


ఈనాడు



కరీంనగర్ 3-2-2019 ఆదివారం సిటీ సంపుటి 45 సంచిక 174

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00. పేజీలు 16+16+32 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



మాఘ సందేశం

లగ్గం ఖర్చుకు పగ్గం వేద్దాం

ఒంటి బతుకున జంట సరిగమ పలికించే మాఘమాసం మరో రెండ్రోజుల్లో వచ్చేస్తోంది. కొత్త జీవితం ఆకారం దాల్చే ఆ కమనీయ దృశ్యాల్ని కనులారా వీక్షించడానికి సిద్ధమయ్యారా? అయితే మీ కళ్లు చారెడంత చేసుకోండి. ఇంద్రసభను తలపించే పెళ్లివేదికలు.. భూమ్యాకాశాలు దద్దరిల్లే డీజే శబ్దాలు.. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల స్వాగత తోరణాల్ని చూసి ఆశ్చర్యపోకండి. నూరున్నొక్క, కొండొకచో వెయ్యిన్నొక్క వంటకాల్ని చూసి, ఇన్ని తినగలమా..! అని సంశయపడకండి. అదిరిపోయే వెడ్డింగ్ కార్డ్సును అందుకుని.. వామ్మో ఇదేం ఖర్చు అని ముక్కున వేలేసుకోకండి. 'గొప్ప పెళ్లిళ్ల'కు ఆరంభ సూచికలవి. మీ నెత్తిన చక్కర్లు కొట్టే 'రెక్కల యంత్రపు' ఝుంకారానికి జడుసుకోకండి. మిమ్మల్ని పెళ్లికి ఆహ్వానించిన వారి తాహతును చాటే డ్రోన్ కెమెరాలవి.

ఆదిత్య కిరణం

నయా పెళ్లిళ్లలో డబ్బుకు విలువలేదు. ఎంత ఎక్కువగా ఖర్చుచేస్తే అంత 'ప్రత్యేకం' అనుకునే రోజులొచ్చేశాయ్. ఇదో అనివార్యతలా స్థిరపడుతోంది. మధుర జ్ఞాపకంలా పెళ్లి చేయాలనుకోవడంలో తప్పు లేదు కానీ.. వివాహ ఖర్చులు అదుపు తప్పుతుండడమే ఆందోళన కలిగిస్తోంది. ఒకర్ని చూసి మరొకరు అనుకరిస్తున్నారు. ఈ అనుకరణల పుణ్యమా అని.. పేద, మధ్యతరగతి వారు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ దుబారా ఆచారాలను ఆపలేమా? కుటుంబాల్ని కుంగదీస్తున్న దుబారా ఖర్చులు, వాటి నివారణ మార్గాలపై 'ఈనాడు' అందిస్తున్న ప్రత్యేక కథనం 11లో

గొడ్డళ్ల గాండ్రింపు

అడవిలో అక్రమార్కులు

- వేల ఎకరాల్లో కలప దోపిడీ.. 30 శాతం అడవి మాయం
- తెలంగాణవ్యాప్తంగా అరణ్యాల్లో నేలకొరుగుతున్న భారీవృక్షాలు
- చీకటిపడితే చెలరేగిపోతున్న అక్రమార్కులు
- అడ్డంగా నరికి అయినకాడికి బేరం
- అటవీ, పోలీసు అధికారులకూ వాటాలు
- 'ఈనాడు' క్షేత్రస్థాయి పరిశీలన



అక్కడ... చీకటి పడగానే గొడ్డళ్లు గాండ్రిస్తాయి... రంపాలు ఘీంకరిస్తాయి
ఆ రెండింటి మరణఘోషల మధ్య ఆకాశాన్నంటుకోవాలన్న ఆశతో
దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న వటవృక్షాలు నిట్టనిలువునా కుప్పకూలుతున్నాయి
అందుకే అది చీకటి రాజ్యం
అధికారం గుర్రుపెట్టి నిద్రపోయే, అరాచకం ఒళ్లు విరిచి వికటాట్టహాసం చేసే ఆటవిక రాజ్యం

అడవి దొంగలు వేగంగా చెట్లను నరికేందుకు పెట్రోల్‌తో నడిచే పవర్ సాను వాడుతున్నారు. ఎంత పెద్ద చెట్టునయినా నిమిషాల్లోనే నరికేసే పవర్‌సాతో కత్తిరించిన ఓ వృక్షం



ఈనాడు - హైదరాబాద్

అక్కడ అడవి అడవిలాగానే ఉంది.. అని అధికారుల లెక్క. కానీ అందులో వెలకట్టలేని వృక్ష సంపద మాత్రం అవసానదశకు చేరుకుందన్నది క్షేత్రస్థాయిలో కళ్లకు కడుతున్న వాస్తవం. అడవుల్లో యథేచ్ఛగా సాగిపోతున్న అక్రమాలను పరిశీలించేందుకు 'ఈనాడు' బృందం రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో పర్యటించింది. రోడ్డు మీద నుంచి చూస్తే అడవి ఉన్నట్లుగా ఉంది. లోపలికి వెళ్లి చూస్తే అడ్డంగా నరికేసిన చెట్లు.. వాటి మొదళ్లు అడవి తల్లి గుండెకోతకు సాక్ష్యంగా మిగిలాయక్కడ. భయం మాటున కొంత, భక్తితో కొంత, జేబు నింపుకోవాలన్న ఆశతో మరికొంత.. వెరసి అటవీశాఖ అధికారులకు తెలిసే ఈ దోపిడీ సాగుతుందని తేటతెల్లమైంది. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ అటవీ బీటు పరిధిలో ఒకప్పుడు అడుగడుగునా కనిపించే టేకు చెట్టు ఇప్పుడు అరుదైన వృక్షం జాబితాలోకి చేరిపోయింది. పలు జిల్లాల్లో దాదాపు ఇదే దుస్థితి. ...ప్రత్యేక కథనం 14లో

> అడవులు కాపాడాలి. కొట్టేసే వారు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. చట్టాలు మార్చాలి. శిక్షలు పెంచాలి
> – అటవీశాఖపై సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశం



స్తంభోద్భవుని సన్నిధిలో సప్తగోపుర శోభ

యాదికుండేలా యాదాద్రి శోభ

- మార్చి చివరి నాటికి ప్రధానాలయ విస్తరణ పూర్తి
- సప్త గోపురాలతో సర్వాంగ సుందరంగా యాదాద్రి
- నేడు పనులను పరిశీలించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్

5లో



కేంద్రం ఏం ఇయ్యలే

- నిరాశాజనకంగా బడ్జెట్
- పేరుకే కేంద్ర పథకాలు.. అమలుపై దృష్టి లేదు
- హడావిడిగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి
- తెలంగాణ తరహాలో సన్నద్ధత ఏదీ?
- హామీల అమలు దిశగా రాష్ట్ర బడ్జెట్
- అధికారుల సమీక్షలో సీఎం కేసీఆర్

2లో

సీబీఐ కొత్త సారథి రిషికుమార్ శుక్లా

- మధ్యప్రదేశ్ మాజీ డీజీపీకి కీలక బాధ్యతలు
- నియామకంపై ఖర్గే అభ్యంతరం... ప్రధానికి లేఖ



ఈనాడు, దిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్‌గా 1983 బ్యాచ్‌కు చెందిన మధ్యప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి రిషికుమార్ శుక్లా (58) నియమితులయ్యారు. ఉత్కంఠకు తెరదించుతూ ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాలు-శిక్షణ శాఖ (డీవోపీటీ) శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. 'కేంద్ర నియామకాల మంత్రివర్గ సంఘం' (ఏసీసీ) ఆయన నియామకానికి ఆమోద ముద్ర వేసింది. వివాదాల్లో మునిగి బదిలీ మీద వెళ్లిన ఆలోక్‌వర్మ స్థానంలో శుక్లా బాధ్యతలు చేపడతారు. రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగుతారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అధికారి ఈ బాధ్యతల్ని నిర్వర్తించడం ఇదే తొలిసారి. శుక్లా గ్వాలియర్ నివాసి. తత్వశాస్త్రంలో పీజీ కూడా చేశారు. ...మిగతా 2లో

భీమా-కోరేగావ్ కేసులో

అంబేడ్కర్ మనవడి అరెస్టు


- ఆయన నిర్బంధం అక్రమమన్న సెషన్స్ జడ్జి
- తక్షణం విడుదల చేయాలని ఆదేశం



ప్రొఫెసర్ ఆనంద్ తెల్‌తుంబ్డే

పుణె: భీమా-కోరేగావ్ కేసులో.. డా. బి. ఆర్. అంబేడ్కర్‌కు వరుసకు మనవడయ్యే ప్రొఫెసర్ ఆనంద్ తెల్‌తుంబ్డేను శనివారం ఉదయం పుణె పోలీసులు అరెస్టు చేశారు! అయితే.. ఈ చర్య అక్రమమని, తక్షణం ఆయనను విడుదల చేయాలని అదనపు సెషన్స్ జడ్జి కిశోర్ వదానే పోలీసులను ఆదేశించారు. ఈ వ్యవహారంలో పెద్ద హైడ్రామాయే నడిచింది. డిసెంబరు 31, 2017న ఎల్గార్ పరిషద్‌లో ఓ సమావేశం జరిగింది. దీనికి ఆనంద్ ముఖ్యఅతిథిగా వెళ్లారు. ...మిగతా 2లో

ఇదీ సంగతి!



ఆ మేరకు కూరగాయల ధరలూ, పప్పుల ధరలూ, నూనె ధరా పెరగకుండా చూడు దేవుడా!

ఆహా!

ద్రాక్ష చికెన్



ద్రాక్షను ఏం చేస్తాం...
పుల్లపుల్లటి పళ్లను
ఆరగిస్తాం...
మహా అయితే
సలాడ్‌గానో, జ్యూస్
చేసుకునో లాగించేస్తాం.
కానీ ద్రాక్షను చికెన్‌తో
కలిపితే.. చట్నీగా చేసుకుంటే..
చాక్లెట్లుగా మార్చుకుంటే...
ఆహా... ఆ రుచే వేరులెండి...

- లవంగీ కూర ఎలా చేస్తారు?
- తింటే కాశీలోనే తినాలి... ఏంటవి?

చవులూరించే వంటల హంగామా నేటి 'ఆహా'లో

చదువు ఆపేయానుకున్న సంధ్యారాణి పీహెచ్‌డీ చేసింది. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె ప్రభుత్వ లెక్చరర్ ఉద్యోగాన్ని అందుకుంది. ఆమె ప్రస్థానం ఎందరికో స్ఫూర్తి ఆమెపై కథనం.

వసుంధరలో

విద్యార్థుల అరెస్టుపై భారత్ ఆందోళన



- అమెరికా రాయబార కార్యాలయానికి 'డెమార్షే' జారీ చేసిన విదేశాంగశాఖ
- బాధితుల గురించి సమాచారం కోసం సహాయ కేంద్రం ఏర్పాటు

2లో

వికారాబాద్ ఈవీఎంలపై ముదిరిన వివాదం

- కలెక్టరుకు ఎన్నికల సంఘం నోటీసులు
- కోర్టు కేసు విషయం తెలియదంటూ కలెక్టర్ వివరణ
- కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక
- కాంగ్రెస్ నేతల ఆగ్రహం

2లో

పంచాయతీల్లో పాలక సందడి

- బాధ్యతలు స్వీకరించిన సర్పంచులు, ఉప సర్పంచులు

3లో

పాఠాలు చదివి.. పీఠాలవైపు కదిలి

- పంచాయతీ పాలనలో ఇంజినీర్లు.. పట్టభద్రులు

విద్యార్థుల అరెస్టుపై భారత్ ఆందోళన

దిల్లీ

అగ్రరాజ్యంలో భారతీయ విద్యార్థుల అరెస్టు వ్యవహారంపై దిల్లీలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయానికి భారత్ 'డెమార్ష్' (అభ్యంతర పత్రం) జారీ చేసింది. బాధిత విద్యార్థుల బాగోగుల విషయంపై ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు, వారిని కలిసేందుకు దౌత్య అధికారులను తక్షణమే అనుమతించాలని ఇందులో కోరింది. అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు వల పన్ని, నకిలీ వర్సిటీ ఏర్పాటు చేసి, విద్యార్థి వీసాలు దుర్వినియోగం చేస్తున్న 130 మంది విద్యార్థులను, 8 మంది దళారులను బుధవారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వీరిలో ఒక్క విద్యార్థి మినహా మిగతావారంతా భారతీయులే. ఈ నేపథ్యంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. "దళారులను, బాధిత విద్యార్థులను వేర్వేరుగా చూడాలని అమెరికా రాయబార కార్యాలయానికి విజ్ఞప్తి చేశాం. విద్యార్థుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరాం. వీలైనంత త్వరగా వారిని విడుదల చేయాలని అభ్యర్థించాం. అభీష్టానికి విరుద్ధంగా దేశం నుంచి వారిని బయటకు పంపవద్దని కోరాం" అని పేర్కొంది. వివిధ నిర్బంధ కేంద్రాలను సందర్శించి ఇప్పటివరకూ 30 మంది విద్యార్థులను భారత దౌత్య అధికారులు కలిశారని, మిగతావారినీ కలవనున్నారని తెలిపింది. అరెస్టయిన విద్యార్థుల సమాచారం, సందేహాల నివృత్తి కోసం వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయంలో 24 గంటలూ నడిచే సహాయ కేంద్రం ఏర్పాటైంది. +1-202-322-1190, +1-202-340-2590 నెంబర్లకు ఫోన్ చేయడం ద్వారా గానీ, cons3.washington@mea.gov.inకు ఈ-మెయిల్ పంపడం ద్వారా గానీ ఈ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. విద్యార్థుల అరెస్టు వ్యవహారానికి సంబంధించిన అన్ని అంశాలపై సమన్వయం కోసం భారత రాయబార కార్యాలయం ఓ నోడల్ అధికారిని నియమించింది.

అరెస్టుకు ముందే కోర్టులో నేరారోపణ

ఈనాడు, హైదరాబాద్: అమెరికాలో విద్యార్థి వీసాల దుర్వినియోగంపై చేపట్టిన రహస్య ఆపరేషన్ వివరాలను అమెరికా భద్రతా విభాగం అక్కడి న్యాయస్థానానికి ముందుగానే నేరారోపణ (ఇండిక్ట్‌మెంట్) ద్వారా వెల్లడించినట్లు తెలుస్తోంది. డొల్ల యూనివర్సిటీని ఏర్పాటు చేసి, దళారులు, కొందరు విద్యార్థులు అనుసరిస్తున్న అక్రమ విధానాలను ఎలా వెలికి తీసిందీ కోర్టుకు తెలిపింది. విద్యార్థుల్ని అదుపులోకి తీసుకునేందుకు ముందుగానే మిచిగాన్ తూర్పు ప్రాంత జిల్లా కోర్టులో జనవరి 15 సాయంత్రం 4.47 గంటలకు నేరారోపణ పత్రం దాఖలు చేసింది. డొల్ల యూనివర్సిటీ ఏర్పాటు చేసిన తరువాత, ప్రవేశాల కోసం ఏజెంట్లు తమను సంప్రదించిన తీరు, విద్యార్థుల సంభాషణ.. ఇలా సమగ్ర వివరాలు రికార్డు చేసింది. ఈ మేరకు 14 అంశాలను పేర్కొంది. ఇమిగ్రేషన్, భద్రతా విభాగాల అధికారులు ఎంతో పకడ్బందీగా వ్యవహరించినట్లు తెలిసింది.



ఒక్కొక్కరినీ అదుపులోకి..

అమెరికా భద్రతా విభాగం ఒక్కొక్కరుగా ప్రస్తుతం 130 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిలో తెలుగు విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. వీరంతా వేర్వేరు ప్రాంతాల్లో అధికారుల అదుపులో ఉన్నారు. రహస్య ఆపరేషన్లో భాగంగా ఏర్పాటు చేసిన యూనివర్సిటీలో 600 మంది వరకు విద్యార్థులు చేరారని, వీరి ప్రవేశ వివరాల ఆధారంగా అదుపులోకి తీసుకునే ప్రయత్నం జరుగుతోందనీ తెలుస్తోంది.

యూనివర్సిటీ వెబ్‌సైట్ మూసివేత

అమెరికా ఇమిగ్రేషన్, అంతర్గత భద్రతా విభాగాలు రహస్య ఆపరేషన్లో భాగంగా నెలకొల్పిన యూనివర్సిటీ ఆఫ్ ఫ్రామింగ్టన్ వెబ్‌సైట్‌ను మూసివేసింది. వివరాలకు ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని సంప్రదించాలంటూ పేర్కొంది.

రంగంలోకి తెలుగు సంఘాలు

బాధిత తెలుగు విద్యార్థులకు న్యాయసహాయం చేసేందుకు తెలుగు సంఘాలు ముందుకు వచ్చాయి. అక్కడి న్యాయనిపుణులతో చర్చలు జరుపుతున్నాయి. విద్యార్థుల తరపున వాదించేందుకు వలస విధానాల్లో నిపుణులైన ఇద్దరు అటార్నీలను నియమించినట్లు అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ (ఆటా-తెలంగాణ) ప్రతినిధులు కరుణాకర్ మాధవరం, వినోద్ కుమార్ కుకునూరు, వెంకట్ మంథెనలు తెలిపారు. అటార్నీలను విద్యార్థుల వద్దకు తీసుకువెళ్లి మాట్లాడిస్తామని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో భద్రతా విభాగం అదుపులో ఉన్నవారిని వ్యక్తిగతంగా సంప్రదించి సహాయం చేస్తున్నామన్నారు.

బిడ్డా... మోసపోవద్దు..!

అమెరికా ప్రభుత్వ రహస్య ఆపరేషన్, విద్యార్థుల అరెస్టుతో తెలుగు రాష్ట్రాల్లోని తల్లిదండ్రుల్లో అలజడి కొనసాగుతోంది. అమెరికాలో కొనసాగేందుకు ఎవరైనా అడ్డదార్లు సూచిస్తే మోసపోవద్దని, అక్కడి నిబంధనల మేరకు నడుచుకోవాలని తల్లిదండ్రులు తమ పిల్లలకు ఫోన్లలో సూచిస్తున్నారు. ఇప్పటికే ఓపీటీలో ఉన్నవారి గురించి తెలుసుకుంటున్నారు. రెండో పీజీ చేయాలని భావిస్తే, మంచి యూనివర్సిటీలో చేరాలని చెబుతున్నారు.

శ్రీలంకలో 73 మంది భారతీయుల అరెస్టు

కొలంబో: వీసా నిబంధనలు ఉల్లంఘించినందుకు 73 మంది భారతీయులను శ్రీలంక అరెస్టు చేసింది. శనివారం మటుగామాలోని ఓ పరిశ్రమలో 49 మంది భారత పౌరులను అదుపులోకి తీసుకున్నట్లు శ్రీలంక వలస విభాగం వెల్లడించింది. వీసా గడువు ముగిసినా వారు తమ దేశంలోనే ఉండిపోయినట్లు పేర్కొంది. గత నెలలో ఇంగిరియాలోనూ ఇదే ఉల్లంఘన కారణంగా 24 మంది భారతీయులను అరెస్టు చేసినట్లు శ్రీలంక అధికారులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని కొలంబోలోని మిరిహానా ప్రాంతంలో ఉన్న వలసదారుల నిర్బంధ కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు. అధికారిక ప్రక్రియలు పూర్తయిన తర్వాత వారిని భారత్‌కు పంపుతామని తెలిపారు.

గుర్రం ఎక్కువ తినటం చూశారా?

జీవితంలో మోహలాలసత్వానికే కాదు.. మనం జిహ్వకు కూడా దాసులమైపోకుండా నిగ్రహంతో ఉండటం అవసరమన్నది నా నిశ్చితాభిప్రాయం! నిజానికి ఇతరత్రా నియమాలన్నింటి కంటే కూడా దీన్ని ఆచరణలో పెట్టటం మరింత కష్టం. మిఠాయి దుకాణాలు, కాఫీ హోటళ్లు, తినుబండారాల అంగళ్లు, ఇతరత్రా వంటశాలల నుంచి దృష్టిని మరలించుకోలేకపోతున్నంత కాలం.. మనకు 'ఆహార నిగ్రహం' అన్నది సాధ్యం కాదు. మనం చక్కటి ఆరోగ్యంతో జీవించాలంటే కేవలం అవసరమైన ఆహారంతోనే సంతృప్తి పడాలి. తినటం, తాగటం, కామలాలసత్వం... ఇవన్నీ మనకూ, జంతువులకూ సమాన లక్షణాలే. కానీ ఆవుగానీ, గుర్రంగానీ.. రుచి కోసం మనలాగా కావాల్సిన దానికంటే కూడా ఎక్కువ తినటం మీరెప్పుడైనా చూశారా? ఆహార నిగ్రహం లేకపోవటం వల్ల మనం జంతువుల కంటే కూడా హీనులమైపోతున్నాం. రుచికి బానిసలై.. విరివిగా, రకరకాల పదార్థాలు తినటమన్నది నాగరిక లక్షణమని మీరు భావిస్తున్నారా? మన భోజనంలో పదార్థాల సంఖ్యను ఎంత పెంచుకుంటే అంత గొప్పవాళ్లం అవుతామన్నది మీ అభిప్రాయమా? పళ్లాల కొద్దీ పదార్థాలను తెప్పించుకొని తింటున్నందువల్ల మీరు అశక్తులుగా మారిపోయి.. వార్తాపత్రికలలో మందుల ప్రకటనల కోసం వెతుక్కోవాల్సిన దుస్థితి వస్తుంది. అది ధర్మమా? కాదు కదా. కాబట్టి మనకు జిహ్వేంద్రియ నిగ్రహం ఉండాలి. ఇది ప్రకృతి సహజమైన ప్రధాన సూత్రం! దీనికి అనుగుణంగా నడుచుకుంటే మనకూ, ఈ ప్రపంచానికీ కూడా ఎంతో మేలు జరుగుతుంది!!

– మహాత్మా గాంధీ

(1916 ఫిబ్రవరి 16న మద్రాసు వైఎంసీఏ ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి గాంధీజీ చేసిన ప్రసంగం నుంచి)

భీమా-కోరేగావ్ కేసులో అంబేడ్కర్ మనవడి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టుల మద్దతు ఉన్న ఈ సమావేశంలో ఆనంద్ ఉద్రేకపూరితంగా ఉపన్యసించి ప్రజలను రెచ్చగొట్టారనీ... ఈ ప్రభావంతోనే ఆ మరుసటి రోజు కోరేగావ్ భీమా యుద్ధస్మారకం వద్ద హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం ముంబయి విమానాశ్రయానికి వచ్చిన తెల్‌తుంబ్డేను పుణె పోలీసులు అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

విచారణ చేపట్టిన అదనపు సెషన్స్ జడ్జి... తెల్‌తుంబ్డేను ఫిబ్రవరి 11 వరకు అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన అరెస్టు చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు. ఆనంద్‌పై వచ్చిన ఆరోపణలపై సంబంధిత న్యాయస్థానాన్ని ఆశ్రయించి, నిర్దోషిగా నిరూపించుకునే అవకాశాన్ని సుప్రీంకోర్టు కల్పించిందన్నారు. ఆయనపై నమోదైన 'ఎఫ్ఐఆర్'ను మాత్రం తాము కొట్టివేయమని స్పష్టం చేశారు. మరోవైపు ఏసీపీ శివాజీపవార్ మాత్రం... తెల్‌తుంబ్డే ముందస్తు బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం సెషన్స్‌కోర్టు కొట్టివేసిందని, అందుకే శనివారం ఆయనను అరెస్టు చేశామని చెప్పారు.

న్యాయస్థానం ఖర్చులు భరించేదెలా?

- **నలుగురు న్యాయవాదులను ఏర్పాటు చేసిన ఏపీఎన్ఆర్టీ**

ఈనాడు, అమరావతి: అమెరికా ఇమిగ్రేషన్ అధికారుల అదుపులో ఉన్న వారికి న్యాయ సహాయం అందించడంపై ఏపీఎన్ఆర్టీ దృష్టి సారించింది. అక్కడ నలుగురు న్యాయవాదుల(అటార్నీల)ను ఏర్పాటు చేసింది. తెలుగు విద్యార్థులకు న్యాయ సహాయం అందించేందుకు అత్యవసర నిధి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వ్యయం చేసేందుకు నిర్ణయించింది. అయితే, అక్కడ న్యాయ ఖర్చులు అధికం కావడంతో ఇది సమస్యగా మారింది. అధికారుల అధీనంలో 130 మంది వరకు ఉన్నారు. వీరిలో తెలుగువారు ఎందరనేదీ తెలియాల్సి ఉంది. సోమవారం వీరి బెయిల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కొందరు విద్యార్థులు తమ పరువుకు భంగం కలుగుతుందనే ఉద్దేశంతో వివరాలు ఇవ్వకపోవడంతో సమాచార సేకరణ కొంత కష్టంగా మారింది. నోటీసులు అందుకున్న వారిలోనూ కొందరు తమ ఫోన్‌లను స్విచ్‌ఆఫ్ చేశారు. దీంతో వారు ఎక్కడున్నది తెలియడం లేదు. మరికొందరు ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి మారడంతో సమాచారం బయటకు రావడంలేదు.

ఎక్కువ మంది పేదలే..


అమెరికాలో భద్రతా విభాగం అదుపులో ఉన్న విద్యార్థుల్లో ఎక్కువ మంది పేదలే అని తెలుస్తోంది. ఇక్కడ న్యాయ ఖర్చులు ప్రాథమికంగా 50 డాలర్ల నుంచి 500 డాలర్ల వరకు ఉంటాయని అంచనా. ఇమిగ్రేషన్ పన్నిన వలలో ఇరుక్కున్న వారిలో కొందరు మాత్రమే ఉద్యోగాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో న్యాయ ఖర్చులు ఎవరు భరించగలరు? ఎంతమందికి సహాయం చేయాల్సి ఉంటుందనేది తెలియాల్సి ఉంది. న్యాయసహాయం కోసం నిధులు సమీకరించాలన్నా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిధులిచ్చేవారిని కూడా 'విద్యార్థులతో మీకు ఏమిటి సంబంధం?' అని ఇమిగ్రేషన్ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉందనే భయం కొందరిని వెంటాడుతోంది. ఫార్మింగ్టన్ వర్సిటీలో చేరిన వారిలో 150 మంది వరకు తెలుగువాళ్లు ఉన్నట్లు ఏపీఎన్ఆర్టీకి సమాచారం అందింది.

మరో రెండు నకిలీ వర్సిటీలు?

ఫార్మింగ్టన్ లాంటివే మరో రెండు నకిలీ వర్సిటీలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫార్మింగ్టన్ వర్సిటీ వెబ్‌సైట్ హోమ్ పేజీలోనే వివరాలు సక్రమంగా లేవని, విద్యార్థులు వెబ్‌సైట్‌ను జాగ్రత్తగా పరిశీలించినా.. అది నకిలీ అనే విషయం తెలిసేదని వరల్డ్‌వైడ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్ ఎండీ వెంకటేశ్వరరెడ్డి వెల్లడించారు. ఇమిగ్రేషన్ అదుపులో లేనివారు తిరిగి భారత్‌కు వచ్చేయడమే మేలని సూచించారు.

స్నానాల గదిలో జారిపడిన దేవేగౌడ

- కాలు బెణకడంతో ఆసుపత్రిలో చికిత్స



ఈనాడు డిజిటల్, బెంగళూరు : మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవేగౌడ శనివారం బెంగళూరు పద్మనాభనగరలోని తన నివాసంలోని స్నానాల గదిలో జారిపడ్డారు. ఆయన శుక్రవారం రాత్రే దిల్లీ నుంచి తిరిగి వచ్చారు. అనంతరం శనివారం ఉదయం సమయంలో జారిపడినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ సందర్భంగా ఎడమ కాలు బెణికినట్లు ఆయన కుమారుడు, వైద్యుడు రమేశ్ గుర్తించారు. వెంటనే ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ చంద్రశేఖరరావు పర్యవేక్షణలో ఎంఆర్ఐ పరీక్షలు నిర్వహించారు. అప్పటికే కాలు వాపుతో పాటు నొప్పి అధికమవడంతో డాక్టర్ జయదేవ్ ఆసుపత్రికి తరలించారు. ఎంఆర్ఐ పరీక్షలో ఎముక విరగలేదని స్పష్టం కావటంతో రెండు రోజుల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. "కాలు నొప్పి మాత్రమే ఉంది. నేను ఆరోగ్యంగానే ఉన్నాను. భయపడేంత సమస్య లేదు" అని దేవేగౌడ శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదలచేశారు.

25 నుంచి విశాఖలో ప్రపంచ సముద్ర సైన్స్ కాంగ్రెస్

ఈనాడు, విశాఖపట్నం: విశాఖలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రపంచ సముద్ర సైన్స్ కాంగ్రెస్ జరగనుంది. కాలుష్యం కారణంగా సముద్ర జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా.. సముద్రంపై ఆధారపడేవారు కూడా జీవనోపాధిని కోల్పోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని దిల్లీలోని 'విజ్ఞాన భారతి' సంస్థ ప్రభుత్వ రంగ సంస్థల సహకారంతో 2014లో తొలిసారి కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో ప్రపంచ సముద్ర సైన్స్ కాంగ్రెస్ నిర్వహించింది. రెండో సదస్సును ఆంధ్ర విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో విశాఖలో నిర్వహించాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా సముద్ర సంబంధ పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలను కార్యక్రమానికి ఆహ్వానించారు. విదేశీ పరిశోధన సంస్థలకు కూడా ఆహ్వానాలు పంపారు.

కేంద్రం ఏం ఇయ్యలే!

- **ముఖ్యమంత్రి కేసీఆర్ అసంతృప్తి**

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని, రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏమీ ఇవ్వలేదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల దృష్టితో ఎన్డీయే ప్రభుత్వం హడావిడిగా నిర్ణయాలు తీసుకుందని, రైతుబంధు తరహాలో సన్నద్ధత లేకుండా ప్రధా నమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే దిశగా తెలంగాణ బడ్జెట్ ఉండాలన్నారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. "కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదు. విభజన హామీలతో పాటు వినతుల పైనా స్పందించలేదు. ఎన్నిసార్లు విన్నపాలు చేసినా కేంద్రంలో చలనం రావడం లేదు. ఈసారి మొత్తంగా చూస్తే బడ్జెట్‌లో దిశానిర్దేశం కనిపించలేదు. పథకాలకు నిధుల కేటాయింపు తప్ప అమలు ఆలోచనే కేంద్రానికి లేదని మళ్లీ రుజువైంది. తెలంగాణలో అన్నదాతకు మేలు చేసేందుకు పక్కా ప్రణాళికతో రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టాం. దానికి మూడేళ్ల ముందు నుంచే కసరత్తు చేశాం. భూరికార్డులను ప్రక్షాళన చేశాం. రైతుల వివరాలు పక్కాగా తీసుకొని, పథకాన్ని రెండు విడతలు ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతంగా అమలు చేశాం. రైతుబంధు తరహాలో కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తెచ్చింది. తెలంగాణను చూసి చేయడం తప్ప దీనికి ముందస్తుగా కేంద్రం కసరత్తు చేయలేదు. ఒక్క తెలంగాణలో మినహాయిస్తే మిగిలిన రాష్ట్రాల్లో రైతుల వివరాలు, భూముల రికార్డులు, బ్యాంకు ఖాతాలు.. ఇలా సన్నద్ధతకు అనుగుణంగా పరిస్థితులు లేవు.

ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్

"రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ఆదర్శప్రాయంగా ఉండాలి. కేంద్ర పథకాలకు, పన్నుల వాటా రూపేణా వచ్చే నిధులపై స్పష్టత వచ్చింది. ఆర్థిక పరిస్థితి, ఇతర అంశాలను విశ్లేషించుకొని బడ్జెట్‌ను రూపొందించాలి. శాసనసభ ఎన్నికల సందర్భంగా తెరాస తరపున ప్రజలకు పలు హామీలు ఇచ్చాం. రైతుబంధు సాయం, ఆసరా పింఛన్ల సాయం పెంపు, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు, సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వారికి రూ. ఆరేసి లక్షలు, నిరుద్యోగ భృతి వంటి వాటన్నింటినీ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హామీల అమలు జరిగేలా బడ్జెట్ రూపకల్పన జరగాలి. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వాటికి నిధుల కొరత లేనివిధంగా బడ్జెట్లో ప్రాధాన్యమివ్వాలి. ఇతర ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేయాలి. ఈ నెల 18 నుంచి రాష్ట్రంలో జరగనున్న 15వ ఆర్థిక సంఘం పర్యటనను పురస్కరించుకొని ఏర్పాట్లు చేయాలి. ఆర్థిక సంఘానికి తెలంగాణ ప్రగతి కనిపించాలి. డిమాండ్ల సాధనకు కృషి చేయాలి" అని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బడ్జెట్ రూపకల్పనపై పలు సూచనలు చేశారు. ఆర్థిక సంఘం పర్యటన తరువాతే రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఉంటాయనే సంకేతాలను ముఖ్యమంత్రి ఇచ్చినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఆర్థిక సలహాదారు జి.ఆర్.రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, నీటి పారుదలశాఖ ఇ.ఎన్.సి. మురళీధర్, ఆర్ అండ్ బీ ఇ.ఎన్.సి.లు గణపతిరెడ్డి, రవీందర్‌రావు సమావేశంలో పాల్గొన్నారు.

సీబీఐ కొత్త సారథి రిషికుమార్ శుక్లా

(మొదటి పేజీ తరువాయి)

పూర్తికాల డైరెక్టర్‌ను నియమించడంలో జాప్యంపై సుప్రీంకోర్టు శుక్రవారమే అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

80 మంది నుంచి వడపోత

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో సీబీఐ అధిపతి పదవి కోసం 1983, 84, 85 బ్యాచ్‌లకు చెందిన 80 మంది అర్హులైన అధికారుల నుంచి 30 మందితో జాబితా తయారుచేసి... ప్రధానమంత్రి, ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష నాయకుడితో కూడిన ఎంపిక కమిటీ ముందుంచారు. అందులో అయిదు పేర్లను పరిశీలించి చివరకు రిషికుమార్ శుక్లాకు కమిటీలో ఆమోద ముద్ర వేశారు. ఆయన ఇదివరకు మధ్యప్రదేశ్ డీజీపీగా సేవలందించారు. ఇటీవలే ఆ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థకు ఛైర్మన్‌గా మార్చారు. ఆయన మితభాషి. నిబంధనల్ని తు.చ. తప్పకుండా పాటిస్తారని, ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా సిబ్బంది పక్షానే నిలబడతారని ఆయనకు పేరుంది. మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సర్కారుతో శుక్లా ఘర్షణ పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక డీజీపీ పదవి నుంచి ఆయన్ని తప్పించింది. తాత్కాలిక డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.



డైరెక్టర్ ఎంపిక తీరును ఖర్గే ఆక్షేపించారు. సీనియారిటీ ఒక్కటే సరిపోదని, అవినీతి కేసుల్ని విచారించడంలో శుక్లాకు అనుభవమే లేదని చెప్పారు. చట్టాన్ని, సుప్రీంకోర్టు తీర్పుల్ని ఉల్లంఘించి నియామకం చేశారని ఆరోపించారు. ఈ మేరకు రెండు పేజీల అసమ్మతి లేఖను శనివారం ప్రధానికి పంపించారు.

ఖర్గే మతలబు చేయాలని చూశారు: జితేంద్ర సింగ్

లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే వ్యక్తంచేసిన అభ్యంతరాలను ఎంపిక సంఘం తోసిపుచ్చిందని సమాచారం. సీబీఐ అధిపతి నియామకంలో మతలబు చేయాలని ఖర్గే ప్రయత్నించినట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ ఆరోపించారు. నచ్చిన అధికారికి ఈ పదవి దక్కాలన్న దురుద్దేశంతో ఆయన వ్యవహరించారన్నారు. 1984 బ్యాచ్‌కి చెందిన జావేద్ అహ్మద్‌ను సీబీఐ డైరెక్టర్‌గా నియమించాలని ఖర్గే పట్టుపట్టినట్లు తెలుస్తోంది.

మళ్లీ పెరుగుతున్న చలి తీవ్రత

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలో చలి తిరిగి పెరుగుతోంది. మెదక్‌లో శనివారం తెల్లవారుజామున అత్యల్పంగా 12 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్‌లో 13, రామగుండంలో 15, హైదరాబాద్‌లో 16 డిగ్రీలు నమోదయ్యాయి. పగటి పూట కూడా సాధారణంకన్నా 2 డిగ్రీలు తక్కువగా ఉంటోంది. మాల్దీవుల నుంచి కర్ణాటక మీదుగా మహారాష్ట్ర వరకు.. భూమికి 1500 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో సముద్రం నుంచి తేమ గాలులు తెలంగాణ వైపు వస్తున్నాయి. గాలిలో తేమ పెరుగుదల సాధారణం కంటే 20 శాతందాకా ఉంది. పగలు సైతం చల్లగా ఉండటానికి ఇదే కారణం. ఇదే తరహా ఉష్ణోగ్రతలు మరో 3 రోజులు రాత్రివేళల్లోనూ కొనసాగుతాయని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు.

గ్రహం అనుగ్రహం

3–2–2019 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
చతుర్దశి: రా. 11.26 తదుపరి అమావాస్య
ఉత్తరాషాఢ నక్షత్రం: రా. 2.44 తదుపరి శ్రవణం
అమృత ఘడియలు: రా. 7.44 నుంచి 9.29 వరకు
వర్జ్యం: ఉ. 9.14 నుంచి 10.59 వరకు
దుర్ముహూర్తం: సా. 4.22 నుంచి 5.07 వరకు
రాహుకాలం: మ. 4.30 నుంచి 6.00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; **సూర్యాస్తమయం:** సా.5-52

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	12.0	32.1
ఆదిలాబాద్	13.0	30.2
రామగుండం	15.0	29.4
గుంటూరు	15.1	30.5
హైదరాబాద్	16.0	29.0
శ్రీకాకుళం	16.0	27.0
నిజామాబాద్	16.8	30.5
కరీంనగర్	17.0	27.0
విశాఖపట్నం	17.0	28.9
హన్మకొండ	17.0	29.0
మహబూబ్‌నగర్	17.1	31.9
నల్గొండ	18.0	30.4
విజయవాడ	18.8	29.5
సూర్యాపేట	19.0	29.0
తిరుపతి	19.0	31.3
ఖమ్మం	20.0	30.0

వికారాబాద్ ఈవీఎంలపై ముదిరిన వివాదం

ఈనాడు – హైదరాబాద్

నిబంధనలకు విరుద్ధంగా వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను భద్రపరిచిన గది(స్ట్రాంగ్ రూమ్)ని ఆ జిల్లా కలెక్టర్ తెరిచినట్లుగా ఎన్నికల సంఘం అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీనిపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ కేంద్రం ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన గడ్డం ప్రసాద్‌కుమార్ ఓట్ల లెక్కింపుపై అనుమానాలు వ్యక్తంచేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానంలో వ్యాజ్యం దాఖలైన నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపరిచిన గదులను తెరవకూడదన్నది నిబంధన. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలనే వినియోగించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆయా యంత్రాల్లోని మునుపటి ఓట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం జిల్లా కలెక్టర్లను కోరింది. న్యాయస్థానంలో వ్యాజ్యాలు దాఖలైన నియోజకవర్గాల ఈవీఎంలను పరిగణనలోనికి తీసుకోవద్దని కూడా స్పష్టం చేసింది. ఆ నిబంధనలను తోసిరాజని వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన గదిని ఆ జిల్లా కలెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్ శుక్రవారం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరవడం, 120 ఈవీఎం యంత్రాల సీళ్లను కూడా తొలగించటం వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. "వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంపై హైకోర్టులో వ్యాజ్యం దాఖలైన విషయం తన దృష్టికి రాలేదని, అందుకే స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచి ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ చేపట్టినట్లు" కలెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్ ఎన్నికల సంఘానికి ఇచ్చిన వివరణలో పేర్కొన్నారు.

కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలి: కాంగ్రెస్ డిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎన్నికల నియమావళి, కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఈవీఎం యంత్రాలు భద్రపరచిన గదిని తెరిచిన వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్, టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ ఛైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి, కన్వీనర్ జి.నిరంజన్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు శనివారం గాంధీభవన్‌లో సమావేశమై ఈ వివాదంపై చర్చించారు. అనంతరం భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రాజకీయ నాయకులతోపాటు ప్రజల్లోనూ అనుమానాలు ఉన్నాయన్నారు. బాధ్యతగల కలెక్టర్ ఇంత నిర్లక్ష్యంగా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే ఈ పని చేశారా? దీని వెనక ఎవరైనా ఉన్నారా? అనే విషయాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గడ్డం ప్రసాద్‌కుమార్, మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈవీఎంల సీళ్ల తొలగింపు ఉద్దేశపూర్వకంగానే జరిగినట్లు కనిపిస్తోందని, ఈ వ్యవహారాన్ని అంత తేలిగ్గా వదిలిపెట్టబోమని వెల్లడించారు.

కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక

వికారాబాద్ నియోజకవర్గం వ్యవహారంపై రజత్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. ఫిర్యాదులతోపాటు కలెక్టర్ ఇచ్చిన వివరణను కూడా జత చేశారు. ఈ విషయమై రజత్‌కుమార్ 'ఈనాడు'తో మాట్లాడుతూ ఈవీఎంలను భద్రపరిచిన గదిని తెరిచిన విషయం తన దృష్టికి రాగానే కలెక్టర్‌ను వివరణ కోరినట్టు చెప్పారు. వీవీప్యాట్‌లలోని ఓటు పత్రాలు భద్రంగా ఉన్నాయని వెల్లడించారు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి నివేదిక పంపామని, అక్కడి నుంచి వచ్చే ఉత్తర్వుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.



పెద్దపల్లి జిల్లా ధర్మారం పంచాయతీలో తొలి సంతకం చేస్తున్న సర్పంచి జితేందర్‌రావు

పంచాయతీల్లో పాలకవర్గాల సందడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత, తొలిసారిగా పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించాయి. మొత్తం 12,680 పంచాయతీల్లో సర్పంచులు, ఉప సర్పంచులు, 1.13 లక్షలమంది వార్డు సభ్యులు శనివారం ప్రమాణం చేశారు. హైదరాబాద్ మినహా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని మండలాల్లో సర్పంచులకు మద్దతుగా నిలిచిన పార్టీల కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. ఎన్నికల ప్రత్యేక అధికారి సూచన మేరకు సభ్యులు ప్రతిజ్ఞ చదివిన అనంతరం, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పుస్తకం(మినిట్స్ బుక్)లో సంతకాలు చేశారు. పంచాయతీరాజ్ చట్టం మార్గదర్శకాల ప్రకారం, నూతన సర్పంచులు తొలి పాలకవర్గ సమావేశాలను నిర్వహించారు.

పాఠాలు చదివి.. పీఠాలవైపు కదిలి

• పంచాయతీ పాలనలో ఇంజినీర్లు, పట్టభద్రులు • గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న తపన

ఈనాడు – హైదరాబాద్

గ్రామ పాలనలో మేము సైతం అంటూ విద్యాధికులు కదలి వచ్చారు. మూస పరిపాలన ధోరణులకు భిన్నంగా నూతన పంథాలో పల్లెలను బాగు చేస్తామంటూ.. పట్టభద్రులు, ఇంజినీర్లు.. పీజీ విద్యార్థులు.. ఉపాధ్యాయ విద్య పూర్తిచేసిన వారు పంచాయతీ పీఠాన్ని అధిరోహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్నత విద్యావంతులు గ్రామ పంచాయతీ సర్పంచి పగ్గాలను చేపట్టారు. మారుతున్న కాలంతోపాటు పరిపాలననూ కొత్తపుంతలు తొక్కించడమే ధ్యేయమంటూ ముందడుగు వేశారు.

మారిన అంతరంగం

నేటి యువతరం అంతరంగమే మారిపోయిందనేది పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన వారిని చూస్తే తెలిసిపోతోంది. సమస్యలపై స్పష్టత.. లక్ష్యాల పట్ల ప్రణాళికలతో పంచాయతీ ఎన్నికల్లో అడుగుపెట్టిన విద్యావంతులు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చదువుకున్న వారు సమస్యలను సులువుగా ఆకళింపు చేసుకోగలుగుతారని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చుతారన్న అభిప్రాయం కూడా వ్యక్తం అవుతోంది.

ఒక్కొక్కరిదీ ఒక్కో లక్ష్యం



సదాశివరెడ్డి

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోలేని రైతుల దయనీయ పరిస్థితిని చూసి కరిగిపోయిన సదాశివరెడ్డి అనే ఎంబీఏ (లండన్) యువకుడు పంచాయతీ బరిలోకి దిగి సర్పంచి అయ్యారు. సిద్దిపేట గ్రామీణ మండలం బుస్సాపూర్‌నకు చెందిన ఇతను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానుకుని నేడు గ్రామ ప్రథమ పౌరుడి బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ నిధులు, విధులు, వ్యయంపై ప్రజల్లో అవగాహన తేవాలని, మౌలిక సౌకర్యాలు కల్పించి నిజమైన గ్రామ జీవనాన్ని అందుబాటులోకి తేవాలన్న తపన ఉందని చెబుతున్నారు.

నల్గొండ జిల్లా రామన్నపేట పంచాయతీ సర్పంచిగా ఎన్నికైన గోదాసు శిరీష ఎంఏ(పొలిటికల్ సైన్సు) చదివారు. ఆ గ్రామంలో తాగునీటి సమస్యను చూసి చలించిన ఆమె పంచాయతీ పోరుకు నడుం కట్టి విజయం సాధించారు. ఇప్పుడు ఆమె లక్ష్యం తాగునీటి సమస్య పరిష్కారమే.



రోజా

నల్గొండ జిల్లా చండూరు మండలం గట్టుప్పల్‌ను మండలంగా ప్రకటించాలని కోరుతూ పంచాయతీ పోరులో దిగారు ఇడెం రోజా. బీటెక్ పూర్తి చేసిన ఆమె తెరాస, కాంగ్రెస్‌లు మద్దతిచ్చిన అభ్యర్థులను ఓడించి విజయం సాధించారు. గ్రామంలో వసతుల కల్పనకు కృషి చేస్తానంటున్నారు.

- ✦ పీజీ పూర్తి చేసి సర్పంచులైన యువత : 85 మంది
- ✦ డిగ్రీ పూర్తిచేసిన వారు: 300
- ✦ బీఈడీ, ఎంఈడీ లాంటి ఉపాధ్యాయ కోర్సులు పూర్తి చేసిన వారు: 75
- ✦ బీటెక్, ఎంటెక్, సాంకేతిక పట్టభద్రులు: 62

★ వివరాలు జిల్లాల్లో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు..

కొత్త జిల్లాలో కలపకండి

ప్రమాణంనాడే 44 పంచాయతీల తీర్మానం

మహబూబ్‌నగర్, ఈనాడు డిజిటల్: రాష్ట్రప్రభుత్వం ములుగు, నారాయణపేటలను కొత్త జిల్లాలుగా ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో.. నారాయణపేట కూర్పుపై కొన్ని మండలాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మహబూబ్‌నగర్ నుంచి వేరుపడనున్న ఈ నూతన జిల్లాలో నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద, మరికల్, మక్తల్, ఊట్కూరు, నర్వ, కృష్ణా, మాగనూరు, మద్దూరు, కోస్గి, కోయిలకొండ మండలాలను కలుపుతూ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. నెలరోజుల గడువులో అభ్యంతరాలను సైతం స్వీకరించారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న పై మండలాలను నారాయణపేట జిల్లాలో కలపనున్నారు. ఇందులో కోయిలకొండ మండల ప్రజలు తమను కొత్త జిల్లాలో కలపరాదని, పాత జిల్లాలోనే కొనసాగుతామని రోజురోజుకూ స్వరం పెంచుతున్నారు. ఇదే మండలంలో ఉన్న మొత్తం 44 గ్రామ పంచాయతీల పాలకమండళ్లు శనివారం కొలువుదీరాయి. ప్రమాణస్వీకారం అనంతరం ఒకే తీర్మానం చేశాయి. కోయిలకొండను మహబూబ్‌నగర్ జిల్లాలోనే కొనసాగించాలంటూ గ్రామసభల ద్వారా తీర్మానాన్ని ఆమోదించారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి కోయిలకొండ దగ్గరగా ఉంటుంది. అందువల్ల భౌగోళికంగా, రెవెన్యూపరంగా చూసినా పాత జిల్లాలో తమను ఉంచాలంటున్నారు. మండలంలోని గ్రామపంచాయతీల పాలకమండళ్లన్నీ ప్రమాణస్వీకారంరోజే ఏకగ్రీవ తీర్మానం చేయడం విశేషం. మొత్తం 44 గ్రామపంచాయతీల్లో 31 మంది సర్పంచులు తెరాస మద్దతుదారులే! 13 పంచాయతీల్లో ఇతరులు గెలిచారు.

'రెడ్డి జాగృతి కృతజ్ఞత సభ'కు మోదీ, అమిత్ షా

ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కొట్టెం మధుసూదన్‌రెడ్డి వెల్లడి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: దేశంలోని అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపేందుకు ఈ నెల 24న నిర్వహించనున్న సభకు ప్రధాని నరేంద్రమోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హాజరవుతున్నట్లు 'రెడ్డి జాగృతి' సంస్థ ప్రధాన కార్యదర్శి కొట్టెం మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించే ఈ సభకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు హాజరవుతున్నట్లు శనివారం హైదరాబాద్‌లో ఆయన తెలిపారు. సమావేశంలో రెడ్డి జాగృతి అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి, మహిళా అధ్యక్షురాలు శ్వేతారెడ్డి, ఆర్యవైశ్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రేమ్‌గాంధీ పాల్గొన్నారు.

తిరుపతి గోవిందరాజస్వామి కిరీటాలు మాయం

• తితిదే వర్గాల్లో కలకలం

ఈనాడు, తిరుపతి: కలియుగ దైవం తిరుమల శ్రీవారి అన్నయ్యగా పేరొందిన తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో శనివారం దొంగలు పడ్డారు. నగర నడిబొడ్డున కొలువైన గోవిందరాజస్వామి ఆలయంలోని ఉత్సవమూర్తుల విగ్రహాలకున్న మూడు కిరీటాలు శనివారం సాయంత్రం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. విలువైన వజ్రాలు పొదిగిన కిరీటాలే కన్పించడం లేదని తెలుస్తోంది. ఈ పరిణామం తిరుమల తిరుపతి దేవస్థానం వర్గాల్లో కలకలం రేపింది. గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు ప్రతిరోజూ సాయంత్రం వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ప్రత్యేక రోజుల్లో స్వామివారితోపాటు అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వాహనాల్లో ఊరేగిస్తారు. వారికి అలంకరించేందుకు వివిధ వజ్రాభరణాలతో కూడిన ఆరు పురాతన కిరీటాలున్నాయి. వాటిని సాధారణ రోజుల్లో మూలవిరాట్టుకు సమీపంలోనే ఉంచుతారు. ఒంటిపై ఒక జతతోపాటు మరో జత కిరీటాలు, హారాలు విడిగా ఉంటాయి. శనివారం ఉదయం సుప్రభాతసేవ సమయంలో కనిపించిన ఉత్సవమూర్తుల కిరీటాలు తర్వాత మాయమైనట్లు సమాచారం. దీన్ని తితిదే విజిలెన్స్‌కు చెందిన ఓ మహిళా కానిస్టేబుల్ గుర్తించి తమ అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిసింది. విచారణలో భాగంగా అధికారులు.. కిరీటాలను పర్యవేక్షించే సిబ్బందిని, అర్చకులను ఒక్కొక్కరుగా ఆలయానికి పిలిపించారు. ఆలయం మూసివేత అనంతరం రాత్రి తొమ్మిదింటి ప్రాంతంలోనూ అర్బన్ ఎస్పీ అన్బురాజన్, తితిదే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గోపీనాథ్‌జెట్టితోపాటు తితిదే జేఈవో పోలా భాస్కర్ గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు, సిబ్బందిని ఆరా తీశారు. కిరీటాలు మూడు కన్పించడం లేదని ప్రాథమికంగా గుర్తించారు. విలువైన ఆభరణాలు ఎప్పుడు మాయమయ్యాయి? ఇతర విచారణ అంశాలను అధికారులు వెల్లడించడం లేదు. శనివారం అర్ధరాత్రి తర్వాత కూడా ఆలయ పరిసరాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.



తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం..

మహారాష్ట్రలోని రెండు తాలూకాల్లో భూప్రకంపనలు

పాల్‌గఢ్: తరచూ భూమి కంపిస్తుండటంతో మహారాష్ట్రలోని దహాను, తలాసారీ తాలూకా(మండలా)ల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రజలు ఇళ్లలో ఉండటానికి భయపడుతున్నారు. అప్రమత్తమైన ప్రభుత్వం ఈ రెండు తాలూకాల్లో 42 శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. ప్రజలు రాత్రుళ్లు తమ ఇళ్లల్లో కంటే, ఈ శిబిరాల్లో తలదాచుకోవాలని దహాను కలెక్టర్ ప్రశాంత్ నవ్‌నార్నే సూచిస్తున్నారు. రెండు తాలూకాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగానికి సూచించామన్నారు. భూప్రకంపనల సమయంలో ఏం చేయాలి, ఏం చేయకూడదో? అవగాహన కల్పించడానికి సర్పంచులు, గ్రామ సేవకులతో సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) సభ్యులను సంసిద్ధులను చేశామని చెప్పారు. గత ఏడాది నవంబరు నుంచి పైరెండు తాలూకాల్లో భూమి తరచూ కంపిస్తోంది. భూకంపలేఖినిపై 3 నుంచి 4.1 తీవ్రత నమోదవుతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.

ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో..

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా శనివారం భూమి పలుచోట్ల కంపించింది. అఫ్గానిస్థాన్‌లోని హిందుకుష్ ప్రాంతంలో 6.1 తీవ్రతతో భూకంపం వచ్చిందని జాతీయ భూకంప కేంద్రం తెలిపింది. ఉత్తర కాబుల్‌లో భూమికి 212కిమీ దిగువున భూకంపకేంద్రాన్ని గుర్తించామని, శనివారం సాయంత్రం 5.34 గంటలకు భూకంపం వచ్చిందని వెల్లడించింది. దీనికారణంగా ఉత్తరభారతదేశంతో పాటు దిల్లీలో పలుచోట్ల భూమి కంపించిందని ప్రకటించింది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్, ఉత్తర ఖైబర్‌ఫంక్తూన్‌ఖ్వా ప్రావిన్స్, తూర్పు పంజాబ్ ప్రావిన్స్‌లోనూ భూమి కంపించింది. పశ్చిమ ఇండోనేసియాలోని పశ్చిమ సుమత్రా ప్రావిన్స్‌ను 6.0 తీవ్రతతో భూకంపం వణికించింది. ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఫ్రెంచి గయానాలోని కౌరు అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి జీశాట్-31 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. భారత కాలమానం ప్రకారం ఈ నెల ఆరో తేదీన వేకువజామున 2.31 గంటలకు ప్రయోగం చేపట్టనున్నారు.

ఇటీవల మరణించిన జార్జి ఫెర్నాండెజ్ అస్థికలను శనివారం మంగళూరు సమీపంలోని ఆయన స్వస్థలం బెజాయ్‌లో ఖననం చేశారు.

పత్తిని కబళిస్తున్న గులాబీ పురుగు

• దూది తీత పూర్తయితే పత్తిచేలను దున్నేయండి
• రైతులకు జయశంకర్ వర్సిటీ సూచనలు

ఈనాడు, హైదరాబాద్: పత్తి మొక్కల నుంచి తీసిన దూదిలో గులాబీ పురుగు వల్ల జరిగిన నష్టాలను గుర్తించినట్లు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పురుగు సోకినందున దూది రంగు, నాణ్యత తగ్గాయని, దూదిలోని గింజలను పురుగు తినడం వల్ల బరువు తగ్గి రైతులకు నష్టం వాటిల్లిందని పేర్కొంది. ఇలా పురుగు సోకిన పత్తిని అమ్మకానికి, జిన్నింగ్‌కు తీసుకెళ్లిన చోట అది మరింత వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది. బోరునీటి వసతి ఉన్న రైతులు సైతం ఇక పత్తి చేలను ట్రాక్టర్లతో దున్నేయాలని సూచించింది. దుక్కుల వల్ల పత్తి మొక్కల మొదలు వద్ద ఉండే పురుగులు చనిపోతాయని తెలిపింది. నీటి వసతి ఉన్న రైతులు వేసవిలో కాసింత నీరు పెట్టి కలియదున్నితే పురుగులు పూర్తిగా నశిస్తాయని వెల్లడించింది. పత్తి సాగుచేసిన చేలో ఒక పంటకు, మరో పంటకు కనీసం 4 నుంచి 6 నెలల వరకు వ్యవధి ఉంటే పురుగులు పూర్తిగా తగ్గిపోతాయని తెలిపింది. జిన్నింగ్ మిల్లుల్లో వ్యర్థాలను పూర్తిగా తొలగించకపోతే పురుగు వ్యాప్తి చెందుతుందని, మిల్లుల్లో దూది, గింజలు ఉన్నన్ని రోజులు లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేస్తే పురుగులు వాటిలో చేరతాయని.. ఆ బుట్టలను ఎప్పటికప్పుడు కాల్చివేయాలని వర్సిటీ వరంగల్ ప్రాంతీయ పరిశోధనా కేంద్రం ప్రధాన పత్తి శాస్త్రవేత్తలు ఎ.సుదర్శనం, బి.రాంప్రసాద్‌లు తెలిపారు.

మావోయిస్టుల చేతిలో ఇద్దరు గిరిజనుల హతం

మహదేవ్‌పూర్, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ధనోర తాలూకాలో ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరిని మావోయిస్టులు హతమార్చారు. మార్కెగావ్ గ్రామానికి చెందిన సమరు భరత్ గులట్రాస్(46), నిర్మల్ దీపక్‌గిరి(36) అనే వ్యక్తులను హత్య చేశారు. గత 11 రోజుల వ్యవధిలో మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో ఏడుగురిని హతమార్చారు. దీంతో పాటు వాహనాలు, పొక్లయిన్లను దహనం చేయడం, రహదారుల పై చెట్లను నరికివేయడంతో పాటు పలు సంఘటనలకు పాల్పడ్డారు. వరుస ఘటనలతో ఈ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి.

ప్రముఖ పౌరాణికులు సీతారామశాస్త్రి కన్నుమూత



ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురికి చెందిన శ్రీమద్భాగవత పౌరాణికులు బ్రహ్మశ్రీ గుండి సీతారామశాస్త్రి(60) శనివారం రాత్రి కన్నుమూశారు. రాష్ట్రంలోనే ప్రముఖ పౌరాణికులుగా గుర్తింపు పొందిన ఆయనకు సంస్కృత, తెలుగు భాషల్లో అపార ప్రావీణ్యం ఉంది. ధర్మపురి, మంథని, హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో వందలాది వేదికలపై ప్రవచనాలు ఇచ్చారు. వారం రోజుల కిందట ముంబాయి నుంచి వచ్చిన సీతారామశాస్త్రి కొంత అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి 11 గంటలకు ధర్మపురిలోని స్వగృహంలో తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. వైద్యులు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధరించారు.

రూ.2.15 కోట్ల రుణ కుంభకోణం

• పాత ఎస్‌బీఐ కంఠాత్మకూరు శాఖలో భాగోతం
• ముగ్గురిపై సీబీఐ కేసు

పరకాల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాల రుణాల పేరిట అవినీతి వరంగల్ గ్రామీణ జిల్లా పరకాలలోని పాత ఎస్‌బీఐ కంఠాత్మకూరు శాఖలో వెలుగు చూసింది. అప్పటి బ్యాంకు మేనేజర్ అమరనేని నరేన్‌చౌదరి కొందరితో కలిసి రూ.2.15 కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు సీబీఐకి అందడంతో మేనేజర్‌తో పాటు మరో ఇద్దరిపై శనివారం కేసు నమోదు చేశారు. 2017 అక్టోబరులో ఈ బ్యాంకును స్థానిక ఎస్‌బీఐ(ఏడీబీ)లో విలీనం చేశారు. అప్పటి వరకు బ్యాంకు మేనేజర్‌గా నరేన్‌చౌదరి వ్యవహరించారు. జులైలోనే బ్యాంకు విలీన ప్రకటన వెలువడింది. ఈ మధ్యకాలంలో కేంద్రం ప్రవేశపెట్టిన ముద్ర, స్టాండప్ ఇండియా రుణాలను ఎక్కువ మొత్తంలో ఇచ్చారు. ముద్ర కింద అత్యధికంగా రూ.10 లక్షలు, స్టాండప్ ఇండియా ద్వారా రూ.కోటి వరకు రుణాలిచ్చే అవకాశాలున్నాయి. యూనిట్లు లేకున్నా కొందరికి, తప్పుడు పత్రాలతో మరికొందరు ఇతర గ్రామాల వారికి రుణాలు మంజూరు చేశారు. ఈ వ్యవహారంలో ఇద్దరు మధ్యవర్తులుగా ఉన్నారు. 12 దరఖాస్తుల పేరిట రూ.2.15 కోట్ల అవినీతి జరిగిందని ఎస్‌బీఐ రీజియన్ ఉన్నతాధికారులు గుర్తించారు. సీబీఐకి ఫిర్యాదు చేయడంతో శనివారం బ్యాంకు మేనేజర్ నరేన్‌చౌదరి, మధ్యవర్తులైన దొంతుల శ్రీనివాస్, మాడిశెట్టి రాజేశ్‌కుమార్‌లపై కేసు నమోదు చేశారు. నరేన్ చౌదరి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులో పనిచేసినపుడు కూడా రుణాల పేర అవినీతికి పాల్పడినట్లు సమాచారం.



సూర్యాపేట జిల్లా ఫణిగిరిలోని బౌద్ధక్షేత్రం వద్ద తవ్వకాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర వారసత్వ శాఖ డైరెక్టర్ విశాలాచ్చి

పురాతన శిల్ప సంపదను వెలికితీసేందుకే తవ్వకాలు

ఫణిగిరి (జాజిరెడ్డిగూడెం), న్యూస్‌టుడే: పురాతన శిల్ప సంపదను పరిరక్షించేందుకే తవ్వకాలు జరుపుతున్నట్లు తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ విశాలాచ్చి పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం ఫణిగిరిలోని బౌద్ధ క్షేత్రం వద్ద రూ.56 లక్షలతో తవ్వకాల పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బౌద్ధక్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. గతంలో ఫణిగిరిలోని బౌద్ధ క్షేత్రం వద్ద జరిగిన తవ్వకాల్లో బయటపడిన శిల్పాలను మ్యూజియంలో భద్రపరిచినట్లు చెప్పారు. ఇప్పటి నుంచి వర్షాలు వచ్చే వరకు తవ్వకాలు చేపడతామన్నారు.

'కీచక' ప్రధానోపాధ్యాయుడు

• పదో తరగతి విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన
• 'నిర్భయ' కేసు నమోదు

కూసుమంచి, న్యూస్‌టుడే: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి వారి భవితకు బాటలు వేయాల్సిన గురువే 'దారి' తప్పాడు. బిడ్డల్లాంటి విద్యార్థినుల పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడే అసభ్యంగా ప్రవర్తించాడు. ఇతని లైంగిక వేధింపులను భరించలేని విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు గోడు వెళ్లబోసుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో 130 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 46 మంది విద్యార్థినులున్నారు. పరీక్షల సందర్భంగా ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు బెజవాడ శంకర్‌రెడ్డి ఒక్కొక్కరినీ తన గదిలోకి పిలిచి బాగా చదవాలని చెబుతూనే.. లైంగికంగా వేధించసాగాడు. కూసుమంచి, జీళ్లచెర్వు గ్రామాలకు చెందిన విద్యార్థినులు ప్రధానోపాధ్యాయుని వికృత చేష్టలను తల్లిదండ్రులకు చెప్పారు. వారంతా స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఇంటూరి శేఖర్‌తో కలిసి శనివారం పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. ప్రధానోపాధ్యాయుడు సెలవులో ఉండటంతో ఉపాధ్యాయులను నిలదీశారు. ఓ బాధిత విద్యార్థిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూసుమంచి ఎస్‌ఐ అశోక్ నిర్భయ చట్టం కింద ప్రధానోపాధ్యాయునిపై కేసు నమోదు చేశారు. కలెక్టర్ ఆదేశం మేరకు సోమవారం విచారణ చేపట్టనున్నట్లు డీఈవో మదన్ మోహన్ చెప్పారు. మరో ఏడాదిలో ఉద్యోగ విరమణ చేయనున్న ప్రధానోపాధ్యాయుడు గతంలోనూ విద్యార్థినులను లైంగికంగా వేధించి, సస్పెండయ్యాడు.



ఈనాడు

దేవుడికి చలి కోటు

'ఈశ్వరుడు సత్యం' అనేది విశ్వాసం. 'సత్యమే ఈశ్వరుడు' అనేది దర్శనం. వీటిలో మొదటిది సగుణారాధనకు, రెండోది నిర్గుణోపాసనకు పునాదులు. నమ్మినవారికి భగవంతుడు బలమైన ఆలంబన. 'నమ్మితి నా మనంబున సనాతనులైన ఉమామహేశులన్' అనుకొంది- రుక్మిణి. 'నిన్ నమ్మినవారికి ఎన్నటికిని నాశము లేదు గదమ్మ ఈశ్వరీ' అంటూ కృష్ణుడి రాక కోసం నిబ్బరంగా వేచి చూసింది. చివరకు ఆమె నమ్మకం ఫలించిందని భాగవతం తెలియజెప్పింది. పూర్వాంధ్ర మహాకవులు చాలామంది కావ్యారంభంలో ఇష్టదేవతా ప్రార్థనను నియమంగా పాటించేవారు. 'శ్రీవాణీ గిరిజా'త్' ఆదికవి ఆ ఆనవాయితీకి శ్రీకారం చుట్టాడు. 'శ్రీయన గౌరినాబరగు చెల్వకు చిత్తము పల్లవింప' అంటూ తిక్కన సోమయాజి ఆ పరంపరను కొనసాగించాడు. 'భక్తజనంబు వైదికద్వాయిత కిప్పమెచ్చు పరతత్త్వము గొల్చెదను ఇష్టసిద్ధికిన్' అనుకొంటూ కావ్యసృష్టికి అనుకూలమైన విస్పష్ట నిర్మలచిత్తాన్ని, సృజనచైతన్యాన్ని అందిపుచ్చుకొన్నాడు. 'భావాంబర వీధి విశ్రుత విహారిణి నన్ కృప చూడు భారతీ' అనే ప్రార్థన ఎర్రాప్రగడ హృదయాన్ని లోకానికి ఆవిష్కరించింది. భక్తుల విషయం వేరే చెప్పనే అక్కర్లేదు. శ్రీకాళహస్తీశ్వర శతకంలో ధూర్జటి కవి చెప్పినట్లు 'నిన్నున్ నమ్మినరీతి నమ్మను ఒరులన్ నీకన్న నాకెన్న(ఆలోచిన్నే)- లేరు అన్నట్లుమ్ములు, తల్లిదండ్రులు గురుండు ఆపత్సహాయుండు' అన్నది లోకంలో భక్తుల శరణాగత స్థితికి అచ్చమైన అక్షరరూపం. దాశరథీ శతక కర్త కంచర్లగోపన్నది కాస్త దూకుడు ఎక్కువ అనిపించే ధోరణి. అందుకే 'రామమూర్తికిన్ రెండవ సాటి దైవము ఇక లేడనుచున్ మత్త వేదండము(మదపుటేనుగు) నెక్కి చాటెదను' అంటూ ఆ ఉత్సాహాల పద్యం అయింది పాదానికి దూకింది.

భక్తుల్లో రకరకాల వారుంటారు. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లుగా, భక్తి ముదిరి మైత్రిగా పరిణమించిన దాఖలాలుంటాయి. స్నేహాన్ని పురస్కరించుకొని భక్తులు భగవంతుడితో పరిహాసాలకు పాల్పడతారు. పరాచికాలాడతారు, దబాయిస్తారు. త్యాగరాజస్వామి వంటి సౌమ్యులైతే 'మా జానకి చెట్టాపట్టగా మహారాజువైతివి...' ఇందులో నీ గొప్పదనం ఏముందిలే వంటి చలోక్తులతో సరిపెడతారు. దీనిలో గడుసుదనమంతా 'మా' జానకి అనడంలో ఉంది. ఆంధ్రనాయక శతక కర్త కాసుల పురుషోత్తమ కవి అధిక్షేపం 'ఆంధ్ర(భార్యలు) బిడ్డలు తెచ్చు ప్రఖ్యాతి కాక మొదటినుండులు నీవు దామోదరుడవే' అన్న ధోరణిలో ఉంటుంది. దామోదరుడన్న పదానికి లోకంలో నిర్భాగ్యుడు, సోమరి వంటి అర్థాలు చలామణిలో ఉన్నాయి. అంతేకాదు, 'వివిధ పూజోత్సవములు నిర్వహ్యములుగ చేసికొనకున్న నీకు తీర్థ కిందటా?' కాస్త ఆదబుటరూ లేకపోతే నీ ప్రాచుర్యం దెబ్బతింటుంది సుమా అంటూ శ్రీకాకుళాంధ్రదేవుడికి కాసులకవి సలహా ఇచ్చాడు. ధూర్జటి ఓసారి శివుడిమీద కోపం పట్టలేక 'నీ చేతిలో లేడి ఉంది, మరో చేతిలో పదునైన కఠారం(గొడ్డలి) ఉంది, నీ నుదుటనే మంట ఉంది, నెత్తిన నీరు(గంగమ్మ), మెడలో బొచ్చెలాంటి కపాలం(పుర్రె) సిద్ధంగానే ఉన్నాయి. నీవు మాంసం తినాలనిపించినప్పుడు చక్కగా రుచికరంగా వండుక తినాలి. అంతేగాని ఎంగిలి కూటికి ఎగబడతావా ఎవరైనా? 'ఆ బోయ(కన్నప్ప)చేన్ చేకొంటి ఎంగిలి మాంసము ఇట్టు తగునా' అంటూ తీవ్ర నిరసన వ్యక్తం చేశాడు. 'దాహం తీర్చు' అంటే పోయేదానికి శ్రీనాథుడు 'సిరి గలవానికి చెల్లును తరుణుల పదియారువేల తగ పెండ్లాడన్ తిరిపెమునకు (బిచ్చగాడికి) ఇద్దరాండ్రా? పరమేశా, గంగ విడుము పార్వతి చాలున్' అని దబాయించాడు. వీరంతా ఈశ్వరార్పణ కాకాకోవిదులన్న విషయం మనం మరచిపోకూడదు. కాబట్టే అంతటి చనువు తీసుకొన్నారు.

మరోవైపు భగవంతుణ్నే ఇరకాటంలోకి నెట్టిన పరమభక్తుల తీరును భారతం వర్ణించింది. అభిమన్యుడి మరణానికి సైంధవుడే కారణమని తెలియగానే ముందువెనకా చూడకుండా అర్జునుడు ఒక్కరోజులో వాణ్ని చంపి తీరతానని అందరి ముందూ ప్రతిజ్ఞ చేశాడు. అది విని కృష్ణుడు 'నరుడు(అర్జునుడు) ఇటులేలనో నృపగణంబు వినంగ జయించవచ్చునే గురు కరుసేనలన్ తరణి(సూర్యుడు) గ్రుంకక మున్న చాల దుస్తరమిది(కష్టసాధ్యం)' అంటూ అసహనం వ్యక్తం చేశాడు. దేవుడికోసం ప్రాణాలిచ్చే భక్తుల గురించి పురాణాలు వివరించాయి. 'నీ నగవులు, నీ చూడ్కులు, నీ నానా విహారములు, నీ దొనుబులు, నీ నర్మలాపములు మానసములు నాటె...' అంటూ కృష్ణుణ్ని ప్రాణాధికంగా ప్రేమించిన గోపికలు అందుకు ఉదాహరణలు. నరకానికి పోతారన్నా సంకోచించకుండా వారు కాలిదుమ్మును తీసిచ్చిన వైనాన్ని మనం విన్నాం. శబరి చూపించిన ప్రేమకు విశ్వనాథవారి రాముడు కన్నీరు మున్నీరయ్యాడు. 'అట శబరియు, ఇట పంపయు(పంపా సరస్సు) ఆటుల ఆత్మ ఇటుల కనులకు అనవధి భూతప్పుటతర సుఖానుభూతిన్ ఘటియించిరి యింత కష్టకాలమునందున్' అనుకొన్నాడు. సరిగ్గా అలాంటి సన్నివేశమే ప్రస్తుతం ఉత్తరాదిలో సంభవిస్తోంది. ఈ ఏడాది చలి తీవ్రత బాగా పెరిగిపోయిన నేపథ్యంలో ఆలయాల్లో మూలవిరాట్టులకు భక్తజనులు ఉన్నిబట్టలు, చలికోట్లు, టోపీలు అలంకరించారు. 'విగ్రహాలు కావు- వారు మా ఆరాధ్య దైవాలు' అంటున్నారు ఖటిమా నగరవాసులు. రాతి విగ్రహాల్లో దైవత్వాన్ని, సజీవ చైతన్యాన్ని అనుభూతి చెందడంకన్నా భక్తికి నిదర్శనం ఏముంటుంది? 'నోరున్ వాయియు లేని జంతువులు నన్నుం జూచి జాలింబడున్' అంటూ ఆశ్చర్యపోయిన రాముడు ఈ భక్తుల ప్రేమకు ఎంతగా మురిసిపోతాడో! అవును... భావన చేసేవారికే భగవంతుడు!



సంస్కరణలతోనే... మరింత ఉపశమనం

మధ్యంతర బడ్జెట్ కూర్పుపై కొన్ని రోజులుగా వివిధ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఊహించినట్లుగానే తాత్కాలిక బడ్జెట్‌ను పలు ప్రజాకర్షక పథకాలు, భారీ కేటాయింపులు, పన్ను రాయితీలతో తీర్చిదిద్ది నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓ కొత్త ఒరవడి సృష్టించింది. బడ్జెట్ తాత్కాలికమే అయినా కేంద్ర ఆర్థిక మంత్రిగా పీయూష్ గోయల్ దాదాపు పూర్తిస్థాయి బడ్జెట్‌ను తలపించే రీతిలో వివిధ వర్గాలకు వరాల జల్లులు కురిపించారు. సార్వత్రిక ఎన్నికల ముందు ప్రవేశపెట్టే బడ్జెట్లో ఎటువంటి జనాకర్షక పథకాలు లేకుండా కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు అవసరమయ్యే ఆదాయ, వ్యయాల పైనే దృష్టిసారించే ఆనవాయితీకి భిన్నంగా మోదీ ప్రభుత్వం 'ఎన్నికల బడ్జెట్'కు తెరతీసింది. దేశ రైతాంగాన్ని ఆదుకొనే దిశలో భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించడంతోపాటు కార్మికులు, మధ్యతరగతి వర్గాలు, ఉద్యోగులు, పింఛనుదారులకు వరాలు కురిపించింది. మోదీ హయాములో ఇప్పటివరకూ ఇంతటి జనాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదనడం అతిశయోక్తి కాదు. దేశంలోఉన్న అసంఘటిత కార్మికులకు పింఛను పథకం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు వడ్డీరాయితీ, జాతీయ విద్యామిషన్‌కు అధిక నిధులు, మత్స్యకారుల సంక్షేమానికి కేంద్రంలో ప్రత్యేక శాఖ ఏర్పాటు వంటి పలు ప్రతిపాదనలతో తాత్కాలిక బడ్జెట్‌ను సర్వజన బడ్జెట్‌గా రూపొందించడంలో ఆర్థికమంత్రి సఫలీకృతులయ్యారు.

కాసింత ఊరట

బడ్జెట్లో ప్రత్యక్ష పన్నుల సంస్కరణల ఊసు లేనప్పటికీ ఆదాయపు పన్ను మినహాయింపులు, రాయితీలను ప్రకటించి మధ్యతరగతికి, ఉద్యోగులకు కొంత ఊరట కలిగించారు. కార్పొరేట్ పన్నుల్లో ఎటువంటి మార్పులూ చేయకుండా యథాతథంగానే కొనసాగించిన ఆర్థికమంత్రి వ్యక్తిగత, ఆదాయపు పన్నుల విషయంలో ఊహించినదానికంటే ఎక్కువగా ప్రయోజనాలను కల్పించి అందర్నీ ఆశ్చర్యపరచారు. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితి పెంపుదలకోసం కొన్నేళ్లుగా మధ్యతరగతికి, వేతన జీవులు ఎదురుచూస్తున్నారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితుల్లో ఎటువంటి మార్పులు చేయకుండా యథాతథంగా కొనసాగిస్తూ రిబేటు పరిధిని పెంచారు. ఫలితంగా అయిదు లక్షల రూపాయల వరకూ వ్యక్తిగత ఆదాయం ఉన్నవారు పూర్తి పన్నురాయితీ (రూ.12,500) పొంది ఆదాయపు పన్ను నుంచి పూర్తి మినహాయింపు పొందవచ్చు. వివిధ సెక్షన్ల కింద ఇచ్చే మినహాయింపులు (80సీ, 80డీ) ప్రామాణిక తగ్గింపు, గృహరుణంపై వడ్డీ మినహాయింపు వంటివాటిని తీసేసిన తరవాత వచ్చే ఆదాయం అయిదు లక్షల రూపాయలకు మించకపోతే పూర్తి పన్ను మినహాయింపు వర్తిస్తుంది. ఆదాయ పన్ను పరిమితి పెంచకుండా, పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయకుండా రాయితీ పరిధిని పెంచి కొంతమేర పన్నుపోటు తగ్గించారు. నాలుగేళ్లుగా పన్ను పరిమితి పెంపుదలకోసం ప్రతి బడ్జెట్లోనూ ఎదురుచూసి భంగపడ్డ మధ్యతరగతికి ఇది ఊరటనిచ్చే ప్రతిపాదనే. మోదీ ప్రభుత్వం 2014లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రెండు లక్షల రూపాయలనుంచి రెండున్నర లక్షలకు పెంచింది. ఆ తరవాత ప్రవేశపెట్టిన బడ్జెట్లలో ఆ పరిమితిని యథాతథంగా కొనసాగించింది. స్వల్పరాయితీలతో, పన్ను మినహాయింపులతో సరిపెట్టింది. ఈసారి మధ్యతరగతిని ఆకట్టుకొనే విధంగా పలు పన్ను రాయితీలను ప్రకటించింది. ఉద్యోగులకు వర్తించే ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్)ను రూ.40 వేల నుంచి రూ.50 వేలకు పెంచడంవల్ల వేతన జీవులందరికీ అదనపు ప్రయోజనం చేకూరనుంది. అదేవిధంగా ఇప్పటివరకు సొంత ఇంటిపై (సొంత నివాసం ఉంటున్నది) ఎలాంటి అని

ఆదాయ పన్నుపోటుకు చికిత్స

శ్చియమైన (నోషనల్) అద్దె ఆదాయాన్ని చూపాల్సిన అవసరం లేకుండా ఉండే వెసులుబాటు ఒక్కో ఇంటికి మాత్రమే లభించేది. రెండో ఇల్లు ఉన్నట్లయితే ఆ ఇంటిపై అద్దె ఆదాయాన్ని చూపాల్సి వచ్చేది. ఈ బడ్జెట్లో రెండో ఇంటికీ ఎటువంటి ఆదాయాన్ని చూపాల్సిన అవసరం లేకుండా సొంతంగా నివాసం ఉంటున్నట్లుగా చూపించుకొనే వీలు కల్పించారు.

బ్యాంకులు, పోస్టాఫీసుల్లో వెచ్చించిన డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయంపై మూలం వద్ద పన్నుకోత (టీడీఎస్) విధించే పరిమితిని పెంచారు. ప్రస్తుతం వార్షిక వడ్డీ ఆదాయం రూ.10 వేలు దాటినట్లయితే ఆ మొత్తానికి టీడీఎస్



కొందరివద్ద అధిక సంపద

మారుతున్న అంతర్జాతీయ వ్యాపార విధానాలు, దేశ ఆర్థికం, పెరుగుతున్న మహా సంపన్నుల సంపద, విస్తరిస్తున్న ధనిక-పేదల మధ్య అంతరాలు... ఇవన్నీ ప్రత్యక్ష పన్నుల విధానంలో సంస్కరణల అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. సంపన్నుల ఆదాయంపై పన్నురేటును పెంచడంతోపాటు దేశ జనాభాలో అత్యధికులను పన్ను పరిధిలోకి తీసుకురావలసిన అవసరం ఉంది. పన్ను ఎగవేతలను అరికట్టడంతోపాటు సామాన్య పన్ను చెల్లింపుదారులకు పన్ను భారం తగ్గించే ప్రయత్నం చేయాలి. ప్రత్యక్ష పన్నుల వసూలు గత నాలుగేళ్లలో గణనీయంగా పెరిగాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం రూ.6.38 లక్షల కోట్లు. 2017-18 నాటికి రూ.12 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అదేవిధంగా దేశంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు జీడీపీలో 5.98 శాతానికి పెరిగాయి. అయినా దేశంలో ఆదాయపన్ను చెల్లించేవారి సంఖ్య అతి తక్కువగా ఉంది. ఒకవైపు ధనవంతుల సంపద 39శాతం దాకా పెరగ్గా, అట్టడుగు వర్గాల సంపద కేవలం మూడు శాతానికే పరిమితమైందని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. దాదాపు సగానికి పైగా దేశ సంపద ఒక శాతం సంపన్నుల చేతిలో ఉందని ఆ నివేదిక స్పష్టీకరించింది. అంతేకాక సుసంపన్నులైన ఒక శాతం పౌరులు తమ సంపదపై అదనంగా చెల్లిస్తున్న పన్నులు 0.5 శాతమేనని కుండ బద్దలుకొట్టింది.



తుమ్మల కిశోర్

వర్తిస్తుంది. ఈ పరిమితి రూ.40 వేలకు పెరిగింది. దీనివల్ల అత్యధిక పింఛనుదారులు, వయోవృద్ధులు, సాధారణ మదుపుదారులు ప్రయోజనం పొందుతారు. నిజానికి ఈ పరిమితిని పెంచాలని కొన్నేళ్లుగా పన్ను చెల్లింపుదారులు కోరుతున్నప్పటికీ ఎప్పుడూ సరైన ప్రయత్నం నమోదు కాలేదు. సొంత ఇంటిని అమ్మినప్పుడు వచ్చిన దీర్ఘకాలిక మూలధనం లాభంలోనూ కొంత వెసులుబాటు కల్పించడంతోపాటు ఇంటిని వాణిజ్య అవసరాలకు అద్దెకిచ్చిన సందర్భాల్లో అద్దె ఆదాయం రూ.1.80 లక్షలు దాటినా టీడీఎస్ వర్తించేది. ఈ బడ్జెట్లో అద్దె ఆదాయం పరిమితిని రూ.2.40 లక్షలకు పెంచి కొంత ఊరటనిచ్చారు. మొత్తంమీద తాత్కాలిక బడ్జెట్లో మధ్యతరగతికి, ఉద్యోగులకు పలు పన్ను రాయితీలు ప్రసాదించి గతంలో ఎన్నడూ లేనంత ఆకర్షణీయంగా, జనరంజకంగా బడ్జెట్‌ను తీర్చిదిద్దారు.

నష్టదాయకం కాదు

సంపన్నులను, మహా సంపన్నులు అధిక ఆదాయ పన్ను చెల్లించే విధంగా శ్లాబుల రేట్లు పెంచాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో మధ్యతరగతికి మరిన్ని రాయితీలు కల్పించే దిశలో పన్ను సంస్కరణలు కొనసాగాలి. మధ్యతరగతికి, వేతన జీవులకిచ్చే రాయితీలు, పన్ను మినహాయింపులవల్ల ప్రభుత్వానికి పెద్దగా పన్ను ఆదాయం కోల్పోయే పరిస్థితి ఉత్పన్నం కాదు. ఎగవేతకు ఎటువంటి ఆస్కారం లేకుండా నూటికి నూరుశాతం పన్ను ఆదాయాన్ని లెక్కకట్టి పన్ను చెల్లించేది ఉద్యోగులేనన్నది వేరే చెప్పనక్కర్లేదు. పెద్దయెత్తున ధనార్జన చేస్తూకూడా పన్నుపోటు తప్పించుకుంటున్న కొన్ని వర్గాలను సుంకాల పరిధిలోకి తెచ్చి వేతన జీవులకు మరింత ఊరట కల్పించాలి. వీటితోపాటు కొన్నేళ్లుగా పన్నులకు సంబంధించి పలు న్యాయవ్యాజ్యాల్లో చిక్కుకొన్న రూ.7.6 లక్షల కోట్ల మొత్తానికి సంబంధించిన వివాదాలను కొంతమేరకైనా పరిష్కరించగలిగితే ప్రభుత్వానికి పన్ను ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. భవిష్యత్తులో మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు మరింత ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు వీలుంటుంది. ముఖ్యంగా పేద, ఆర్థికంగా వెనకబడిన వర్గాల పరిధి నిర్వచనం మారుతున్న నేపథ్యంలో ప్రత్యక్ష పన్ను విధానాల్లో కొన్ని కీలక మార్పులు చేయవలసిన అవసరం ఉంది. ఉదాహరణకు ఆర్థికంగా వెనకబడినవారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం ఎనిమిది లక్షల రూపాయల వార్షిక ఆదాయం ఉన్నవారికి అర్హత కల్పించింది. అంటే ఎనిమిది లక్షల రూపాయల వార్షిక ఆదాయం ఉన్నవారు ఆర్థికంగా వెనకబడినవారైతే ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో అయిదు లక్షల వరకే పన్ను మినహాయింపు ఇవ్వడంలో ఔచిత్యమేమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రత్యక్ష పన్నుల విధానాన్ని సంస్కరించే దిశలో ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయాలి. ప్రత్యక్ష పన్నుల విధానంలో సంస్కరణలు చేపట్టే లక్ష్యంతో గతంలో అఖిలేశ్ రంజన్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటైంది. అది తమ నివేదికను ఈ నెల 28 నాటికి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. ఈ కమిటీ ఆదాయ పన్ను శ్లాబులను క్రమబద్ధీకరించడంతోపాటు మధ్యతరగతికి, సామాన్య పన్ను చెల్లింపుదారులకు పన్ను భారాన్ని తగ్గించే దిశలో కొన్ని సిఫార్సులు చేసే అవకాశం ఉంది.

(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

బడి చుట్టూ మాదక బూచాళ్లు!

మత్తుగా గమ్మత్తుగా మనిషిని చిత్తు చేసి జీవచ్ఛవంగా మార్చి చివరకు చితి మీదకు చేర్చేవి మత్తు పానీయాలు, మాదక ద్రవ్యాలు. సర్కారీ లేబుళ్లతో మత్తు పానీయాల గరళాన్ని సామాన్య జనం గొంతులో పోసి, కాసుల కిక్కుతో పేరు గొప్ప ప్రభుత్వాలు తరించిపోతుంటే, చాపకింద నీరులా మాదక ద్రవ్య మహోపద్రవం విరుచుకుపడుతోంది. మాదక శక్తుల పంజాదెబ్బకు పంజాబు ఒక్కటే విలవిల్లాడుతోందనుకోవడానికి వీల్లేదని, నిశ్శబ్దంగా చొచ్చుకువస్తున్న మహమ్మారి ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులను చుట్టబెట్టేయడంతో ఆగకుండా పాఠశాలలకూ పాకుతోందన్న భయానక నిజం భీతిల్లజేస్తోంది. పిల్లలంటే ప్రతి కుటుంబానికీ ప్రాణప్రదం; వాళ్లే జాతిభవితకు ప్రాణదీపం! ఆ భవిష్యద్దీపాలను కొడిగట్టించేలా మాదక శక్తులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుంటే ప్రభుత్వాలు వెలగబెట్టాల్సింది నిష్క్రియాపరత్వమా? మన కొంప అంటుకొన్నప్పుడు చూద్దాంలే అనుకొంటే- నిలువునా మునిగిపోమా?

సాధారణంగా స్కూలు పిల్లల బడి సంచుల్లో ఏముండాలి? పుస్తకాలు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, మధ్యాహ్న భోజనం, చిరుతిళ్లు- అంతేగా? ఇటీవల బెంగళూరులోని పలు స్కూళ్లలో పిల్లల బ్యాగుల్ని తనిఖీ చేస్తే పొగాకు, ఈ-సిగరెట్లు, బ్లేడ్లు, స్క్రూడ్రైవర్లు, సిరంజీలు, బాణసంచా వంటివి బయటపడ్డాయి. గత వారంలో బెంగళూరులోనే అయిదు నుంచి పదో తరగతి చదివే పిల్లలు నిషేధిత సరకును అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. కేవలం ఒక్కరోజు తనిఖీలోనే ఒక పాఠశాలలో అలాంటి నిషేధిత వస్తువులు నాలుగు గోనె సంచులకు సరిపడా దొరికాయి! పిల్లలకే కాదు, వారి తల్లిదండ్రులకూ కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆయా పాఠశాల యాజమాన్యాలు అభిప్రాయపడుతున్నాయి. ముంచుకొచ్చిన ముప్పు ఊహించనంత తీవ్రమైనదనడానికి సాక్ష్యంగా నిరుడు జులైలో కర్ణాటక విధాన మండలి ప్రశ్నోత్తరాలనే ఉదాహరించాలి. దేవనహళ్ళిలో మాదక ద్రవ్యాలు ఉత్పత్తి అవుతున్నాయని, మాదక ద్రవ్యాల పూత పూసిన చాక్లెట్లు జయానగర్‌లోని పాఠశాల వెలుపల సరఫరా అవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వమే అంగీకరించింది. దేవనహళ్ళి చుట్టుపక్కలున్న ఔషధ కంపెనీలు మాదక ద్రవ్య మాత్రల్ని తయారు చేస్తున్నాయని, బడి పిల్లలకు రెండు రోజులపాటు ఉచితంగా ప్రత్యేక పూత చాక్లెట్లను అందించడంతో అవే కావాలంటూ పిల్లలు మారాం చేస్తున్నారన్న ప్రభుత్వం- బెంగళూరు పరిస్థితిని పంజాబులా దిగజారనివ్వబోమని ప్రతినబూనింది. ఊకదంపుడు ఉపన్యాసాలతో మాదక మారణ హోమం ఆగుతుందా?

ముప్పై నెలల క్రితంనాటి ముచ్చట. కేరళ కోజికోడ్ జిల్లాలోని ఏడు గ్రామ పంచాయతీలు చేపట్టిన బాల సురక్షాయాత్ర- మాదక ద్రవ్య మాఫియా అనేక రూపాల్లో పాఠశాలల దాకా ఎలా చొచ్చుకుపోయిందీ కళ్లకు కట్టింది. పాఠశాల బుడతల్నే ఇటు వినియోగదారులుగా, అటు సరఫరాదారులుగా తీర్చిదిద్దిన దారుణాన్ని 'చైల్డ్ లైన్ కోజికోడ్' నివేదిక వెలుగులోకి తెచ్చింది. పద్దెనిమిది నెలల క్రితం హైదరాబాద్‌లో ముగ్గురు సభ్యుల ముఠా తీగ లాగితే కదిలిన డొంకలు- వాళ్ల పరిధిలోని వినియోగదారుల జాబితాలోనే 20 పాఠశాలలకు చెందిన పిల్లలు వెయ్యిమంది దాకా ఉన్నారన్న నిజాన్ని వెల్లడించాయి. ఎల్ఎస్‌డీ, ఎమ్‌డీఎమ్ఏ లాంటివి గోవా, కర్ణాటకల నుంచి; కొకైన్, హెరాయిన్ వంటివి ఆఫ్రికా, లాటిన్ అమెరికాల నుంచి రెండు తెలుగు రాష్ట్రాలనూ ముంచెత్తుతున్నాయన్న వార్తాకథనాలు ఈనాటివి కావు. మాదకద్రవ్య సరఫరాదారులకు పంజాబులో మరణశిక్ష ప్రతిపాదిస్తున్నారంటే- బెంగళూరులో పరిస్థితి అంతగా దిగజారలేదని మంత్రివర్యులు చప్పరించేశారు. ఇలాంటి ఉదాసీన ధోరణులతోనే నేతలు- రేపటి తరాన్ని బలిపీఠం మీదకు నెడుతున్నారు!



పుణ్యభూమి

మద్య నిషేధాన్ని గట్టిగా అమలుచేస్తున్న బిహార్లో మాదక ద్రవ్యాల ఉరవడి నితీశ్ ప్రభుత్వానికి సవాళ్లు రువ్వుతోంది. భోజ్‌పూర్ జిల్లాలోని మసఢ్, గయ, పుర్ణియా, వైశాలి జిల్లాలో రాఘోపూర్ దయారా, తూర్పు చంపారన్‌లోని గోపాల్ గంజ్, రక్సౌల్ పరగణాలు- మాదకద్రవ్య సరఫరాలకు నెలవులుగా మారాయి. మాదక ద్రవ్య సంక్షోభంపై పాఠశాల విద్యార్థుల్ని జాగృతం చేసేందుకు హరియాణా నిరుడు వారోత్సవాలు నిర్వహిస్తే, ప్రభుత్వ పాఠ్యాంశాల్లో డ్రగ్స్ దుష్ప్రభావాల్ని వివరిస్తూ ఓ అధ్యాయం ఉండాలని హిమాచల్ ప్రదేశ్ తీర్మానించింది. నాగ్‌పూర్ వ్యాప్తంగా పాఠశాలల్లో పిల్లలు హుక్కా పెన్ (ఈ-సిగరెట్)ను వినియోగిస్తున్న వైనం విస్తృతమవుతోంది. ఈ హుక్కా పెన్‌లు మాదక ద్రవ్యాలకు 'గేట్ వే'గా మారుతున్నాయని, 12-14 ఏళ్ల పిల్లలు వాటికి బానిసలైపోతున్నారని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. 'ఎక్కడైనా మాదక ద్రవ్యాలు పట్టుబడితే ఆయా ప్రాంతాల్లో వాటి ఉరవడి ఉద్ధృతంగా ఉందని అర్థం... తనిఖీల్లో సరకు ఏమీ లభించనంత మాత్రాన మాదక ద్రవ్యాల వినిమయమే లేదనుకోవడం అసంబద్ధం' అని ఐక్యరాజ్య సమితి ఏనాడో హెచ్చరించింది. ఇంత ఉరవడి కళ్లకు కడుతున్నా- మాదక ద్రవ్య మహాగాడ్పులకు ఇంటిదీపాలు, కంటి వెలుగులు కొండెక్కిపోకుండా కాచుకొనే కనీస జాగ్రత్త చర్యలే కుటుంబం, సమాజం, ప్రభుత్వాల నుంచి పూర్తిగా కొరవడుతున్నాయి.

ప్రాథమిక పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల పిల్లలకూ మాదక ద్రవ్య పరీక్షలు నిర్వహించాలని తద్వారా దేశ భవిష్యత్తును భద్రంగా కాచుకోవాలని ఫిలిప్పీన్స్ నిర్ణయించింది. పాఠశాలలే బాలబాలికల పాలిట మాదక ద్రవ్య బలిపీఠాలవుతున్నాయన్న పబ్లిక్ పాలసీ ఏజెన్సీ నివేదిక- కెన్యా దుస్థితికి అద్దంపట్టింది. పాఠశాలలకూ పాకిన మాదక మహమ్మారిపై ఏం చేస్తున్నారంటూ పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఇటీవలే తీవ్రంగా స్పందించింది. పొరుగున శ్రీలంక అయితే చనువుగా పిల్లలతో మెలగుతూ తల్లిదండ్రులు తమ బిడ్డల్ని ఎలా కాపాడుకోవాలో జనజాగృత ఉద్యమానికి తాజాగా తెర తీసింది. బడి పిల్లల్లో బాధ్యత, పరిసరాల పరిశుభ్రత పట్ల స్పృహ పెంచి, మేలిమి భావిపౌరులుగా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో జపాన్- తరగతి గదుల్ని పిల్లలే శుభ్రం చేసే విధానాన్ని ఆచరణాత్మకం చేసింది. ఇజ్రాయెల్ అయితే, 'స్టూడెంట్-పోలీస్ క్యాడెట్ ప్రోగ్రాం' ద్వారా నేర నియంత్రణలో విద్యార్థుల్నీ క్రియాశీల భాగస్వాముల్ని చేస్తోంది. 'అంత దూరం...' ఆలోచించలేని ప్రభుత్వాలకు ఇదమిత్థంగా ఏం చేయాలో పంజాబ్- హరియాణా హైకోర్టు పది రోజులనాడు విస్పష్ట సూచనలు చేసింది. వాటి అమలుకైనా ప్రభుత్వాలు సిద్ధపడతాయా?

నిషేధిత మాదక ద్రవ్యాలు విద్యార్థులకు సరఫరా అవుతున్నా దోషుల్ని పోలీసులు పట్టుకోలేకపోవడాన్ని సూటిగా తప్పుపట్టిన పంజాబ్ హరియాణా హైకోర్టు- కచ్చితంగా అమలు చెయ్యాలంటూ పాతిక ఆదేశాలు జారీచేసింది. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు దాకా అన్ని విద్యాసంస్థల దగ్గర మఫ్టీలో పోలీసుల్ని మోహరించాలని, మందుల షాపుల ద్వారానూ మైనర్లు ఎవరికీ మాదక ద్రవ్యాలు చేరకుండా తనిఖీలు ముమ్మరం కావాలనీ ఉత్తర్వులిచ్చింది. అవేం సరిపోతాయంటే, అంతకంటే మెరుగైన వ్యూహాలుంటే- తక్షణం వాటిని అమలుచేసి రేపటి పౌరుల భవిష్యత్తు బుగ్గిపాలు కాకుండా ప్రభుత్వాలు కాచుకోవాలి. నేరగ్రస్త చీకటి వ్యవస్థ క్రీనీడలు మన పిల్లల మీద పడరాదంటే, సామాజిక బాధ్యతతో అందరూ జాగరూకులై మెలగాలి. నయా బూచాళ్ల బారి నుంచి బుడతల్ని కాపాడుకోవాలి. ఏమంటారు?

– పర్వతం మూర్తి

సార్థక జీవనం

అసంతృప్తితో రగిలిపోయే మనిషికి సుఖం ఒక ఎండమావి. ఎన్ని ఉన్నా అన్నింటినీ కోల్పోయినట్లు మనిషి డీలా పడిపోతాడు. అరచేతిలో అక్షయపాత్ర ఉన్నా, ఇంకా ఏదో కావాలని తపిస్తుంటాడు. పరుల ఉన్నతిని సహించలేడు. ఆత్మోన్నతిని గుర్తించలేడు. ఆత్మన్యూనతతో అల్లాడిపోతాడు. దుఃఖిస్తూనే బతుకు సాగదీస్తుంటాడు.

ఇలాంటి దీనావస్థలో ఉన్న మనిషిని ఉద్ధరించేందుకు జగద్గురువులైన శంకర భగవత్పాదులు పూనుకొన్నారు. ఏది సార్థక జీవితమో తేల్చిచెప్పడానికి అద్భుత కవితాస్తోత్రం 'శివానందలహరి'ని అందించారు. పరమేశ్వరుణ్ని సంబోధిస్తూ చెప్పిన ఈ స్తోత్రంలో మానవుడిలోని ఆర్తిని ప్రతిబింబంగా చూపి, సార్థక మానవ జీవితానికి దారులు వేశారు.

'ఓ పరమేశ్వరా! లోకంలో మానవులు తాము దేవతలమై పుడితే బాగుండేదని, అనేక కష్టాలతో కూడిన నరజన్మ లభించడం బాధాకరమని భావిస్తుంటారు. కానీ స్వామీ! నరులు, సురలు, పర్వతాలు, వనాలు, మృగాలు, ఈగలూ దోమలు, పశుపక్ష్యాదులు... అన్నీ అందరూ ఒకటే బ్రహ్మ సృష్టిలో! కానీ వీటన్నింటికీ వాటి పుట్టుకలతో సార్థకత కలగదు. నీ పాద కమలాలను అర్చిస్తే, నీ నామాన్ని తలిస్తే వీటన్నింటికీ సార్థకత వస్తుంది. లేకుంటే ఏ శరీరం అయితేనేమి... అన్నీ వ్యర్థమే అవుతాయి! కనుక నిన్ను స్మరించే జన్మ ఒక్కటే సార్థకం!

లోకంలో ఎందరో పెళ్ళికాని బ్రహ్మచారులు ఉన్నారు. పెళ్ళి అయిన గృహస్థులూ ఉన్నారు. బ్రహ్మచారులకు వివాహితులను చూసి అసంతృప్తి కలుగుతుంది. గృహస్థులకు బ్రహ్మచారులను చూస్తే అసంతృప్తి కలుగుతుంది. వీళ్లిద్దరికీ సన్యాసిని చూస్తే అసంతృప్తి జన్మిస్తుంది. సన్యాసికి సంసారిని చూస్తే అసంతృప్తి ఉదయిస్తుంది. ఏ మనిషీ తాను అనుభవిస్తున్న దశను సంతృప్తిగా భావించడు. తనకు లభించని దానికోసం అసంతృప్తి చెందుతాడు. ఇది మానవుడి అజ్ఞానం. కానీ ఓ పరమేశ్వరా! నిన్ను ధ్యానించాలనే కోరిక ఉదయించాలిగాని, ఈ ఆశ్రమాలు ఏవైతేనేమి? వీటివల్ల ఒరిగేదేమీ లేదు. నీ నామస్మరణ చేసేవాడు బ్రహ్మచారి అయినా, గృహస్థుడైనా, సన్యాసి అయినా ధన్యుడవుతాడు.

స్వామీ! నీ సేవకు అమూల్యమైనవి సమర్పించలేదని మనిషి అసంతృప్తికి గురి అవుతుంటాడు. కానీ, నీకు సమర్పించగల స్తోమత ఈ ప్రపంచంలో ఏ నరుడికైనా ఉందా? బంగారుకొండ మేరు పర్వతమే నీ



అంతర్యామి

చేతిలో ఉంది. దేవతలకే అక్షయ నిధులు ఇవ్వగల కుబేరుడే పాదదాసుడై ఉన్నాడు. నిరుపమాన సంపదలుగల నీకు ఇవ్వగల సామర్థ్యం ఈ ప్రపంచంలో ఏ నరుడికైనా ఉందా? లేనేలేదు. ఇక మనిషికి అసంతృప్తి ఎందుకు? నీవు మనసును కోరేవాడివి. అది నరుల దగ్గర అమూల్యంగా దొరుకుతుంది. దాన్ని నీకు అర్పిస్తే చాలు కదా? ఇక మనిషికి అసంతృప్తి ఎందుకు?

స్వామీ! నిన్ను పూజించే సమయంలో ఒళ్లంతా విభూతిని దాలుస్తుంటే నాలో నీ రూపమే కనబడుతోంది. నాకు నీ సారూప్య ముక్తి లభించినట్లే కదా? నిన్ను ధ్యానిస్తూ, పూజిస్తున్న భక్తులతో నేను స్నేహంచేస్తూ వారితో నీ నామాలనే సంభాషిస్తుంటే నీకు సమీపంలోనే ఉన్నట్లు అనుభూతి పొందుతున్నాను. ఇది నాకు సామీప్య ముక్తి కాదా? ఈ చరాచరాలన్నీ నీలోనే ఉన్నాయని భావిస్తుంటే నీవూ నేనూ ఒకే లోకంలో ఉన్నామనే ధ్యాస కలుగుతోంది. ఇది నాకు సాలోక్యముక్తి కాదా? ఇప్పుడు నిరంతరం నిన్నే ధ్యానిస్తూ, నీ దివ్యమంగళ విగ్రహాన్ని దర్శిస్తున్నాను. ఇది నాకు సాయుజ్య ముక్తి కాదా? ఇలా అన్ని మోక్షాలూ లభిస్తుంటే నాలో ఇక అసంతృప్తి ఎక్కడిది? నిన్ను ధ్యానిస్తూ ఈ జీవితాన్ని శాశ్వతంగా సంతృప్తిమయం చేసుకుంటాను. కనుక పరమేశ్వరా... నన్ను అనుగ్రహించు!'

ఇలా మనిషికి సార్థక జీవనం ఎలా లభిస్తుందో తెలియజేసిన స్తోత్రం 'శివానందలహరి' అమృతస్రోతస్వినిలా స్తోత్రసాహిత్యం మానవాళిని తరింపజేస్తోంది!

– డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ

యాదికుండేలా యాదాద్రి శోభ

- నేడు పనులను పరిశీలించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు, నల్గొండ

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది మార్చి చివరికల్లా ప్రధాన ఆలయ విస్తరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) ఆ మేరకు ప్రణాళికలతో ముందుకెళ్తోంది. కొండపై 2.33 ఎకరాల విస్తీర్ణంతో స్వయంభువుల సన్నిధి, మాడ వీధితో కలిపి 4.33 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ ప్రాకార విస్తరణ పనులు జరుగుతున్నాయి. యాదాద్రి అభివృద్ధి పనులను ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పరిశీలించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

కాకతీయుల శిల్పకళ ఉట్టిపడేలా ప్రధానాలయ నిర్మాణం దాదాపు పూర్తి కాగా.. మిగతా విస్తరణ పనులకు శిల్పులు తుది మెరుగులు దిద్దుతున్నారు. సప్తగోపురాలు సిద్ధమయ్యాయి. మిగిలిన పనులన్నీ సమాంతరంగా సాగుతున్నాయి. ఆదివారం యాదాద్రి రానున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. తొలుత స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి.. అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా చిన జీయర్ స్వామితో చర్చించి మహాకుంభాభిషేకానికి ఓ తేదీని సీఎం ఖరారు చేయనున్నట్లు తెలిసింది. కేసీఆర్ రెండోసారి సీఎం అయిన తర్వాత యాదాద్రికి రావడం ఇదే ప్రథమం.



శరవేగంగా రూపుదిద్దుకుంటున్న యాదాద్రి ఆలయ గోపురాలు

రేయింబవళ్లూ పనులు..

- సప్త గోపురాలతోపాటు పంచనారసింహులు కొలువుండే ప్రధానాలయ పనులన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. ఒక మాడ వీధి, రెండు ప్రాకారాలతో నిర్మిస్తున్న మిగిలిన పనులు తుది దశకు చేరాయి.
- 12 మంది ఆళ్వారుల శిల్పాలతోకూడిన మహాముఖమండపం.. గర్భాలయం ఎదుట ఇప్పటికే కొలువుదీరింది.
- సుమారు 500 మంది శిల్పులు రేయింబవళ్లు ఆలయ విస్తరణ పనుల్లో భాగస్వాములవుతున్నారు.
- సిమెంటు, ఇటుకలు కాకుండా సున్నం, బెల్లం, కరక్కాయ మిశ్రమాలనే విస్తరణ పనులకు వాడారు. ప్రధానాలయాన్ని పూర్తిగా కృష్ణశిలతో నిర్మించడం విశేషం. ఇది వెయ్యేళ్ల వరకు మన్నికగా ఉంటుందని శిల్పులు చెబుతున్నారు. ఆలయ విస్తరణలో ఉపయోగించిన శిల్పాలను తెలంగాణ, ఏపీ పరిధిలో దాదాపు పది చోట్ల 1,000 మంది శిల్పులు తయారు చేశారు.
- ప్రధానాలయం పక్కనే ఉన్న శివాలయం పనులు సైతం చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేయనున్నారు.
- బ్రహ్మోత్సవాలు లాంటి ప్రధాన వేడుకలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం యాడా అధునాతన సౌకర్యాలు సమకూర్చనుంది.

మండప ప్రాకారాల్లోనే ఏకకాలంలో సుమారు 4 వేల మంది భక్తులు సేద తీరేలా వసతులు సిద్ధంచేస్తున్నారు. హరితమయంగా తీర్చిదిద్దనున్న కొండ చుట్టూ వివిధ వరుసల్లో పచ్చదనం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీటిల్లోనూ సుమారు 5 వేల మంది వరకు సేదతీరే అవకాశం ఉంటుంది.

- స్వయంభువుల దర్శనానికి వచ్చే భక్తులకు కొండ కిందే క్యూ కాంప్లెక్సును నిర్మించనున్నారు. కల్యాణ కట్ట, పుష్కరిణి సైతం కొండ కిందే నిర్మించాలని యాడా నిర్ణయించింది.
- విస్తరణ పనులు పూర్తయితే ఆలయ వెడల్పు 11.9 అడుగుల నుంచి 48 అడుగులకు.. ఎత్తు 21 అడుగుల నుంచి 48 అడుగులకు పెరుగుతుంది.
- క్షేత్రం చుట్టూ ఆరు వరుసలతో వలయ దారి(రింగు రోడ్డు) నిర్మించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించగా ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలోనే ఆమోదం తెలపనున్నారు. ఇప్పటికే దేవదేవుడి దర్శనానికి వెళ్లడానికి ఒక కనుమ దారిని, రావడానికి మరో కనుమ దారిని నిర్మించారు.
- ఈ ఏడాది మార్చి 8 నుంచి మొదలయ్యే వార్షిక బ్రహ్మోత్సవాలను బాలాలయంలోనే నిర్వహిస్తామని ఈవో గీత వెల్లడించారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న మహారాజగోపురం



పచ్చదనాన్ని సంతరించుకున్న ఆలయనగరి

ప్రధాన కొండకు సమీపంలో ఉన్న పెద్దగుట్టపై భక్తుల వసతి, ఇతర సౌకర్యాలకు సుమారు 850 ఎకరాలను సేకరించారు. ఇందులో 250 ఎకరాలను భక్తుల బసకు ఉపయోగపడే ప్లాట్లుగా అభివృద్ధి చేస్తుండగా.మిగిలిన స్థలంలో పచ్చదనం, రహదారులను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

ఇప్పటికి రూ.622 కోట్ల వ్యయం..

- ఆలయం, ఆలయ నగరి అభివృద్ధికి మొత్తం రూ. 1,800 కోట్లు అవసరమవుతాయని యాడా ప్రాథమికంగా అంచనా వేసింది. అయితే, భక్తులకు అవసరమైన వసతి సముదాయాలను దాతల సాయంతో నిర్మిద్దామని నిర్ణయించడంతో అంచనా వ్యయం సుమారు రూ. 1,200 కోట్లకు తగ్గింది.
- ఇప్పటి వరకు ఆలయ విస్తరణతో పాటు కొండపై జరుగుతున్న పనులన్నింటికీ రూ. 622 కోట్లు ఖర్చుకాగా.. ఈ ఏడాది బడ్జెట్‌లో మరో రూ. 600 కోట్లు కావాలని ప్రభుత్వాన్ని యాడా కోరింది.

నియోజకవర్గానికి మరింత సమయం కేటాయించేందుకే..

కార్మిక సంఘాల పదవులకు ఎంపీ కవిత రాజీనామా



ఈనాడు, హైదరాబాద్: నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత శనివారం పలు సంఘాల రాష్ట్ర గౌరవాధ్యక్ష పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్ర బొగ్గుగని కార్మిక సంఘం, విద్యుత్ కార్మిక సంఘం, అంగన్‌వాడీ టీచర్లు మరియు హెల్పర్ల సంఘం, గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం గౌరవ అధ్యక్ష పదవులకు రాజీనామా చేస్తూ అందుకు సంబంధించిన లేఖలను ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులకు అందజేశారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కార్మిక సంఘాలతో కలిసి కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు నిరంతరం కృషి చేశామని, తెలంగాణ వచ్చిన తర్వాత కార్మిక వర్గాల ప్రయోజనాలు, హక్కుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పనిచేశామని తెలిపారు. కార్మికుల సేవలో సంతృప్తి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పనిభారం దృష్ట్యా తన సేవలను అందించలేక పోతున్నానని, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గానికి మరింత సమయం కేటాయించాల్సి ఉన్నందున పై సంఘాల గౌరవ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ కార్మిక సంక్షేమానికి అందుబాటులో ఉంటానని ఆమె పేర్కొన్నారు.

రైతులకు కేంద్ర సాయం పెరగాలి

సోమాజిగూడ, న్యూస్‌టుడే: తెలంగాణలో 'రైతు బంధు' పథకం తరహాలో కేంద్రప్రభుత్వం కూడా అన్నదాతలకు సాయంచేయాలని ముందుకు రావడం మంచిదైనా.. అది తగిన స్థాయిలో జరగాలని ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమాజిగూడలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ, రైతుబంధు మాదిరి పథకాన్ని బాగా అమలుచేయడం దేశవ్యాప్తంగా రైతులకు ఉపకరిస్తుందన్నారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి పథకాలతో పాటు నిధులు ఇంకా ఇవ్వలేదన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా తనను ఒక పత్రిక ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందని, అటువంటి గౌరవంతో తన బాధ్యత కూడా ఎంతో పెరిగిందని పేర్కొన్నారు.

కేంద్రం రైతుబంధును కాపీ కొట్టింది: హరీశ్‌రావు

సిద్దిపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అమలవుతున్న రైతుబంధు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో శనివారం జరిగిన ఎరువులు, విత్తనాల డీలర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. రైతుబంధు ద్వారా తెలంగాణ ప్రభుత్వం అయిదెకరాలున్న రైతుకు ఏడాదికి రూ. 50 వేల పెట్టుబడి సాయం అందజేస్తుండగా, కేంద్రం కేవలం రూ. 6 వేలు మూడు విడతల్లో ఇవ్వనుందన్నారు. దీనివల్ల అన్నదాతలకు ఒరిగేదేమీ లేదని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నదాతల సంక్షేమానికి ఎన్నో చర్యలు చేపట్టారని గుర్తుచేశారు.

భాజపాకు ప్రజలే బుద్ధి చెబుతారు

ఎంపీ బీబీ పాటిల్, తెరాస నేతల ధ్వజం

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణను విస్మరించడం దారుణమని.. ఇందుకు భాజపా తగిన మూల్యం చెల్లించుకుంటుందని తెరాస ఎంపీలు ధ్వజమెత్తారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాల్లో ఆ పార్టీకి డిపాజిట్లు గల్లంతవడం ఖాయమని జోస్యం చెప్పారు. శనివారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ హైదరాబాద్‌లోని తన నివాసంలో, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గట్టు రామచందర్‌రావు, చాడా కిషన్‌రెడ్డి, తెరాస విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌లు తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. "ఈ బడ్జెట్‌తో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు. కేంద్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో తెలంగాణకు ఒక్క మేలూ చేయలేదు. కాళేశ్వరం, మిషన్ భగీరథలకు సాయం ఊసే లేకపోవడం బాధాకరం. విభజన చట్టం అంశాల ప్రస్తావన లేదు. భాజపా నేతలు బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడకుండా మోదీ భజన చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారు" అని తెరాస నేతలు ధ్వజమెత్తారు.

హక్కుల సాధనలో తెరాస ఎంపీలు విఫలం

ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్

ఈనాడు, దిల్లీ: గత నాలుగు బడ్జెట్ల మాదిరే ఈసారీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మొండిచేయి చూపిందని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ విమర్శించారు. దిల్లీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మిషన్ కాకతీయ, భగీరథలకు నిధులు ఇవ్వాలన్న నీతి ఆయోగ్ సిఫార్సులను కేంద్రం పట్టించుకోకపోయినా తెరాస ఎంపీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెరాస ఎంపీల వైఫల్యం, అలసత్వంతోనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. భాజపా-తెరాస కుమ్మక్కుతో తెరాస ఎంపీలు కేంద్రానికి కొమ్ముకాస్తూ తెలంగాణ ప్రజల నోట్లో మట్టి కొట్టారని ధ్వజమెత్తారు. దేశంలో ఒక్కో రైతుపై సగటున రూ. 47 వేల అప్పు ఉండగా.. బడ్జెట్‌లో రోజుకు రూ. 17 కేటాయించి అన్నదాతలను మోదీ అవమానించారన్నారు. నిరుద్యోగితపై బడ్జెట్‌లో ఒక్క మాటా మాట్లాడలేదని పేర్కొన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు రూ. 3 వేల పింఛనుకు రూ. 3 లక్షల కోట్లు అవసరం కాగా.. కేవలం రూ. 500 కోట్లు ఇచ్చి అందరినీ పక్కదోవ పట్టించారన్నారు.

ఖమ్మం జడ్పీ అధ్యక్షురాలి రాజీనామా

ఈనాడు, ఖమ్మం: ఖమ్మం జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ గడిపల్లి కవిత తన పదవికి రాజీనామా చేశారు. ఆమె శనివారం ఉదయం పుట్టినరోజు వేడుకల తర్వాత.. సాయంత్రం 6గంటల సమయంలో కలెక్టర్ ఆర్. వి. కర్ణన్‌ను కలెక్టరేట్‌లో కలిసి రాజీనామా పత్రం అందజేశారు. 2014 ఆగస్టు 7న కవిత జడ్పీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. పదవీకాలం ముగింపునకు మూడు నెలల ముందుగా రాజీనామా చేయడంతో, పూర్వ ఖమ్మంజిల్లా రాజకీయాల్లో ఇది చర్చనీయాంశంగా మారింది. రాజీనామా చేయడం వాస్తవమేనని ఆమె ధ్రువీకరించారు.

రూ.75 లక్షల మద్యం చోరీ

ఏడుగురు నిందితుల అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: మంచిర్యాలకు తరలించాల్సిన మద్యాన్ని చోరీ చేసిన లారీ డ్రైవర్లను రాచకొండ పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, రూ. 73 లక్షల విలువైన మద్యాన్ని, లారీని మల్కాజ్‌గిరి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాచకొండ సీపీ మహేశ్ భగవత్ కేసు వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖనికి చెందిన కొమరవెల్లి రాకేశ్(42), సమ్మయ్య(35), ఎండీ మునీర్(42)లు సంజీవ అనే వ్యాపారివద్ద లారీని అద్దెకు తీసుకున్నారు. దేక్‌నాథ్ రవికుమార్ అనే వ్యక్తి వద్ద లారీకి నకిలీ పత్రాలు, అతడి స్నేహితుడు చిలుముల నగేష్ దుకాణంలో సెల్‌ఫోను 2 సిమ్‌కార్డులు పొందారు. మల్కాజ్‌గిరిలోని ఓ లిక్కరు కంపెనీ నుంచి మంచిర్యాలకు మద్యాన్ని తరలించే ఆర్డరు సంపాదించారు. జనవరి18న లిక్కరు కంపెనీనుంచి 950 పెట్టెలలోని మద్యంలోడ్‌ను తెచ్చారు. ఈ మద్యాన్ని మంచిర్యాలలో ఓచోట దించారు. ఇందుకు వ్యాపారి సంజీవ సహకరించాడు. తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో కొంత మద్యాన్ని అమ్మి సొమ్ము చేసుకున్నారు. మద్యం కంపెనీ మేనేజర్ రవికుమార్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన మల్కాజ్‌గిరి పోలీసులు సిమ్‌కార్డుల ఆధారంగా నిందితులకు సెల్‌ఫోను అమ్మిన దుకాణాన్ని గుర్తించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడు రాకేశ్‌ను, మంచిర్యాలలో ముఠా సభ్యులను పట్టుకుని చోరీసొత్తు స్వాధీనంచేసుకున్నారు.

అడవుల రక్షణకు సహకరించండి

- ప్రజాప్రతినిధుల్ని కోరనున్న అటవీశాఖ
- సా మిల్లుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: అటవీ సంపద రక్షణకు ప్రజాప్రతినిధులను కలిసి వారి సహకారం తీసుకోవాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ మేరకు కొత్తగా ఎన్నికైన సర్పంచులు మొదలుకుని ఎమ్మెల్యే స్థాయి వరకు ప్రజాప్రతినిధులను కలవాలని అధికారులను అటవీశాఖ ఆదేశించింది. సా మిల్లుల్లో(కట్టె కోత) కలప అక్రమాలను అరికట్టేందుకు ఆయా మిల్లుల్లో లోపల, వెలుపల సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని అటవీశాఖ పేర్కొంది. వీటి ద్వారా ఏ రకం కలప వస్తుంది? ఏయే వాహనాలు వస్తున్నాయి? తదితర వివరాలను రికార్డు చేయడం ద్వారా అక్రమాలకు చెక్ పడుతుందని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 2,449 సామిల్లులు ఉన్నాయి. అత్యధికంగా హైదరాబాద్ సర్కిల్‌లో 532, ఆ తర్వాత రంగారెడ్డిలో 297, వరంగల్‌లో 222 ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం తనిఖీలు నిర్వహించిన అటవీ అధికారులు.. ఇల్లెందు సత్యనారాయణపురంలో 13 కట్టె కోత మిషన్లను, సుమారు రూ. ఆరు లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు. ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడినేలల దినోత్సవం(వెట్ ల్యాండ్స్ డే) సందర్భంగా 'అడవులు, జంతువులు, పక్షులకు చిత్తడినేలల ఆవశ్యకత' అంశంపై వివరిస్తూ పలుచోట్ల శనివారం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



నిర్మల్ జిల్లా మాముడాలోని ఓ సామిల్‌లో బిగించిన సీసీ కెమెరా

పులుల సంరక్షణకు ఆదేశించాలంటూ వ్యాజ్యం

జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ రూపొందించిన పథకాన్ని అమలుచేసేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాలకు విస్తరించి ఉన్న కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రానికి సంబంధించి పథకం అమలయ్యేలా చూడాలని హైదరాబాద్ బండ్లగూడ జాగిర్ దియా సూర్ ఆ పిటిషన్ వేశారు. పులుల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఓ కమిటీ ఏర్పాటయ్యేలా ఆదేశించాలన్నారు. మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి తెలంగాణ పరిధి అడవుల్లోకి వచ్చిన 20 పులులు కనిపించకపోవడమో మృతిచెందడమో జరిగిందన్నారు. ఒక్క నెలలోనే రెండు పులులు చనిపోయాయన్నారు. 2002లో దేశంలో 3,642 పులులుండగా; 2008నాటికి వాటి సంఖ్య 1411కు పడిపోయిందన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్నవారు తమతో పాటు ఆస్తుల భద్రత, వేట కోసం కూడా విద్యుత్తు కంచె ఏర్పాటుచేయడం వల్ల పులులు చనిపోతున్నాయని వెల్లడించారు. ఆక్రమణలు, పోడు వ్యవసాయంతో అటవీ ప్రాంతం తగ్గిపోతోంది. పులుల జాతి సైతం అంతరిస్తోందని పేర్కొన్నారు. సంరక్షణ సిబ్బంది కొరత ఎక్కువగా ఉందన్నారు. అందుకే జాతీయ అథారిటీ రూపుదిద్దిన పథకాన్ని అమలుచేసేలా చూడాలని, ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయాలని కోరారు. ఆక్రమణల నిరోధానికి, విద్యుత్తు ఫెన్సింగ్‌లను తొలగించడానికి బృందాలు అవసరమన్నారు. పిటిషన్‌లో ప్రతివాదులుగా తెలంగాణ అటవీశాఖ ముఖ్య కార్యదర్శి, అటవీ సంరక్షణ ప్రధాన అధికారి, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్, కేంద్ర అటవీ శాఖ, జాతీయ పులుల సంరక్షణ అథారిటీలను చేర్చారు.

సమాఖ్య కూటమితోనే దేశానికి కొత్త వెలుగు

తెరాస నేతలు పిడమర్తి, రాజారాం యాదవ్

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపాదించిన సమాఖ్య కూటమితోనే దేశానికి కొత్త వెలుగులొస్తాయని తెరాస నేతలు పిడమర్తి రవి, రాజారాం యాదవ్ తెలిపారు. సమాఖ్య కూటమి ద్వారా రైతుబంధు పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తామనే కేసీఆర్ ప్రకటనను చూసే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ తరహా పథకాన్ని కేంద్ర బడ్జెట్‌లో పెట్టారని పేర్కొన్నారు. శనివారం వారు తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రతిపాదనకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. 'దేశంలో సమాఖ్య కూటమి ప్రాముఖ్యత' అంశంపై ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సెంట్రల్ కోర్టు హోటల్‌లో ఎస్సీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి తెరాస ఎంపీలు వినోద్‌కుమార్, బూర నర్సయ్యగౌడ్, సీతారాంనాయక్, మాజీ సభాపతి సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, మేధావులు, విద్యావేత్తలు, నేతలు హాజరవుతున్నారని తెలిపారు.

పాతాళానికి పడిపోయింది

- 20 జిల్లాల్లో తగ్గిన భూగర్భ జలమట్టం
- అత్యధికంగా సంగారెడ్డిలో 7.49 మీటర్ల తగ్గుదల

ఈనాడు, హైదరాబాద్: తీవ్ర వర్షాభావం వల్ల 20 జిల్లాల్లో భూగర్భ జలమట్టం మరింత లోతుకు పడిపోయింది. గతేడాది జనవరితో పోలిస్తే గత నెలలో అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 7.49 మీటర్ల అదనపు తగ్గుదల నమోదైందని భూగర్భ జలశాఖ శనివారం విడుదల చేసిన నివేదికలో ప్రకటించింది. గత జూన్ నుంచి జనవరి వరకూ మొత్తం 16 జిల్లాల్లో వర్షపాతం లోటు 20 నుంచి 45 శాతం వరకూ ఉంది. సంగారెడ్డి జిల్లాలో వర్షపాతం లోటు గరిష్ఠంగా 45 శాతానికి చేరడంతో ఆ ప్రభావం భూగర్భ జలమట్టాలపై పడింది. రాష్ట్రవ్యాప్తంగా సగటు 11.91 మీటర్ల లోతున నీరుంది. అత్యధికంగా మెదక్ జిల్లాలో 20.95 మీటర్ల లోతుకు వెళితేనే నీటి జాడ కనిపిస్తోంది. అత్యల్పంగా ఖమ్మంలో 5.57 మీటర్ల లోతుకు వెళితే నీరుంది. వర్షాలు లేనందున తెలంగాణలోని పశ్చిమ, మధ్య ప్రాంతాల్లో జలమట్టాలు బాగా తగ్గాయి. రాష్ట్ర భూభాగంలో 17 శాతం విస్తీర్ణంలో 20 మీటర్లకు పైగా లోతుకు వెళితేనే నీరు లభిస్తోంది. ఇదే రాష్ట్రంలో అత్యధిక లోతు. నాగర్‌కర్నూలు, భద్రాద్రి తదితర 11 జిల్లాల్లో గతేడాది వ్యవధిలో స్వల్పంగా నీటిమట్టాలు పెరిగాయి. అత్యధిక పెరుగుదల భద్రాద్రిలో 1.56 మీటర్లుంది.

కొన్ని జిల్లాల్లో గత ఏడాది వ్యవధిలో భూగర్భ జలమట్టాల తగ్గుదల తీరు (మీటర్లలో)

జిల్లా	జనవరి 2018	జనవరి 2019
సంగారెడ్డి	12.67	20.16
మెదక్	15.4	20.95
వికారాబాద్	12.66	18.24
సిద్దిపేట	13.26	18.10
మేడ్చల్	8.39	13.65
గద్వాల	6.68	11.62
రంగారెడ్డి	12.51	17.36
నల్గొండ	9.97	13.83
కామారెడ్డి	12.12	15.32
యాదాద్రి	11.01	14.86



'గంగ ప్రక్షాళన'.. ఎనిమిదో తరగతి విద్యార్థి సృజన

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట జిల్లా పరిషత్తు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి. రాహుల్ రూపొందించిన ఈ పరికరం పేరు 'గంగ ప్రక్షాళన యంత్రం'. పాడైన సైకిల్ చక్రాలు, పెడల్, కన్వేయర్ బెల్టు, అయిదారు టబ్బులతోపాటు డీసీ మోటార్లను వినియోగించి రూ. 4500 ఖర్చుతో దీన్ని రూపొందించాడు. ఇది సముద్రాలు, నదుల్లో కలుపు మొక్కలను కత్తిరించడంతోపాటు అయిదు రకాలుగా పనిచేస్తుంది. గంగానదిలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని చూసి ఈ యంత్రాన్ని రూపొందించినట్లు రాహుల్ చెప్పాడు. వరంగల్ అర్బన్ జిల్లాలోని మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం ప్రారంభమైన ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ఈ యంత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'ఇన్‌స్పైర్ మానక్' ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వందలాది ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. 31 జిల్లాల నుంచి 647 మంది విద్యార్థులు హాజరయ్యారు.

– ఈనాడు, వరంగల్





ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

TG







వధువు కావలెను

బ్రాహ్మణ/ 29/ B.Tech/ MBA (IIM)/ 19L ★ 25/ 5'10"/ B.Tech/ SBI ★ 30/ B.Tech MS (US) $ 140K ★ 26/ B.Tech/ SWE/ 10L ★ 9440449285. (A)

యాదవ/ 29 సం॥/ M.Pharma/ MS సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ★ యాదవ/ 29 సం॥/ MS జనరల్ సర్జన్ ★ యాదవ/ 26 సం॥/ B.Tech గల వరులకు తగిన వధువులు కావలెను. Ph: 90003 45360, 98485 88102. (B)

కమ్మ 27 5'8" B.Tech, SWE, TCS 80,000 Pm వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయ కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను 9618483383 (A)

కాపు ఓన్లీ సన్ 27 5'9" B.Tech, SWE, MNC 12 Lakhs PA వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబపు వధువు కావలెను 9393891760 (A)

Kapu (Telaga) 29, 5'10" M.Tech Structures (Civil) working in Arcadis as Structural Engineer at Bangalore Salary 70K P/M Rich Family Wel Settled Seek Suitable Bride from Decent Family Contact ✆ 8142563779, 9542167468 (A).

క్రిస్టియన్/ 27/ 5'9"/ B.Tech/ SWE/ 1 లక్ష P.M./ Hyd/ అందమైన వరునికి తగిన వధువు కావలెను. సంప్ర॥ ✆ 8919759359 (A)

వైశ్య/ 30/ 5'8"/ B.ఫార్మసి/ బిజినెస్/ 40,000/- PM/ 3 Cr. ప్రాపర్టీ/ మంచి తెలుపు, అందమైన వరుడికి వధువు కావలెను. వెరీ అర్జెంట్ ✆ 9063471025, వాట్సప్: 8187053655 (A)

మాదిగ/ B.Tech/ Govt.Asst. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (BHEL)/ 75,000/-PM/ 5'9" ఎత్తు/ 29 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9642459724 (A)

గౌడ/ M.Tech, IIT/ C.Govt. ట్యాక్స్ ఆఫీసర్ (ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept.)/ 15 Lakhs. PA / 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9989450693 (A)

రెడ్డి/ M.Tech, NIT/ C.Govt. ఎలక్ట్రానిక్ ఇంజనీర్ (ECIL)/ 13 Lakhs. PA/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A)

క్రిస్టియన్ మాదిగ/ M.Tech/ C.Govt. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ (FCI)/ 11 Lakhs. PA/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014 (A)

విశ్వబ్రాహ్మణ/ M.Tech / C.Govt. A.E. (BHEL)/ 80,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010 (A)

రజక/ B.Tech, MBA / C.Govt. A.E. (రైల్వే)/ 72,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

పద్మశాలి/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ (ఇండియన్ బ్యాంక్)/ 65,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A)

రెడ్డి/ 1988/ 5'6" B.Tech/ MS/ US/ H1B/ 85K ★ 1987 / 5'8" B.Tech/ M.Tech/ MS/ US/ 105K ✆ 8885559579/ 9848221166 (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రెడ్డి/ 1990/ 5'10" MBBS/ MD (Gen Medicine/ Final Yr./ Rich ★ 1990/ 6" B.Tech/ MBA/ 8.5L.P.A ✆ 7893333726/ 9848221166 (A)

రెడ్డి 1990/ 6'2" B.Tech/ MS/ US/ 100 K (H1B/ I-140 ★ 1989/ 6" B.Tech/ (IIT)/ 25L.P.A/ Hyd. ✆ 9505551788/ 9848221166 (A)

Neelakanda Pillai Ayyapppan 19/05/1984 look for homely girl to marry. Telephone number 9884801044. Email: ayyappan.neelakanda.pillai@email.com Telangana 500016 (A).

కుమ్మరి/ 29సం॥లు/ B.Tech/ సాఫ్ట్‌వేర్/ 60,000 PM/ హైదరాబాద్‌లో సెటిల్ అయిన వరుడు (రాజమండ్రి)కి అందమైన వధువు కావలెను. జాబ్ చేసేవారికి ప్రాధాన్యత. ✆ 92906 03939. (G)

Cosmopolitan Well Educated, Mature, Tall good looking below 37 Yrs Un Married Bride/ (Dvc without Kids) from Cultured Telugu upper Middle Class Family for Tall fair, Handsome PMT Commissiond Armed forces Naval Officer, early Forties, Legally Dvc No issues, well to do Naidu Family, Req Contact Whatsapp only with Biodata & Pic of Bride on 09969886971/ Calls only Between 8AM-10AM & 6PM-10PM. (C)

ప్రైవేటు స్కూల్లో పనిచేస్తూ నెలకు 20,000/- సంపాదిస్తున్న అంగవైకల్యంగల అబ్బాయికి అమ్మాయి కావలెను. Cont: 9985511791 (బ్రోకరేజి లేదు) (E)

కాపు/ కుల కట్న ప్రసక్తి లేదు (2nd మ్యారేజ్) 28/ 5'10" B.Tech/ SWE/ Accenture 85,000/- PM 5 Cr. ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. ✆ 9246333320. (A)

SC మాదిగ హిందూ 30/5'10" MCA/SWE 1 Lakh PM హ్యాండ్‌సమ్ వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8712865419 (A)

గౌడ (కట్న ప్రసక్తి లేదు) 27/5'10"/ B.Tech/ SWE/ Accenture 85,000/-PM 5 Cr ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ సాంప్రదాయ కుటుంబ వరుడికి వధువు కావలెను. ✆ 9246171703 (A)

కుల పట్టింపు లేదు /30/60 వేలు PM/ గవర్నమెంట్ /40 / 1 లక్ష PM కోటీశ్వరుడైన వరునికి వధువు ఫోటో & బయోడేటా వాట్సప్. 9949595523 బిజీగా వున్న లేదా కాల్ లిఫ్ట్ చేయకున్నా మెసేజ్ (A)

రెడ్డి 29/5'10" B.E (BITS)/MS (USA)/ SWE 230K H1 10Cr ప్రాపర్టీ గల వరుడికి ఇండియా/ అబ్రాడ్ వధువు కావలెను. (కట్నం ముఖ్యం కాదు) ✆ 8019864386 (A)

రజక (కట్నప్రసక్తి లేదు) 27/5'10"/ B.Tech MS SWE/ Accenture 10 Lac P/A అందమైన సాంప్రదాయ కుటుంబ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9573450303 (A)

SC మాదిగ 29/ 5'10" B.Tech సివిల్ ISRE రైల్వే C.Govt, 85 వేలు P/M వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన సాంప్ర॥ కుటుంబపు వధువు కావలెను. 9182870836 (A)

58, 5'6" కొ. వెలమ Profession నీతి, నిబద్ధత, దయాహృదయం కల్గిన వ్యక్తికి అవే లక్షణాలు గల మానసికంగా, శారీరకంగా అందమైన విడో 45-50 సం॥. (డైరెక్ట్). ✆ 86398 84433. (B)

మాదిగ, మాల Q: B.Tech, Job డిప్యూటి మేనే. SBI బ్యాంక్ A: 30yrs Govt జాబ్, స్టాఫ్ A: 28Y అబ్బాయికి అమ్మాయి కావలెను. ✆ 9573416447, 9704626658 (A).

పద్మశాలి 33y / 5.9 H1B Visa USA లో జాబ్ చేస్తున్న వరునికి USA లో జాబ్ చేస్తున్న 1 వ లేదా 2 వ వివాహం గల వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్ : 83176 84446 (J)

దేవాంగ, పద్మశాలి/ డైవర్సీ 43/ 5'4", BE Software, Eng/ పిల్లలు లేని వరునకు, పిల్లలులేని/ వధువు కావలెను/ డైరెక్ట్ Contact: 9880647639 (A)

విశ్వబ్రాహ్మిణ్ 29/ 5'8", B.Tech, MBA/ SWE, 1L,PM/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి కలిగిన వరుడికి/ తగిన వధువు కావలెను. 7661814929/ 7093044262 (A)

SC, మాల, హిందూ/ B.Tech, MBA/ 28, 5'10", రైల్వే అసిస్టెంట్/ ఇంజనీర్, 16L PA చాలా అందమైన/ వరునికి తగిన/ వధువు కావలెను. 9705960270 (A)

కమ్మ ప్రత్యేకం/ 1 to 50Cr ఎబౌవ్ 28, B.Tech, MS, USA సిటిజన్/ B.Tech, M.Tech, MBA, IND, USA వరులకు/ వధువు కావలెను/ శారద: 9849413031 (A)

మాదిగ, క్రిస్టియన్/ 27, 5'9"/ M.Tech, SWE, 1LPM వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి/ కలిగిన వరుడికి తగిన వధువు/ కావలెను/ 9676968974/ 7673939882 (A)

52 Age, సింగిల్, రజక కాస్ట్ నోబార్ ప్రైవేట్‌జాబ్ 1, 2వ 40 Yrs దాటిన జాబ్ చేసే వధువు కావలెను. ✆ 8367691318/ 8008964589. (C)



పెళ్లి 'కళ' వచ్చేసిందే బాలా!

అక్కినేని నాగచైతన్య - సమంత
స్నేహ - ప్రసన్న
దీపిక పదుకొనె- రణవీర్‌సింగ్
వీళ్లంతా వెండితెర మీద ప్రకాశించే తారలు!

సానియా మీర్జా - షోయబ్ మాలిక్
సైనా నెహ్వాల్ - పారుపల్లి కశ్యప్
దీపికా పల్లికల్ - దినేష్ కార్తీక్
వీళ్లంతా క్రీడా గగనంలో మెరిసే తారలు.

వీరంతా ముచ్చటయిన జంటలు! అభిరుచులు కలిస్తే హాయిగా పెళ్లి చేసుకోవచ్చని నిరూపిస్తున్నవారు. వీరేకాదు.. గోపికాపూర్ణిమ- మల్లికార్జున్, హేమచందర్- భార్గవిలాంటి గాయక జంటలు, పుల్లెల గోపీచంద్- పీవీవీ లక్ష్మి ఇలా ఎందరెందరో 'పెళ్లిచేసుకుని.. ఇల్లు చూచుకుని' హాయిగా కళకళలాడుతున్నారు. కలిసి నటించడం, క్రీడల్లో పాల్గొనడంవల్ల వీళ్లందరికీ పరస్పరం మంచి అవగాహన ఉంది. మాటలూ మనసులూ కలిశాయి. అనంతరం పెద్దల అనుమతీ లభించడంతో పెళ్లిపీటలెక్కేశారు.

కళ్లు కళ్లు కలిస్తే ప్రేమంటారు. మరి కళలు, కళలూ కలిసినా ప్రేమే. అంతేకాదు ఒక కళలో రాణించిన వాళ్లు ఇంకో కళలో రాణించినవారితో వైవాహిక బంధంలోకి దిగితే ఆ అందమే వేరు. ఒక క్రీడలో రాటుతేలిన వ్యక్తి ఇంకో క్రీడలో పేరు తెచ్చుకున్న వ్యక్తిని పెళ్లాడినా, జీవితక్రీడలోనూ విజయాలు వరించవచ్చు. వ్యక్తులకు గుర్తింపు రావడమేకాదు, వారివారి కళలకు, క్రీడలకూ ప్రచారం! క్రికెటర్ విరాట్ కోహ్లి- నటి అనుష్క శర్మ, నటుడు రాజీవ్ కనకాల- టీవీప్రయోక్త సుమ, నృత్య దర్శకుడు రఘు మాస్టర్ ప్రణవి అనే గాయనిని పెళ్లాడడాన్ని బట్టి వేర్వేరు రంగాలవారూ మనసులు ఇచ్చిపుచ్చుకుంటున్నది తేటతెల్లం. యువ క్రీడాకారులూ తమ అభిరుచులు కలిస్తే హాయిగా పెళ్లి చేసుకుంటున్నారు. నిండునూరేళ్ల కాపురం చేస్తున్నారు. పిల్లాజెల్లాతో కళకళలాడుతున్నారు.

ఇటీవలి కాలంలో కళాకారులు, క్రీడాకారుల్ని వారి అభిమానులు పెళ్లాడటమూ పరిపాటే. దీనికి కావాల్సిందల్లా మనసులు కలవడమే. నూరేళ్లు కలిసి జీవించగలమన్న నమ్మకం కుదిరితే చాలు.

దంపతులు గాయకులయితేనేం, నృత్యకారులయితేనేం, మరే కళాకారుల జంటలయితేనేం జనాకర్షణ అద్భుతం. పేరు తెచ్చుకోవడంలో దంపతులిద్దరూ పోటీపడవచ్చు. ఈ ప్రభావంతో వారి పిల్లలూ గొప్పవారిగా రూపుదిద్దుకోవచ్చు. కళాసేవ కూడా జనసేవే. అందువల్ల కళారాధన మంచిది. కళాకారులు ప్రేమించి పెళ్లిచేసుకున్నా, పెళ్లి చేసుకుని ప్రేమించుకున్నా కల్యాణం కమనీయం. కల్యాణం వల్ల కలిసిన కళాజంటలు లోకకల్యాణానికీ దోహదపడతాయి. దంపతులయిన కళాకారుల విషయంలో.. ఒకింట్లో సరిగమలు వినిపించినా, ఇంకో ఇంట్లో నృత్యసాధన కోసం ఒయ్యారాలు కనిపించినా ఎంత వీనువిందు! కనువిందు! కళాజంటలు, క్రీడా జంటలవల్ల ఆదర్శాలు, ఆశయాలు ఆచరణ సాధ్యమవుతున్నాయి.

కళకు కులం, మతం, ప్రాంతం లేదు, దేశం లేదు. క్రీడలు కూడా ఇంతే. అవి సార్వజనీనమైనవి, సార్వత్రికమైనవి.

'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అన్నారు. ఇదే పద్ధతిలో కళాకారులకు, క్రీడాకారులకు ప్రపంచంలో ఎక్కడైనా గౌరవం లభిస్తుంది. జేజేలు పలుకుతారు. అందువల్ల కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా కళాకారులు తాము నచ్చిన, మెచ్చినవారిని పెళ్లాడుతున్నారు.. పెళ్లాడగలుగుతున్నారు. ఇవే 'ఆదర్శ వివాహాలు' వీళ్లు ఆయా రంగాల్లో ఒకరికి కరు తోడు నీడగా ఉంటూ. వసుధైక కుటుంబంలో సభ్యులవుతున్నారు. అంతెందుకు? ఆదిదంపతులయిన పార్వతీ పరమేశ్వరులు నృత్య కళాకారులేగా, శివుణ్ని నటరాజని అంటారు.

అందుకేనేమో- 'స్వరమూ స్వరమూ కలయికలో ఒక రాగం పుడుతుంది/ మనసూమనసూ కలయికలో అనురాగం పుడుతుంది' అన్నారు దాసరి.

- శంకర నారాయణ

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

OC Caste, రెండవపెళ్ళి 43 సం 5'10" M.Com సొంత బిజినెస్ 60 కోట్లు ప్రాపర్టీ గల వరుడికి తగిన రెండవపెళ్ళి వధువు కావలెను. నో బ్రోకర్స్ ✆ 9121370157 (A)

కుల పట్టింపులేదు/ 40Y/5.7/ B.A/ బిజినెస్ 12K PA (ఇల్లరికం) వరుడుకు అందమైన వధువు కావలెను. ✆ 9248011114 (A)

38/5'8"/Hindu/Second Marriage/ Working/ Fair/ Handsome Groom/ Seeks a Suitable Bride. 8465035767/ Email: 325hemanth@gmail.com (A)

వడ్డెర కట్నప్రసక్తి లేదు: M.Tech, C.Govt ఎలక్ట్రికల్ ఇంజనీర్, రైల్వేస్, 62000 PM, 5'9" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A).

గంగపుత్రబెస్త: B.Tech, Govt ఇంజనీర్ ఇరిగేషన్ Dept, 60,000/- PM, 6' ఎత్తు 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A).

యాదవ: M.Tech, C.Govt ఇంజనీర్ పవర్‌గ్రిడ్ Dept, 1,30,000/- PM, 6' ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 8008939651 (A).

కమ్మ/ కుల ప్రసక్తి లేదు/ 56/ MRO (VRS)/ విడోవర్/ సొంత ఇల్లు/ పిల్లలు లేరు/ 23 ఎకరాల భూమిగల వరుడికి వధువు కావలెను. ✆ 95152 98844 (D)

పద్మశాలి: 39, 5'7" LLB, LLM అడ్వకేట్, డైవర్సీ వరుడికి 29-35 సం॥ వయస్సు 5'3" డిగ్రీ, ఫిజి/ ఫెయిర్ రంగుకల వధువు కావలెను. డైరెక్ట్ సంప్రదించండి. ✆ 9133243483 (A).

బలిజ/ కాపు: 27Yrs/ B.Tech, MBA (IIM)/ S/W "Capgemini" 18 Lak P/A, Well settled వరునికి అందమైన వధువు కావలెను. 95420 52189 (D)

బ్రాహ్మణ: 28 Yrs/ B.Tech, MBA (IIM)/ S/W "Microsoft" 20 Lak P/A, 5 Crore వరునికి వధువు కావలెను. 96522 06107 (D)

రెడ్డి: 27 Yrs/ B.Tech, MBA (IIM)/ 5'10", S/W "Infosys", 21 Lak P/A, well to do కుటుంబం వరునికి అందమైన వధువు కావలెను. 79952 20232 (D)

క్షత్రియ/ రాజులు: 27Yrs/ B.Tech (IIT)/ S/W "Wipro", 18 Lak P/A, 3 Cr. వరునికి తగిన వధువు కావలెను. 97045 94965 (D)

క్షత్రియ/ రాజులు: 30 Yrs/ MBBS, PG Cardiology, Job in Banglore, 24 Lak P/A వరునికి MBBS (or) ఇంజనీర్ చదివిన వధువు కావలెను. 97049 84045 (D)

★ ★ ★

SC మాదిగ, హిందూ, తెలంగాణ, గ్రూప్- 1 ఆఫీసర్, 34Y, 5'10" వరునికి వెల్ సెటిల్డ్ ఫ్యామిలీకి చెందిన 28 సంవత్సరాల లోపు వధువు కావలెను. ఫోన్ 8367057472 (నో బ్రోకర్స్) (A)

Hindu Madiga 39Y 5'4" C.Govt Job 50K PM Divorced Own House. Hyd Prefer Unmarried Girl 27Y-32Y (No Dowry) ✆ 9396713457 (A)

CNB ముంబాయి నావిలో జాబ్స్ చేస్తున్న 38Y బ్రాహ్మణ అబ్బాయికి చదవుకున్న (టీచర్) జాబ్స్ చేసే వధువు కావలెను. నో బ్రోకర్స్ సంప్రదించవలసిన ✆ 9700663129 (A)

ముదిరాజ్ 32 సం॥ 5'7", B.Tech, MBA, S/W, Salary- 12 Laks P/A వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. No Brokers. Ph: 8897091964 (A)


2వ పెళ్ళి కులకట్న ప్రసక్తిలేదు. 46/ 5'6" అడ్వకేటు సంవత్సర ఆదాయము 6 లక్షలు సంప్ర. ముళ్ళపూడి మ్యారేజెస్ & రియల్‌ఎస్టేట్, నల్లకుంట, హైద్రాబాద్ ✆ 9515125822 (A)

Hyd Based Aryavysya Divorce 50/ 5'7" Central Govt CNB Seek Suitable Bride ✆ 9290124225. shobhaalladi31@gmail.com (A)

★ ★ ★

వైశ్య, 29, M.Sc, M.Ed, ప్రైవేట్ లెక్చరర్, 40 వేలు, 2 ఎ॥ భూమి, ఎరుపు, 5.6 అబ్బాయికి వైశ్య ఎరుపు అమ్మాయి కావలెను. వినాయక మ్యారేజ్ బ్యూరో. ✆ 96184 18981. నల్లగొండ.

విశ్వబ్రాహ్మణ 43, 5'-4" 1 బాబు (11 సం॥ల) కల్గి, భార్యలేని, ప్రై॥ జాబ్ (వెల్ సెటిల్డ్) వరునకు లేట్/2వ సంబంధం వధువు కావలెను, 9000505091. (N)



వరుడు కావలెను

41, Divorced, 5'5", USA, looking well educated genuine match, email: later918@gmail.com, Ph: 9490847275. (A)

రెండోపెళ్ళి, కులపట్టింపులేదు 56, 5'3" Govt 90 వేలు ఒక కోటి & 45, 5'4" Govt 65 వేలు, 85 లక్షలు & 36, 5'2" 40 వేలు, 55 లక్షలు " మాసేవ " ✆ 9291503949 (A).

బ్రాహ్మణ 25, 5'4"/ B.Sc ★ 22/ B.Tech/ SWE Wipro 3L ★ 27/ 5'4"/ MCA ★ 26/ B.Tech MS (US)/ SWE ★ 30/ M.Sc/ 3L ★ 9494096081. (A)

విశ్వబ్రాహ్మణ డైవర్సీ కుల ప్రసక్తిలేని 32/ 5'3" M.Sc/ SWE/ TCS 40,000/-PM అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9959265078/ 9866158793 (A)

విజయవాడ కాపు (2nd మ్యారేజ్) 34/5'3" బెంగుళూరులో SWE 70 వేలు PM 1 CR ప్రాపర్టీ గల అందమైన వధువుకు ANY OC/BC వరుడు కావలెను చాలా అర్జెంట్ 9550296562 వాట్సప్ (A)

ఆర్యవైశ్య 23, 5'4" 12 లక్షలు & 29, 5'2" 17 లక్షలు రెండోపెళ్ళి, 35, 5'3" 65 లక్షలు & 43, 5'2" Govt, 80 లక్షలు జి.సుప్రజాగుప్తా " మాసేవ" ✆ 9493163996 (A).

SC/ 32yr/ 5'.5", గ్రూప్-I ఆఫీసర్ గల వధువునకు గ్రూప్-I & II, డాక్టర్, గెజిటెడ్ ఆఫీసర్, ల్యాండ్‌లార్డ్, బిజినెస్ గల వరుడు కావలెను. Cont: 99484 73597. (G)

కుల ఆస్థి ప్రసక్తిలేదు. చౌదరి age 27 ఎత్తు 5.5 Govt. Job అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. వాట్స్‌ప్:8374356448.(k)

బ్రాహ్మణ/ 21/ 5'3"/ 9th ★ 26/ 5'2"/ 10th ★ 30, 5'2"/7th. కట్నాలు ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. పురోహితం అయినా OK. వాట్సప్: 8712244110 (A)

బ్రాహ్మణ/ 35/ 5'3"/ ఇంటర్/ Pvt. జాబ్/ 10,000/- PM/ వధువుకు తగిన జాబ్/ బిజినెస్ వరుడు కావలెను. ✆ 9030056547/ 9676812525 (A)

యాదవ/ M.Tech, NIT/ C.Govt. A.E. (ఇరిగేషన్ Dept)/ 55,000/- PM/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9515755529 (A)

మున్నూరుకాపు/ B.Tech, (NIT)/ Govt. A.E.E. (R&B)/ 40,000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9912280929. (A)

క్రిస్టియన్ మాదిగ/ B.Tech/ Govt. బ్యాంక్ P.O. (ఆంధ్రా బ్యాంక్)/ 30,000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9515755529. (A)

గౌడ/ M.Tech/ Govt. A.E. (ట్రాన్స్‌కో)/ 45000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9703978131. (A)

పద్మశాలి (ఏకైక కుమార్తె)/ B.Tech, BITS/ Govt. A.E.E. (జెన్‌కో)/ 50,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014. (A)

కుమ్మరి/ B.Tech/ C. Govt. ఎలక్ట్రానిక్ ఇంజనీర్ (ECIL)/ 45000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9989450693. (A)

గౌడ/ B.Tech/ C. Govt. బ్యాంక్ P.O. (ఇండియన్ బ్యాంక్)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9052296834. (A)

కాపు/ B.Tech/ Govt. A.E. (TS జెన్‌కో)/ 50,000/- PM/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8096493963. (A)

కమ్మ/ 25/ 5'6"/ 10th ★ 28/ 5'5"/ ఇంటర్ ★ 30/ 5'4"/ 10th కట్నాలు ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. బిజినెస్ అయినా OK. వాట్సప్ ✆ 7286042215. (A)

బ్రాహ్మణ/ 28/ 5'3"/ 10th ★ 33/ 5'2"/ ఇంటర్ ★ 38/ 5'3"/ 10th పేద వధువులకు వరుడు కావలెను. ★ మొదటి, రెండవ, లేటు, బ్రాహ్మణ వివాహాలకు ప్రత్యేకం. ✆ 8374994855. (A)

కమ్మ/ డైవర్సీ/ కుల ప్రసక్తి లేని/ 33/ 5'5"/ V. Fr./ MBA/ HR/ వర్కింగ్ Hyd/ 50,000/- PM/ చాలా అందమైన/ వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. అర్జెంట్ ✆ 9381534569. (A)

ఆర్యవైశ్య/ డైవర్సీ/ కుల ప్రసక్తి లేని/ 39/ 5'4"/ Fr./ PG/ వర్కింగ్ Hyd/ 50,000/- PM/ చాలా అందమైన/ వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. అర్జెంట్ ✆ 9966538381. (A)

ఆర్యవైశ్య/ 28/ 5'3"/ 10th ★ 32/ 5'3"/ ఇంటర్ ★ 36/ 5'4"/ 10th కట్నాలు ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. బిజినెస్ అయినా OK. ✆ 7288942198. (A)

Yadava/ Kurma (Divorced) 35/ 5'3" B.Tech/ Warangal 9440831748 ★ 32/ 5'3" MSc/ BEd Gudivada 9440759945 ★ 33/ 5'3" B.Tech/ OU/ BEL Machilipatnam 9441735157 (A)

కులపట్టింపు లేదు తండ్రి బ్రాహ్మణ (లేట్/ తల్లి రెడ్డి, 30Y/ 5'4" 2nd మ్యాచ్/ డిగ్రీ/ ఫెయిర్, నో బ్రదర్స్/ సొంత ఇల్లు/ అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 7893689763. (A)

కులపట్టింపు లేదు, బ్రాహ్మణ 20y/ 5'5" డిప్లొమా/ ఫెయిర్/ సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8897587959 (A)

బ్రాహ్మణ 30y/ 5'4" గౌతమమాస గోత్రం/ B.Sc/ B.Ed/ Pvt. టీచర్/ రిక్వైర్‌మెంట్/ Govt/ Pvt జాబ్ & పురోహితం OK. ✆ 9121408020/ 9121423830 (A)

రెడ్డి/ 1993/ 5'3" B.Tech/ MS/US/ 90K ★ 1993/ 5'4" B.Tech/ NIT/ 42L.P.A/ Singapore నవీన్‌రెడ్డి M.B. 8885559579/ 9848221166 (A)

రెడ్డి / 1995/ 5'4"/ B.Tech/ MBA (UK)/ Fair ★1994/ 5'3"/ B.Tech/ JNTU/ TCS/ 4.2 L.P.A/ Hyd. ✆ 7893333726/ 9848221166 (A)

రెడ్డి/ 1993/ 5'3" BDS/ V.Fair ★ 1995/ 5'3" B.Tech/ SWE/ Wipro/ 3.25 L.P.A. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో. 9505551788/ 9848221166 (A)

37Y, Kapu, CNB, 5'1" V.Fair, Ist Match MCA- Job Seeks Suitable Bridegroom Direct Send Photo, Bio-Data Whatsapp ✆ 9505708079, 8332838079 (A).

కాపు 23 Y, B.Tech కోట్ల స్థిరాస్తి కలిగి పేరెంట్స్ లేని అందమైన ఏకైక కుమార్తెకు వరుడు కావలెను. (ఆస్థి, కుల పట్టింపు లేదు). Send Photos Whats App. 90309 16399. (B)

SC హిందూమాదిగ 24/ 5'5"/ B.Tech/ Asst. Engg./ R.W.S/ స్టేట్ Govt. Emp. 50,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246151501. (A)

గౌడ 1994 B.Tech SWE Infosys 1995 B.Tech SWE IBM బెంగళూర్, డాక్టర్స్, MBBS & MD వధువులకు వరులు కావలెను. ✆ 7093458237. (A)

కాపు 24/ 5'5" B.Tech/ SWE/ CTS 35,000/- PM V.Fair అందమైన సాంప్రదాయ కుటుంబం వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246555529. (A)

SC మాదిగ 23, 5'5", B.Tech, NIT AEE ఇరిగేషన్ Dept. 40,000 P/M అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 9666148352. (A)

కమ్మ 24/ 5'5"/ B.Tech MS USA/ SWE/ Deloitte 70K $ P/A 5 Cr. ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246964555. (A)

కుల పట్టింపు లేదు/ డైవర్సీ/ 36/ 5'5"/ 2 పెట్రోల్ బంకులు, 2L PM, సొంత ఇల్లు, ఫామ్ హౌజ్, 10 Cr. ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. ✆ 9121823650. (A)

కుల పట్టింపు లేదు/ విడో/ 44/ 5'3"/ సొంత స్పిన్నింగ్ మిల్స్, ఫ్యాబ్రిక్ షోరూమ్స్, 7L PM, సొంత ఇల్లు, 11 Cr. ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. ✆ 9704516289. (A)

రెడ్డి/ లేట్ మ్యారేజ్/ 29Y/ 5'4"/ SBI బ్యాంక్ ఎంప్లాయి 6 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. ✆ 7032730202. (A)

నాయీ బ్రాహ్మణ 24/ 5'5"/ B.Tech/ SWE/ Wipro 40,000/- PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ సాంప్రదాయ కుటుంబం వధువుకు వరుడు కావలెను. ✆ 9246191907. (A)

బ్రాహ్మిణ్స్, 26, 5'5", B.Com, 28, ఇంటర్, 5'5" అందమైన వధువులకు వరుడు కావలెను. పురోహితం & బిజినెస్ & B.Tech & జాబ్. ✆ 8978691424/ 40- 48542181 (A)

కులపట్టింపులేదు, చౌదరి, విడో, 34, 5'5", ఫెయిర్, B.Com, ఓన్ బిజినెస్, 2L PM, 22 Cr గల అందమైన వధువుకు వరుడు కావలెను. వాట్సాప్. 7731976933 (A)

వైశ్య, 24Y, 5'4", V.Fair, B.Tech, SWE, 20K PM, అందమైన వధువులకు తగిన వరుడు కావలెను. ✆ 9059158811 (A)

కమ్మ ప్రత్యేకం. 1 to 50 Cr ఎబౌవ్ 24 to 39, B.Tech, MS, MBA, PG, డిగ్రీ, Ind, USA అందమైన ఆస్తిగల వధువులకు వరుడు కావలెను. శారద: 9849413031 (A)

ఆర్యవైశ్య 2nd, 38Y, డిగ్రీ, 5'1", స్థిరాస్తి, ఇద్దరు పిల్లలుగల వధువుకు అదే కులములో సెటిల్డ్ వరుడు కావలెను. 9010432846 (A)

39Y, డిగ్రీ, సాంప్రదాయ వధువుకి వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. (2వ పెళ్లి అయినా, పిల్లలున్నా Any FC/BC హిందు మాత్రమే) ✆ 9666405928 (A)

గౌడ, 24/ 5'4", B.Tech/ SWE, 50K, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి/ కలిగిన అందమైన/ వధువుకు తగిన వరుడు కావలెను/ SWE, (గౌట్) 9705345003/ 9951022798 (A)

కుల, ఆస్తి పట్టింపులేదు, చౌదరి విడో, 5'5" 36Y, MBBS, MS గైనిక్ Own హాస్పిటల్, పిల్లలు లేరు. స్థిరాస్తి గల వధువుకు 1, 2 వ వరుడు కావలెను. వాట్సప్: 8499074736 (A).

హిందూ మాదిగ: ఏకైక కుమార్తె B.Tech, Govt Asst. ఇంజనీర్ ఇరిగేషన్ Dept, 45000 PM, 5'4" ఎత్తు 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9908222406 (A).

పద్మశాలి: 40 లక్షల ఆస్తి, B.Tech, Govt Sr.ఇంజనీర్, ఎలక్ట్రికల్ Dept, 40,000 PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 6309319756 (A).

వాల్మీకిబోయ: 30 లక్షల ఆస్తి, B.Tech, SWE, 40,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A).

వాల్మీకి - బోయ, 25, 5'4", వైట్, B.Tech, SWE, TCS, 10 LP-A, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ వధువుకి వరుడు కావలెను. 79010 12671, 73961 57727 (D)

కమ్మ/కుల ప్రసక్తి లేదు/ 51/ 5'3"/ M.Sc., B.Ed/ గవర్నమెంట్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్/ సొంత ఇల్లు/ విడో/ 13 ఎకరాల అగ్రికల్చర్ భూమి గల వధువుకి వరుడు కావలెను. ✆ 95152 98844 (D)

కమ్మ విడో, 32Y, B.Tech, Well Settled, పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు) send photo Whatsapp: 72072 14721 (D)

కమ్మ విడో, 32Y, B.Tech, well settled, పేరెంట్స్ లేని అందమైన వధువుకు వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు) send photos Whatsapp: 90304 58459 (D)

యాదవ: 24 Yrs/ B.Tech (IT)/ S/W "TCS", Banglore, 6 Laks P/A, 50 Lakhs ఇస్తున్న వధువుకు వరుడు కావలెను. 70320 21201 (D)

★ ★ ★

ఆస్తి, కుల ప్రసక్తి లేదు. 30y, 5.3, డిగ్రీ, GHMCలో క్లర్క్ in:30 వేలు, Hydలో సొంత ఇల్లు గల అందమైన వధువుకు వరుడు అలాగే వధువు కావాలి. ✆ 77290 98545.

ప్రభుత్వ ఉద్యోగినికి ఏదైనా Private/ Govt. ఉద్యోగి వరుడు కావలెను. వయస్సు 25-30 సం॥ మధ్యలో ఉండాలి. కులపట్టింపులేదు. ✆ 7680975761 (A)

గౌడ్, 31, 5'1", B.Tech, MS, జర్మనీ PR ★ 24, 5'4", B.టెక్, SWE, Hyd ★ 29, 5'5", B.టెక్, Sr. అనలిస్ట్, Hyd. వధువులకు వరులు కావలెను. సం॥ 'శుభమస్తు' Hyd 9490479371 (A)

II డైవర్సీ, ముదిరాజ్, CNB, 25Y, 5'4", MBA, S/W/E, 50,000/- PM, వెల్‌సెటిల్డ్ in Hyd. ఓన్లీ డాటర్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 7702195227 (A)



వివాహ వేదిక

"ముదిరాజ్ విదేశసంబంధాల పరిచయవేదిక" విదేశాల్లోని తమపిల్లలకు సంబంధాలు వెదుకుతున్న, విదేశాలకు తమ పిల్లల్ని ఇవ్వాలనుకుంటున్న వారు సంప్రదించండి "ముదిరాజ్ సేవాసంఘం" "ముదిరాజవాణి" స్వచ్ఛంద పరిణయ పరిచయ వేదిక. కాల్, వాట్సప్. 9441455277 (A)

కేవలం మాల మాదిగ హిందూ & క్రిస్టియన్, IT, Govt., Pvt. 1వ, 2వ, లేట్, డైవర్స, A.P. తెలంగాణలో దేశ, విదేశ సంబంధాలకు సంప్ర: నో కమీషన్ Ph: 9100474440. (A)

23 సం॥ అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీసత్యసాయి వివాహ వేదిక 23 వ వార్షికోత్సవ సందర్భంగా ఫ్రీ రిజిస్ట్రేషన్ ✆ 9849414098, 040-66317515 (A).

ఫ్రీ రిజిస్ట్రేషన్ కేవలం మున్నూరు కాపు, కమ్మ, రెడ్డి, కాపు, బ్రాహ్మణ్, వైశ్య, OCలకు 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ SW/ Govt. M: info@goodlifemarriage.com ✆ 9989140444. (A)

P.Supriya Reddy, Rich Reddy Boys & Girls India & Abroad Matches, All Emp, govt, Pvt, SWE, Doc's, Business, Divorcees from all Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762. Email: palletisupriyareddy@gmail.com (A).

శ్రీ సాయి పద్మశాలి ఇంటర్నేషనల్ మ్యారేజి బ్యూరో: Ph: 93921 65685 చెరుకు ప్రసాద్ (పద్మశాలి), విజయవాడ. Civils, Doctors, NRI's (Special). (B)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి S.N.శర్మ, HYD ✆ 9248600342, 8019207503, brahmininformationmatri@gmail.com (A)

ఆర్యవైశ్య వధూవరుల సంబంధాలకై సంప్రదించండి. HYD.Ph. 8465834874, (W) 9491376774, www: teluguaaryavysyainfo@gmail.com (A)

కులపట్టింపులేని వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా 2 వ, లేట్, డైవర్సీ విడో వధూవరులకు. స్త్రీలకు ఫ్రీ. పురుషులకు రి॥ ఫీ॥ 1500/- ✆ 7997540254, 9246214511 (A).

శుభంగౌడ్స్ మ్యాట్రిమోని గౌడ్స్ వధూవరులకై దేశ, విదేశ, 1 వ, 2 వ, డా॥ ఇంజనీర్, PG, డిగ్రీ, బిజినెస్ సం॥లకై సంప్ర॥ బుర్ర శ్రీనివాస్ గౌడ్ Hyd ✆ 9247257445, 9246214511 (A).

CNB/ 2 వ, లేట్ వయస్సుతో నిమిత్తం లేకుండా 5 వేల ప్రొఫైల్స్ కలవు. ఉచితంగా సంబంధం కుదుర్చబడును. కేవలం సర్వీస్‌ఛార్జ్ మాత్రమే. Hyd ✆ 9440937900 (A).

1 వ, 2 వ లేట్ విదేశీ అన్ని కులాల వారికి కులపట్టింపులేని సంబంధాలు కుదుర్చబడును. 1500 మంది వధూవరుల లిస్ట్. ECIL, రాంపల్లి 'x' రోడ్ ✆ 9515406334, 9515559893 (A).

కేవలం యాదవ/ కుర్మ వివాహసంబంధాలకై, గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com Hyd:9440831748, Gunt:9440759945, VSP:9441735157 (A)

Whatsapp Your Photo & Biodata to 9347262769. We will Send the suitable Matches www. pellisandadi.com Estd.1991 (A)

మాల మాదిగ IAS, IPS, IRTS, MBBS, MD.MS, USA Govt. Jobs, SWE, 7893013265. (N)

విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయవేదిక, బ్రహ్మముడి గుంటూరు కమీషన్ డిమాండ్ లేదు. ✆ 0863-2261898, 94911 25725 (I)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

MALA (SC) Free మాలమహానాడు ఆధ్వర్యంలో వివాహ సంబంధాల సెటిల్‌మెంట్ కొరకు సంప్ర॥ 90301 42666, 90109 22444.

రెడ్డి కులస్తులకు తక్కువ సమయంలో ఉన్నతమైన వివాహ సంబంధాలు 1వ, 2వ, లేట్ సంబంధాలు కుదుర్చబడును. దండెం మ్యారేజ్‌బ్యూరో. ✆ 6303738265, 9032339339 (A)

Since 1989 శ్రీకన్య వివాహ వేదిక అన్ని కులాలు & కులాంతర మున్నూరు కాపు మా ప్రత్యేకత. ✆ 27619998, వాట్సప్ - 9347009998/ 9849027778 వేల్పుల భిక్షపతి. (A)

స్పెషల్లీ డాక్టర్స్: (5 వేల ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, MDS & డా॥కి మాత్రమే. 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదుర్చబడును. ✆ 9701655685. (A)

కాపు వధూవరుల వివాహ సంబంధములు కుదుర్చుటలో ఎంతో అనుభవం ఉన్న వేదిక. కాపుమాట్రిమోని హైదరాబాద్ సంప్ర: 8008729902 (A).

క్రిస్టియన్ వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865, Blue Trend Matrimonial(P) Ltd (A).

బ్రాహ్మణ వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Suresh ✆ 7702262508, Blue Trend Matrimonial (P) Ltd (A).

ఓన్లీ కమ్మ చౌదరి: (10 వేల ప్రొఫైల్స్) డాక్టర్స్ సాఫ్ట్‌వేర్స్, గౌట్ ఎంప్లాయిస్, బిజినెస్, హైరిచర్స్ & ఆల్ 1వ, 2వ, దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9959305599 (A)

స్పెషల్లీ కాపు/రెడ్డిస్: డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, అబ్రాడ్స్, బిజినెస్ & అందరికీ AP/ తెలంగాణ/ కర్ణాటక & దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

డాక్టర్స్ డాక్టర్స్ 6000 ప్రొఫైల్స్ అన్ని కులాల MBBS, MD, MS, DM, MCH, BDS, MDS, బిజినెస్‌లకు 1 వ, 2 వ ఇండియా & విదేశాల సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. మా బ్రాంచీలు వైజాగ్, హైదారాబాద్ ✆ 9966808059 (A).

రెడ్డిస్ మ్యాట్రిమోని గత 5 సం॥లుగా ఎన్నో జంటలు కలిపిన సంస్థ. 20 వేలకి పైగా ప్రొఫైల్స్, డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్, హైరిచ్చార్స్, బిజినెస్‌మెన్ & All ఇండియా & విదేశాలలో గల రెడ్డీస్ సంబంధాలకై ✆ 9100404026 (A).

రజక వివాహవేదిక (1994) Abroad ఇంజనీర్స్, డాక్టర్స్, Govt - Jobs, Bussiness, B.Ed సంబంధాలకై సంప్ర: 8106303155, 9391265304 ksrajaka1@gmail.com (A).

రెడ్డి కులస్తులకు ప్రత్యేకముగా చూడబడును. IIT, IIM, M.Tech, B.Tech, MBA, Doctors/ NRI/ Business/ Rich Affluent అన్ని professional Coures వారికి సంబంధాలు చూడబడును. సంప్ర: 63031 15956 (జానకిరెడ్డి) (D)

★ ★ ★

పద్మశాలి కులబాంధవులకు శుభవార్త! గత కొన్ని దశాబ్దాలుగా నామమాత్రపు ఫీజుతో సేవలందిస్తున్న వీవర్స్ వేల్ఫేర్ ట్రస్టువారి ఆధ్వర్యములో పద్మశాలి పరిణయ పరిచయవేదికను తేది: 17.02.2019 ఆదివారం రోజున 1PM నుండి 5 PM వరకు నిర్వహిస్తున్నాము. సంప్ర॥ పద్మశాలిభవన్, నారాయణగూడ, హైద్రాబాద్ ఫోన్: 040-24765557/ 8/9 (A)

కురుమ- యాదవ వివాహ సంబంధాలకు విదేశీ, డాక్టర్స్, ఇంజనీర్, 2వ, వివాహసంబంధాలకు సం॥ Kurumapellipandhiri.com 9396649499/ 9393001666 Hyd. (A)

"వైశ్యలకు మాత్రమే" "కళ్యాణమస్తు" (వివాహవేదిక) రి.నం. 601/2006 వివాహసంబంధాల కొరకై బాదం ఉమాశంకర్ ✆ 9849134206 ప్లాట్: 6PVRS శ్రీసాయిహిల్స్ కూకట్‌పల్లి Hyd. (A)


ఓన్లీ మున్నూరుకాపు మ్యారేజ్ బ్యూరో, కరీంనగర్. డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt. మీరు కోరిన పెళ్ళి సంబంధాలకు సంప్ర॥ భ్రమరాంబ M.B. ✆: 99484 83542 (F)

★ మాదిగ పరిచయవేదిక ఈరోజు 10AM-6PM ఫీజు 1 వేయి. # సుందరయ్య విజ్ఞాన కేంద్రం. హైద్రాబాద్ సంప్ర॥ స్వప్న వివాహవేదిక. సికింద్రాబాద్ స్టేషన్ ✆ 9347046175 (A)

కులపట్టింపులేని అన్ని కులముల వారికి 1వ, 2వ సంబంధాలకై సంప్రదించగలరు. 22 సం॥ నుండి 65 Yrs వరకు. విడో/ డైవర్సీ వాళ్లకు సంబంధాలు చూడబడును. 8897091926 (A)

సింధూర్ వివాహ వేదిక: కాపు, రెడ్డి, గౌడ, పద్మశాలి, కులాలవారికి వివాహ సంబంధాలు చూడబడును. లేట్ మ్యాచెస్‌కి ప్రత్యేకం. సంప్ర॥ 9032417139 (A)

గౌడ్‌మ్యారేజ్‌బ్యూరో Hyd. గౌడ కులస్తులకు మాత్రమే. 10 సం॥ అనుభవం. డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI, Govt/ Pvt ఎంప్లాయిస్/ బిజినెస్/ 1వ, 2వ పెళ్ళి సం॥లకై ✆ 9440454842 (A)



కోరుకున్న లక్ష్యం కోసం ప్రభుత్వ ఉద్యోగాలని సులభంగా వదులుకునేంత ధైర్యం ఆయనది! తాను తయారుచేసిన వ్యాక్సిన్లను స్వదేశంలోని బిడ్డలకూ అందించాలన్న లక్ష్యం కోసం 'ఆర్‌యూ జోకింగ్' అన్నా.. 'గెటవుట్' అన్నా.. పదకొండేళ్లు పాటు భరించిన సహనం ఆయనది. నాస్తికవాదం నుంచి మొదలైన ఆయన పయనం దైవత్వం దిశగా అడుగులు వేసింది. సంగీతం, సాహిత్యం తోడులేకపోతే ఏమయ్యేవాడినో... అనే శాంతా బయోటెక్ వరప్రసాదరెడ్డి మనసులో మాటలు...

ఎవరికైనా అమ్మ ఒడే తొలి బడి. తల్లి తన కొడుకు వివేకవంతుడైన పౌరుడిగా మారాలని కోరుకోవాలిగానీ కేవలం మార్కులే తెచ్చుకునే అక్రమార్కులుగా ఎదగాలని కోరుకోకూడదు. ముందు తల్లిలో మార్పు రావాలి. ఒకప్పుడు మోరల్ క్లాసులు ఉండేవి. ఇప్పుడు సబ్జెక్టుల బట్టీ, మార్కుల విధానంతో పిల్లలు రోబోలుగా తయారవుతున్నారు. 99శాతం మార్కులు రాకపోయినా, ఐఐటీలో సీటు రాకపోయినా నీ మొహం నాకు చూపించొద్దనే తల్లిదండ్రులు తయారయ్యారు. ఇలాంటి కన్నవాళ్లు, మార్కుల కోసమే పుట్టిన ఈ విద్యావ్యవస్థకి ఎలాంటి నైతిక విలువలు ఉంటాయి? రైతుల విషయానికొస్తే వాళ్లకు రుణమాఫీలు ఇవ్వడం కాదు.. రుణం అవసరం లేని పరిస్థితి కల్పించాలి.

వంద మందినైనా చంపాలనుకున్నా

● రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేసి బయటికెందుకొచ్చారు?

మనిషిని ప్రభావితం చేసేవి చదువు, తల్లిదండ్రులు, పెరిగిన వాతావరణం. రైతు కుటుంబంలో పుట్టాను. ఉమ్మడి కుటుంబంలో పెరిగాను. అల్లరిచిల్లరగా ఉండేవాణ్ణి. అందుకే మా అమ్మ నన్ను మేనమామ దగ్గరికి పంపించారు. ఆయన కరుడుగట్టిన కమ్యూనిస్టు. సుందరయ్యగారి శిష్యుడు. క్రమశిక్షణ గల వ్యక్తి. నాకూ అదే భావజాలం అబ్బింది. డి.ఆర్.డి.ఒ.లో 23 ఏళ్ల వయసులో చేరాను. మాపై అధికారి తాను చెప్పినట్లే చేయాలనేవారు. కష్టమైనా ఏడేళ్లు అలాగే చేశాను. అంత కీలకమైన వ్యవస్థలో నిజాయితీ లేకపోవడం నన్ను చాలా బాధించింది. దీంతో బయటికి వచ్చేశాను. ఇది 1972 నాటి పరిస్థితి. తర్వాత ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బోర్డులో ఉద్యోగం వచ్చింది. అక్కడ 90 శాతం దగా. ఐదేళ్లు ఉద్యోగం చేసి రాజీనామా చేశా.

● ఉద్యోగాలు వదిలేస్తున్నప్పుడు భయం లేదా?

వ్యవసాయం చేసుకునైనా బతికేయగలననే ధైర్యం ఉండేది. అందుకే ఉద్యోగాలు వదిలానుగానీ, విలువలు వదులుకోలేకపోయాను. నేను డీఆర్‌డీఎల్‌లో ఉద్యోగం చేసేప్పుడు ఐడీబీఎల్‌లో నామినీ డైరెక్టర్ అయిన ప్రొఫెసర్ జగదీష్ ప్రసాద్‌గారు పరిచయమయ్యారు. 1985లో ఆయన భాగస్వామ్యంతో మిస్సైల్ బ్యాటరీలకు సంబంధించిన కంపెనీలో రూ.8.5 లక్షలు పెట్టుబడి పెట్టాను. ఆయన విజ్ఞత, నా కార్యశీలత కుదిరాయి. మాది గురుశిష్యుల బంధం. కంపెనీలో పరిశోధనకు పెద్దపీట వేశాం. సంస్థకు మంచి పేరొచ్చింది. తరువాత ఆయనతో విడిపోవాల్సిన పరిస్థితులు వచ్చాయి.

● విడిపోయాక మీ డబ్బులు మీకు రాలేదా?

నన్ను ఆయన బాగా ఇబ్బంది పెట్టారు. అక్కడ రాజకీయ ప్రమేయం మొదలైంది. గొడవైంది. మానసికంగా చాలా బాధపడ్డాను. కోర్టుకు వెళ్లినా ఫలితం లేకపోయింది.

● వ్యాక్సిన్ ఆలోచన ఎలా వచ్చింది?

అప్పుడు మా కజిన్ అమెరికాకు తీసుకెళ్లాడు. ఆ గగనయానం దైవఘటనగానే భావిస్తాను. అమెరికాలో హెపటైటిస్ బి గురించి ఎక్కువగా చర్చించుకునేవారు. దాన్ని ఎయిడ్స్ కంటే తీవ్రమైన వ్యాధిగా భావించేవారు. హెపటైటిస్ బి చాలా రకాలుగా వస్తుంది. పైగా మరణాలు ఎక్కువ. మనదేశంతో పాటు ఆసియా దేశాల్లో ఆ వ్యాధి తీవ్రత గురించి వాళ్లు చర్చించేవాళ్లు. అక్కడ మన పిల్లలు, మన దేశం గురించి చాలా తక్కువ చేసి మాట్లాడడం విన్నాను. 'మీకు కావాల్సినంతమంది పిల్లలున్నారు కదా! కొందరు చనిపోతే ఏంటి?' అన్నట్లు మాట్లాడారు. బాధేసింది. హెపటైటిస్ బి వ్యాక్సిన్ గురించి ఆలోచన మొదలైంది.

మనదేశానికి వచ్చి అహ్మదాబాద్‌లో ఓ ఫార్మా కంపెనీకి వెళ్లా. ఇక్కడ హెపటైటిస్ బి వ్యాక్సిన్ అవసరం గురించి అంజిరెడ్డికి చెప్పా. 'ఇది బయోటెక్నాలజీ సంగతి. ఆ పరిజ్ఞానం సంపాదించడానికి మనకు సమయం పడుతుంద'న్నారు. దీంతో మళ్లీ అమెరికాకి వెళ్లాను. ఓ బయోటెక్నాలజీ నిపుణుడిని కలిశాను. 'మీది పేద దేశం... సాధ్యపడదు. మూడేళ్ల క్రితం మేం అభివృద్ధి చేశాం. ఇది అర్థం కావాలంటే మీకు 30 ఏళ్లు పడుతుంది' అన్నారాయన. మన దేశం గురించి చాలా వ్యంగంగా మాట్లాడాడు. నాకైతే అతన్ని కొట్టాలన్నంత కోపం వచ్చింది. ఓ ఉత్తరాది వ్యక్తిని కలిస్తే 'వీళ్లు మనకు నూతన పరిజ్ఞానం అందివ్వరు. మనమే దీన్ని సాధించుకోవచ్చ'ని వివరించారు. డబ్బు, ఓపిక దానికి చాలా అవసరమని చెప్పారు. నేనా ఇంజినీరింగ్ చదివినవాడిని... జీవశాస్త్రం గురించి అఆలు కూడా తెలీవు. అందుకే ముందు మంచి బృందాన్ని తయారు చేయాలనుకున్నాను.

అన్నీ మోహనరాగాలే

మోహనరాగం అంటే నాకు ప్రాణం. నాకు రాగాల గురించి తెలియని వయసులోనే దారినపోతూపోతూ ఎక్కడైనా మంచి పాట వినిపిస్తే గోడకు ఆనుకుని రేడియోలో వచ్చే ఆ పాట వినేవాడిని. ఇంజినీరింగ్‌లోకి వచ్చిన తర్వాత కొన్ని పాటలు రికార్డు చేసుకున్నాను. రాగం ఏదో తెలియకుండా రికార్డు చేసుకున్నా.. కాస్త అవగాహన వచ్చిన తర్వాత చూస్తే అవన్నీ మోహనరాగాలే.

● నిపుణులు, డబ్బు ఎలా సమకూర్చుకున్నారు?

హైదరాబాద్‌లో అప్పటికి బయోటెక్నాలజీ కంపెనీలు లేవు. దీంతో ఆ రంగంలో పనిచేసేవారూ అందుబాటులో లేరు. విదేశాలకు వెళ్లిన బయోటెక్నాలజీ వాళ్లను వాకబుచేశాను. 'మీరు ఇక్కడ చదువుకొని అక్కడకు వెళ్లారు.. ఈ దేశానికి ఏమీ తిరిగి ఇవ్వరా' అని ఉత్తరాలు రాశాను. కొద్దిమంది సానుకూలంగా స్పందించారు. ముగ్గురొచ్చారు. జాయిన్ అయ్యాక ఇద్దరు వెళ్లిపోయారు. ఒక్కరే ఉండిపోయారు. మరోవైపు భాగస్వామిగా ఉంటానన్న కంపెనీ రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. బ్యాంకుల చుట్టూ తిరిగాను. బయోటెక్నాలజీ నేపథ్యంలో లేకపోవడంతో బ్యాంకులు రుణం ఇవ్వడానికి ముందుకు రాలేదు. చివరికి మానాన్న భూమి అమ్మి కావాల్సిన డబ్బు సర్దారు. మా కజిన్, స్నేహితులు సాయం చేశారు. రూ.2 కోట్లతో మల్లారెడ్డిగారి సౌజన్యంతో ల్యాబ్‌లో పనిచేయడం ప్రారంభించాం. అమెరికా వాళ్లు 18 డాలర్ల వ్యాక్సిన్‌ను మనకు 35 డాలర్లకు అమ్మేవాళ్లు. ఒక్కో డోసు రూ.840. ముగ్గురు పిల్లలుంటే దాదాపు రూ. 2500 దాకా అయ్యేది. దీన్ని సామాన్యులు భరించడం కష్టంగా ఉండేది. తక్కువ డబ్బులకే వ్యాక్సిన్ అందివ్వాలనేది నా లక్ష్యం. లక్ష్యశుద్ధి ఉంటే లక్ష్యసిద్ధి కూడా ఉంటుంది. కొందరి సహకారంతో అలా నాకు రూ.15కోట్లు జమకూడాయి.

● వ్యాక్సిన్ తయారీకి ఎన్నాళ్లు పట్టింది?

1991 అక్టోబర్‌లో ఈ ఆలోచన వచ్చింది. 1992 నుంచి ఈ పనిలో ఉన్నా. ఆ తర్వాత ఏడాది మార్చికి మా కంపెనీ రిజిస్ట్రేషన్ అయింది. 1997 ఆగస్టుకి హెపటైటిస్ బి వ్యాక్సిన్ తయారు చేశాం.

● ఈ క్రమంలో మీరు పడిన ఇబ్బందులేంటి?

అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అందులో మొదటిది డబ్బు. నాకున్న రూ.2కోట్లు ఎంత వరకూ సరిపోతాయి? కావల్సింది రూ.15 కోట్లు. అన్నిటి కన్నా ముఖ్యమైంది ఈ ఉత్పత్తి పుట్టిన కొన్ని క్షణాల్లోనే బిడ్డకు అందాలి. ఇది మంచిది అని చెప్పడానికి ఒక వ్యవస్థ ఉండాలి. ఇది సోపో, టూత్ పేస్టో కాదు కదా! నియంత్రించే విధానం ఒకటి ఉండాలి. డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా ఆ పని చేస్తుంది. కానీ వాళ్ల దగ్గర అంతవరకూ ఎటువంటి విధివిధానాలు లేవు. వెళ్లి అడిగితే 'ఆర్ యూ జోకింగ్' అనేవారు? ఆరోగ్య కార్యదర్శి జావెద్ చౌదరీ గారి దగ్గరకు వెళితే... 'నా సమయం వృథా చేయొద్దు. జోక్ చేస్తున్నావా. గెట్ అవుట్' అన్నారు. అలా నాకు ఎవ్వరూ సహకరించలేదు.

అప్పుడే కలాంను చూశా!

యాభై ఏళ్ల క్రితం డీఆర్‌డీవోలో చేస్తున్నప్పుడు అబ్దుల్‌కలాంగారు తారసపడ్డారు. ఆయన, నేను ఓ ప్రాజెక్టులో సభ్యులం. ఆయనను మిస్సైల్ సైంటిస్ట్ అని రాసేవారు. అయితే ఆయన ఓ గొప్ప మానవతావాది. నిజాయితీపరుడు. సైంటిస్ట్‌ల భుజంమీద చేయి వేసి అభినందించేవారు.

పుస్తకాలు తక్కువ రాశాను. కానీ మంచి పుస్తకం చదివితే సమీక్ష రాస్తాను. చాలామంది ముందుమాట రాయమని అడిగేవారు. పుస్తకం మొత్తం చదివి విషయం మీద సమగ్రంగా రాస్తాను. నన్ను ప్రభావితం చేసిన వ్యక్తుల గురించి 'సైకాలజీ టుడే' పత్రికలో వ్యాసాలు రాస్తున్నాను.



● ఎవరికైనా లంచాలు ఇచ్చారా?

ఇచ్చాను. అనేక సవాళ్ల ఎదుర్కొన్నాను. శాస్త్రవేత్తలని సమీకరించుకోవడం కష్టం అయ్యింది. ఒక ప్రయోగశాల కట్టాలంటే ఒక నమూనా ఉండాలి. మరి మేం దేన్ని చూసి కట్టాలి. అయినా మంచిగానే కట్టాం. అయితే నేను బ్రహ్మని కాను, మయుడునీ కాదు. కొన్ని తప్పులు వచ్చాయి. సరిదిద్దుకున్నాం. డబ్బు లేదు, అనుభవం లేదు, విధివిధానాలు లేవు. అనుభజ్ఞులైన జనం లేరు, అన్నింటి కన్నా ముఖ్యంగా ప్రభుత్వంలో దీని గురించి స్పందన లేదు. భయంకరమైన రెడ్ టేపిజం. చివరికి ప్రైవేట్‌గానే అమ్మడం మొదలుపెట్టాం.

● ఈ పరిస్థితుల్లో కుటుంబం నుంచి ఎలాంటి సహకారం అందింది?

నా కుటుంబం నన్ను భరించింది. నన్ను కట్టుకున్నావిడ నా మేనత్త కూతురే కాబట్టి ఆవిడకి నా గురించి బాగా తెలుసు. ఇతను ఒక నిర్ణయానికి వస్తే మారడు అనుకుంది. ఏకైక సంతానం కాబట్టి అమ్మానాన్నలు ఎదురుచెప్పలేదు.

● అప్పటికే ఉన్న కంపెనీలు మీకు పోటీ వచ్చాయా?

మేం ప్రారంభించిన తర్వాత 8 కంపెనీలు బయోటిక్ డివిజన్ని ప్రారంభించారు. అప్పటికి 'శాంతా బయోటెక్'కి చాలా పేరు వచ్చేసింది. మనమూ ఈ రంగంలోకి వెళ్లాలి అనే తపన ఇతరుల్లో మొదలైంది. కొంతమంది టెక్నాలజీని దిగుమతి చేసుకుని, మరొకటి చేసి ఈ రంగంలోకి వచ్చేశారు. నేను డబ్ల్యుహెచ్‌వో ప్రీక్వాలిఫికేషన్‌కి వెళ్లాను. రెండేళ్లపాటు మా పనితీరుని పరీక్షించారు. ఆ పరీక్షలో విజయం సాధిస్తే అంతర్జాతీయంగా వ్యాక్సిన్ అమ్ముకోవచ్చు. దాంట్లో మేం విజయం సాధించాం. యునిసెఫ్ మా దగ్గర కొనడం ప్రారంభించింది. తక్కిన వాళ్లు ఈ విషయంలో వెనకబడ్డారు. అలా మాకు అంతర్జాతీయ అనుమతులు వచ్చిన తర్వాత ఈ మందు మన బిడ్డలకన్నా ఇతర దేశాల బిడ్డలకే ఎక్కువగా అందింది. మన బిడ్డల కోసమన్నా ఆనాటి ఆరోగ్యమంత్రి అన్బుమణిరాందాస్ సహకరించలేదు. మన పొరుగు దేశాలు వైజ్ఞానికంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డ దేశాలు మన దగ్గర కొనుక్కుని వాడుకున్నారు. కానీ మన బిడ్డలకు అందలేదు. పాకిస్తాన్‌కి మనమే ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా ఇచ్చాం. నాకోసారి టెక్నాలజీ అవార్డు ఇచ్చారు. డబ్బుని వెనక్కి ఇచ్చేసి ఈ వ్యాక్సిన్‌ని మనదేశంలోనూ వాడండి అన్నాను. రెండోసారి అవార్డు వచ్చినప్పుడు అవార్డే వద్దన్నాను. నా సేవలు గొప్పవంటూనే నేను తయారుచేసిన వ్యాక్సిన్ వాడకపోతే ఎలా అని ప్రశ్నించాను. వాజ్‌పేయి గారి ప్రత్యేక కార్యదర్శి సుధీంద్ర కులకర్ణి గారికి చెప్పాను. అలా పదకొండేళ్లపాటు నా వ్యాక్సిన్ మన బిడ్డలకు చేరువకాలేదు. కానీ ఇప్పుడలా కాదు. మా వ్యాక్సిన్ల కారణంగా చాలామందికి వ్యాధి తగ్గింది.

అవగాహన లేదు

ఆ రోజుల్లో ఎయిడ్స్ గురించి ప్రచారం విపరీతంగా ఉండేది. ప్రపంచబ్యాంకు బలవంతంగా మనకు రుణమిచ్చి కండోమ్‌లు వాడమని చెప్పారు. మన ప్రభుత్వ పెద్దలు సిగ్గులేక బస్సులమీద రాయించారు. బోలెడు డబ్బు ఖర్చు పెట్టారు. దీని మీద విమర్శిస్తే 'విదేశీ లోన్ లేండీ' అన్నారు అప్పటి నాయకులు. బాధాకరం ఏంటంటే హెపటైటిస్ బి గురించి ఎలాంటి ప్రచారం లేదు. అవగాహన కల్పించలేదు. హెపటైటిస్ అంటే కృత్రిమంగా సృష్టించిన ఓ మాయరోగం అని కొన్ని పత్రికలు రాశాయి. ఆ సమయంలో రామోజీరావుగారిని కలిసి మాట్లాడాను. ఆయన 'క్రియేటెడ్ హెపటైటిస్ బి వ్యాక్సిన్ బై వరప్రసాద్‌రెడ్డి' అని ఆయన ఈనాడులో రాశారు. రుబెల్లాలా అందరు పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇస్తే బావుంటుందినేది నా ఆలోచన. అందుకే నేను తక్కువ డబ్బులకే అందరికీ అందుబాటులో అమ్మాలనుకున్నా. ఈరెండు సాధించగలిగాం.

● మొదట్లో నాస్తికుడిగా ఉండేవారు. మరి దైవత్వం వైపు ఎలా వచ్చారు?

మా అమ్మ ఆస్తికురాలు. చదువుకుంది. శ్రద్ధగా పూజాపునస్కారాలు చేసుకునేది. పెరిగిందేమో పరమ నాస్తికుడైన మామయ్య దగ్గర. అక్కడ హరిజనవాడల్లో తిరుగుతూ యాంటీబయోటిక్స్ ఇస్తూ విటమిన్ సి లు ఇచ్చేవాడు. ఆయన సమసమాజం కావాలని చెప్పేవాడు. 'నువ్వు పెట్టుబడిదారీగా మారిపోతున్నావ్. శ్రామికుల అదనపు శ్రమే పెట్టుబడిదారుల పెట్టుబడి. నువ్వు నా దగ్గర పెరిగి ఇంత ద్రోహం చేస్తావను కోలేదు' అన్నారాయన. నేను 'శాంతా'ను ప్రారంభించిన తర్వాత ఉద్యోగస్తుల్లో నేను నాకోసం పనిచేస్తున్నాను అనే నమ్మకం కలిగించాను. పదహారు ఉత్పత్తులు. 1600 మంది ఉద్యోగులు. ఎంతో మంది వాటాదారులకు లాభాలువచ్చాయి. ఇక్కడ సంపద పెంచడం, పంచడం కూడా జరిగింది. మామయ్య చెప్పిన దాని ప్రకారం దేవుడు ఉన్నాడో లేదో తెలియదు. దైవీ గుణాలు ముఖ్యం అని అనుకున్నాను. దయ, కరుణ, ఓపిక, క్షమ, సహనం అలవరుచుకున్నాను. ఒకప్పుడు తీక్షణంగా ఉండేవాడిని. ప్రభుత్వంలో కనీసం వందమందిని చంపేయాలి అనుకునే వాడిని. కానీ అమ్మ నన్ను మార్చింది. ఇప్పుడు చాలా హాయిగా ఉన్నాను. సంగీతంతో, సాహిత్యంతో జీవితం ముడిపెట్టుకుని చాలా ప్రశాంతంగా ఉన్నాను.

నా ఫోన్ లాక్కున్నారు



ఒక్కసారి.. కన్ను గీటి.. సన్నగా నవ్వి... చేతిని తుపాకీలా చేసి పేల్చిందంతే...! ప్రపంచం మొత్తం ఆమెకు ఫిదా అయిపోయింది. ఇంకా సినిమా విడుదల కాకముందే... ఎందరో అభిమానుల్ని తన ఖాతాలో వేసుకున్న ఆ కేరళ కుట్టి ప్రియా ప్రకాశ్ వారియర్ 'హాయ్'తో పంచుకున్న సంగతులు...

మాది కేరళలోని త్రిశ్సూర్. నాన్న ప్రకాశ్ వారియర్ సెంట్రల్ ఎక్సైజ్‌లో చేస్తారు. అమ్మ ప్రీతా గృహిణి. చిన్నప్పటి నుంచి స్టేజ్ ఫియర్ ఉండేది కాదు. సంగీతం, డాన్స్ వచ్చు. త్రిశ్సూర్‌లోని విమలా కాలేజ్ ఫర్ విమెన్‌లో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నా. సృజనాత్మక రంగంలోకి వెళ్లాలని ఆశ. మా అంకుల్ ఒకరు మోడల్ అని పిలిచేవారు. ఆ మాటలు విన్నప్పుడు నేను మోడల్ ఎందుకు కాకూడదని అనిపించింది. అది క్రమంగా ఆసక్తిగా మారింది. అమ్మవాళ్లు కూడా చదువు ముఖ్యం అంటూనే ప్రోత్సహించారు. 'ఒరు ఆదార్ లవ్...'కి ఆడిషన్లు జరుగుతున్నాయని తెలిసి వెళ్లా. ఎంపికయ్యా. 'మాణిక్య మలరాయ పూవి' పాట ముందువరకూ నాది చిన్న పాత్రే. ఆ తరువాతే పూర్తి స్థాయిలో అవకాశం ఇచ్చారు.

● దర్శకుడు పాట గురించి వివరిస్తూ కనుబొమలు ఎలా పైకెత్తాలి... కన్ను ఎలా గీటాలనేది చెప్పారంతే. ఒక టేక్‌లోనే పూర్తిచేశా. అప్పటివరకూ నా ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య వెయ్యి. ఆ వీడియో విడుదలైన వెంటనే ఆ సంఖ్య మిలియన్లకు చేరుకుంది. ఇప్పుడు ఆరు మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇప్పుడా సినిమా నాలుగు భాషల్లో విడుదల కాబోతోంది. మాది అమ్మాయిల కాలేజీ కావడంతో లవ్‌లెటర్లేమీ రాలేదు కానీ... నా ఈమెయిల్ ఇన్‌బాక్స్ మొత్తం డేట్‌ల ప్రతిపాదనలతో నిండిపోయింది.

● మాణిక్య మలరాయ పూవి పాట వచ్చినప్పుడు ఓ విచిత్రం జరిగింది. నా వీడియోను నాన్న స్నేహితుడు నాన్నకు షేర్ చేశాడట. అది నాన్న చూసి 'ఈ అమ్మాయి ఎవరో తెలుసా...' అని అడిగారట. తెలియదనడంతో నా గురించి చెప్పారట.

● తర్వాత అమ్మావాళ్లు జాగ్రత్తలు చెప్పడమే కాదు కొన్ని రోజులు నా ఫోను తీసేసుకున్నారు. మొదటినుంచీ నాకు స్నేహితులతో సరదాగా బయటకు వెళ్లడం ఇష్టం. కానీ వీడియో వైరల్ అయ్యాక ఆ సాహసం చేయలేకపోయా.



నా వీడియోను చూసిన అప్పటి నటుడు రిషీకపూర్ ట్విట్టర్‌లో నా గురించి రాస్తూ 'ఆమెకు పెద్ద స్టార్‌డమ్ వస్తుంది. అభినయం కవ్వించేట్టుగా ఉన్నా... ముఖం అమాయకంగానే ఉంది అంటూనే... నా సమయంలో ఎందుకు రాలేదు...' అంటూ ట్వీట్ చేశారు. ప్రిన్స్ ఆఫ్ రొమాన్స్‌గా పేరు తెచ్చుకున్న రిషీకపూర్‌గారి మాటలు నాకు చాలా ఆనందం కలిగించాయి.

● మలయాళం మాత్రమే కాదు, తెలుగు, తమిళం, బాలీవుడ్ నుంచి సినిమా అవకాశాలు వచ్చాయి. తెలుగులో అయితే అల్లు అర్జున్‌తో చేసే అవకాశం వచ్చింది. అయితే మొదటి సినిమాకి చేయాల్సింది ఇంకా ఉండటంతో బాధపడుతూ తిరస్కరించా. తెలుగులో నన్ను మొదట గుర్తించింది అల్లు అర్జునే. ట్వీట్ చేసి, ఆ వీడియోను డబ్‌స్మాష్ చేయడం ఆనందం కలిగించింది.

● 'ఒరు...' పూర్తయ్యే సమయానికి శ్రీదేవి బంగ్లా అంగీకరించా. నాకు ఆ కథ నచ్చడం, థ్రిల్లింగ్‌గా ఉండడంతో ఓకే చెప్పా. చాలామంది అది శ్రీదేవి చరిత్ర అనుకుంటున్నారు కానీ.. కాదు. అందులో నా పాత్ర పేరు శ్రీదేవి అంతే.

● తీరిగ్గా ఉన్నప్పుడు స్నేహితులతో సరదాగా గడపడం, సినిమాలు చూడటం నాకు ఇష్టం.

● ఈ ఒక్క సినిమా అనే కాదు... మున్ముందు చేయబోయే వాటిల్లో నన్ను నేను పూర్తిస్థాయిలో నిరూపించుకోవాలనుకుంటున్నా. అందుకోసం ఇప్పటినుంచీ కసరత్తులు చేస్తున్నా. ఏ మాత్రం ఖాళీ దొరికినా తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, ఇంగ్లిష్ సినిమాలు చూస్తున్నా. తెలుగు కొద్దిగా అర్థమవుతుంది కానీ... మాట్లాడటం నేర్చుకోవాలి.

● ఇప్పుడిప్పుడే మరికొన్ని అవకాశాలు వస్తున్నాయి. స్క్రిప్ట్ విని నాన్నతో చర్చించినా చేయాలా వద్దా అనే నిర్ణయం మాత్రం నాదే.

● మొదటిసారి హైదరాబాద్ వచ్చా. నగరం అంతా తెలియదు కానీ... బిర్యానీ అయితే తిన్నా. రామోజీ ఫిలింసిటీ కూడా చూశా.

– హెచ్. శ్రీలక్ష్మి

కథానాయికల పారితోషికం...

కథానాయకుల వయసూ అడక్కూడదు. ఇదే సినీ సూత్రం!

యాభై దాటిన హీరోలూ.. కాలేజీకి వెళ్తూ పదహారేళ్ల నాయికలకు సైటు కొట్టేస్తుంటారు. బామ్మ 'పెళ్లి చేసుకోరా మనవడా' అని అడిగితే...

'అప్పుడే పెళ్లేంటి బామ్మా' అంటూ మెలికలు తిరిగిపోతుంటారు.

వయసు దాచేయడంలో హీరోలు... హీరోయిన్లతో పోటీపడుతుంటారు. అభిమానులకూ అదే నచ్చేస్తుంటుంది. తమ కథానాయకుడు యువకుడిగా మారిపోతూ ఉంటే ముచ్చటపడిపోతారు. అందుకే మన హీరోలు తలకు రంగేసుకుని, ముడతల్ని మేకప్‌తో కప్పేసి ఇప్పటికీ నవ మన్మథుల్లా వెండి తెరపై మెరిసిపోతుంటారు. అయితే ఇప్పుడు ఈ ట్రెండ్ మారింది. ఉన్న వయసుని ఇంకా పెంచేసుకోవడం కొత్త ఫార్ములాగా మారింది. తెలుగులో తెరకెక్కుతున్న కొన్ని చిత్రాల్లో కథానాయకులు తమ వయసుని మించిన పాత్రల్ని పోషిస్తున్నారు.

ఎక్కువ వయసే ముక్కువ

వృద్ధ పాత్రలపై అగ్రతారల మనసు



కమల్‌హాసన్

బాలకృష్ణ

రవితేజ

శర్వానంద్



సమంత

ద్విపాత్రాభినయం తెలుగు తెరకు కొత్తేం కాదు. తండ్రీ కొడుకుల్లా రెండు పాత్రల్లోనూ మెరిసి అభిమానుల్ని అలరించారు మన హీరోలు. చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేష్... వీళ్లంతా ఇలాంటి పాత్రల్లో సిద్ధహస్తులు. 'స్నేహం కోసం'లో చిరు, 'ఎదురులేని మనిషి'లో నాగార్జున, 'బొబ్బిలి సింహం'లో బాలకృష్ణ, 'సూర్యవంశం'లో వెంకటేష్.. ఎక్కువ వయసున్న పాత్రల్లో కనిపించారు. కమల్‌హాసన్ గురించైతే చెప్పనవసరం లేదు. తనో ప్రయోగశాల. ఒకే సినిమాలో రకరకాల పాత్రల్లో అలరించారు. ముప్ఫైలలో ఉన్నప్పుడే అరవై ఏళ్ల వయసున్న పాత్రలు పోషించేశారు. 'భారతీయుడు'లో ముసలి కమల్‌ని మర్చిపోలేం. అప్పట్లో కమల్‌కి వేసిన మేకప్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు. ఇప్పుడు మరోసారి 'భారతీయుడు 2'లో కమల్ అదే గెటప్పులో కనిపించబోతున్నారు. 'భారతీయుడు' వచ్చి 23 ఏళ్లవుతోంది. ఆ లెక్కన ఈసారి ఇంకాస్త ముసలి కమల్ దర్శనమివ్వడం ఖాయం. మరి ఈ పాత్ర కోసం కమల్ కొత్తగా ఏం చేస్తారా? అనే ఆసక్తి మొదలైంది. ఇప్పటికే మేకప్ కోసం విదేశీ నిపుణుల్ని రంగంలోకి దించారట. విక్రమ్, సూర్యలకు గెటప్పుల మీద మమకారం ఎక్కువ. అందుకే అప్పుడప్పుడూ వయసు మీరిన పాత్రల్లో కనిపించి భళా అనిపించారు. 'బాహుబలి'లో భళ్లాల దేవగా కనిపించిన రానా పాత్రలోనూ ముసలి ఛాయలుంటాయి.

ఇప్పుడు బాలకృష్ణ, రవితేజ, శర్వానంద్.. వీళ్లంతా వయసు మీరిన పాత్రలు పోషిస్తున్నారు. సమంత కూడా ఈ జాబితాలో చేరిపోయింది. నందమూరి బాలకృష్ణ 'ఎన్టీఆర్ - మహానాయకుడు'లో తన తండ్రిగా కనిపించబోతున్నారు. అంటే ఈ పాత్ర కోసం బాలయ్య తన వయసుని పెంచేసుకుంటున్నారన్నమాట. యువ కథానాయకుడు శర్వానంద్ కూడా అదే చేస్తున్నాడు. ప్రస్తుతం సుధీర్‌వర్మ దర్శకత్వంలో శర్వా నటిస్తున్నాడు. అందులో శర్వా రెండు పాత్రల్లో కనిపించబోతున్నాడు. అందులో ఓ పాత్ర వయసు ఇంచుమించు యాభై ఏళ్లట! ఈ పాత్రకు సంబంధించిన లుక్ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుందని చిత్రబృందం చెబుతోంది. ఆ లుక్‌ని త్వరలో విడుదల చేయబోతున్నారు. రవితేజ కూడా ఇదే బాట పట్టారు. ఆయన కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'డిస్కో రాజా'. ఇందులో రవితేజ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఓ పాత్రలో వృద్ధాప్య ఛాయలుంటాయట. ఆ పాత్రలో రవితేజ గెటప్ కొత్తగా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ కథానాయకులకు పోటీగా సమంత ఓ ప్రయోగం చేయబోతోంది. సమంత ప్రధాన పాత్ర ధారిగా నటిస్తున్న చిత్రం 'ఓ బేబీ'. హాలీవుడ్‌లో రూపొందిన 'మిస్ గ్రానీ'కి ఇది రీమేక్. ఓ బామ్మ.. పదహారేళ్ల మనవరాలి వయసుకి మారిపోవడమే ఈ కథలోని ప్రత్యేకత. పైకి అమ్మాయిలా కనిపించే బామ్మ చేసే వింతలూ విశేషాలూ ఈ సినిమాలో చూడొచ్చు.

కొత్త కథలు వస్తే పాత్రలూ కొత్తగా మారిపోతుంటాయి. పాత్రల్ని బట్టే లుక్ ఉంటుంది. మనవాళ్లు వైవిధ్యభరితమైన గెటప్పులలో దర్శనమిస్తున్నారంటే కొత్త కథలు వస్తున్నట్టే! తెలుగు సినిమాకి ఇంత కంటే కావల్సిందేముంది? ఈ ట్రెండ్‌ని ఇంకెంతమంది నటులు ముందుకు తీసుకెళ్తారో చూడాలి.

క్రిష్ చెప్పేది నిజమైతే నిరూపించాలి

- కంగనా రనౌత్



కంగనా రనౌత్ నటించిన 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'పై వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. 'మణికర్ణిక'కు సంబంధించి దర్శకుడు క్రిష్‌తో పాటు రచయిత అపూర్వ అస్రాని, నటి మిస్తీ చక్రవర్తి విమర్శలు చేసినా ఇప్పటి వరకూ నోరు విప్పని కంగన తాజాగా స్పందించింది. "వారందరూ నన్ను విమర్శిస్తూ కూర్చుంటే ప్రయోజనం ఉండదు. నేను ఎంతో కష్టపడి పరిశ్రమలో ఈ స్థాయికి వచ్చాను. అందువల్లే ఈరోజు సృజనాత్మకత స్వేచ్ఛ తీసుకుని ఓ సినిమా సన్నివేశాలను ఎడిట్ చేసి 'మణికర్ణిక' లాంటి మంచి చిత్రాన్ని రూపొందించే హోదాను పొందగలిగాను. వారి దురదృష్టానికి నన్ను నిందించడం కన్నా, నన్ను స్ఫూర్తిగా తీసుకొని వారు కూడా అంత శక్తిమంతంగా ఎదగడానికి కృషి చేస్తే మంచిద"ని సలహా ఇచ్చింది కంగన. క్రిష్‌తో పాటు తన పేరును కూడా దర్శకురాలిగా వేసుకోవడాన్ని క్రిష్ తప్పుపట్టడంపై స్పందిస్తూ "క్రిష్ నాపై అలా దాడి చేయడం తప్పు. ఒకవేళ క్రిష్ చెప్పేది నిజమైతే దాన్ని నిరూపించాలి. మీడియాతో మాట్లాడినంత మాత్రాన ఆయనకు ఉపయోగం లేదు. 'మణికర్ణిక'కు నేను దర్శకత్వం వహించాను. అది విడుదలై పోయింది. ఇప్పుడు దాని గురించి ఏమీ చేయలేం. నన్ను విమర్శిస్తున్న క్రిష్, అపూర్వ అస్రాని, మిస్తీ చక్రవర్తి, సోనుసూద్ కలిసి మరో సినిమా చేయాలి. ఆ విధంగానైనా వారు నాకు బదులిచ్చారని అనుకోవచ్చు. సినిమాలో కొందరి పాత్రలను తగ్గించానని, లేదా నేను కొన్ని సీన్లను ఎడిట్ చేశానని విమర్శించేవాళ్లకు నా సమాధానం ఏంటంటే కష్టపడి ఇప్పుడున్న స్థాయికి వచ్చాను.. నటిగా జాతీయ పురస్కారాలైనా, దర్శకురాలిగా ప్రశంసలైనా నేను సాధించాను తప్ప మా నాన్న నాకు ఇవ్వలేదు. మీరూ కష్టపడే ఆ స్థాయికి ఎదగండి. ఏడ్వడం వల్ల ఉపయోగం లేదు" అంది కంగన. క్రిష్ విమర్శలపై స్పందిస్తూ "క్రిష్ ఈ చిత్రాన్ని నా చేతుల్లో పెట్టి వెళ్లినప్పుడు ఓ దర్శకురాలిగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి నిర్ణయానికీ నాదే బాధ్యత అనుకొని ఈ సినిమాను పూర్తి చేశాను. నన్ను విమర్శించడం వల్లో, నన్ను చూసి అసూయపడటం వల్లో వారు ఏమీ పొందలేర"ని చెప్పింది కంగన.

పంచ్ డైలాగ్

ప్రేమించుకున్న వాళ్లందరూ పెళ్లి చేసుకోవాలని రూలేమీ లేదు. ఎక్కువ మంది చేసుకోలేదు. చేసుకోలేరు కూడా.

చిత్రం: బొబ్బిలిపులి – పంపినవారు: దిలీప్, మియాపూర్

మెయిల్ ఐడీ: cinema@eenadu.net



ఆదిత్, నిక్కీ తంబోలి

అతిగా ఆశపడితే అనర్థమే!

ఆదిత్, నిక్కీ తంబోలి జంటగా నటించిన చిత్రం 'చీకటి గదిలో చితక్కొట్టుడు'. పోసాని, తాగుబోతు రమేష్, రఘుబాబు, సత్యం రాజేష్ ఇతర ప్రధాన పాత్రధారులు. సంతోష్‌కుమార్ పి. జయకుమార్ దర్శకత్వం వహించారు. బ్లూ గోస్ట్ పిక్చర్స్ నిర్మించింది. శనివారం హైదరాబాద్‌లో ప్రచారచిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిత్ మాట్లాడుతూ "వినోదాత్మకంగా సాగే కామెడీ హారర్ సినిమా ఇది. ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలూ ఉంటాయి. ఇదివరకు నేను చేసిన హారర్ సినిమా 'ఎల్ 7' ఆదరణ పొందలేదు. ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుంద"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నేను దర్శకత్వం వహించిన 'ఐఏఎంకే' చిత్రం తమిళంలో విజయాన్ని సాధించింది. ఆ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేశాం. దెయ్యం నేపథ్యంగా సాగే దృశ్యాలు భయాన్ని కలిగిస్తూనే వినోదాన్ని పంచుతాయి. అందని దాని కోసం ఆశపడితే అనర్థాలే. ఈ కారణంగానే సమాజంలో అఘాయిత్యాలు, అకృత్యాలు జరుగుతున్నాయి. ఈ ధోరణిలో యువతరం నడవద్దు అనే విషయాన్ని వినోదాత్మకంగా తెరకెక్కించాం. ఈ సినిమా తప్పకుండా విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంద"న్నారు. ఈ చిత్రంలో నా పాత్ర ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటుందని చెప్పింది నిక్కీ తంబోలి. ఈ చిత్రానికి ఛాయాగ్రాహణం: బాలు, సంగీతం: బాలమురళి.

అప్పటి ముచ్చట!

అనుకోని అవకాశం



పద్మనాభం

హాస్య నటుడు పద్మనాభం 'రేఖా అండ్ మురళీ ఆర్ట్స్' నాటక సంస్థను స్థాపించి 'శాంతి నివాసం' నాటకాన్ని ప్రదర్శిస్తున్న రోజులవి. ఓ రోజు మద్రాసుకు వచ్చిన డ్రామా కాంట్రాక్టర్లకు సినిమా స్టూడియోలు చూపిస్తూ వాహినీలోకి అడుగు పెట్టారాయన. అదే సమయంలో అక్కడ 'వెలుగు నీడలు'లో ఏయన్నార్ మిత్రబృందం పాడే 'భలే భలే మంచి రోజులులే..' పాట చిత్రీకరణ జరుగుతోంది. అందులో నటిస్తున్న హాస్యనటుడు సారథి వరసగా టేకులు తినడంతో నిర్మాత దుక్కిపాటికి విసుగెత్తింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన పద్మనాభంని చూస్తూనే- 'నువ్విప్పుడు వేసుకున్న డ్రెస్ బాగుంది. వెంటనే మేకప్ చేయించుకో' అంటూ సారథి పాత్రలో పద్మనాభాన్ని తీసుకుని, 'కర్నూలు ఎక్కడ, కాకినాడ ఎక్కడ...' అంటూ ఆరంభమయ్యే సాకీని ఆయన మీద చిత్రించారు. అది ఆయనకు గుర్తింపును తీసుకొచ్చింది. చలనచిత్ర హాస్యనట జీవితానికి గట్టి పునాదులు వేసింది. – శ్రీవత్స


హాలీవుడ్ చిత్రాల అనుభూతి పొందుతారు



"నటన అనేది నా పూర్తిస్థాయి వ్యాపకం కాదు. కానీ సినిమా అంటే ప్రత్యేకమైన ప్రేమ. ఆ ప్రేమతోనే ప్రతిసారీ కొత్త రకమైన సినిమాలు చేస్తుంటా. నేనెక్కడ నటించినా నా తొలి ప్రాధాన్యం తెలుగుకే" అన్నారు సచిన్ జోషి. 'మౌనమేలనోయి', 'ఒరేయ్ పండు', 'నీ జతగా నేనుండాలి', 'వీడెవడు' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు. ఆయన నటించిన 'అమావాస్య' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీలోనూ 'అమావాస్'గా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సచిన్ జోషి శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

- "చేస్తే విభిన్నమైన సినిమానే చేయాలనుకొంటున్న దశలో దర్శకుడు భూషణ్ పటేల్ 'అమావాస్య' కథ వినిపించారు. నేను చేసిన చిత్రాలకి పూర్తి భిన్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కింది. హారర్ కథల్లోనూ ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. నా గత చిత్రం 'వీడెవడు?'తో ప్రేక్షకులకు కొత్తదనం పంచాను. అలాంటి చిత్రం తర్వాత 'అమావాస్య' చేయడం ఆనందంగా ఉంది".
- "ఇందులో నేను కరణ్ అనే ఓ యువకుడిగా కనిపిస్తా. పెళ్లికి సిద్ధమైన జంట ఓ బంగళాకి ఎందుకు వెళ్లింది? అక్కడ వారాంతం తర్వాత ఏం జరిగిందనేదే ఈ చిత్రం. నర్గీస్ ఫక్రీ ఇందులో కథానాయిక. ఆమె పాత్ర కూడా ప్రేక్షకుల్ని థ్రిల్‌కి గురిచేస్తుంది. హారర్ చిత్రాలనగానే హాలీవుడ్ సినిమాల్ని గుర్తు చేస్తుంటారు. ఆ సినిమాల్లో నాణ్యత ప్రేక్షకులకి నచ్చుతుంటుంది. అలాంటి అనుభూతిని పంచేలా ఈ చిత్రాన్ని రూపొందించారు దర్శకుడు భూషణ్ పటేల్. ఆయన హారర్ చిత్రాల స్పెషలిస్ట్. '1920', 'రాగిణి ఎమ్.ఎమ్.ఎస్2', 'ఎలోన్' తదితర విజయవంతమైన చిత్రాలు చేశారు. కథనంలో భాగంగా వచ్చే మలుపులు రక్తికట్టిస్తాయి".

సుకుమార్ శిష్యుడితో...



నాగశౌర్య

ప్రముఖ దర్శకుడు సుకుమార్ కొత్త ప్రతిభని ప్రోత్సహించడమే లక్ష్యంగా సుకుమార్ రైటింగ్స్ పేరుతో నిర్మాణ సంస్థని ప్రారంభించారు. ఆ సంస్థ నుంచి ఇప్పటికే పలువురు దర్శకుల్ని పరిచయం చేశారు. తన దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న కాశీ విశాల్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ శరత్ మరార్‌తో కలిసి ఓ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. అందులో నాగశౌర్య కథానాయకుడిగా నటించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తామని చిత్రబృందం తెలిపింది.

అవసరమైతే కోర్టుకు వెళతాం



వెంకట్, కె.టి.నాయక్

బెనర్జీ, వెంకట్, సుమా రంగనాథ్, ముమైత్‌ఖాన్, సంజీవ్‌కుమార్, అరుణ్ బచ్చన్, డి.ఎస్.రావు ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'దండుపాళ్యం 4'. కె.టి.నాయక్ దర్శకుడు. వెంకట్ నిర్మాత. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ "కన్నడ, తమిళ భాషల్లో తెరకెక్కించి తెలుగు, మలయాళ, హిందీ భాషల్లోకి అనువదించాం. ఈ నెల్లోనే విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. కానీ కర్ణాటక సెన్సారు బోర్డు నుంచి చిక్కులొచ్చాయి. అక్కడ సెన్సారు కమిటీ అధికారి ఏ కారణాలు చెప్పకుండానే సెన్సారుకి తిరస్కరించారు. సమాజానికి హాని కలిగించే అంశాలేవీ మా సినిమాలో లేవు. ఎవరినీ నమ్మొద్దనే సందేశంతో దర్శకుడు తెరకెక్కించారు. సెన్సార్ అభ్యంతరాల గురించి రివైజింగ్ కమిటీ, ట్రిబ్యునల్‌కి వెళతాం. అక్కడా న్యాయం జరగకపోతే కోర్టుకు వెళతామ"న్నారు. "ఈతరం ప్రేక్షకులకి నచ్చేలా వినోదాన్ని, సందేశాన్ని మేళవించి గత దండుపాళ్యం సినిమాలకి భిన్నంగా తెరకెక్కించామ"ని దర్శకుడు తెలిపారు. "ఏ భారతీయ సినిమా ఇలా సెన్సారు తిరస్కరణకి గురయిన దాఖలాలు లేవ"ని ఫిలిమ్ ఛాంబర్ కార్యదర్శి ముత్యాల రాందాసు చెప్పారు.

రకుల్ @ ఏరియల్ యోగా



రకుల్‌ప్రీత్ సింగ్‌కు అత్యంత ఇష్టమైంది ఏంటంటే బహుశా ఫిట్‌నెస్ అనే సమాధానమే రావొచ్చు. ఇక్కడ ఆమె చేస్తున్న యోగా విన్యాసాలు చూస్తుంటే ఆ మాట ఎలా కాదనగలం. తను నటించబోయే తదుపరి బాలీవుడ్ చిత్రంలో యాక్షన్ సన్నివేశాల మోతాదు ఎక్కువగా ఉంటుందట. అందులో రకుల్ వాటా ఎక్కువగానే ఉండటంతో దేహదారుఢ్యంపై మరింత దృష్టి పెట్టింది. అందుకే ఇలా ఏరియల్ యోగా సాధనలో మునిగి తేలుతోంది. "ఏరియల్ యోగా చాలా ఛాలెంజింగ్‌గా ఉంది. నాకు బాగా నచ్చింది. నేను ఎందుకోసం ఇంతలా కష్టపడుతున్నానో నా తర్వాత బాలీవుడ్ చిత్రం చూస్తే మీకే అర్థమవుతుంది"అని చెబుతోంది రకుల్. ఆమె ఏరియల్ యోగా చేస్తున్న ఫొటోలు అంతర్జాలంలో సందడి చేస్తున్నాయి. తను ఫిట్‌గా ఉంటే సరిపోదు, అందరూ ఉండాలనే ఉద్దేశంతో జిమ్‌లు కూడా నిర్వహిస్తోందామె.

పరిమళం వాడే ముందు!



ఈ రోజుల్లో చాలామంది పరిమళం వాడుతున్నారు కానీ... సందర్భాన్ని బట్టి ఎంచుకోవాలనే అవగాహన ఉండటంలేదు. అలాంటివారు ఈ విషయాలు తెలుసుకుని ఉండటం చాలా అవసరం.

ఆఫీసుకు వెళ్లేటప్పుడు వుడీ, పూలు, నిమ్మ ఆధారిత పరిమళం బాగుంటుంది. ఆహ్లాదంగానూ అనిపిస్తుంది. అయితే ఎండలో వెళ్లేటప్పుడు, ప్రయాణం చేయాల్సి వస్తే మాత్రం గాఢత తక్కువగా ఉన్నదే ఎంచుకోవాలి.



- ఏవయినా సమావేశాలు ఉన్నప్పుడు పరిమళానికి ప్రాధాన్యం ఇవ్వకపోవడమే మంచిది. ఎందుకంటే కొందరికి అవి పడక అలర్జీలు, ఇతర సమస్యలు బాధిస్తాయి. కాబట్టి అప్పుడు వద్దు. ప్రత్యామ్నాయంగా నిమ్మనూనె, లావెండర్, ఇతర ఎసెన్షియల్ నూనెలను చర్మంపై అక్కడక్కడా రాసుకుంటే సరిపోతుంది.
- కొందరు రోజంతా సువాసన రావాలని ఎక్కువ పరిమళం స్ప్రే చేసుకుంటారు. కానీ అలా ఎప్పుడూ చేయకూడదు. దాని వల్ల శ్వాస సంబంధ సమస్యలు వచ్చే ప్రమాదముంటుంది. చర్మానికీ మంచిది కాదు. కాబట్టి గాఢత తక్కువ ఉన్న పరిమళాలను ఎంచుకుని ఐదారు గంటలకోసారి కొద్దిగా స్ప్రే చేసుకుంటే చాలు.
- పరిమళం వాడే ముందు దాని గడువు తేదీని కూడా గమనించుకోవాలి. గడువు దాటిన వాటిని వాడటం సరికాదు. దద్దుర్లు, దురద వచ్చే ప్రమాదం ఉంటుంది.
- పరిమళం ప్రభావం చర్మం మీద పడకుండా ఉండాలంటే ముందుగా పెట్రోలియం జెల్లీ రాసుకోవాలి. సాధ్యమైనంత వరకూ చర్మంపై పడకుండా చూసుకోవాలి. అలానే అలంకరణ అంతా పూర్తయ్యాకే ధరించాలి. కానీ నగలు మాత్రం పరిమళం వేసుకున్నాకే పెట్టుకోవాలి. లేదంటే వాటి మెరుపు తగ్గే ప్రమాదం ఉంటుంది.

ఉదర సమస్యలకు పవనముక్తాసనం



మనలో చాలామంది గ్యాసు, ఎడిసిటీ వంటి సమస్యలతో బాధపడుతుంటారు. వాటికి మాత్రలు వేసుకోవడం కన్నా... పవన ముక్తాసనాన్ని ప్రయత్నించి చూడండి.

ఎలా వేయాలంటే: మొదట యోగా మ్యాట్‌పై వెల్లకిలా పడుకోవాలి. ఇప్పుడు రెండు కాళ్లు ఎత్తి మోకాళ్ల దగ్గర మడిచి పొట్టకు ఆనించాలి. చేతుల్ని కాళ్ల చుట్టూ తిప్పి పొట్టకు ఆనేలా వీలైనంత నొక్కి పెట్టాలి. ఇలా ముప్పై సెకన్ల వరకు ఉండాలి. శ్వాస సామాన్యంగా తీసుకోవాలి. రెండు మూడు నిమిషాల వరకూ ఉండగలిగితే మంచిది.

జాగ్రత్తలు: రెండు కాళ్లతో చేయలేనివారు ఒక్కో కాలితో చేయొచ్చు. నడుమునొప్పి విపరీతంగా ఉంటే చేయకూడదు. నెలసరి సమయంలో కూడా ఈ ఆసనం వేయకూడదు.

లాభాలు: పొట్టకు సంబంధించిన అన్ని సమస్యలు తగ్గుతాయి. గ్యాసు, ఎసిడిటీ తగ్గడమే కాకుండా పొట్ట దగ్గర పేరుకొన్న కొవ్వు కూడా తగ్గుతుంది. నడుము నొప్పి, సయాటికా, గర్భాశయ సంబంధ సమస్యలు, హృద్రోగాలకు ఇది మంచి ఆసనం.

ఈ ఆసనంతోపాటు పొట్ట తగ్గడానికి ఈ చిట్కాలు పాటించి చూడండి.

- ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగాలి.
- ఒకేసారి ఎక్కువ ఆహారం తీసుకోకూడదు. అలాగే ఆహారాన్ని బాగా నమిలి తినాలి. భోజనం చేస్తున్న సమయంలో నీళ్లు తాగకూడదు.
- వేపుళ్లకు దూరంగా ఉండాలి. టీ, కాఫీ వీలైనంత వరకూ తగ్గించాలి.
- ఒకేరకమైన వంట నూనెలు కాకుండా మార్చాలి.
- పొట్టలో సమస్య ఎక్కువగా ఉన్నప్పుడు రాత్రి పడుకునే సమయంలో శుద్ధి చూర్ణం లేదా త్రిఫల చూర్ణం గోరువెచ్చటి నీటిలో కలిపి తాగితే... మంచి ఫలితం ఉంటుంది.



కృష్ణశ్రీ
యోగా నిపుణురాలు

విజయానికి ఐదు సూత్రాలు



కొందరు మహిళలు వృత్తిగత జీవితాన్నే కాదు, వ్యకిగతాన్ని, ఇతర బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వర్తిస్తారు. తక్కువ సమయంలోనే ఉన్నతస్థాయికీ చేరుకుంటారు. అదెలా సాధ్యం అంటే... వారు పాటించే కొన్ని నియమాలే కారణం అంటారు నిపుణులు. అవేంటంటే...

❖ **పరిస్థితులకు అనుకూలంగా...** ప్రపంచంలో ఏదీ స్థిరంగా ఉండదు. సమాజంలో జరిగే మార్పు మనలో అనేక ఒత్తిళ్లు, అడ్డంకులను తెచ్చిపెడుతుంది. సందర్భాన్ని మనకు అనుకూలంగా మలుచుకుంటూ ముందుకెళ్లడమే మనముందున్న సవాళ్లు. అప్పుడే విజయం మీ బానిస అవుతుందని చెబుతారు మహిళా విజేతలు.

❖ **ప్రశ్నించేతత్వం...** జీవితంలో విజయం సాధించిన చాలామంది మహిళలు తమ హక్కులను పోరాడి సాధించుకున్నవారే. అవసరమైతే ప్రశ్నించినవారే. ప్రతిఒక్కరూ అదే చేయాలంటారు వాళ్లు. కానీ కొందరు తమ సమస్యలను చెప్పడానికే సంకోచిస్తారు. ఆ సంకోచమే వద్దంటారు విజేతలు. మీకు ఏది కావాలో ఓ స్పష్టత ఉండాలి. దాన్ని సాధించేందుకు కష్టపడాలి. అవసరమైతే ప్రశ్నించాలి. లక్ష్యాన్ని చేరుకోవాలే తప్ప వెనకడుగు వేయకూడదని చెబుతారు.

❖ **సవాళ్లు ఎదురైనా...** ప్రపంచంలో తమదైన ముద్ర వేసిన అతివలు జీవితంలో అనేక రకాల సవాళ్లు ఎదుర్కొన్నవారే. అయినా అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగినవారే. జీవితంలో పైకి ఎదిగిన చాలామంది మహిళలు పాటించే సూత్రం ఇదే.

❖ **సామర్థ్యాలు గుర్తించడం...** తమకున్న సహజమైన నైపుణ్యాలను గుర్తించి వాటిని ఎలా ఉపయోగించాలో తెలిసిన వారు ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారు. అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటూ పరిస్థితులకనుగుణంగా రాటుతేలుతారు. ఇది కూడా విజయరహస్యమే.

❖ **ఓటములకు కుంగిపోవద్దు...** విజయం సాధించాలని ఉన్న ప్రతి ఒక్కరు ఎన్నో ఆటుపోట్లు, ఎదురుదెబ్బలు, ఓటములను ఎదుర్కోవాల్సి ఉంటుంది. విజేతలు వాటికి భయపడి నిరుత్సాహపడరు. ప్రయత్నించి పడిపోయిన ప్రతిసారి అందులోంచి పాఠాలు నేర్చుకుంటారు. లక్ష్యాన్ని చేరుకుంటారు.

వసుంధర

పదో తరగతితోనే చదువు ఆపేయాలనుకున్న ఆమె...
పీహెచ్‌డీ చేసే స్థాయికి చేరుకుంది.
ఇంటి పరిస్థితులతో... చిన్న ఉద్యోగం వస్తే చాలనుకున్న ఆమె...
ఏకంగా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించింది.
ఆర్థిక పరిస్థితులు అడుగడుగునా ఇబ్బంది పెడుతున్నా...
చదువే లక్ష్యంగా అడుగులు వేసింది.
చదువుల పటంలో ఒక్కో మెట్టు పైకెక్కేసింది.
తాజాగా ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి అర్హత సాధించింది.
ఆమే సింహరాజు సంధ్యారాణి.



జీవన సంధ్యారాగం

సంధ్యారాణిది జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని రాజారం. తల్లి నాగమణి. తండ్రి రాజమౌళి. ఆర్థిక పరిస్థితుల అంతంత మాత్రం కావడంతో తల్లిదండ్రులు మహారాష్ట్రలోని బివండికి వలస వెళ్లారు. అక్కడ తండ్రి టైలరింగ్ చేస్తే, తల్లి బీడీలు చుట్టేది. సంధ్యారాణి, ఆమె ఇద్దరు చెల్లెళ్లు, తమ్ముడు రాజారంలోనే ఉన్న అమ్మమ్మ వాళ్లింట్లో పెరిగారు. తల్లిదండ్రులు అప్పుడప్పుడూ వచ్చే వారంతే. సంధ్యారాణి పదో తరగతిలో ఉన్నప్పుడు... తండ్రికి మధుమేహం వల్ల మూత్రపిండాల సమస్య వచ్చింది. దీంతో వాళ్లు మహారాష్ట్ర నుంచి రాజారం వచ్చేశారు. అప్పటి నుంచి పిల్లల బాధ్యత తల్లే తీసుకుంది. 'అమ్మ రాత్రనకా పగలనకా కష్టపడుతూ మమ్మల్ని చదివించింది. ఓ వైపు నాన్నకు అనారోగ్యం. మరోవైపు మా చదువులు, అవసరాలు... ఇలా అన్నీ అమ్మే చూసుకునేది. మమ్మల్ని ఏమీ ఆలోచించొద్దని, కష్టపడి చదవమని మాత్రమే చెప్పేది. ఈ రోజు నేను విజయం సాధించడానికి కారణం ఒకవిధంగా మా అమ్మే...' అని అంటుంది సంధ్యారాణి.

చదువు మానేయాలనుకుంది....

తండ్రి ఆరోగ్య పరిస్థితి క్రమంగా విషమించడం మొదలుపెట్టింది. దాంతో మరిన్ని సమస్యలు ఎదురయ్యాయి. వచ్చిన ప్రతి రూపాయి ఆయన వైద్యానికే ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి. ఇంటికి సంధ్య పెద్దది కావడంతో తనవంతుగా ఏదయినా చేయాలనుకుంది. బాగా ఆలోచించి పదో తరగతి పూర్తి కాగానే చదువు ఆపేయాలని అనుకుంది. ఏ చిన్న పని దొరికినా అమ్మకు చేదోడువాదోడుగా ఉండొచ్చనేది సంధ్య తపన. పరీక్షలు పూర్తయ్యాయి. ఫలితాల గురించి కాకుండా ఏ పని దొరుకుతుందా అనే ధ్యాసలో ఉండేది. మార్కులు ఎన్నొచ్చినా సరే... పనిచేయడమే లక్ష్యం అనుకుంది. తీరా చూస్తే స్కూల్ సెకెండ్ ర్యాంకు. ఆమె చదువు ఆపేస్తోందని తెలిసిన ఇద్దరు టీచర్లు సంధ్య ఇంటికొచ్చారు. 'నువ్వు చదువు ఆపేస్తే ఎలా...? కొన్నాళ్లు కష్టపడితే జీవితంలో మంచి స్థాయిలో ఉంటావు. కావాల్సిన సాయం మేం చేస్తాం...' అని ప్రోత్సహించారు. అలా ధర్మపురిలోని శ్రీలక్ష్మి నరసింహా సంస్కృతాంధ్ర కళాశాలలో చేరింది సంధ్య. ఫీజు ఖర్చులు ఆ ఇద్దరు టీచర్లే భరించారు. అయితే ఆ కాలేజీ వేళలు సాయంత్రం. దాంతో పొద్దుటిపూట రాజారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యావలంటీర్‌గా చేరింది. మధ్యాహ్నం వరకూ అక్కడ పనిచేసి సాయంత్రం కాలేజీకి వెళ్లేది. ఇంటికొచ్చాక చదువుకునేది. కొన్నిసార్లు కాలేజీకి వెళ్లలేని పరిస్థితి. అప్పుడప్పుడూ చదువుపై ఆసక్తి కూడా తగ్గేది. అయినా వెనకడుగు వేయలేదు. 'నాపై నమ్మకంతో వాళ్లు డబ్బు కట్టారు. ఎలాగైనా పాసవ్వాలని కష్టపడేదాన్ని. విద్యావలంటీరుగా పనిచేసినందుకు వచ్చిన జీతాన్ని అమ్మకు ఇచ్చేసేదాన్ని. అలా డిగ్రీ పూర్తయ్యే వరకు ఈ పాఠశాలలోనే పని చేశా...' అని వివరించారు సంధ్య. అయితే అన్నీ అనుకున్నట్లుగా జరగవు కదా.. సంధ్య జీవితంలోనూ అదే జరిగింది. ఏమయ్యిందంటే...

పీజీలో చేరి...

సంధ్య డిగ్రీ మూడో సంవత్సరంలో ఉన్నప్పుడు తండ్రి చనిపోయారు. మరో ఏడాది అయితే నా చదువు పూర్తవుతుంది కానీ... ఇంటి పరిస్థితులు ఆమెను మళ్లీ చదువుపై ఆసక్తిని తగ్గించేలా చేశాయి. ఒకవేళ ఫెయిల్ అయితే గనుక ఇక చదవకూడదని అనుకుంది. ఉద్యోగం చేయాలనుకుంది. కానీ ఆమెతో పాటు పనిచేసే ప్రణీత, హేమ అనే ఇద్దరు టీచర్లు పరిస్థితి తెలిసి సంధ్యకు అండగా నిలబడ్డారు. అవసరమైన డబ్బు సాయం చేశారు. అలా వాళ్ల సాయంతో డిగ్రీ పూర్తి చేసింది. అదయ్యాక జగిత్యాలలోని కౌశల్య తెలుగు పండిత కళాశాలలో తెలుగు పండిత్ శిక్షణ కూడా తీసుకుంది. ఆ సమయంలో డీఎస్సీ రాద్దామని ఏడాదిపాటు దానికి సిద్ధమైనా స్నేహితులంతా పీజీలవైపు వెళ్లడంతో ఏడాది తరువాత ఆమె కూడా పీజీకి సిద్ధమైంది. అమ్మను ఒప్పించి కాకతీయ యూనివర్శిటీ నిర్వహించిన పీజీ తెలుగు ప్రవేశ పరీక్ష రాసి, కాలేజీలో చేరింది.

చెల్లి సాయం చేసేది...

ఇంటికి దూరంగా వరంగల్‌లోని కేయూలో పీజీ చేయడం సంధ్యకు సవాలే. అయినా సిద్ధమైంది. తల్లి, చెల్లి స్వాతి ఇంటికోసమే కాదు, సంధ్య ఆర్థిక అవసరాలు తీర్చేందుకు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. తల్లి బీడీలు చుడితే, చెల్లి మెషీన్ కుట్టి డబ్బు సంపాదించి సంధ్య ఖర్చులకోసం పంపించేది. ఇంటిమీద బెంగ ఉన్నా... రెండేళ్లు అలానే కష్టపడి పీజీ పూర్తి చేసింది. ఆ తరువాత కూడా చదువును వదిలేయలేదు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంఫిల్ ప్రవేశ పరీక్షకు సిద్ధమైంది. ప్రముఖ రచయిత నలిమెల భాస్కర్ రచించిన 'సుద్దముక్క' కవితా సంపుటిపై పరిశోధన చేసింది. ఎంఫిల్ చేస్తున్న సమయంలోనే నెట్/జేఆర్ఎఫ్ కూడా సాధించా. అప్పటి నుంచి రూ.25 వేలు ఫెలోషిప్‌గా వచ్చేవి. అలా సెంట్రల్ యూనివర్శిటీలో ఉండి... చదువుకుంది. అయితే కొన్ని ఖర్చులు తగ్గించుకుని తనకు వచ్చే ఫెలోషిప్‌లో ఎక్కువ భాగాన్ని ఇంటికే పంపేది. ఎంఫిల్ పూర్తయ్యాక ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేయకుండా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలోనూ అర్హత సాధించింది. ప్రస్తుతం గూడ అంజయ్య రచనలపై పరిశోధన చేస్తోందామె.

ఆరేడు గంటలు కష్టపడి...

పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో కూడా మంచి మార్కులు సాధించి మల్యాల మండలం తాటిపెల్లి గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా చేరింది. అయితే కిందటేడాది మే నెలలో గురుకుల బోర్డు నుంచి డిగ్రీ లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. దాన్ని ఎలాగైనా సాధించాలనుకుంది సంధ్య. అప్పటినుంచీ పీహెచ్‌డీని పార్ట్‌టైంగా మార్చుకుని ఆరేడు గంటలు కష్టపడి చదివి పరీక్షలు రాసింది. ఇప్పుడు ఉద్యోగం వచ్చింది. 62 తెలుగు లెక్చరర్ల పోస్టులు ఉంటే... 124 మందిని ఇంటర్వ్యూకి పిలిచారు. వడపోతల అనంతరం అరవైమందిని ఎంపిక చేస్తే అందులో సంధ్య కూడా ఉంది. 'ఇప్పుడు అంతా అమ్మతో మంచి కూతుర్ని కన్నావు అని అంటుంటే నాకే కాదు అమ్మకూ ఆనందంగా, గర్వంగా ఉంది. ఆ ఉద్యోగం వచ్చే వరకూ గురుకుల పాఠశాలలోనే చేస్తా...' అని చెబుతుంది సంధ్య.

పెళ్లయ్యాకే ఉద్యోగం...

పీహెచ్‌డీ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడే శ్రీధర్‌తో నా పెళ్లయ్యింది. మేమిద్దరం ఇంటర్ నుంచి క్లాస్‌మేట్స్. సాధారణంగా పెళ్లయితే ఆడవాళ్లకు చదువుమీద ఆసక్తి తగ్గుతుందని అంటారు. కానీ మా విషయంలో అలా జరగకూడదని అనుకున్నాం. అందుకే సవాలుగా తీసుకుని ఇద్దరం కష్టపడి చదువుకుని, ఉద్యోగాలు సాధించాం. మా వారు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆయన కూడా తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం తెచ్చుకున్నారు. మా సోషల్‌టీచర్ రాజేందర్‌సార్, తెలుగు మాష్టారు శంకర్ శర్మ సాయం ఎప్పటికీ మర్చిపోలేను.


-అక్కల మనోజ్

న జ రా నా

కళ్ల చుట్టూ నల్లని వలయాలు ఇబ్బంది పెడుతున్నాయా... విటమిన్ ఈ నూనెతో మర్దన చేసుకుని చూడండి.

బంగారం వెండి

2న ముగింపు-క్రితం



తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,194	3,186
వెండి (గ్రా)	43.80	43.80

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	34,440	34,400	33,800	-------	33,780	33,750	34,440	34,410	34,340	34,250
ఆర్నమెంట్	32,150	32,130	31,300	-------	31,220	31,210	31,930	31,860	31,940	31,860
వెండి(కిలో)	41,600	41,680	41,800	-------	41,500	41,400	41,700	41,700	41,500	41,500

పార్టీలకు ఎలా వెళ్లొచ్చు?



నేను ఉద్యోగిని. సంప్రదాయంగా ఉంటా. ఆఫీసుకు కూడా ప్రత్యేకంగా తయారై వెళ్లను. అయితే తరచూ బంధువులు, స్నేహితుల నుంచి ఏదో ఒక పార్టీకి ఆహ్వానాలు వస్తూనే ఉంటాయి. అలాంటి సందర్భాల్లో నేను ప్రత్యేకంగానే కాదు హుందాగానూ కనిపించాలనుకుంటున్నా. అందుకోసం ఎలా సిద్ధమవ్వాలి... ఏం చేయాలో చెప్పండి?

- లక్ష్మి, విజయవాడ

దుస్తులు ఒక్కటే కాదు మెడ డిజైన్లు, వస్త్రం వంటి వాటి గురించి కూడా మీరు ఆలోచించాలి. ముందుగా మెడ డిజైన్ల మీద దృష్టి పెట్టండి. బోట్‌నెక్, కాలర్‌నెక్, చైనీస్ కాలర్లు ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. మీరు ఇప్పటి వరకూ సంప్రదాయ దుస్తుల్నే ఎంచుకున్నారు కాబట్టి... ఈసారి ఈ ప్రయోగాలు చేసి చూడండి. అలానే త్రీ బై ఫోర్త్, ఫుల్‌హ్యాండ్స్ కూడా బాగుంటాయి. హుందాగానూ కనిపించేలా చేస్తాయి. చేనేత దుస్తులకు ఇప్పుడు ప్రాధాన్యం పెరిగింది. పోచంపల్లి, కలంకారీ మంగళగిరి వస్త్రాన్ని ఎంచుకొని టాప్స్ కుట్టించుకుని, వాటికి లెగ్గింగ్‌లు వేసుకోండి. అవసరం అనుకుంటే కాస్త భారీగా ఉన్న దుపట్టా వేసుకుంటే చాలు. అలానే కుర్తాల్లో కూడా ఇప్పుడు ట్రెండీ డిజైన్లు వస్తున్నాయి. మీరు ఎంచుకునే వస్త్రాన్ని బట్టి చిన్న చిన్న మార్పులతో వైవిధ్యంగా డిజైన్ చేయించుకోవచ్చు. కుర్తాలకు ముందు భాగంలో పోట్లీ బటన్లు పెట్టించుకుని... బోట్‌నెక్‌తో కుట్టించుకుంటే బాగుంటుంది. అదే సాయంత్రం పార్టీలకు వెళ్లేటప్పుడు పొడవాటి గౌన్లు సరైన ఎంపిక. వాటి మీదకు వెయిస్ట్ కోట్ వేసుకుంటే ఇంకా స్టైలిష్‌గా కనిపిస్తారు. ఈ వెయిస్ట్ కోట్‌లను కాటన్‌తో డిజైన్ చేయించుకుంటే రిచ్ లుక్ వస్తుంది. మీకు చీరలు ధరించే అలవాటు ఉంటే మాత్రం దానిపైకి లాంగ్ జాకెట్ వేసుకోవచ్చు. దాన్ని మామూలు బ్లవుజు మాదిరి ధరించొచ్చు లేదా చీరంతా కట్టుకున్నాక కూడా వేసుకోవచ్చు. ఈ జాకెట్‌ను పోచంపల్లి, కలంకారీతో డిజైన్ చేయించుకుంటే హుందాగా ఉంటుంది. అలానే దానిపైన పెట్టుకునే బెల్టు ట్రెండీ లుక్‌ని తెస్తుంది. అదే ప్రయాణాల సమయంలో అయితే మోకాళ్లవరకూ ఉండే ఓ కుర్తా, పలాజో సౌకర్యంగా అనిపిస్తుంది. అవి కాస్త వదులుగా ఉండేలా చూసుకుంటే ఫ్యాషన్‌తోపాటు సౌకర్యం కూడా.

డియర్ వసుంధర



నిహారికారెడ్డి
డిజైనర్

– మీ సందేహాలను, సమస్యల్ని vasufash@eenadu.net కు పంపించగలరు.



ఆహా!
.. ఏమి రుచి

అందని ద్రాక్ష పుల్లనంటాం. అయినా వండుకోవడం చేతనవ్వాలి కానీ పుల్లనయితే ఏంటట. అద్భుతమైన రుచిలోకి మార్చుకోమూ! ద్రాక్షని వండటమేంటని అనుమానం రావొచ్చు.. నిజమే ద్రాక్షపండ్లని అలానే తినడం వంట చేతకాని వాళ్లు చేసేపని. మనమలా కాదుగా దేనితో అయినా అద్భుతాలు చేసేయగలం. ద్రాక్షతోనూ పిల్లలకు, పెద్దలకు నచ్చేట్టుగా వంటకాలు చేసేద్దాం. డబుల్‌డోస్ పోషకాలని అందిపుచ్చుకుందాం...

ద్రాక్ష పండు ఇలా వండు

చికెన్ సలాడ్

కావాల్సినవి: బోన్‌లెస్ చికెన్- అరకిలో(చిన్న ముక్కలు), చికెన్ ఉడికించిన నీళ్లు- అరకప్పు, మొక్కజొన్నపిండి- చెంచా, పంచదార- చెంచా, వెనిగర్- చెంచా, చిల్లీ పేస్ట్- రెండు చెంచాలు, సోయాసాస్- రెండు చెంచాలు, నూనె- పెద్దచెంచా, వెల్లుల్లిరేకలు- ఆరు, సన్నగా తరిగిన అల్లంముక్కలు- మూడు చెంచాలు, ద్రాక్షపండ్లు- కప్పున్నర, ఉల్లికాడల తరుగు- మూడు చెంచాలు, కొత్తిమీర తరుగు- పావు కప్పు, కీరాదోసముక్కలు- అరకప్పు, ఉప్పు- తగినంత

తయారీ: ఒక పాత్రలో చికెన్ ఉడికించిననీళ్లు, సోయాసాస్, చిల్లీపేస్ట్, మొక్కజొన్నపిండి, కొద్దిగా నీళ్లు, వెనిగర్, పంచదార వేసి అన్నింటినీ కలిపి పక్కన పెట్టుకోవాలి. ఒక పాత్రలో నూనె పోసుకుని వేడి చేసుకోవాలి. ఇందులో అల్లం, వెల్లుల్లి పలుకులు వేసి వేగాక చికెన్ ముక్కలు వేసుకుని మూత పెట్టి ఉడికించుకోవాలి. ఆ తర్వాత ద్రాక్షపండ్లు, ఉల్లిపొరక, ఉప్పు వేసి మరికాసేపు వేయించుకోవాలి. ముందుగా తయారుచేసి పెట్టుకున్న సాస్‌మిక్చర్ వేసి సాస్ దగ్గరకు వచ్చేంతవరకూ ఉడికించుకోవాలి. దీన్ని వేడిగా ఉండగానే క్యాబేజీ ఆకుల్లో వడ్డించుకుని కొత్తిమీర, కీరదోసలతో అలంకరించుకోవాలి. చలిలో వేడివేడి చికెన్ సలాడ్ అదిరిపోతుంది.





చట్నీ:

కావాల్సినవి: ద్రాక్ష- కప్పు, కారం- అరచెంచా, పసుపు- పావుచెంచా, ఇంగువ- చిటికెడు, అప్పటికప్పుడు వేయించి పొడి చేసిన మెంతులపొడి- అరచెంచా, ఉప్పు- తగినంత, నువ్వుల నూనె, ఆవాలు- పోపు కోసం

తయారీ: నీళ్లతో కడిగి తడి లేకుండా ఆరబెట్టిన ద్రాక్షపండ్లని నిలువుగా కట్ చేసి, తగినంత ఉప్పు వేసి పక్కన పెట్టుకోవాలి. కడాయిలో నువ్వుల నూనె, ఆవాలతో తాలింపు వేసి పొయ్యి కట్టేయాలి. చల్లారాక ఇందులో ద్రాక్ష ముక్కలు, కారం, ఇంగువ, మెంతిపొడి వేసి బాగా కలుపుకోవాలి.

• • •

కావాల్సినవి: ద్రాక్ష- అరకప్పు, టూత్‌పిక్స్- తగినన్ని, కారామిల్ సాస్- పావుకప్పు, కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసిన పల్లీపొడి లేదా జీడిపప్పు పొడి- నాలుగు చెంచాలు, వాల్‌నట్ పొడి కూడా తీసుకోవచ్చు.

తయారీ: ద్రాక్షపండ్లకి టూత్‌పిక్‌లు గుచ్చి ఉంచాలి. వాటిని కారామిల్ సాస్‌లో సగం వరకు ముంచి ఆ వెంటనే వాల్‌నట్ లేదా పల్లీపొడిలో అద్ది బేకింగ్‌షీట్‌పై ఉంచాలి. వీటిని రిఫ్రిజిరేటర్‌లో ఉంచి పిల్లలకు ఇస్తే ఇష్టంగా తింటారు.

కారామిల్‌తో...



మధుర

కావాల్సినవి: అనాస ముక్కలు- కప్పు, అరటిపండు ముక్కలు- కప్పు, నల్ల ద్రాక్షలు- పది, పసుపు- చెంచా, కారం- పావుచెంచా, పెరుగు- రెండు చెంచాలు, పంచదార- చెంచా, కొబ్బరికోరు- అరకప్పు, పచ్చిమిర్చి- రెండు, తాలింపుకోసం: నూనె- మూడుచెంచాలు, ఆవాలు- కొద్దిగా, ఎండుమిర్చి- నాలుగు, కరివేపాకు- కొద్దిగా

తయారీ: నాన్‌స్టిక్ పాన్‌లో ముందుగా అనాసముక్కలని పసుపు, కారం, ఉప్పు, మూడుచెంచాలు నీళ్లు వేసి ఉడికించుకోవాలి. సగం ఉడికిన తర్వాత అప్పుడు అరటిపండు ముక్కలు, ద్రాక్షపండ్లని కలుపుకోవాలి. మొత్తం నీరు పోయేంతవరకూ ఉడికించిపెట్టుకోవాలి. కొబ్బరి, పచ్చిమిర్చి గ్రైండర్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ రుబ్బుని ఇందాక ఉడికించి పెట్టుకున్న పండ్ల మిశ్రమంతో కలుపుకుని దగ్గరకు వచ్చేంతవరకూ ఉడికించుకుని పంచదార కలుపుకోవాలి. చివరిగా పెరుగు కూడా కలిపి ఉప్పు సరిచూసుకోవాలి. చివరిగా ఎండుమిర్చి, ఆవాలు, కరివేపాకుతో తాలింపు పెట్టుకుని మిశ్రమానికి కలుపుకోవాలి. అన్నంలోకి బాగుంటుంది.



చాక్లెట్ కవర్స్

కావాల్సినవి: ద్రాక్షపండ్లు- కప్పు, వైట్ చాక్లెట్ చిప్స్- పావుకప్పు, బ్లాక్ చాక్లెట్ చిప్స్- పావుకప్పు

తయారీ: ద్రాక్షపండ్లని శుభ్రంచేసి గంటపాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచుకోవాలి. ఇప్పుడు ఒక పాత్రలో నీళ్లు నింపి అవి మరుగుతున్నప్పుడు మరొక పాత్రలో చాక్లెట్ చిప్స్‌ని(బ్లాక్, వైట్ చిప్స్‌ని విడివిడిగా)ఉంచి వేడి చేసుకోవాలి. చిప్స్ కరిగి మెత్తగా పాకంలా అయిన తర్వాత వాటిల్లో ద్రాక్షపండ్లని ఒక్కోదాన్ని టూత్‌పిక్‌తో గుచ్చి బేకింగ్ షీట్‌పై ఉంచాలి. తెల్ల చాక్లెట్‌లో ముంచిన ద్రాక్షపండ్లపై నల్లని చాక్లెట్ మిశ్రమంతో అలంకరించుకుంటే చూడ్డానికి బాగుంటుంది. వీటిని ఫ్రిజ్‌లో ఉంచి చల్లబడిన తర్వాత పిల్లలకు అందిస్తే ఇష్టంగా తింటారు. పోషకాలూ, రుచీ రెండూ ఉండే ఆహారం. వీటిని టూత్‌పిక్ పుల్లకి వరుసగా గుచ్చుకుని దానిపై షుగర్ చిప్స్‌ని కూడా వేసుకోవచ్చు.



నల్లద్రాక్ష ఆస్తమా నుంచి ఉపశమనం అందించడం తోపాటు దంతక్షయం రాకుండా చూస్తుంది.

ద్రాక్షలోని లూటిన్, జియాంతిన్, రెస్‌వెరట్రాల్ వంటి పాలిఫినాల్స్ కంటి సమస్యలు రాకుండా చేస్తాయి.

ద్రాక్షలోని రెస్‌వెరట్రాల్ అనే పాలీఫినాల్ మెదడుని చురుగ్గా ఉంచి అల్జీమర్స్ బారిన పడకుండా చేస్తుంది.

కొత్త రుచి!

లవంగీ కూర



కావాల్సినవి: లవంగీలు- 150గ్రా, కొబ్బరికోరు- 100గ్రా, ఎండుమిర్చి- మూడు, ధనియాలు- చెంచాన్నర, మినపప్పు- అరచెంచా, చింతపండు గుజ్జు- అరచెంచా, పచ్చిమిర్చి- నాలుగు, ఆవాలు, మెంతులు కలిపి- పావుచెంచా కన్నా తక్కువ, నూనె- పెద్దచెంచా, బంగాళాదుంప ముక్కలు- అరకప్పు, ఉల్లిపాయముక్కలు- పావుకప్పు, అల్లం- చిన్నముక్క, ఉప్పు- తగినంత, పసుపు- కొద్దిగా

తయారీ: పాన్‌లో కొద్దిగా నూనె వేసి మినపప్పు, ఎండుమిర్చి, ధనియాలు వేసి దోరగా వేయించుకోవాలి. మిక్సీలో కొబ్బరితోపాటు వీటినీ వేసి తక్కువ నీళ్లతో చక్కగా గ్రైండ్ చేసుకోవాలి. లవంగీలను నిలువుగా కట్ చేసి నీటిలో వేసుకోవాలి. కడాయి వేడిచేసుకుని అందులో నూనె వేసుకుని ఆవాలు, మెంతులు వేసి వేగిన తర్వాత ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, లవంగీలు, బంగాళాదుంప ముక్కలు, పసుపు, ఉప్పు వేసి వేయించుకోవాలి. అవి మెత్తబడిన తర్వాత రుబ్బిన కొబ్బరి మిశ్రమాన్ని వేసి, కాసిని నీళ్లు, చింతపండు గుజ్జు చేర్చుకోవాలి. ఉడికిన తర్వాత దించుకోవాలి.



● చూడ్డానికి పెద్దపెద్ద లవంగ మొగ్గల్లా ఉండే ఈ కాయగూరలని తెలుగులో లవంగీలు అంటారు. పాదు మాదిరిగా పాకుతుంది. ఇంగ్లిష్‌లో క్లోవ్‌బీన్స్ అంటారు.

మీకూ ఇటువంటి కొత్తరకం కాయగూరల గురించి కానీ, వంటకాల గురించి కానీ తెలిస్తే మాకు పంపొచ్చు.

పొరుగింటి పుల్లకూర!

తింటే వారణాసిలోనే తినాలి!


వారణాసి మనకు ఆధ్యాత్మిక కేంద్రంగానే తెలుసు! ఆహార ప్రియులకు తెలిసిన కోణం వేరు. వాళ్లు మాత్రం వారణాసి పేరుచెబితే జన్మలో మరిచిపోలేని అద్భుతమైన ఫలహార రుచులే గుర్తుకొస్తాయంటారు. ఏ వీధిలోకి వెళ్లినా నేతి ఘుమఘుమలు, చిక్కని మీగడ తరకలే విందులు చేస్తాయి మరి..

పవిత్ర వారణాసిలో అడుగుపెడుతూనే మునుపెన్నడూ మనం రుచి చూడని అల్పాహార రుచులు తమ ఘుమఘుమలతో స్వాగతం పలుకుతాయి. తెల్లారుతూనే ఆ చిక్కని టీ గొంతులోకి జారుతూ ఉంటే.. ఆహా! ఆరుచిని మరిపించాలంటే మళ్లీ వారణాసి వచ్చి టీ తాగాల్సిందే అంటారు ఆ టీ రుచిని ఆస్వాదించిన వాళ్లు. ఎందుకంత రుచీ అంటే... మనలా నీళ్లపాలతో కాచిన టీ కాదది మరి. చిక్కని మీగడపాలతో మట్టిముంతలో పాలనురుగతో విందులు చేస్తూ తాగాలా... తినాలా అనిపించేలాంటి





టీ అది. అందుకే ఆ రుచిని మరిపోలేం. చూరా మటర్.. ఇది వారణాసి ప్రత్యేకం. అటుకులు, తాజా పచ్చి బఠానీలు, నెయ్యి, డ్రైఫ్రూట్స్, నిమ్మరసం వేసి చేసే ప్రత్యేకమైన వంటకం ఇది. అది తిన్న తర్వాత మరింకేదో కొత్తరుచి గురించి తెలుసుకుని తీరాలనే తపన మొదలవ్వడం పక్కా. సరిగ్గా అప్పుడే మీకోసమే అన్నట్టుగా కరకరలాడే కచోరీలు, రబ్డీలో ముంచి తీసిన వేడి జిలేబీలు నోరూరిస్తూ కనిపిస్తాయి. ఇక భోజ్‌పూరీలో మాట్లాడే బిహారీలు తాము తయారుచేసిన బట్టీచోకాలని తిననీయకుండా మనల్ని అక్కడ నుంచి కదలనీయరనుకోండి. ఇంతేనా అని పొరపాటున అనుకుంటే చనాదహీ వడా, కలాకండ్, లవంగలత, పరవాల్ మిఠాయి, సంకట్‌మోచన్ హనుమాన్ గుడిలోని లడ్డూలు మన మీదికి దాడిచేసినంత పనిచేస్తాయి. ఏంతిన్నా చివరికి వారణాసి పాన్ తినకపోతే వారణాసి వెళ్లిన ఫలితం లేకపోయిందే అని బాధపడతారు చూస్కోండి.



అస్త్రం

తాజా బటర్ కోసం...

అప్పటికప్పుడు తాజా బటర్, అది కూడా వివిధ రకాల ఫేవర్లలో దొరకడం కష్టమే! పిల్లలకేమో బ్రెడ్‌లోకి హనీ బటర్ కావాలి, మరో వంటకం చేయడానికి సాల్టెడ్ బటర్ కావాలి. కానీ ఇన్ని ఫ్లేవర్లు ఎక్కడ కొని పెడతాం. అలా కాకుండా తాజా బటర్ అప్పటికప్పుడు చేసుకోవాలని ఉంటే





బటర్ కప్ పరికరం మీ ఇంట్లో ఉంటే సరి. మీరు చేయాల్సిందల్లా కాసిని చిక్కని పాలు తీసుకోవడమే. ఈ పరికరంలో పాలు పోసి షేక్ చేస్తే చాలు. మజ్జిగ, వెన్న సులభంగా వేరవుతాయి. పైనున్న మూతతీసి మజ్జిగను వంపేస్తే, పరికరం అడుగుభాగానికి బటర్ చేరుతుంది. దీనిలో మీకు నచ్చినట్టుగా హెర్బల్స్, లేదా తేనె వంటివి కలిపితే నచ్చిన బటర్ ఫ్లేవర్ సిద్ధం.

లగ్గం ఖర్చుకు పగ్గం వేద్దాం



ఆదిత్య కిరణం

పెళ్లి ఇప్పుడు ఆర్భాటపు వ్యవహారం. ఆహ్లాదంగా జరగాల్సిన వేడుక సిరిసంపదల ప్రదర్శనకు వేదిక. అన్యోన్యతను పెంచే ఆప్యాయతల కన్నా ఆడంబరాలదే పైచేయి. కలవారిని అనుకరిస్తూ మధ్యతరగతి కష్టాలను కొనితెచ్చుకొంటోంది. నిశ్చితార్థం, పెళ్లి, రిసెప్షన్... ముగిసేసరికి ఆర్థికభారం వెక్కిరిస్తోంది. ఇక విందు గురించి చెప్పక్కర్లేదు. జానెడు పొట్టకు దేన్నితినాలో... దేన్ని వదలాలో తెల్చుకోలేనంతగా వంటకాల్ని వడ్డించేస్తున్నారు. ఇతరుల్ని అనుకరిస్తూ మూసలో పడి కొట్టుకుపోతున్నారు. పెరిగిపోతున్న పెళ్లి ఖర్చుపై ఒకసారి స్థిమితంగా ఆలోచిస్తే చాలు... కుటుంబాలు అప్పులపాలు కావు. అప్పుడు వివాహం చేసుకున్నవారికీ, చేసినవారికీ కూడా మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగి రిటైరయ్యేదాకా పనిచేస్తే.. వచ్చిన ప్రావిడెంట్ ఫండ్ మొత్తం రూ.10 లక్షలు. అతడు తన కుమారుడి పెళ్లి రిసెప్షన్ కోసం ఫంక్షన్ హాల్ అద్దె, అలంకరణల కింద చెల్లించిన మొత్తం రూ.10 లక్షలు!!'. ఇక పెళ్లి ఖర్చు ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోండి.

అతనో చిరుద్యోగి. చదువుకునే రోజుల నుంచి స్నేహితులు చాలా మంది ఉన్నారు. వారందరినీ కలపడానికి తన కుమార్తె వివాహాన్ని ఓ వేదికగా చేద్దామనుకున్నాడు. చేతిలో డబ్బు లేకున్నా ఆడంబరాలకు పోయాడు. ప్రస్తుతం అతనికి మిగిలిన అప్పు రూ.25 లక్షలు

ఆయనో సంపన్నుడు. తన కుమార్తె వివాహాన్ని దాదాపు 5 రోజుల పాటు వేడుకగా చేశాడు. అతిథులు ఔరా! అనుకునేలా రోజుకో రకంగా అలంకరణలు, భోజన ఏర్పాట్లు చేశాడు. కుమార్తెకు కొన్న నగలు, దుస్తుల్ని చూసి ముక్కున వేలేసుకోవాల్సిందే. పెళ్లికి ఎన్నికోట్లు ఖర్చయిందో ఆయనకే ఎరుక!



నాడు.. ఇంత ఖర్చేదీ?


ఒకప్పుడు పెళ్లంటే బంధుమిత్రులంతా కలిసి పండుగలా చేసుకునేవారు. పెళ్లిలో ఖర్చుల కంటే కూడా.. ఆత్మీయతలు, అనుబంధాల హడావుడే ఎక్కువగా కనిపించేది. ఇంటి వద్దో, గుడిలోనో పెళ్లిచేసేవారు కాబట్టి.. ఫంక్షన్ హాళ్ల ఖర్చులుండేవి కాదు. పెళ్లి కుదర్చడం దగ్గర్నుంచి.. వధువును అత్తారింటికి సాగనంపేదాకా.. ప్రతి పనిలోనూ బంధుమిత్రుల భాగస్వామ్యం ఉండి తీరాల్సిందే. పెళ్లి పనులు చేయడానికి పిలవకపోతే నొచ్చుకునే రోజులు. పిలిస్తే.. ఇంటిల్లిపాదీ వెళ్లి.. అన్నీ తామై పనిచేసే అభిమానం. కొబ్బరి మట్టలతో, మావిడాకుల తోరణాలతో పెళ్లి మంటపాన్ని అలంకరించేవారు. వచ్చిన చుట్టాలకు తమ ఇళ్లలోనూ విడిది ఏర్పాటుచేసేవారు. కొసరి కొసరి వడ్డించినా.. విస్తళ్లలో వృథాగా వదిలిపెట్టడానికి ఆస్కారం ఇచ్చేవారు కాదు. ఎవరో ధనవంతులైతే తప్ప... మిగతావారు పెళ్లిపై ఎక్కువగా ఖర్చుపెట్టేవారు కాదు. గొప్పలన్నీ ఆత్మీయతలు, అనురాగాల్లో కనిపించేవి.

నేడు.. అంతటా ఖర్చే


మెహందీ, సంగీత్, విదేశీ పూల అలంకరణలు, ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ షూట్‌లు, సెలబ్రిటీలతో ప్రత్యేక కార్యక్రమాలు, ఆర్కెస్ట్రా/డీజే శబ్దాలు, పూలవర్షాలు, డ్రోన్‌లతో చిత్రీకరణలు, బ్రైడల్ మేకప్‌లు, బౌన్సర్ల హడావుడులు... ఒక్కటేమిటి ఆధునిక పెళ్లిళ్లలో అన్నీ ఉంటున్నాయి. అన్నీ ఖర్చుతో కూడుకున్నవే.

ఖర్చులు తగ్గించుకోండి ఇలా..


కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పెళ్లి ఖర్చుల్ని తగ్గించుకోవచ్చని 'డోలీ సాజాకే రఖ్‌నా' సహవ్యవస్థాపకురాలు రాగినీ శ్రీవాస్తవ, బ్యాండ్ బాజా.కామ్ సీఈఓ సచిన్ సింఘాల్ తదితర వెడ్డింగ్ ప్లానర్లు సూచిస్తున్నారు. ఈ సూచనలు అన్నివేళలా, అందరికీ నచ్చకపోయినా.. కొన్నయినా ఉపయోగపడతాయని వారు అంటున్నారు.



- ఇతరుల్ని పెళ్లి ఖర్చుల్ని చూసి వారిని అనుకరించొద్దు. మీ ఆర్థిక స్థోమతను బట్టి ప్లాన్ చేసుకోండి.
- నగరం/పట్టణం నడిబొడ్డున కాకుండా.. ఊరి శివార్లలో పెళ్లి మంటపాల్ని బుక్‌చేసుకుంటే ఖర్చులు తగ్గుతాయి.
- హోటళ్లు, రిసార్టుల్లో కాకుండా.. బహిరంగ ప్రదేశాల్లో, ఒక మోస్తరు ఫంక్షన్ హాళ్లలో పెళ్లి పెట్టుకుంటే.. పన్నుల తలనొప్పి ఉండదు.
- ముహూర్తాల సమస్య లేకపోతే...ఆఫ్‌సీజన్‌లో పెళ్లిపెట్టుకుంటే ఫంక్షన్ హాళ్లు కాస్తంత చౌకగా దొరుకుతాయి.
- పెళ్లిని వారాంతంలో కాకుండా వారం మధ్యలో పెట్టుకుంటే ఖర్చులకు కొంత కళ్లెం వేయొచ్చు.



- ఖరీదైన పెళ్లి ఆహ్వాన పత్రికలు కాకుండా.. సంప్రదాయ ఆహ్వాన పత్రికలవైపు మొగ్గండి. లేదంటే ఓ డిజిటల్ వీడియోను తయారుచేయించి.. ఫేస్‌బుక్, వాట్సాప్‌ల ద్వారా పంపండి. సొంత వెడ్డింగ్ కార్డుల్ని డిజైన్ చేసుకునే కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లను వినియోగించుకోండి.
- ముఖ్యులు, ఆప్తులు, తప్పకుండా పిలవాల్సిన స్నేహితులు, బంధువుల్నే పెళ్లికి ఆహ్వానించండి. మొహమాటానికి ముఖపరిచయస్తుల్ని సైతం పిలిచి.. ఖర్చులు పెంచుకోకండి.



- అందర్నీ ఆకట్టుకునే మంచి వంటకాల్నే పరిమితంగా వండించండి. లెక్కకు మించి వండించడం వల్ల వృథా ఎక్కువ. ఖర్చూ పెరుగుతుంది.
- పెళ్లి తేదీ ఎలాగూ తెలుసుకాబట్టి.. చాలా ముందుగానే ఆఫ్‌సీజన్‌లో, డిస్కౌంట్లు ఎక్కువగా ఉన్నప్పుడు పెళ్లి దుస్తుల్ని కొనుక్కోండి.



- భోజన ఏర్పాట్లు, పువ్వులు, అలంకరణ, అద్దెలు, దుస్తులు, నగలు.. ఇలా ఏయే ఖర్చులుంటాయో ముందే లెక్కరాసుకోండి. ఖర్చు మరీ అదుపు తప్పుతుందని అనుకున్నప్పుడు మీరు రాసుకున్న జాబితాలో మొదటి, ద్వితీయ ప్రాధాన్యాల్ని ఎంచుకుని.. మూడో ప్రాధాన్యాన్ని పరిహరించడానికి ప్రయత్నించండి.
- టేబుళ్ల వద్ద కూర్చుని తినే భోజనాల కన్నా.. ఫ్యామిలీ తరహా బఫేల వైపు ఎక్కువగా మొగ్గుచూపండి.
- ఫొటోల పేరుతో భారీగా ఖర్చుచేయొద్దు.
- పెళ్లిళ్ల సందర్భంగా మద్యం సరఫరాను నివారించండి.




వామ్మో.. ఇంత ఖర్చా?

- ఒక సర్వే ప్రకారం.. ప్రస్తుతం దేశంలో పెళ్లిళ్లపై చేస్తున్న ఖర్చు ఏటా- రూ.లక్ష కోట్లు పైగానే!
- పెళ్లి ఖర్చులు ఏటేటా 25-30% దాకా పెరుగుతున్నాయి.
- సగటు భారతీయ వివాహ ఖర్చు తరగతులను బట్టి రూ.20 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకూ ఉంటోంది.
- దేశంలో ఒక వ్యక్తి తన జీవితకాలంలో సంపాదించిన మొత్తంలో ఐదో వంతును పిల్లల పెళ్లిపై ఖర్చుచేస్తున్నాడు.

పెళ్లి ఖర్చులు పెరగడానికి కారణాలు

- వ్యక్తుల ఆదాయాలు పెరగడం.
- పెళ్లి వేడుకల్ని 'ప్రత్యేకంగా' చాటుకోవాలనే ధోరణులు ఎక్కువకావడం.
- డబ్బూ, దర్పాన్ని ప్రదర్శించుకోవాలనుకునే మన స్తత్వం.
- చుట్టుపక్కల వారిని అనుకరించడానికి ప్రయత్నించడం.
- నానాటికీ పెరుగుతున్న ధరల ప్రభావం.




దేనిపై ఎంత ఖర్చు?

● పెళ్లి వేదిక: పెళ్లికయ్యే ఖర్చులో ఎక్కువభాగం ఫంక్షన్ హాలు/హోటల్‌పైనే వెచ్చించాల్సి వస్తోంది. కొందరు ఏసీ ఫంక్షన్ హాళ్లనూ బుక్‌చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒక మోస్తరు ఫంక్షన్ హాలుకు సగటున రూ.1-2 లక్షల అద్దె చెల్లించాల్సి వస్తోంది. సాధారణ హోటల్ బాల్‌రూమ్ అద్దె రూ.లక్ష దాకా ఉంటోంది.



● అలంకరణలు: వివాహ వేదికను స్వర్గంలా అలంకరించడం ఇప్పుడో ఫ్యాషన్. పూలు, సంప్రదాయ డిజైన్లు, శిల్పకళా చిత్రాలు, తోరణాలు, మిరిమిట్లు గొలిపే విద్యుద్దీపాలు, ఆకట్టుకునే కుర్చీలు.. ఇలా సుందర రమణీయంగా పెళ్లి మంటపాల్ని ముస్తాబు చేస్తున్నారు. ఒక్కొక్కరి అలంకరణ అభిరుచుల్ని బట్టి వేదిక డెకరేటర్లు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.



● భోజనాలు: మన పెళ్లిని బంధుమిత్రులు కలకాలం గుర్తుంచుకోవాలంటే భోజనాల్లో గొప్పలు కనిపించాల్సిందేనన్న ధోరణి ప్రబలిపోయి, లెక్కకుమించి వంటకాలు వండిస్తున్నారు. వాటిలో కొన్నింటిని అతిథులు రుచి కూడా చూడలేరు. ఏకంగా స్వీట్‌స్టాళ్లు, ఐస్‌క్రీమ్ పార్లర్‌లు, ఫ్రూట్‌స్టాళ్లు ఏర్పాటుచేయిస్తున్నారు. తెలుగురాష్ట్రాల్లో సాధారణ క్యాటరర్ ఒక ప్లేటుకు రూ.400 నుంచి రూ.800 దాకా వసూలుచేస్తే... పేరున్న క్యాటరర్, పెద్ద హోటల్ యజమాని రూ.1500 నుంచి రూ.2500 దాకా వసూలుచేస్తున్నాడు.



● డ్రెస్‌లు: జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేని సందర్భం కాబట్టి.. పెళ్లిరోజు ఎంతో భిన్నంగా కనిపించాలని, ఖరీదైన దుస్తులు ధరించాలని వధూవరులు, వారి తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. పెళ్లికూతురు ధరించే చీరలు రూ.5 వేలతో మొదలై రూ.2-3 లక్షల దాకా ఉంటున్నాయి. లెహెంగాలు రూ.50 వేల దాకా ఉంటున్నాయి. పెళ్లికొడుకు షేర్వాణీ సూటుకు రూ.30-50 వేల దాకా ఖర్చుచేస్తున్నారు. ఇక వధూవరుల కుటుంబీకులకు, సమీప బంధువులకు కొనే దుస్తుల ఖర్చు అదనం.

● వేడుకలు: మెహందీ, సంగీత్, నిశ్చితార్థం, రిసెప్షన్.. ఇలా రకరకాల పేర్లతో మూడు నాలుగు రోజులు పెళ్లి వేడుకలు నిర్వహించే సంప్రదాయం వేళ్లూనుకుంటోంది. కొన్ని కుటుంబాలు అంతకుమించీ చేస్తున్నాయి. ప్రతి వేడుకకూ ప్రత్యేక దుస్తులు, సెటప్‌లు, సామగ్రి అవసరమవుతాయి. డీజే, లైటింగ్, అలంకరణలు.. ఇవన్నీ తోడవుతున్నాయి. ఒక్కో వేడుకకు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చుచేస్తున్నారు.




● ఫొటోలు/వీడియోలు: సినిమా షూటింగ్‌ను తలపించేలా పెళ్లి వేదిక వద్ద ఫొటోగ్రఫీ/వీడియోగ్రఫీలు ఏర్పాటుచేస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్, పోస్ట్ వెడ్డింగ్ షూట్ పేరుతో వీడియోల్ని రూపొందిస్తున్నారు. ఇందుకోసం డ్రోన్‌లతో చిత్రీకరిస్తున్నారు. ఫొటోల అల్బంలలో దర్పం కనిపిస్తూ ఉంటుంది. ఫొటోలు, వీడియోల కోసం ఒక్కో కుటుంబం స్థాయిని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల దాకా ఖర్చుచేస్తున్నారు.



● నగలు: పెళ్లి కుమార్తె నగలు, పెళ్లి కుమారుడికి బంగారు గొలుసులు, ఉంగరాల కొనుగోలుకు ఒక్కో కుటుంబం స్థాయిని బట్టి భారీగానే వెచ్చిస్తున్నారు. పెళ్లి కుమార్తె నగల్ని కట్నం కింద ఇస్తున్నారు.



● ఇతర ఖర్చులు: వివాహ ఆహ్వాన పత్రికల ముద్రణ, బ్యాండు మేళం, ఆర్కెస్ట్రా/డీజేల ఏర్పాటు, రిటర్న్ గిఫ్ట్‌లు, అద్దె వాహనాలు, విడిది ఏర్పాట్లు, అతిథులకు ఆహ్వానం పలకడం, స్నాక్స్, జ్యూస్, నీళ్ల గ్లాసుల్ని అందివ్వడం కోసం అందమైన అమ్మాయిల నియామకం, ధనవంతుల పెళ్ళిల్లలో బౌన్సర్ల ఏర్పాటు, పెళ్లి తర్వాత వధూవరుల హనీమూన్.. ఇలా ఇతరత్రా ఖర్చులు చాలా ఎక్కువగానే ఉంటున్నాయి. ఖరీదైన పెళ్లి పత్రికల్ని ఒకర్ని మించి మరొకరు అచ్చువేయించి పంచుతున్నారు. ఆహ్వాన పత్రికల డిజిటల్ వీడియోల్నీ పంపుతున్నారు.



● డెస్టినేషన్ వెడ్డింగ్‌లు: సంపన్నులు సొంతూళ్లో కాకుండా.. గోవా, ఉదయ్‌పూర్, మారిషస్, శ్రీలంక, మాల్దీవులు, స్పెయిన్, ఇటలీ తదితర దూర ప్రాంతాల్లో పెళ్లిచేయడానికి(డెస్టినేషన్ వెడ్డింగ్) ఇష్టపడుతున్నారు. పెళ్లికి వచ్చేవారికి విమాన టిక్కెట్లు, అక్కడ హోటల్ రూంల బుకింగ్, అలంకరణలు, భోజనాలు, సరదాల కోసం చేసే ఖర్చులకు అంతూపొంతూ లేకుండా పోతోంది. ఒక్కో కుటుంబ ఆర్థిక స్థోమతను బట్టి ఖర్చు చేస్తున్నారు.

పెళ్లి ఖర్చు ఏ రాష్ట్రంలో ఎంత?



1 రాజస్థాన్

పెళ్లిళ్లపై అత్యధికంగా ఖర్చుచేసే రాష్ట్రాల్లో రాజస్థాన్ మొదటిస్థానంలో ఉంది. ఇక్కడ కనీసం మూడురోజులు పెళ్లిచేస్తారు. మధ్యతరగతి కుటుంబం సగటు ఖర్చు రూ.15-20 లక్షల దాకా ఉంటోంది. సంపన్నులైతే జైపూర్‌లో రూ.కోటి, ఉదయ్‌పూర్‌లో రూ.1.5 కోట్ల దాకా ఖర్చుచేస్తున్నారు.

గుజరాత్ 2

పెళ్లి ఖర్చులో రెండోస్థానం గుజరాత్‌దే. ఇక్కడ సగటు ఖర్చు రూ.14-18 లక్షల మధ్య ఉంటోంది. ఈ రాష్ట్రంలో నాలుగురోజుల పాటు పెళ్లి వేడుకలు నిర్వహిస్తారు. భోజనం, ఇతరత్రా ఏర్పాట్లపై ఎక్కువ ఖర్చు ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ 3

పెళ్లి ఖర్చులో రాజస్థాన్, గుజరాత్‌లకు తెలుగు రాష్ట్రాలేమీ తీసిపోని విధంగా తయారవుతున్నాయి. ఇక్కడ కొందరు ఐదురోజుల దాకా పెళ్లి వేడుకలు చేస్తారు. నగలు, దుస్తుల కొనుగోలు, రిటర్న్‌గిఫ్ట్‌లు, అలంకరణలు, భోజనాలపై ఎక్కువ ఖర్చుచేస్తారు. మధ్యతరగతి కుటుంబం సగటు ఖర్చు రూ.10-12 లక్షల మధ్య ఉంటోంది.

4 తమిళనాడు

తమిళనాడులో మూడు రోజులు పెళ్లి వేడుకలు నిర్వహిస్తారు. సగటు ఖర్చు రూ.10 లక్షల దాకా ఉంటోంది.

పంజాబ్ 5

ఈ రాష్ట్రంలో ఆహారం, అలంకరణలు, దుస్తులపై ఎక్కువగా ఖర్చుపెడతారు. సగటు ఖర్చు రూ.8-10 లక్షల మధ్య ఉంటోంది.

ఎందరు వస్తారో..!

పెళ్లికి పిలిచేటప్పుడు ఎందరు వస్తారో ముందే తెలుసుకోవడం మంచిది. దీనివల్ల ఎందరు వస్తారో అంచనావేసుకుని.. దానికి అనుగుణంగా వంటలు చేయడానికి వీలవుతుంది. ఇది మంచికేనని, వృథా తగ్గుతుందని అంటున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఓటరు నమోదుకు నేడు ప్రత్యేక కార్యక్రమం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆదివారం ఓటర్ల నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బీఎల్‌వో(బూత్ లెవల్ అధికారులు) ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. జనవరి 1, 2018 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోవచ్చన్నారు. ఇంతకు ముందే జాబితాలో పేరుంటే వాటికి సంబంధించిన అభ్యంతరాలు, తప్పుల సవరణ, చిరునామాలను మార్చుకునేందుకు కూడా అవకాశం ఉంటుందని రజత్ కుమార్ పేర్కొన్నారు.

స్థిరమైన అభివృద్ధికి విస్తృత దృష్టి అవసరం

- **ఎల్‌బీఎస్ఎన్ఏఏ డైరెక్టర్ సంజీవ్ చోప్రా**

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే విస్తృత దృష్టితో కూడిన ప్రణాళిక, వ్యూహరచనతోపాటు నిర్ణయాధికారం అవసరమని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ), ముస్సోరి సంచాలకుడు, ఐఏఎస్ సంజీవ్ చోప్రా అన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం(ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ)లో "స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు" అనే అంశంపై సీనియర్ ఐఏఎస్, ఏఐఎస్ అధికారులకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంజీవ్ చోప్రా మాట్లాడుతూ.. వ్యవసాయరంగంలో స్థిరమైన అభివృద్ధి కేవలం వరి, గోధుమల పంటలపైనే దృష్టి పెడితే రాదని, పరిశ్రమ, వ్యవసాయరంగాలను సమానంగా చూసినప్పుడే అది సాధ్యం అవుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పేదరికం, పోషకాహార లోపం లాంటి సమస్యలను గుర్తించడానికి కాకుండా వాటి పరిష్కారం కనుగొనేందుకు వినియోగించాలన్నారు. స్థిరమైన అభివృద్ధి సాధనకు భారత ప్రభుత్వంతో కలిసి మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య అన్నారు. శిక్షణలో పాల్గొన్న ఐఏఎస్, ఏఐఎస్‌లకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

దోస్త్‌లో ఎంసెట్ తరహా విధానం

- **4, 5 తేదీల్లో 'ఉన్నతవిద్య-మానవ వనరులు'పై సదస్సు**
- **కళాశాలలు, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్**

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఈ నెల 4, 5 తేదీల్లో హైదరాబాద్ వేదికగా 'ఉన్నత విద్య- మానవ వనరులు' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాలలు, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి, ఇంటర్మీడియట్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం, ఎలైట్స్ టెక్నోమీడియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాంపల్లిలోని విద్యాభవన్‌లో శనివారం ఉన్నతవిద్యామండలి వైస్ ఛైర్మన్ లింబాద్రితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్తులో నిరుద్యోగ సమస్యను సమర్థంగా ఎదుర్కోవాలంటే ఏం చేయాలో సదస్సు ద్వారా ఒక అవగాహనకు రావొచ్చని లింబాద్రి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా సంస్కరణలపై రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల ప్రతినిధులు, 50 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ప్రసంగిస్తారన్నారు. డిగ్రీ ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ వెబ్‌సైట్‌లో ఎంసెట్ తరహా విధానాలు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని నవీన్ మిత్తల్ తెలిపారు. గతేడాది నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులతో ప్రవేశాల్లో 39శాతం పెరుగుదల కనిపించిందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది విద్యార్థులు నచ్చిన సబ్జెక్టులు చదువుకునేలా కొత్త కోర్సులను తీసుకువస్తున్నామన్నారు.

'విదేశీ విద్యానిధి' దరఖాస్తులకు ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో ఉన్నత విద్యకు సంబంధించి, నిరుపేద గిరిజన విద్యార్థులు అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకంకింద దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎ.సుభాష్ చంద్రగౌడ్ తెలిపారు. అర్హులైనవారు అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, ఇతర దేశాల విద్యాలయాల్లో చదువుకునేందుకు రూ.20లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు.

వారంలోగా రైతులకు కందుల బకాయిలు చెల్లించాలి

నాఫెడ్ అధికారులకు పార్థసారథి ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: రైతుల నుంచి మద్దతు ధరకు కొన్న కందులకు బకాయి ఉన్న రూ.93 కోట్లను వారంలోగా విడుదల చేయాలని నాఫెడ్ అధికారులను మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఆదేశించారు. పంటల కొనుగోళ్లపై శనివారమిక్కడ ఆయన సమీక్ష జరిపారు. ఇప్పటివరకూ 123 కేంద్రాలద్వారా 43వేల టన్నులు కొనగా.. రైతులకు పూర్తిగా డబ్బు చెల్లించలేదని అధికారులు తెలిపారు. రబీలో రైతులు సాగుచేసిన సెనగ, మినుములను మద్దతు ధరకు కొనేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని పార్థసారథి ఆదేశించారు.

'కొత్తగూడెం-సత్తుపల్లి' భూసేకరణ వేగవంతమవ్వాలి: సింగరేణి సీఎండీ

కొత్తగూడెం-సత్తుపల్లి రైలుమార్గం నిర్మాణానికి భూసేకరణ పనులు వేగంగా జరిగేలా చూడాలని సింగరేణి సీఎండీ శ్రీధర్ అధికారులకు సూచించారు. సంస్థలోని అన్ని ప్రాంతాల అధికారులతో శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. బొగ్గు తవ్వకాలపైనే కాకుండా వేగంగా రైళ్లలో గమ్యస్థానాలకు తరలింపుపైనా శ్రద్ధ చూపాలని సూచించారు. కొత్త యంత్రాల కొనుగోలు వచ్చే నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు.

ఈనాడు బిజినెస్ వారాంతం

ఆన్‌లైన్ లావాదేవీలు, కార్డ్ స్వైపింగ్ సందర్భాల్లోనే బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన రహస్య సమాచారం ఇతరులకు చేరేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. అందువల్ల ఈ లావాదేవీలకు ప్రత్యేక బ్యాంక్ ఖాతాను ఉంచుకుంటే, ఇబ్బందులు చాలావరకు తీరుతాయని బ్యాంకింగ్ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. దీంతోపాటు యూపీఐ ఆధారిత చెల్లింపు సేవల సంస్థలను అనుసంధానించేందుకూ ఈ ఖాతానే వాడుకోవాలని వివరిస్తున్నారు. అధిక మొత్తం నగదు నిల్వ ఉండే ఖాతాల నుంచి ఆన్‌లైన్ లావాదేవీలు, కార్డ్ స్వైపింగ్ చేయకుడా ఉంటే, మోసాలకు దాదాపుగా ఆస్కారం ఉండదని విశ్లేషిస్తున్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలకో ఖాతా

- వీటిలో పరిమిత నగదు ఉంచుకోవాలి
- కార్డ్ స్వైపింగ్‌కూ ఇదే వాడుకోవాలి
- యూపీఐ వాలెట్ అనుసంధానానికీ ఇదే
- అధికమొత్తం నగదుకు మరో ఖాతా మేలు



ప్రస్తుతం ఉద్యోగులందరికీ వేతనాలు, పదవీ విరమణ చేసిన వారికి పింఛన్లు దాదాపుగా బ్యాంక్ ఖాతాల్లోకే చేరుతున్నాయి. రూ.20,000కు మించి నగదుతో లావాదేవీ జరపకూడదని నిబంధన తెచ్చాక, రైతులకు కూడా పంట దిగుబడులకు సంబంధించి నగదును వారి బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తున్నారు. ఇక వ్యాపారుల లావాదేవీలు చెప్పనవసరం లేదు. బ్యాంక్ ఖాతాల నుంచి ఆన్‌లైన్‌లో, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా నగదును వేరే వారి ఖాతాలకు బదిలీ చేయడం, బిల్లుల చెల్లింపు, ఇకామర్స్ పోర్టళ్లలో కొనుగోళ్లకు వినియోగించడం పెరిగింది. భౌతికంగా అయితే కార్డుతో స్వైపింగ్ ద్వారా చెల్లింపులు అధికమవుతున్నాయి. ఇక మొబైల్ వాలెట్లయిన పేటీఎం, ఫోన్‌పే, జియోమనీ, ఎయిర్‌టెల్ మనీ, మొబిక్విక్, ఫ్రీచార్జ్ వంటి ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, ఫోన్‌నెంబర్ల ద్వారా కూడా నగదు బదిలీ/బిల్లుల చెల్లింపు చేస్తున్నారు.



మోసాలకు అవకాశాలు ఇక్కడే

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, చెల్లింపు జరుపుతున్నప్పుడు, ఆ ఖాతా ఎవరి పేరిట ఉందో గమనించాలి. మనం వెళ్లిన దుకాణం/సంస్థ పేరు బదులు, అనుమానాస్పద పేర్లు ఏమైనా వస్తే, దుకాణదారును ఆరాతీయాలి. ఒక్కోసారి సంస్థ పేరు ఒకటి, బ్యాంక్‌ఖాతా రిజిస్ట్రేషన్ మరో పేరిట ఉంటాయి. ఇలా అయితే సరే. లేకుంటే అప్రమత్తంగా ఉండాలి. ఇక ఆన్‌లైన్‌లో అయితే రూ.10,000 స్మార్ట్‌ఫోన్ రూ.1,000లోపే ఇస్తామనే మోసపూరిత ప్రకటనలు అధికం. ఈ ప్రకటనలతో ఉండే లింక్‌ను క్లిక్ చేసి, చెల్లింపు జరిపితే మన ఖాతా వివరాలు సంగ్రహించే అవకాశాలు ఎక్కువ.

✦ అందువల్ల రూ.50,000, అంతకుమించి ఉన్న బ్యాంక్ ఖాతాల నుంచి ఆన్‌లైన్ లావాదేవీలు జరపకుండా ఉండటం మంచిది. నెలవారీ బిల్లుల చెల్లింపు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, కార్డులతో స్వైపింగ్‌కు మరో ఖాతా ఆరంభించడం మేలు.

✦ ప్రతి నెలా తప్పనిసరిగా ఉండే బిల్లుల చెల్లింపునకు, అదనంగా కొంత మొత్తాన్నే రెండో ఖాతాలో జమచేయాలి. మళ్లీ అవసరం అయినా, అధికమొత్తాలు నిల్వ ఉన్న ఖాతా నుంచి నగదును రూ.10,000 -20,000 వరకు బదిలీ చేసుకోవాలి. ఇందుకు ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను వినియోగించుకోవచ్చు. తక్కువమొత్తం నిల్వ ఉంచిన ప్రత్యేక ఖాతా నుంచే బిల్లులు, ఆన్‌లైన్ కొనుగోళ్లు జరపడం వల్ల, ఒకవేళ ఎవరైనా హ్యాక్ చేసినా, ఆ ఖాతా (కొద్దిమొత్తాలకే) వరకే నష్టాలు పరిమితం అవుతాయి.

గూగుల్‌పే పేటీఎం ఫోన్‌పేలతో

మొబైల్ వాలెట్లుగా ఉన్న ఫోన్‌పే, పేటీఎం వంటి సంస్థలతో పాటు గూగుల్‌పే కూడా యూపీఐ భీమ్ ఆధారిత సేవలు అందిస్తున్నాయి. వీటిని మన బ్యాంక్ ఖాతా, దానిలో నమోదైన మొబైల్ నెంబరు ద్వారా అనుసంధానం చేసుకోవచ్చు. ఇందువల్ల ఎవరికైనా నగదు పంపాలనుకున్నప్పుడు, వారి ఖాతా వివరాలు లేకున్నా, నగదు బదిలీ చేయడం వీలవుతుంది. అయితే నగదు పొందే వ్యక్తికి కూడా ఈ ఖాతా ఉంటేనే వీలవుతుంది.

సౌలభ్యం ఏమిటి?

వాలెట్లలో అయితే ఖాతా నుంచి నగదు నింపుకుని, వినియోగించుకోవాలి. ఈ పద్ధతిలో అయితే నేరుగా బ్యాంక్ ఖాతా నుంచే నగదును స్వీకరిస్తుంది. అయితే బ్యాంక్‌లో నమోదైన మొబైల్ నెంబరుతోనే సాధ్యమవుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆమోదించిన వ్యవస్థలు కనుక, ఇవీ సురక్షితమే. మన ఖాతా నుంచి భీమ్ యూపీఐ/బ్యాంక్ ఖాతాకు, ఫోన్‌పే/పేటీఎం వాలెట్లకు నగదు పంపొచ్చు. బిల్లులు చెల్లించొచ్చు. నగదు మన ఖాతా నుంచి డెబిట్ అయిన వెంటనే, మన మొబైల్‌కు సంక్షిప్త సందేశం వస్తుంది. వెంటనే మన యాప్‌లో లావాదేవీ, ఇంకా ఎంత నగదు నిల్వ ఉంది వంటి వివరాలు కూడా చూసుకోవచ్చు. మనం జరిపిన లావాదేవీలన్నీ నమోదవుతాయి కనుక, ఏరోజు ఎవరికి నగదు పంపిందీ, ఎంత చెల్లించిందీ తెలుస్తుంది.

నగదు చేరకపోతే

ఈ యాప్‌ల ద్వారా నగదు పంపినపుడు, అందుకున్న వ్యక్తి ఖాతాలో జమయిందని సంక్షిప్త సందేశం వచ్చినా, ఖాతాలో చూసుకుంటే, నిల్వ ఉండటం లేదనే ఫిర్యాదులూ వస్తున్నాయి. సాధారణంగా నగదు అందుకున్న వ్యక్తి కనుక కేవైసీ (మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి) నింపకపోతే, ఆయా యాప్‌లు వారి లావాదేవీలకు పరిమితి విధిస్తాయి. దీన్ని మించితే నగదు చేరదు. ఇటువంటి సందర్భాల్లో నగదు మళ్లీ పంపిన వ్యక్తి ఖాతాలోకే వెనక్కి రావాలి. లేదా బిల్లు చెల్లించినప్పుడు కూడా, నగదు సక్రమంగా బదిలీ కాకపోవచ్చు. అప్పుడు కూడా కాస్త ఆలస్యంగా అయిన నగదు వెనక్కి వస్తుంది. అత్యవసరమైనప్పుడు మాత్రం ఇలాంటి సందర్భాల్లో ఇబ్బందే.

✦ ఫోన్‌పేకు అయితే యాప్ పేజీ పైన కుడివైపు ఉండే ? చిహ్నంలో మన లావాదేవీ ఎక్కడ విఫలమైందో ఫిర్యాదు చేయొచ్చు.

✦ గూగుల్‌పేలో కూడా కుడివైపు పైన సెట్టింగ్స్‌లో హెల్ప్ అని ఉంటుంది. అందులో విజ్ఞప్తి చేసి, సాయం పొందొచ్చు.

✦ పేటీఎంలో పేజీపైన ఎడమవైపు ఉండే మెనూబార్‌ను తాకితే, 24X7 హెల్ప్ అని ఉంటుంది.

అందులో మన విఫలమైన లావాదేవీ గురించి తెలిపి, సాయం పొందొచ్చు.

ఈనాడు వాణిజ్య విభాగం

దీపక్, ధూత్ చందా కొచ్చర్‌లపై ఈడీ కేసు

దిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈఓ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ ప్రమోటరు వేణుగోపాల్ ధూత్, ఇతరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మనీలాండరింగ్ కేసును నమోదు చేసింది. వీడియోకాన్ గ్రూప్‌నకు బ్యాంకు ఇచ్చిన రూ.1875 కోట్ల రుణం విషయంలో అవకతవకలు, అవినీతి చోటు చేసుకున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు శనివారం వెల్లడించారు. గత నెలలో సీబీఐ కేసు నమోదును పరిగణనలోకి తీసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్)ను ఈడీ నమోదు చేసింది. పోలీసు ఎఫ్ఐఆర్(తొలి సమాచార నివేదిక)తో ఈ ఈసీఐఆర్ సమానం. రుణ ఒప్పందంలో అవకతవకలు జరిగాయా లేదా అన్న విషయంపై దర్యాప్తు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే ఈసీఐఆర్‌లో ఉన్న వారికి ఈడీ సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. సీబీఐ కేసులో నమోదైన పేర్ల జాబితానే ఈడీ కూడా ఈసీఐఆర్‌లో పొందుపరచడం గమనార్హం.

దివీస్‌కు రూ.379 కోట్ల లాభం

ఈనాడు, హైదరాబాద్: ఔషధాల తయారీ సంస్థ దివీస్ లేబొరేటరీస్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.379 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.1377 కోట్లు ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.1,055 కోట్లు, నికర లాభం రూ.225 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత మూడో త్రైమాసికంలో విదేశీ మారక ద్రవ్య నష్టం రూ.41 కోట్లు ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. అదే విధంగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల కాలానికి దివీస్ మొత్తం ఆదాయం రూ.3,746 కోట్లు, నికర లాభం రూ.1,043 కోట్లు నమోదయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.2,814 కోట్లు, నికర లాభం రూ.608 కోట్లు ఉండటం గమనార్హం. ప్రస్తుత 9 నెలల కాలానికి రూ.38 కోట్ల విదేశీ మారక ద్రవ్య లాభం ఉన్నట్లు వివరించింది.


వాటా విక్రయానికి 10 పీఎస్‌యూలు!

దిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20) నిర్దేశించుకున్న రూ.90,000 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. తొలి పబ్లిక్ ఆఫర్ ద్వారా (ఐపీఓ) వాటా విక్రయానికి 10 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను (కేంద్ర పీఎస్‌యూలు) గుర్తించింది. వీటిల్లో టీహెచ్‌డీసీఐఎల్, రైల్‌టెల్, టీసీఐఎల్ లాంటి సంస్థలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణతో పాటు, వీటికి చెందిన ప్రధానేతర ఆస్తుల విక్రయానికి ఆర్థిక శాఖ యోచిస్తోందని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి అతాను చక్రవర్తి తెలిపారు. 'మేం ఇప్పటికే 10 పీఎస్‌యూల ఐపీఓలను సిద్ధం చేశాం. ఇవే కాకుండా కనీస ప్రజల వాటా పరిమితి నిబంధనలను తృప్తిపర్చాల్సిన సంస్థలు చాలానే ఉన్నాయి. కొత్త తరహా ఈటీఎఫ్‌లను కూడా తీసుకొని రానున్నాం. ఎన్నికల అనంతరం పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. ప్రధానేతర ఆస్తుల విక్రయం వచ్చే ఏడాది చేపడతామ'ని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చక్రవర్తి వెల్లడించారు.

4% పెరిగిన టీవీఎస్ అమ్మకాలు

దిల్లీ: గత నెలలో టీవీఎస్ మోటార్ మొత్తం అమ్మకాలు 4 శాతం పెరిగాయి. 2018 జనవరిలో 2,71,801 వాహనాలను విక్రయించగా.. ఈ జనవరిలో 2,82,630 వాహనాలను కంపెనీ అమ్మింది. ద్విచక్ర వాహనాల మొత్తం అమ్మకాలు 2 శాతం పెరిగి 2,62,995 వాహనాల నుంచి 2,69,277 వాహనాలకు చేరాయి. ద్విచక్ర వాహనాల దేశీయ విక్రయాలు కూడా 2,26,992 నుంచి 2,28,654కి పెరిగాయి.

కోడి గుడ్లు



2న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	395	వరంగల్	397
చిల్లరగా (ఒక గుడ్డు)	4.55	విశాఖపట్నం	395
బెంగళూరు	425	చెన్నై	435
3వ తేదీకి		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	395	నమక్కల్	425

కుటుంబ వ్యాపార సంస్థలకు వారసత్వ ప్రణాళిక ముఖ్యం

హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్



ఐఎస్‌బీలో శనివారం కుటుంబ వ్యాపార సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ కవిల్ రామచంద్రన్, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర శ్రీవాత్సవ, హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్, స్పెక్ట్రమ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు థామస్ స్మిథైనీ.

ఈనాడు, హైదరాబాద్: సరైన వారసత్వ ప్రణాళిక ఉంటే కుటుంబ వ్యాపార సంస్థలు తరాలు మారినా మనుగడ సాగించగలుగుతాయని హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్ అన్నారు. కుటుంబ వ్యాపార సంస్థలు మూడో తరంలో కుప్పకూలిపోతాయనే అభిప్రాయం సరికాదని, ఎన్నో సంస్థలు విజయవంతంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యాపార కుటుంబాలు వ్యాపారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, తర్వాతే కుటుంబమని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) లో శనివారం '7వ ఆసియా ఆహ్వానిత కుటుంబ వ్యాపార సదస్సు' లో దీపక్ పరేఖ్ ప్రధానోపన్యాసం చేశారు. వ్యాపార సంస్థల నిర్వహణ ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో సంక్లిష్టంగా మారిందని, గతంతో పోల్చితే ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అందువల్ల వృత్తి నైపుణ్యం ఉన్న సలహాదార్లను నియమించుకొని తమ వ్యాపార సంస్థలకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని సూచించారు. కంపెనీల డైరెక్టర్ల బోర్డులు కూడా సమర్థమంతంగా ఉండాలన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ చిన్న సంస్థగా మొదలై, ఈరోజు ఎన్నో రంగాలకు విస్తరించిందని, ఎప్పటికప్పుడు వ్యాపార అవకాశాలను గుర్తించటం, నిబద్ధతతో పనిచేయటం ద్వారా పెద్ద వ్యాపార సామ్రాజ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ విస్తరించగలిగిందని ఆయన ఉదహరించారు. విలువలకు పెద్దపీట వేయటం, సిబ్బంది, అధికార్లలో అంకితభావాన్ని పెంపొందించటం ఇందుకు వీలుకల్పించిందన్నారు.

ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర శ్రీవాస్తవ మాట్లాడుతూ ఐఎస్‌బీ చేపట్టిన 'ఫ్యామిలీ బిజినెస్ ప్రోగ్రామ్' ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం వివిధ దేశాల్లోని కుటుంబ వ్యాపార సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషించి తగిన పరిష్కారాలు సూచించటంలో ఈ ఐఎస్‌బీలోని థామస్ స్మిథైనీ సెంటర్ ఫర్ ఫ్యామిలీ ఎంటర్‌ప్రైజ్ విభాగం క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార కార్యకలాపాల తీరుతెన్నులు ఎన్నో మార్పులకు లోనవుతున్నట్లు స్పెక్ట్రమ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అయిన థామస్ స్మిథైనీ విశ్లేషించారు. ప్రపంచీకరణ ఎల్లకాలం సాధ్యం కాకపోవచ్చని, అంతర్జాతీయ వర్తకానికి అవరోధాలు పెరిగిపోతున్నట్లు తెలిపారు. యూఎస్‌కు దీటుగా చైనా బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగటంతో మళ్లీ రెండు బలమైన దేశాల ప్రభావానికి ప్రపంచ దేశాలు లోనుకావలసి వస్తోందని అన్నారు. వాతావరణ మార్పులను అదుపు చేయటం సాధ్యం కాదని, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరుగుతున్నప్పటికీ సంప్రదాయ ఇంధన వినియోగం తప్పదని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు వ్యాపారం తీరుతెన్నులపై ప్రభావం చూపుతున్నట్లు వివరించారు.


నేరం మార్కెట్‌ది కాదు

పెద్దయ్యాక ఏమవుతావని అడిగితే.. టీచర్, లాయర్, డాక్టర్, ఇంజినీరు.. అంటూ చెబుతూ ఉంటారు పిల్లలు. కాని స్టాక్ మార్కెట్ ట్రేడర్ అవుతానని ఏ ఒక్కరూ చెప్పరు. చిన్ననాటి లక్ష్యాల జాబితాలో అసలు అది కనిపించనే కనిపించదు. పోనీ ఉన్నవాటినైనా సాధిస్తారా అంటే అదీ ఉండదు.. ఏ కొద్దిమందో తప్ప. వీళ్లైనా లక్ష్య సాధనకు 10-15 ఏళ్ల పాటు కష్టనష్టాలు భరించాల్సి ఉంటుంది. అంత శ్రమించాకైనా ఆశించిన ఉద్యోగం వస్తుందా.. అంటే అదీ సందేహమే. చివరకు ఏదోలా ఉద్యోగం సాధిస్తే కానీ సంపాదనాపరులు అవ్వలేరు. మరి చిన్నప్పుడు ఏర్పరచుకున్న లక్ష్యాన్ని చేరాలంటేనే సుదీర్ఘ కాలం ప్రయాణం చేయాల్సి ఉన్నప్పుడు, అసలు మన ఆలోచనల్లోనే లేని స్టాక్ మార్కెట్ ట్రేడర్‌గా ఎదగాలంటే ఎంత సమయం పట్టాలి...? కొన్నాళ్లయినా రాటుదేలనిదే లాభాలను ఆశించడం సమంజసమేనా..?

గుణ పాఠం

పిట్టకథ

ఒక ఊరిలో శేఖరయ్య కుండల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు. ప్రతి రోజు బంక మట్టితో పదుల సంఖ్యలో కుండలను తయారు చేసేవాడు. వాటిని నిప్పుల కొలిమిలో కాల్చి గట్టిపడ్డాక సంతకు తీసుకెళ్లి అమ్మేవాడు. ఒక రోజు ఇలాగే ఓ కుండను తయారు చేస్తూండగా.. నిప్పుల్లో కాలుతున్న మిగతా కుండలను చూసి భయపడి అది తనను కాల్చవద్దని మొరపెట్టుకుంది. కాల్చకుంటే ఎలా? కుండ గట్టిపడాలంటే కాల్చక తప్పదు. నాసిరకంగా ఉంటే కొనేవాళ్లు ముందుకు రారు. ఇలాగైతే కొనుగోలుదార్లలో నాపైన నమ్మకం పోతుందని శేఖరయ్య అంటాడు. నన్ను ఎవరూ కొనకపోయినా ఫర్వాలేదు.. నేను ఇక్కడే నీతోనే ఉండిపోతాను. నన్ను మాత్రం దయచేసి కొలిమిలో వేయొద్దని ఆ కుండ బతిమలాడుకుంటుంది. దాని దీనవేదనకు కరిగి శేఖరయ్య దానిని కాల్చకుండా పక్కన పెట్టేశాడు. ఆ తర్వాత అన్ని కుండలు అమ్ముడుపోయినా ఈ కుండను మాత్రం ఎవరూ కొనలేదు. దాంతో ఓ మూలన పడేశాడు శేఖరయ్య. ప్రతి రోజూ రాగానే శేఖరయ్య ఇతర కుండల్లో నీళ్లు పోయడం, కుండీల్లో మట్టి వేసి మొక్కలు పెంచుతుండటం చూసి.. హమ్మయ్య మనకు ఆ బరువు బాధ్యతలు లేవని ఈ కుండ సంతోషపడేది. అంతేకాని.. తాను ఎందుకూ పనికిరావడం లేదనే విషయాన్ని మాత్రం గ్రహించలేకపోయింది. ఇలా ఉండగా ఓ రోజు పెద్ద గాలి వాన వచ్చింది. అక్కడ ఉన్న మిగతా కుండలు, కుండీలు దృఢంగా ఉండటంతో ఆ వాన ఉద్ధృతిని తట్టుకొని నిలబడ్డాయి. కాని ఇది సాధారణ కుండ కావడంతో వాన జల్లుకు కరిగిపోయి మట్టిలో కలిసి కొట్టుకుపోయింది. మర్నాడు శేఖరయ్య వచ్చి చూడటంతో ఆ మూలన కుండ కనిపించలేదు. కాస్తంత బాధకు ఓర్చుకుని ఉంటే మిగతా కుండలతో పాటు అది కూడా కొన్నాళ్లపాటు హాయిగా ఉండేది. ఇప్పుడు చూడు కొన్నాళ్లకే మట్టిలో కల్సిపోయిందని అనుకుంటూ మళ్లీ పనిలో పడిపోయాడు శేఖరయ్య.



నీతి

పిట్టకథలో కుండ గట్టిపడాలంటే కాల్చడం తప్పదని చెప్పినా కూడా వినకుండా ఆ కుండ కాల్చడం నుంచి తప్పించుకుంది. ఆఖరుకు వాన జల్లుకు కరిగిపోయి మట్టిలో కలిసిపోయింది. ఇక్కడ నేరం కుండది కాని.. దానిని తయారుచేసిన శేఖరయ్యది కాదు. స్టాక్ మార్కెట్లో కూడా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళితే కల్యాణ్ తాతకు వచ్చినట్లుగా ఎవరికైనా లాభాలు రావచ్చు. అలాకాకుండా స్వల్పకాలంలోనే లాభాలను సంపాదించేయాలనే ఆశతో అవగాహనారాహిత్యంతో షేర్లు కొన్నప్పుడు నష్టాలు రావడం సహజం. అప్పుడు ఆ నేరం మదుపరిదే అవుతుంది తప్ప.. స్టాక్ మార్కెట్ ముంచేసినట్లు కాదు.

మార్కెట్ కథ

రవికి ఎప్పుడు చూసినా షేర్ల ధ్యాసే. స్టాక్ మార్కెట్‌లో చాలానే నష్టపోయాడు కూడా. అయినప్పటికీ ఆ బాధనేదే కనపడనీయకుండా, ఏ రోజైనా లాభాలు రాకపోతాయా అనే ధీమాతో పైకి నవ్వుతూ కనిపించేవాడు. అతని ఆఫీసులో పనిచేసే కల్యాణ్‌కు స్టాక్ మార్కెట్ అంటే అస్సలు గిట్టదు. రవి, కల్యాణ్ మధ్య ఎంత స్నేహం ఉన్నప్పటికీ షేర్ల ప్రస్తావన వస్తే చాలు ఇరువురికి గొడవ మొదలయ్యేది. షేర్లు కొని నష్టపోయినోడివి నువ్వు స్టాక్ మార్కెట్ గురించి మాట్లాడమేమిటి అని కల్యాణ్ ప్రతిసారీ గేలి చేసేవాడు. ఆ మాట విన్నప్పుడల్లా మనసుకు బాధ కలిగినట్లు అనిపించేది రవికి. ఇదిలా ఉంటే ఓ రోజు పత్రాల రూపంలోని షేర్లను తప్పకుండా డిజిటల్ రూపంలోకి మార్చుకోవాలనే వార్తను పత్రికలో చూశాడు కల్యాణ్. వెంటనే తన తాత దాచిపెట్టిన షేర్లు గుర్తుకొచ్చి.. వాటిని సూట్‌కేస్‌లో నుంచి బయటకు తీశాడు. అప్పటి ధరను ఇప్పటి ధరతో పోల్చి చూడగా ఆశ్చర్యపోవడం కల్యాణ్ వంతయ్యింది. ఆ సమయంలో వాళ్ల తాత రూ.20,000 పెట్టి కొన్న షేర్లు ఇప్పుడు రూ.50,00,000 అయ్యాయి. దాంతో ఒక్క క్షణం కూడా ఆగకుండా రవికి ఫోన్ చేసి ఇంటికి రమ్మన్నాడు. అతను రాగానే షేర్లు ఎంత పెరిగాయో చెప్పి, వాటిని డిజిటల్ రూపంలోకి ఎలా మార్చుకోవాలో తెలియజేయమని అడుగుతాడు. అక్కడితో ఆగకుండా అనవసరంగా నిన్ను, స్టాక్ మార్కెట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నానని అంటాడు. అది విని 'ఈ మాటలెందుకులే కాని నిజాలు మాట్లాడు. డబ్బులు వస్తున్నాయనే కదా.. ఇప్పుడు స్టాక్ మార్కెట్‌ను, నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నావు. లేకుంటే నీ నోట స్టాక్ మార్కెట్ మాట రావడమేమిటి' అని రవి అంటాడు. 'నా సంగతి సరే, షేర్లు షేర్లు అని పదే పదే తపిస్తావు కదా. మరి ఇన్నాళ్లుగా నువ్వు ఏం సాధించావు. స్టాక్ మార్కెట్ గురించి నువ్వు తెలుసుకుందేమిటో చెప్పమ'ని అడుగుతాడు కల్యాణ్. దాంతో రవి ఉత్సాహంగా చెప్పడం మొదలుపెట్టాడు. 'క్రికెట్‌ను చూడటం వేరు, ఆడటం వేరు. స్టాక్ మార్కెటైనా అంతే. ప్రేక్షకులు స్టాండ్స్ నుంచి లేదంటే టీవీలో చూస్తూ ఆ బంతిని ఇలా కొట్టాల్సింది.. ఈ బంతిని అలా వేయాల్సింది అని అంటుంటారు. ఎలాగంటే.. నిన్నమొన్నటి వరకు స్టాక్ మార్కెట్‌పై నీకున్న అభిప్రాయాల్లా అన్న మాట. అయితే ఆడేవాళ్లకు మాత్రమే ఆ బాధ, ఒత్తిడి తెలుస్తాయి. అయినా కూడా ఎవరెన్ని విమర్శలు చేసినా.. ఒక మ్యాచ్‌లో చేసిన తప్పులను మరుసటి మ్యాచ్‌లో సరిదిద్దుకుంటూ జట్టు గెలవడానికి కృషి చేస్తారు. అలా ఆఖరుకు ఏదో రోజు ప్రేక్షకుల దృష్టిలో వాళ్లు హీరోలవుతారు. కాని వాళ్లపై వ్యాఖ్యలు చేసే ప్రేక్షకులు మాత్రం ఎప్పటికీ వందమందిలో ఒకరిగానే మిగిలిపోతారు. క్రికెటర్ తన ఆటను ఎలాగైతే వృత్తిగా భావించి, తప్పుల నుంచి నేర్చుకొని అనుభవాన్ని గడిస్తాడో.. మదుపరి కూడా అదే మాదిరి ముందుకెళితే స్టాక్ మార్కెట్లో రాణించడం అసాధ్యమైన విషయమేమీ కాదు. అయితే అనుభవానికి తోడు సాంకేతిక అంశాలపై పట్టు, కంపెనీల ఆర్థిక స్థితిగతులపై పరిజ్ఞానం, నష్టాలను నియంత్రించుకునే నైపుణ్యం, దీర్ఘకాలం పాటు వేచి చూసే సహనం లాంటి లక్షణాలను కలిగి ఉంటే లాభాలు మన గుప్పెట్లోకి రావడం ఖాయం. ఇందుకు మీ తాత కొన్న షేర్లే నిదర్శనం. ముఖ్యంగా రాత్రికిరాత్రే స్టాక్ మార్కెట్ లాభాలను తెచ్చిపెడుతుందనే దృక్కోణాన్ని మార్చుకోవాల'ని వివరిస్తాడు. ఇదంతా విని స్టాక్ మార్కెట్‌పై తనకున్న అభిప్రాయాన్ని కల్యాణ్ మార్చుకున్నాడు. స్టాక్ మార్కెట్ నష్టాలను మాత్రమే తెచ్చిపెట్టేదయితే.. బ్రోకరేజీ సంస్థలకు లక్షల సంఖ్యలో ఖాతాదారులు ఎలా ఉంటారు? వాళ్లు షేర్లలో పెట్టుబడులు పెట్టనిదే ఇంత పెద్దపెద్ద కంపెనీలు నడుస్తున్నాయా? అని తనలో తాను అనుకుంటాడు. ఇక నుంచి తాను కూడా షేర్లలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకుంటాడు.

సిరి

మ్యూచువల్ ఫండ్లు.. చిన్న మదుపరుల నేస్తాలివి

పెట్టుబడి ఏదైనా ఎంతోకొంత నష్టభయం ఉంటుంది. దానికి భయపడి, మంచి రాబడి వచ్చే పథకాలను విస్మరించడం సరికాదు. ముఖ్యంగా దీర్ఘకాలంలో సంపదను సృష్టించేందుకు వీలు కల్పించే మ్యూచువల్ ఫండ్లు చిన్న మదుపరులకు ఎంతో అనుకూలం. మార్కెట్ హెచ్చుతగ్గులను పట్టించుకోకుండా.. ఏ సమయంలోనైనా పెట్టుబడులను కొనసాగించేందుకు ఇవి అనుకూలం అని అంటున్నారు.. **యూటీఐ మ్యూచువల్ ఫండ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ఫండ్ మేనేజర్ లలిత్ నంబియార్..** ఫండ్లలో మదుపు చేస్తున్న వారికీ.. చేయాలనుకుంటున్న వారికీ ఆయన ఇస్తున్న సలహాలు ఇవీ...

» గత ఏడాది మార్కెట్‌లో హెచ్చుతగ్గులు ఎక్కువగానే ఉన్నాయి.. 2019లో కూడా ఇలాగే ఉండబోతోందా?

ఈ సంవత్సరం సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. మార్కెట్ సెంటిమెంట్‌ను ఇది కాస్త ప్రభావం చేసే అంశమే. ఇప్పటిలాగా కాకుండా.. హంగ్ లేదా సంకీర్ణ ప్రభుత్వం వస్తే.. మార్కెట్‌పై కొంత ప్రతికూల ప్రభావం ఉండకపోదు. ఒకవేళ ఎన్‌డీఏ తిరిగి పూర్తి స్థాయి మెజారిటీతో అధికారంలోకి వస్తే.. మార్కెట్ వృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం షేర్ల ధరలు అందుబాటులోనే ఉన్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ వాణిజ్య యుద్ధాలు మార్కెట్‌పై కొంచెం ప్రభావం చూపే అవకాశం ఉంది.



» వ్యక్తుల ఆర్థిక లక్ష్యాల సాధనకు మ్యూచువల్ ఫండ్లు ఎంత మేరకు సహాయం చేస్తాయి?

షేర్లలో నేరుగా మదుపు చేసినప్పుడు వాటిని ఎంచుకునేందుకు ఎంతో అవగాహన ఉండాలి. క్రమశిక్షణతో పెట్టుబడులు పెట్టాలి. సరైన షేరును గుర్తించాలి. దీంతోపాటు కాస్త ఓపిక ఉండాలి. భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలి. అప్పుడే ఆశించిన లాభాలు ఆర్జించగలం. మ్యూచువల్ ఫండ్ల విషయంలో మీ పెట్టుబడులను మార్కెట్‌లో నిపుణులైన బృందం నిర్వహిస్తుంది. వారు ఎంతో పరిశోధన చేసి ఎక్కడ పెట్టుబడులు పెట్టాలన్నది నిర్ణయిస్తారు. కాబట్టి, మదుపరులు ఈ విషయంలో పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. ఫండ్ మేనేజర్ల అనుభవాన్ని ఉపయోగించుకొని, పరోక్షంగా మార్కెట్లో మదుపు చేసేందుకు వీలు కల్గిస్తాయి. తమ దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు వీటిని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

» ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా మార్కెట్లో మదుపు చేయాలని భావించే వారికి మీ సూచనలేమిటి?

కొత్త మదుపరులు ముందుగా నష్టభయం ఉన్న పథకాలకూ, నష్టభయం లేని పథకాలకూ మధ్య తేడాను గుర్తించాలి. డెట్ పథకాలతో పోలిస్తే ఈక్విటీ పథకాల్లో ఆటుపోట్లు కాస్త ఎక్కువగానే ఉంటాయి. స్వల్ప కాలంలో ఈక్విటీ ఫండ్లలో కొంత ఇబ్బంది ఉండవచ్చు. కానీ, కాలం గడుస్తున్న కొద్దీ ఇతర ఏ పెట్టుబడి పథకాలూ.. ఈక్విటీ ఫండ్లకు సరిసమానమైన రాబడిని ఇవ్వలేదన్నది చరిత్ర చెబుతోంది. కాబట్టి, ఇప్పుడు మార్కెట్లోకి ప్రవేశించే కొత్త మదుపరులు 15-20 ఏళ్ల దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకొని, పెట్టుబడులు ప్రారంభించాలి. చిన్న వయసు నుంచే పెట్టుబడులు ప్రారంభించడం ఎప్పుడూ ఆచరణీయం.

» ఇప్పటికే మార్కెట్లో మదుపు చేస్తున్నవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?


ఫండ్ల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పెట్టుబడుల కేటాయింపు సరిగా ఉందా లేదా చూసుకోవాలి. వైవిధ్యమైన రంగాలు, భిన్న ఫండ్ సంస్థల నుంచి ఫండ్లను ఎంచుకోవాలి. రాబడి అంచనాలు వాస్తవంగా ఉండాలి. సాధారణంగా ఈక్విటీ పెట్టుబడులు దీర్ఘకాలంలో 10-12 శాతం వరకూ రాబడినిస్తాయి. ఒక ఏడాదిలో ఇంతకుమించి ఆర్జిస్తే దాన్ని లాటరీగా భావించాలి. తక్కువ రాబడి వచ్చిన ఏడాదిని ఇది భర్తీ చేసిందని అనుకోవాలి.

» చిన్న మదుపరులకు మీరిచ్చే సలహా ఏమిటి?

మార్కెట్లో మదుపు చేయాలనుకునే మదుపరులు పాటించాల్సిన మొదటి సూత్రం.. పెట్టుబడుల్లో వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. ఓపిక, క్రమశిక్షణతో ఉండాలి.. రెండో సూత్రం ఏమిటంటే.. మొదటి సూత్రాన్ని ఎప్పుడూ విస్మరించకూడదు.

ప్రతి ప్రయాణానికీ ఓ గమ్యం ఉంటుంది. పెట్టుబడులకూ ఇదే వర్తిస్తుంది. మనసులో ఒక లక్ష్యం అనుకొని.. దానికి అనుగుణంగా అనువైన మదుపు పథకాలను ఎంచుకోవాలి. లక్ష్యం సాధించే వరకూ వాటిని కొనసాగించాలి. మారుతున్న పరిస్థితులతోపాటు, వయసునూ దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు ఆ పథకాల్లో మార్పులు, చేర్పులు తప్పనిసరి. ఆర్థికంగా అనుకున్న స్థాయికి చేరాలంటే.. పెట్టుబడుల ఎంపికలో వైవిధ్యంతోపాటు, అవసరాన్ని బట్టి వ్యూహాలనూ మార్చుకోవాలి.

వ్యూహం మారితేనే.. లాభాల పంట



పెట్టుబడి.. ఒక ఆర్థిక లక్ష్యాన్ని సాధించే దశలో కొనసాగే సుదీర్ఘ ప్రక్రియ. ఈ వ్యవధిలో ఎన్నో వ్యూహాలు మార్చుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. తొందరగా పెట్టుబడులు ప్రారంభించిన వారికీ.. కాస్త ఆలస్యంగా మదుపు చేయడం మొదలు పెట్టిన వారికీ ఎంతో తేడా ఉంటుంది. తొందరగా మదుపు ప్రారంభించిన వారికి అధిక సమయం ఉంటుంది కాబట్టి, వారు కాస్త నష్టభయం ఉన్న పథకాలను ఎంచుకున్నా ఇబ్బందేమీ ఉండదు. వ్యవధి పెరుగుతున్న కొద్దీ ఆ నష్టభయం తగ్గి, సగటు రాబడి అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.

ఏ పథకానికి ఎంత మొత్తం పెట్టుబడి కేటాయించాలన్న విషయంలో సరైన అవగాహన లేకపోతే.. అవి మనకు ఆశించిన వృద్ధిని అందించడంలో విఫలం అవుతాయి. అంతిమంగా ఆ ప్రభావం మనకు సమకూరే నిధిపైనే పడుతుంది. పెట్టుబడుల్లో సమతౌల్యం లేకపోతే.. ఈక్విటీల్లాంటి మంచి రాబడిని అందించే పథకాల్లోనూ నష్టాలపాలు కావాల్సి వస్తుంది.

మన దగ్గర ఉన్న మొత్తాన్ని మదుపు చేసేందుకు ఎంచుకునే పథకాలు.. మంచి రాబడిని అందించాలి. అదే సమయంలో నష్టభయం కూడా తక్కువగా ఉండాలి అని భావిస్తాం. ఈ రెండూ పెట్టుబడుల కేటాయింపు సక్రమంగా ఉన్నప్పుడే సాధ్యం అవుతుంది. సాధారణంగా పెట్టుబడులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. నగదు ఆధారిత పెట్టుబడులు.. ఇందులో నష్టభయం చాలా తక్కువ. డెట్ పథకాల్లో కాస్త నష్టభయం ఉంటుంది. పూర్తి సురక్షిత పథకాలకన్నా ఎక్కువ రాబడినిస్తాయి. ఇక మూడోది ఈక్విటీలు.. నష్టభయం ఎక్కువే.. రాబడీ అధికమే. మన పెట్టుబడులు ఎప్పుడూ ఈ మూడింటినీ సమతౌల్యం చేస్తూ ఉండాలి.

వయసును బట్టి..

ఏ పథకంలో మదుపు చేయాలన్నది నిర్ణయించుకునే ముందు.. మనం అనుకున్న లక్ష్యానికి ఎంత వ్యవధి ఉందన్నది చూసుకోవాలి. స్వల్పకాలిక లక్ష్యాల కోసం మదుపు చేయాలనుకున్నప్పుడు.. తొందరగా నగదుగా మార్చుకునే వీలు, తక్కువ నష్టభయం ఉన్న పథకాలను చూడాలి. ఐదారేళ్లకు మించి సమయం ఉండి, కాస్త నష్టభయం భరించగలిగితే.. ఈక్విటీల్లాంటివి ఎంచుకోవాలి. ఇదే సమయంలో ఏ తరహా పథకాన్ని ఎంపిక చేసుకోవాలన్న విషయంలో మదుపరి వయసు కూడా కీలకమే.

నష్టభయం భరించే సామర్థ్యం వయసును బట్టి మారుతుంది. ఉదాహరణకు.. ఇప్పుడిప్పుడే ఉద్యోగం ప్రారంభించిన యువకులకు పెట్టుబడులను కొనసాగించేందుకు కావాల్సినంత వ్యవధి ఉంటుంది. కాబట్టి, ఇలాంటి వారు అధిక నష్టభయం ఉన్న పథకాలను ఎంచుకున్నా పెద్ద ఇబ్బందేమీ ఉండదు.

అదే.. మధ్య వయస్కులు అంటే.. ఇప్పటికే 10-15 ఏళ్ల ఉద్యోగ అనుభవం ఉన్నవారి విషయానికి వస్తే.. కాస్త తక్కువ నష్టభయం ఉన్న పథకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వీరిపై ఆధారపడిన వారు ఉంటారు కాబట్టి, పెట్టుబడుల్లో కాస్త బ్యాలెన్స్‌డ్ పథకాలు ఉండేలా చూసుకోవాలి. అలాగే మదుపరి వయసు పెరుగుతున్న కొద్దీ.. నష్టభయం ఉన్న పథకాల్లో నుంచి పెట్టుబడులను.. తక్కువ నష్టభయం ఉన్న పథకాల్లోకి మళ్లించాలి. ఈ సమయంలో మన లక్ష్యం అధిక రాబడిని ఆర్జించడం మీద కాకుండా.. పెట్టిన పెట్టుబడిని కాపాడుకోవడం, వచ్చిన లాభాలను స్వీకరించడం మీదే ఉండాలి. పదవీ విరమణ దగ్గరకు వస్తున్న కొద్దీ సురక్షిత పథకాలే నప్పుతాయి.

సర్దుబాటు చేయండి..

జీవితంలోని దశను బట్టి, ఏయే పెట్టుబడుల్లో ఎంతెంత శాతం మదుపు చేయాలన్నది తెలుసుకోవడమే ఇక్కడ ముఖ్యం. ప్రధానంగా ఈక్విటీ పెట్టుబడుల విషయం ఇక్కడ గమనించాలి.

100 నుంచి వయసును తీసేయగా వచ్చిన మొత్తమే.. ఈక్విటీల్లో ఎంత పెట్టుబడి పెట్టాలన్నది నిర్ణయిస్తుందనేది ఆర్థిక నిపుణుల సూచన. అంటే.. ప్రస్తుతం మీ వయసు 35 ఏళ్లు అనుకోండి.. 100-35=65. మొత్తం పెట్టుబడిలో 65 శాతం వరకూ ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టుకోవచ్చు. మిగతా మొత్తాన్ని డెట్ పథకాలకు కేటాయించాలి. వయసు పెరుగుతున్న కొద్దీ.. ఈక్విటీ పెట్టుబడులు తగ్గాలి.. డెట్ పెట్టుబడులు పెరగాలి. ఇదే వ్యూహంతో ముందుకు వెళ్లినప్పుడే.. పెట్టుబడుల్లో సమతౌల్యత వస్తుంది. అయితే, ఇది ఇలాగే కచ్చితంగా పాటించాలనే నియమం ఏమీ లేదు. కొంతమందికి అధిక నష్టభయం భరించే సామర్థ్యం ఉంటుంది. అలాంటప్పుడు వారు ఈక్విటీలకే ప్రాధాన్యం ఇవ్వవచ్చు.

క్రమంగా మార్చేయాలి..

మ్యూచువల్ ఫండ్లలో ఈక్విటీల్లో మదుపు చేసిన వారు.. ఒకేసారి మొత్తం పెట్టుబడిని వెనక్కి తీసుకొని, డెట్ పథకాల్లో మదుపు చేయడం సరికాదు. దీనికోసం క్రమానుగత బదిలీ విధానం (ఎస్‌టీపీ)ని వాడుకోవాలి. ఇందులో భాగంగా.. ఈక్విటీల్లో ఉన్న పెట్టుబడులను.. ఆ పెట్టుబడుల క్రమాన్ని బట్టి, డెట్ ఫండ్లలోకి మళ్లించాలి. ఇంకో ఐదారేళ్లలో పదవీ విరమణ చేస్తామన్నప్పుడు ఈ వ్యూహాన్ని అమలు చేయాలి. ఈక్విటీల్లో పెట్టుబడులను మీ పెట్టుబడి నిష్పత్తి ప్రకారం కొనసాగిస్తూనే.. ఎస్‌టీపీ పద్ధతిని పాటించాలి. ఇలా చేస్తూ వెళ్తే.. మీరు పదవీ విరమణ చేసే నాటికి మొత్తం పెట్టుబడులు ఈక్విటీల నుంచి డెట్‌లోకి మారిపోతాయి. అప్పుడు మార్కెట్ పడినా.. అప్పటి వరకూ ఆర్జించిన లాభాలకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

సిప్‌తో యులిప్

కొత్త పథకం

నెలనెలా ప్రీమియం చెల్లించే వెసులుబాటుతో కొత్త తరహా యూనిట్ ఆధారిత పాలసీని విడుదల చేసింది ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్. దీని పేరు స్మార్ట్ ఇన్సూర్ వెల్త్ ప్లస్. 30 రోజుల వయసు నుంచి 55 ఏళ్ల వయసు వారెవరైనా సరే.. ఈ పాలసీని ఎంచుకునే వీలుంది. పాలసీ కాల పరిమితి 10, 15, 20, 25 ఏళ్లు. పాలసీ వ్యవధి మొత్తం ప్రీమియం చెల్లించాలి. కనీస ప్రీమియం నెలకు రూ.4,000. వార్షిక ప్రీమియానికి కనీసం 10 రెట్ల వరకూ బీమా లభిస్తుంది. పాలసీ మధ్యలో పాలసీదారుడికి ఏదైనా జరిగితే.. ఆ తేదీ నాటికి ఉన్న పాలసీ ఫండ్ విలువ, బీమా మొత్తం, చెల్లించిన ప్రీమియానికి 105శాతం ఈ మూడింటిలో ఏది ఎక్కువైతే దాన్ని చెల్లిస్తారు. పాలసీ వ్యవధి తీరిన తర్వాత ఉన్న ఫండ్ విలువను చెల్లిస్తారు. పాలసీ తీసుకున్న 6 ఏళ్ల తర్వాత ఫండ్ విలువలో 15శాతం మించకుండా పాక్షికంగా వెనక్కి తీసుకోవచ్చు. సంవత్సరానికి నాలుగుసార్లు పాక్షికంగా కొంత మొత్తాన్ని ఉచితంగా తీసుకోవచ్చు. కనీసం రూ.5వేల వరకూ ఇలా వెనక్కి ఇస్తారు. పాలసీ కాల పరిమితిలో గరిష్ఠంగా 15 సార్లు పాక్షిక ఉపసంహరణ చేసుకోవచ్చు. చెల్లించిన ప్రీమియానికి సెక్షన్ 80సీ నిబంధనలకు లోబడి పన్ను మినహాయింపు వర్తిస్తుంది.

రుణం తీరిస్తే మంచిదేనా?



✤ బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రూ.4లక్షలు ఉన్నాయి. ఏడాది తర్వాతే ఈ డబ్బుతో నాకు అవసరం ఉంది. వడ్డీ 7.15 శాతం వస్తోంది. మ్యూచువల్ ఫండ్లలో 10శాతం వరకూ రాబడి వచ్చే పథకాలు ఉన్నాయని నాకు తెలిసిన వ్యక్తి చెప్పారు. నిజమేనా? పెట్టుబడికి ఇబ్బందేమీ ఉండదు కదా? - శ్రీవాస్తవ

ఇప్పుడున్న పరిస్థితుల్లో డెట్ ఫండ్లలోని షార్ట్ టర్మ్ అక్రూవల్ ఫండ్ల విభాగంలో దాదాపు 8-10శాతం వరకూ వడ్డీ వచ్చే అవకాశం కనిపిస్తోంది. కానీ, కచ్చితంగా ఇంత రాబడి వస్తుందని చెప్పడం సాధ్యం కాదు. కాస్త నష్టభయం కూడా ఉంటుంది. ఇలాంటప్పుడు మీకు వచ్చే వడ్డీ 3-4శాతం వరకూ తగ్గే ఆస్కారం ఉంది. రానున్న ఏడాది కాలంలో నష్టభయం కాస్త ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వీటిల్లో మదుపు చేసినప్పుడు కనీసం మూడేళ్ల వరకూ కొనసాగితే కొంత లాభం. ఏడాది సమయమే ఉంది కాబట్టి, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడిని కొనసాగించడమే ఉత్తమం.

✤ మా అమ్మాయి వయసు పదేళ్లు. తన పేరు మీద నెలకు రూ.5,000 చొప్పున పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. తనకు 23 ఏళ్లు వచ్చాక ఈ మొత్తాన్ని తీసుకుంటాం. మంచి పెట్టుబడి పథకాలు సూచించండి? అప్పటివరకూ ఎంత మొత్తం అయ్యే అవకాశం ఉంది. - శ్రావ్య

మీ అమ్మాయి వయసు 23 ఏళ్లు వచ్చేనాటికి అధిక మొత్తంలో డబ్బు జమ కావాలంటే.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయడం ఒక మార్గం. ఈక్విటీ ఫండ్లలో దాదాపు 13శాతం వార్షిక సగటు రాబడి అంచనాతో.. మీ పెట్టుబడి రూ.18,00,000 అయ్యేందుకు అవకాశం ఉంది. దీనికోసం మీరు.. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఈక్విటీ ఫండ్, మిరే అసెట్ ఇండియా ఈక్విటీ ఫండ్, యాక్సిస్ ఫోకస్డ్ 25 ఫండ్లను పరిశీలించవచ్చు.

✤ గృహరుణం తీసుకొని, ఇల్లు కొన్నాను. ఇంకా అసలు రూ.3,00,000 చెల్లించాలి. నేను 20శాతం పన్ను శ్లాబులో ఉన్నాను. పన్ను పరంగా మినహాయింపు కూడా పెద్దగా కలిసి రావడం లేదు. దీన్ని ఒకేసారి తీర్చేయడం మంచిదేనా? లేక ఈ డబ్బును వేరే పెట్టుబడి పథకంలో మదుపు చేయాలా? ఏది మంచిది? - కృష్ణ

గృహరుణం వడ్డీ రేటు 8.5%-9% వరకూ ఉంది. మీరు తీసుకున్న రుణంపై వడ్డీ 9శాతం వరకూ ఉంటుందని అంచనా వేసుకుందాం. 20శాతం శ్లాబులో ఉన్నారు కాబట్టి, ఈ మినహాయింపు పోను మీకు వర్తించే వాస్తవ వడ్డీ రేటు 7.2శాతమే. ప్రత్యామ్నాయంగా వేరే పెట్టుబడి పథకాల్లో మదుపు చేసినప్పుడు ఇంతకు మించి రాబడి ఆర్జించాలి. అప్పుడే రుణం తీర్చాలా వద్దా అనే స్పష్టత వస్తుంది. మీకు నాలుగైదేళ్ల సమయం ఉంటే అప్పు తీర్చకుండా.. పెట్టుబడి పథకాలను ఎంచుకోవడమే మంచిది. దీనికి మీరు హైబ్రీడ్ ఈక్విటీ ఫండ్లను చూడొచ్చు. వీటిలో 11శాతం వరకూ రాబడి వచ్చే అవకాశం ఉంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్ ఫండ్, ఎల్అండ్‌టీ హైబ్రీడ్ ఈక్విటీ ఫండ్, మిరే అసెట్ హైబ్రీడ్ ఈక్విటీ ఫండ్లను ఎంచుకోవచ్చు.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ప్రత్యేక పరిస్థితుల్లో.. పరిహారం అందేలా..

తీవ్ర వ్యాధులు, అనుకోని ప్రమాదం.. ఆర్థిక ప్రణాళిక మొత్తాన్ని దెబ్బతీస్తాయివి. అప్పటివరకూ మన దగ్గరున్న సొమ్మునంతా హరించి వేస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో అండగా నిలిచేందుకు కొన్ని ప్రత్యేక పాలసీలను ఎంచుకోవాల్సిందే. అవేమిటి? అవి అందించే ప్రయోజనం ఏమిటో చూద్దామా!



తీవ్ర వ్యాధులు వేధిస్తే...

జీవన శైలిలో మార్పుల నేపథ్యంలో ఇప్పుడు చిన్న వయసులో ఉన్న వారిని కూడా కొన్ని తీవ్ర వ్యాధులు వేధిస్తున్నాయి. పక్షవాతం, గుండెపోటు, క్యాన్సర్ తదితర ఎన్నో తీవ్ర వ్యాధులు ఇప్పుడు పెద్ద సమస్యగా మారాయి. ఈ వ్యాధులను గుర్తించిన వెంటనే.. దాని చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు ఉపయోగపడే పాలసీ.. క్రిటికల్ ఇల్‌నెస్ కవర్. నిర్ణీత మొత్తానికి ఈ పాలసీని తీసుకోవాల్సి ఉంటుంది. పాలసీ తీసుకునేప్పుడు పేర్కొన్న జాబితాలోని వ్యాధులేమైనా వస్తే.. ఆ మేరకు పరిహారం ఇచ్చేస్తాయి. ఇలా వచ్చిన డబ్బును ఆ వ్యాధుల చికిత్స కోసం వినియోగించుకోవచ్చు. తీవ్ర వ్యాధుల బారిన పడినప్పుడు కొంతకాలం ఆర్జించే శక్తిని కోల్పోతారు. ఇలాంటప్పుడు కూడా ఈ డబ్బు ఉపయోగపడుతుంది. వైద్య బీమా పాలసీ ఉన్నప్పటికీ.. క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలను తీసుకోవడం మంచిది.

ప్రమాదంలో ఆదుకునేలా..

ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నప్పుడు ఆసుపత్రిలో చేరితే.. ఆ వైద్య ఖర్చులను అది చూసుకుంటుంది. మరి, ప్రత్యేకంగా వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ ఎందుకు అనే అనుమానం రావచ్చు. దీనికి సమాధానం.. తక్కువ ప్రీమియానికి ఎక్కువ బీమా రక్షణ లభిస్తుంది. ప్రమాదం బారిన పడి వైకల్యం వచ్చినా, మరణించినా ఈ పాలసీ పరిహారం ఇస్తుంది. ప్రమాదం వల్ల కొన్ని రోజులు ఉద్యోగానికి వెళ్లలేకపోవచ్చు. ఇలాంటప్పుడు ఈ పాలసీద్వారా ఆ ఆదాయ లోటును భర్తీ చేసుకునే వీలు కలుగుతుంది. ఇలా ఎంత చెల్లించాలన్న విషయం ఆ పాలసీ తీసుకునేప్పుడు పేర్కొన్న నిబంధనలను బట్టి ఉంటుంది.

ఎలాంటి సందర్భాల్లో ప్రమాద బీమా పరిహారం ఇవ్వదు అనే విషయాన్ని ముందుగానే తెలుసుకోవాలి. కొన్ని వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలు.. ఆదాయాన్ని భర్తీ చేయకపోవచ్చు. కొన్ని పాక్షిక వైకల్యాలకు పరిహారం ఇవ్వవు. కొన్నింటిలో ఉప పరిమితులు ఉంటాయి. పాలసీ తీసుకునే ముందు ఇవన్నీ క్షుణ్నంగా అర్థం చేసుకోవాలి.

ఈ పాలసీని ఎంచుకునేప్పుడు నియమ నిబంధనలు పూర్తిగా తెలుసుకోవాలి. వేటికి పరిహారం ఇస్తారు.. వేటికి ఇవ్వరు అనే విషయంలో స్పష్టత ఉండాలి. అప్పుడే ఈ పాలసీ ద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందేందుకు వీలవుతుంది.

క్యాన్సర్ బారిన పడితే..

క్యాన్సర్ అంటే ఒక భయంకరమైన వ్యాధిగా ముద్రపడిపోయింది. చికిత్సలో ఉండే ఇబ్బందులు.. దానికి అయ్యే ఖర్చును చూస్తే కొన్నిసార్లు నిజమే అనిపిస్తుంటుంది. దీని చికిత్స కోసం అయ్యే ఖర్చు లక్షల్లోనే ఉంటుంది. అప్పటి వరకూ కూడబెట్టిన సొమ్మంతా ఒక్క దెబ్బతో కరిగిపోతుంది. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఆదుకునేందుకు ప్రత్యేక క్యాన్సర్ పాలసీలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు చాలా సాధారణ బీమా సంస్థలు క్యాన్సర్ కోసం ప్రత్యేక పాలసీలను అందుబాటులోకి తెచ్చాయి.


ఈ పాలసీని ఎంచుకునేప్పుడు ఏ రకం క్యాన్సర్లకు పరిహారం లభిస్తుంది, ఎంత మేరకు ఇస్తారనే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కొన్ని పాలసీలు.. క్యాన్సర్ ప్రాథమిక దశలో ఉన్నప్పుడు పాలసీ మొత్తంలో 25 శాతం మాత్రమే పరిహారంగా ఇస్తాయి. మరికొన్ని పాలసీలు క్యాన్సర్‌ను గుర్తించిన వెంటనే.. మొత్తం పరిహారం ఇస్తాయి. కొన్ని కొత్త బీమా సంస్థలు పాలసీ తీసుకున్న వ్యక్తికి క్యాన్సర్ వచ్చిన సందర్భంలో పాలసీ విలువలో 150శాతం వరకూ చెల్లిస్తామంటున్నాయి. ఇక్కడ మరో విషయం గమనించాలి.. ఒకసారి పరిహారం చెల్లించిన తర్వాత ఆ పాలసీ రద్దవుతోందా? కొనసాగుతోందా? తెలుసుకోవాలి. కొన్నిసార్లు క్యాన్సర్ తిరగబెట్టే అవకాశం ఉంది. కాబట్టి, పాలసీ ఒకసారికే రద్దు కాకుండా.. దీర్ఘకాలం కొనసాగేలా ఉండాలి.

-మయాంక్ భత్వాల్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్

అడివంతా ఆగమాగం

వలసాల వీరభద్రం, సుతారపు సోమశేఖర్
ఈనాడు ప్రత్యేక ప్రతినిధులు

ఎటుచూసినా పచ్చదనం.. దట్టమైన అడవి.. దశాబ్దాలుగా ఆ గాలి, నీరు పీల్చుకుని ఎదిగిన వృక్షరాజాలు, వాటిని అల్లుకుని పొదలు, పండ్ల మొక్కలు.. వాటిమీద ఆధారపడి బతికే వన్యప్రాణులు.. ఇదంతా తెలంగాణ అడవుల్లోని ఒకనాటి సుందర దృశ్యం. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. వేలాది ఎకరాల్లో చెట్లు అక్రమార్కుల గొడ్డలి వేటుకు నేలకొరుగుతున్నాయి. అధికార యంత్రాంగం కాసుల మోజులో కళ్లు మూసుకుంటే అడవి దొంగలు అందినకాడికి ఆరగించేస్తున్నారు. దీంతో అడివంతా ఆగమాగమవుతోంది. ఈ అక్రమార్కుల ధాటికి తెలంగాణలో ఒకప్పుడు దట్టమైన అడవులున్న ప్రాంతాలు సైతం మైదానాలుగా మారిపోయాయి. 1988లో 11,689 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో దట్టమైన అడవులు ఉంటే 2014 నాటికి అది 8,076 చ.కిమీకి తగ్గిపోయాయి. రెండున్నర దశాబ్దాల్లోనే 3,613 చ.కిమీ (30 శాతం) క్షీణించాయి. అడవులు అధికంగా ఉన్న పూర్వ ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఈ నష్టం ఎక్కువ జరుగుతోంది. '24 శాతం అటవీ ప్రాంతం ఉన్నట్లుగా చెబుతున్నా.. పచ్చదనం 12 శాతానికి మించి లేదు. సహజంగా చెట్లు పెరిగే అడవిని కాపాడకుంటే హరితహారం లాంటి కార్యక్రమాలు ఎన్ని చేపట్టినా ఉపయోగం ఉండదు' అంటూ ఇటీవల అటవీ శాఖ సమీక్షలో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు అడవుల విధ్వంస తీవ్రతకు నిదర్శనం.




నారాయణపూర్- వాయుపేట మధ్యలో నరికిన చెట్లు

ఇచ్చోడలో అడవే మాయం

జాతీయ రహదారిని ఆనుకున్న ఉన్న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం రెండు దశాబ్దాల క్రితం దట్టమైన అటవీ ప్రాంతం. ఇప్పుడు అడవి ఎక్కడ ఉందా అని వెతకాల్సిన దుస్థితి. పక్కన పెంబి, ఇతర మండలాల్లోనూ అడవిని మాయం చేస్తున్నారు. సిరికొండ మండలం భీంపూర్ గ్రామం నుంచి 2.5 కి.మీ వరకూ అడవి అంతరించిపోయింది. చుట్టుపక్కల పాతికేళ్ల క్రితం పెద్దపులి, చిరుతపులి, ఎలుగుబంటి సహా వివిధ రకాల వన్యప్రాణులు సంచరించేవి. ఇప్పుడు అడవిపందులు మాత్రమే కనిపిస్తున్నాయి. స్మగ్లర్లు, ఆక్రమణల ధాటికి రెండువేల ఎకరాల అడవి మాయమయింది. జన్నారం రేంజ్‌లో మహ్మదాబాద్ బీట్‌లో భారీ వృక్షాలతో కళకళలాడిన పెద్ద గుట్ట నామరూపాలు లేకుండా పోయింది. ఖానాపూర్, కడెం మండలాల్లో రాత్రివేళలో చెట్లను నరికి సైకిళ్లు, ఎడ్లబళ్లపై తరలిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దులోని బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర మండలాలకు మహారాష్ట్రలోని చిక్లి నుంచి ముల్తానీలు వచ్చి చెట్లను నరికేస్తున్నారు. బాసర మొదలుకుని భద్రాచలం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని గోదావరి తీరప్రాంతంలో కలప స్మగ్లింగ్ విచ్చలవిడిగా సాగుతోంది.

నిమిషాల్లో నేలకూలుస్తూ

స్మగ్లర్లు ఎక్కువగా రాత్రి వేళలో చెట్లు నరికేస్తున్నారు. ఎక్కువ శ్రమపడకుండా పెట్రోల్‌తో నడిచే పవర్‌సాతో నిమిషాల్లో చెట్లను నేలకూలుస్తున్నారు. కొన్నిచోట్ల మర రంపాలనూ వాడుతున్నారు. అడవిలో నరికిన చెట్లను బయటకు తెచ్చేందుకు సైకిళ్లు, ఎడ్లబండ్లు, కొన్నిచోట్ల మోటారుసైకిళ్లు ఉపయోగిస్తున్నారు. పొలాలు, ఇతర రహస్యప్రదేశాల్లో దాచిపెడుతున్నారు. గోదావరి తీరంలో.. దుంగల్ని రాత్రి వేళలో నదిలో వేసి తెల్లవారుజామున నదికి మరోవైపు నుంచి తీసుకుంటారు. ఆదిలాబాద్ జిల్లాలో ఖానాపూర్, కడెం తదితర మండలాల్లో నరికే చెట్లను గోదావరి నుంచి నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తరలిస్తున్నారు.

'మహా' మతలబు

అడవుల్లో అక్రమంగా నరికేస్తున్న కలప లారీలకు లారీలు రోడ్డు మార్గంలో దర్జాగా తరలిపోతుంది. మహారాష్ట్ర ప్రభుత్వ కలప డిపోల్లో వేలం పద్ధతిలో టేకు అమ్ముతారు. నాణ్యతను బట్టి క్యూబిక్ మీటర్ రూ.25 వేల నుంచి రూ.80 వేల వరకు ధర పలుకుతుంది. నాసిరకం, స్క్రాప్ ధర ఇంకా తక్కువ. మహారాష్ట్రలో విక్రయించే కలపకు ఇచ్చే పర్మిట్లలో అది ఏ రకమైందో రాయకుండా పరిమాణమే ఉంటుంది. దీన్ని తెలంగాణలోని కొందరు సామిల్లు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడ నాసిరకం, స్క్రాప్ కొనుగోలు చేసి పర్మిట్ తీసుకుంటారు. ఇక్కడి అడవుల్లో నరికిన విలువైన కలపతో కలిపేస్తూ మహారాష్ట్ర పర్మిట్ల పేరుతో సక్రమం చేసుకుంటున్నారు.

ఆ రెండుచోట్ల అత్యధికం

తెలంగాణ వ్యాప్తంగా 12 అటవీ సర్కిళ్లున్నాయి. సింహాలు, చిరుతలు, ఇతర వన్యప్రాణులు తిరిగే పులుల అభయారణ్యాలు (టైగర్ రిజర్వులు), దట్టమైన అటవీ ప్రాంతాల్లో అటవీ నేరాలు అధికంగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. 2017-18లో రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 12,293 కేసులను పరిశీలిస్తే- కవ్వాల్ టైగర్ రిజర్వులో 2,597.. కొత్తగూడెం సర్కిల్‌లో 2,878.. రెండు చోట్ల కలిపి 40 శాతం పైగా ఉన్నాయి.


మంచిర్యాల జిల్లా కవ్వాల్ పులుల అభయారణ్యంలో నరికివేసిన టేకు చెట్లు


ఇన్నాళ్లూ పట్టుకోలేదే?

సీఎం ఆదేశాల నేపథ్యంలో అటవీ అధికారులు దాడులు చేస్తున్నారు. గత 20 రోజుల్లో 554 గ్రామాలు, 387 సామిల్లుల్లో తనిఖీ చేశారు. 528 మంది వడ్రంగి పనివారిని ఆరా తీశారు. 309 దూగోడ యంత్రాలను పరిశీలించి 449 కేసులు నమోదు చేశారు. గడ్డివాముల్లో, పొలాల్లో, అడవుల్లో 480 క్యూబిక్ మెట్రిక్ టన్నుల కలప స్వాధీనం చేసుకున్నారు. ఈ గణాంకాల్ని చూసి 'ఇన్నాళ్లూ ఈ కలప దుంగలు ఎక్కడున్నాయి? ఇంతకాలం ఎందుకు పట్టుకోలేదు?' అని సీఎం ప్రశ్నించినట్లు తెలిసింది. నిజంగా జరిగే అక్రమాల్లో పట్టుబడుతున్నవి 5 శాతం కూడా ఉండవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంతా కుమ్మక్కై..

- కలప అక్రమ రవాణాలో అటవీశాఖతోపాటు పోలీసులు కూడా కుమ్మక్కైనట్లు పోలీసుశాఖ నివేదికలో పేర్కొనడం గమనార్హం.
- ఆరేళ్లుగా నిజామాబాద్‌లోనే పని చేస్తూ ఒకసారి సస్పెండయిన ఎఫ్‌డీవో, అతని కింద పనిచేసే రేంజి అధికారి, డిప్యూటీ రేంజి అధికారి కూడా కలప అక్రమ రవాణాదారులతో కుమ్మక్కైనట్లు నివేదికలో ఉంది. ఉన్నతాధికారులు తనిఖీలకు వస్తే వీరు ముందుగానే కోతమిల్లుల యజమానులు, అక్రమ రవాణాదారులకు సమాచారం ఇచ్చేస్తారని అందులో స్పష్టం చేశారు.
- అటవీశాఖలో స్థానిక, విజిలెన్స్, స్పెషల్ స్క్వాడ్ అధికారులకు కలిపి ఒక్కో సామిల్లు నుంచి ఏడాదికి రూ.5 లక్షల వరకు మామూళ్లు ముట్టజెబుతున్నారని సమాచారం. దీంతో కలప దొంగల గుట్టుమట్లన్నీ తెలిసినా అటవీశాఖ అధికారులు కిమ్మనడం లేదన్నది బహిరంగ రహస్యం.
- స్థానిక పోలీసులు కూడా కొంతమంది కలప అక్రమార్కులతో కుమ్మక్కయ్యారు. ఇచ్చోడ సీఐ సతీష్, నేరడిగొండ ఎస్సై హరిశంకర్, సాయుధ ఎస్సై షకీల్‌పాషాలను ఉన్నతాధికారులు ఇటీవల సస్పెండ్ చేశారు.






రాజకీయ జోక్యం



లాభాలు ఆర్జించిపెట్టే ఈ వ్యాపారంలో రాజకీయ జోక్యం కూడా పెరిగిపోతోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన కలప కోత మిల్లుల యజమానులు ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నారు. కలప అక్రమ రవాణాకు సంబంధించి పోలీసు శాఖ నుంచి ప్రభుత్వానికి నివేదిక అందింది. నిజామాబాద్ జిల్లా ముజాహిద్‌నగర్‌లో ఉన్న బిలాల్ సామిల్, సోహిల్ సామిల్, డెక్కన్ సామిల్, నిజామాబాద్ సామిల్‌ల యజమానులు అక్రమ కలప వ్యాపారంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. కలప అక్రమ రవాణాకు సంబంధించి గతంలో నిజామాబాద్ పోలీసులు అఫ్జల్ అనే నిందితుడ్ని అరెస్టు చేశారు. బిలాల్ సామిల్ యజమాని, నిజామాబాద్ డిప్యూటీ మేయర్ ఫహీమ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బలవంతంగా అఫ్జల్‌ను తీసుకెళ్లారు. దీంతో ఫహీమ్‌పై కూడా కేసు నమోదు చేశారు. కలప అక్రమ రవాణాలో భాగంగా నిజామాబాద్‌కు, మహారాష్ట్రలోని నాందేడ్‌కు మధ్య ఉన్న చెక్‌పోస్టులను ఫహీమ్, సోహిల్ సామిల్ యజమాని మిస్బా బేగ్ తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.





అడవిపై స్మగ్లర్ల ఉడుంపట్టు.. ప్రత్యేక కథనం రేపటి సంచికలో..

కాంగ్రెస్‌ను ఎవరూ కదిలించలేరు

- మళ్లీ లేస్తాం.. రానున్నది మా ప్రభంజనమే
- అందరి ప్రతినిధిగా పనిచేస్తా
- టీపీసీసీ ఓబీసీ విభాగం సన్మాన కార్యక్రమంలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క

హైదరాబాద్, బేగంబజార్ - న్యూస్‌టుడే

కాంగ్రెస్ పార్టీని ఎవరూ కదిలించలేరు, విడదీయలేరని ఆ పార్టీ శాసనసభాపక్షనేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడినంత మాత్రాన పార్టీ పనైపోలేదన్నారు. ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ శాసనసభాపక్ష నేతగా అవకాశం ఇచ్చినందుకు అందరి ప్రతినిధిగా ఒళ్లు దగ్గర పెట్టుకొని పని చేస్తానని స్పష్టం చేశారు. టీపీసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో భట్టివిక్రమార్కకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఓబీసీ విభాగం అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రేమ్‌లాల్, నగేష్ ముదిరాజ్, బొల్లు కిషన్, ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడి సాధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. రాజకీయాల్లోకి ఎందరో వచ్చారు, కాలగర్భంలో కలిసిపోయారు. కానీ కాంగ్రెస్‌ను ఎవరూ కదిలించలేకపోయారు. ఇప్పుడు రెండు సార్లు ఓడినంత మాత్రాన పార్టీ పనైపోలేదు. కార్యకర్తలెవ్వరూ అధైర్యపడొద్దు. మళ్లీ లేస్తాం.. రానున్నది మన ప్రభంజనమే' అని అన్నారు. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి అడ్డదారుల్లో తెరాస అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రతి పౌరుడు ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరిగేలా కాంగ్రెస్ పని చేస్తోందని స్పష్టం చేశారు. సీఎల్పీ నేతగా తనను నియమించినందుకు అధిష్ఠానానికి, ప్రతి కార్యకర్తకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అందరి ప్రతినిధిగా ప్రతి అడుగు ఆచితూచి వేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. పార్టీలో సీనియర్లందరినీ కలుపుకొని, అందరి సలహాలు, సూచనలు తీసుకుని ఏ లక్ష్యం కోసమైతే తెలంగాణ వచ్చిందో దాని సాధన కోసం అసెంబ్లీలో గొంతుక వినిపిస్తానని సీఎల్పీ నేత పేర్కొన్నారు. ఎన్నికల్లో భట్టివిక్రమార్కను ఓడించడానికి చాలామంది ప్రయత్నాలు చేశారని వీహెచ్ తెలిపారు. గెలిచిన ఎమ్మెల్యేలను కాపాడుకుంటూ భట్టి ముందుకు సాగాలని ఆయన సూచించారు. చిత్తరంజన్‌దాస్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడిపోయినవారికి ఇన్‌ఛార్జి పదవులు ఇస్తున్నారని, నాయకుల అభిప్రాయం మేరకు ఆ పదవుల్లో నియమించాలని కోరారు. రాష్ట్ర కమిటీలో, పార్టీ కార్యవర్గంలో 40 శాతం పదవులు బీసీలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.



హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న నగేష్ ముదిరాజ్, చిత్తరంజన్‌దాస్ ★ కార్యక్రమంలో ఆందోళనకు దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు

వీహెచ్, నూతి శ్రీకాంత్ వర్గీయుల బాహాబాహీ

సన్మాన కార్యక్రమం చివర్లో రసాబాసగా మారింది. భట్టి విక్రమార్కను ఓబీసీ విభాగం నగరాధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ వర్గీయులు సన్మానించడానికి వేదిక మీదకు వచ్చిన సమయంలో భట్టి పక్కనే ఉన్న వీహెచ్‌ను తోసినంత పనిచేశారు. ఈ క్రమంలో వీహెచ్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నూతి శ్రీకాంత్ సహా ఆయన వర్గీయులు వీహెచ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ఆయన మీదకు తోసుకువచ్చే ప్రయత్నం చేశారు. వారిని అడ్డుకోబోయిన వీహెచ్ అనుచరుడు, పీసీసీ కార్యదర్శి ఎస్.శ్రీకాంత్‌గౌడ్‌పై దాడి చేశారు. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారడంతో ఇరువర్గాలను సముదాయించడానికి భట్టివిక్రమార్క, చిత్తరంజన్‌దాస్ తదితరులు ప్రయత్నించారు. పీసీసీ మాజీ అధ్యక్షుడినైన తనపై శ్రీకాంత్ వర్గీయులు దాడికి యత్నించడం దురదృష్టకరమని వీహెచ్ అన్నారు. అతన్ని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అధిష్ఠానాన్ని కోరారు. జరిగిన ఘటనపై టీపీసీసీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ ఎం.కోదండరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. వీహెచ్‌పై దాడి, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకుగాను నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను ఓబీసీ విభాగం నగర అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఆ విభాగం ఛైర్మన్ చిత్తరంజన్‌దాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కాగా బాహాబాహీకి పాల్పడిన ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు బేగంబజార్ పోలీసులు తెలిపారు.

ఏళ్లతరబడి అపరిష్కృతంగా ఉంచడం సరికాదు

అప్పీళ్లను పరిష్కరించాలంటూ సమాచార కమిషన్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తన వద్దకు వచ్చిన అప్పీళ్లను ఏళ్ల తరబడి పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచుతున్న రాష్ట్ర సమాచార కమిషన్ తీరును హైకోర్టు తప్పుబట్టింది. అప్పీళ్లపై సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న ప్రైవేటు ఆసుపత్రుల వివరాలను వైద్య ఆరోగ్యశాఖ ఇవ్వకపోవడంపై దాఖలైన అప్పీలును పెండింగ్‌లో ఉంచడాన్ని సవాలు చేస్తూ ఎం.శ్రీనివాస్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఉచిత వైద్య సేవలందిస్తున్న ప్రైవేటు ఆసుపత్రుల వివరాలను ఇవ్వాలంటూ శ్రీనివాస్.. వైద్యశాఖ డైరెక్టర్‌ను సమాచార హక్కు చట్టం కింద అభ్యర్థించారని తెలిపారు. దీంతోపాటు ఉచిత వైద్యసేవల గురించి ప్రభుత్వానికి ఇస్తున్న సమాచారంపై వివరాలు కోరారని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని ఇవ్వకుండా కేవలం ప్రత్యేక పథకం కింద ప్రభుత్వ ఉద్యోగులకు వైద్యసేవలందించడానికిగాను ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఆసుపత్రుల వివరాలను మాత్రమే అందించారన్నారు. వాస్తవానికి 5 శాతం పడకలను దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి ప్రైవేటు ఆసుపత్రులు కేటాయించాల్సి ఉందని, దీనికి సంబంధించిన వివరాలను అడిగినా ఇవ్వడంలేదన్నారు. మొదట సంబంధిత శాఖలో దరఖాస్తు చేసినా ఫలితం లేకపోవడంతో డైరెక్టర్ ముందు 2017లో మొదటి అప్పీలు దాఖలు చేసినట్లు చెప్పారు. అక్కడా ప్రయోజనం లేకపోవడంతో సమాచార కమిషన్ ముందు రెండో అప్పీలు దాఖలు చేయగా 2018 సెప్టెంబరులో నోటీసులు జారీ చేసిందన్నారు. తర్వాత ఇప్పటివరకు దానిపై విచారణ చేపట్టలేదని హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వాదనలను విన్న న్యాయమూర్తి సమాచార కమిషన్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పిటిషనర్ అప్పీలును 4 వారాల్లో పరిష్కరించాలని ఆదేశించారు.

షాబుద్దీన్ ముఖ్య అనుచరుడి హత్య

సివాన్ (బిహార్): బిహార్‌లో ఆర్జేడీ మాజీ ఎంపీ షాబుద్దీన్ ముఖ్య అనుచరుడు, సమీప బంధువు యూసఫ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఈ ఘటన సివాన్ పట్టణంలో ఉద్రిక్తతలకు దారి తీసింది. షాబుద్దీన్ ప్రస్తుతం రెండు హత్య కేసుల్లో తిహార్ జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి సివాన్ పట్టణ ఠాణాకు సమీపంలోని ఓ ప్రాంతంలో యూసఫ్ హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు.

మోదీకి సరైన ప్రత్యర్థే లేరు

- మళ్లీ వచ్చేది భాజపా ప్రభుత్వమే
- ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ ధీమా

ఈనాడు, నిజామాబాద్: కేంద్రంలో మళ్లీ రానున్నది భాజపా ప్రభుత్వమేనని.. మోదీకి సరైన ప్రత్యర్థే లేరని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ ధీమా వ్యక్తంచేశారు. మోదీని ఎదుర్కొనే వారు దిల్లీలోలేకే హైదరాబాద్ నుంచి ఒకరు, అమరావతి నుంచి మరొకరు ఫ్రంట్, మహాకూటమంటూ రాజధానికి పోతున్నారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశాలకు ఆయన శనివారం నిజామాబాద్‌లో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు నెలల్లో ఎన్నికలు రానున్నాయని.. ఘనవిజయమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మెదక్, జహీరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పార్లమెంటు స్థానాలను క్లస్టర్‌గా చేసుకొని ఈ నెల 13న ముఖ్యనాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని నిజామాబాద్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హాజరై దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

పూర్తిస్థాయి బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు మేలు

తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నవారు బడ్జెట్‌లో కేటాయింపులపై విమర్శలు చేయటం సరికాదని.. ఇది ఓటాన్ అకౌంట్ మాత్రమేనని రాంమాధవ్ చెప్పారు. జులైలో పెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు మేలు చేసే నిర్ణయాలుంటాయన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించటం ద్వారా పార్లమెంటు ఎన్నికల్లో విజయానికి బాటలు వేసుకుంటామన్నారు. సమావేశంలో భాజపా నేతలు ప్రేమేందర్, వెంకటరమణి, యెండల లక్ష్మీనారాయణ, అర్వింద్, పల్లా గంగారెడ్డి, 5 పార్లమెంటు నియోజకవర్గాల కన్వీనర్లు పాల్గొన్నారు.


నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నరాంమాధవ్, పక్కన లక్ష్మణ్

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ఈనాడు, దిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కోరుతూ జంతర్‌మంతర్‌లో శనివారం ప్రదర్శన, నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 71 ఏళ్లయినా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించకుండా అన్యాయం చేశారన్నారు. దేశంలో 2,600 బీసీ కులాలు ఉంటే 2,500 కులాలకు చెందినవారు ఇంతవరకు పార్లమెంటులో అడుగు పెట్టలేదని.. 16 రాష్ట్రాల నుంచి ఇప్పటి వరకు ఒక్క బీసీ ప్రతినిధి ఎన్నిక కాలేదని.. ఇదేం ప్రజాస్వామ్యమని ఆయన ప్రశ్నించారు. కేంద్రం ఇటీవల వెలువరించిన లెక్కల ప్రకారం బీసీలకు రాజకీయాల్లో 14%, ఉద్యోగాల్లో 9%, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ఒక్క శాతం ప్రాతినిధ్యమే ఉన్నట్లు తేలిందన్నారు. తమకు రావల్సిన వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. రాజస్థాన్‌లో గుజ్జర్లు, గుజరాత్‌లో పటేళ్లు చేసినట్లే మిలిటెంట్ ఉద్యమాలు చేస్తామన్నారు. పార్లమెంటులోని 36 పార్టీల్లో ఏ పార్టీ కూడా బీసీలకు అనుకూలంగా మాట్లాడటం లేదని ఆరోపించారు. నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, భూపేశ్ సాగర్, సామల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన ప్రదర్శన చేపడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, సంఘం సభ్యులు


ఛాంపియన్స్

ఇక్కడ కోహ్లి.. అక్కడ మంధాన

ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో భారత క్రికెటర్లు



దిల్లీ: అద్భుత ఫామ్‌లో ఉన్న భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకింది. న్యూజిలాండ్‌తో తొలి రెండు వన్డేల్లో వరుసగా 105, 90 పరుగులు చేసిన ఆమె మూడు స్థానాలు ఎగబాకి నంబర్‌వన్ స్థానాన్ని సొంతం చేసుకుంది. కెప్టెన్ మిథాలీ రాజ్ ఐదో స్థానానికి పడింది. మరోవైపు పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లి అగ్రస్థానంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. మహిళా బౌలర్లలో వెటరన్ పేసర్ జులన్ గోస్వామి నాలుగో స్థానంలో నిలిచింది. స్పిన్నర్లు పూనమ్ యాదవ్ ఎనిమిది, దీప్తి శర్మ తొమ్మిదో స్థానాల్లో ఉన్నారు.



"ధోని గొప్ప ఆటగాడు. అతడు ప్రపంచకప్ జట్టులో ఉండాలా లేదా అన్న అంశంపై భారత మీడియాలో చర్చ జరుగుతున్న విషయం నాకు తెలుసు. ధోని చాలా ప్రశాంతంగా ఆడతాడు. అతణ్ని ఔట్ చేసేంత వరకు మ్యాచ్ చేతికొచ్చినట్లు కాదు"

– నీషమ్, న్యూజిలాండ్ ఆల్‌రౌండర్

న్యూజిలాండ్‌తో భారత్ ఆఖరి వన్డే నేడు

ముగింపు అదిరేనా?



స్వింగ్ దెబ్బకు నాలుగో వన్డేలో అనూహ్యంగా కుప్పకూలిన టీమ్ ఇండియా ఆఖరి సమరానికి సన్నద్ధమైంది. న్యూజిలాండ్‌తో ఐదో వన్డే నేడే. కోహ్లి గైర్హాజరీలోనూ సత్తా చాటగలమని నిరూపించుకోవాలనుకుంటున్న భారత్‌కు ధోని జట్టులోకి రావడం బలాన్నిచ్చేదే. కానీ పరిస్థితులే పరీక్షించేవిగా ఉన్నాయి. హామిల్టన్‌లో ఘనవిజయం సాధించిన కివీస్ ఆత్మవిశ్వాసంతో పోరుకు సై అంటోంది.

ఉదయం 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

వెల్లింగ్టన్

న్యూజిలాండ్‌తో వన్డే సమరాన్ని ఘనంగా ముగించాలనుకుంటున్న భారత్ ఆఖరి పోరాటానికి సిద్ధమైంది. ఇప్పటికే సిరీస్ గెలిచినప్పటికీ ఆదివారం జరిగే మ్యాచ్ టీమ్ ఇండియాకు ముఖ్యమైందే. ఎందుకంటే ఇంగ్లాండ్‌లో ప్రపంచకప్‌కు ముందు.. దాదాపుగా అలాంటి పరిస్థితుల్లో భారత్ ఆడే ఆఖరి వన్డే మ్యాచ్ ఇదే. పిచ్ పేసర్లకు అనుకూలించనున్న నేపథ్యంలో రోహిత్ నేతృత్వంలోని జట్టు ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం.

బ్యాటింగ్ సవాలే..: కోహ్లి కూడా లేని నేపథ్యంలో అనుభవజ్ఞుడైన ధోని తిరిగి జట్టులోకి రావడం భారత్‌కు సంతోషాన్నిచ్చే విషయమే. తొడకండరాలు పట్టేయడంతో అతడు గత రెండు వన్డే మ్యాచ్‌ల్లో ఆడని సంగతి తెలిసిందే. 3-2 కంటే 4-1తో సిరీస్ గెలవడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. కానీ అది అనుకున్నంత తేలికేమీ కాదు. ఎందుకంటే నాలుగో వన్డేలో స్వింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై 92కే కుప్పకూలిన భారత్‌ను పరీక్షించడానికి మరో పిచ్ సిద్ధంగా ఉంది. ఆఖరి వన్డే వేదిక వెస్ట్‌పాక్ స్టేడియంలోని పిచ్ కూడా స్వింగ్‌కు అనుకూలించే అవకాశముంది. గత మూడేళ్లలో ఇక్కడ సగటు స్కోరు 207 పరుగులు మాత్రమే. ట్రెంట్‌బౌల్ట్ మరోసారి కీలకం కానున్నాడు. ఈ నేపథ్యంలో ధోని మిడిల్ ఆర్డర్‌లో ఉండడం భారత్‌కు భరోసా ఇవ్వనుంది. దినేశ్ కార్తీక్ స్థానంలో అతడు జట్టులోకి రావొచ్చు. యువ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్‌కు మరో అవకాశం దక్కొచ్చు. రాయుడు, జాదవ్‌లకు ఈ మ్యాచ్ పరీక్షే. టాప్ ఆర్డర్ విఫలమైనా.. మిడిల్ ఆర్డర్‌లో తమను నమ్మకోవచ్చని వీళ్లిద్దరు నిరూపించుకోవాల్సిన అవసరముంది. ప్రపంచకప్ సమీపిస్తున్న తరుణంలో స్వింగ్‌కు అనుకూలించే పరిస్థితుల్లో తడబడే బలహీనతను అధిగమించడం భారత్‌కు ముఖ్యం. బౌలింగ్ విభాగంలో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. గత మ్యాచ్‌లో ఆకట్టుకోకపోయినా పేస్ బౌలర్ ఖలీల్ అహ్మద్‌కు మరో అవకాశం దక్కనుంది. మరోవైపు ఆఖరి మ్యాచ్‌లోనూ నెగ్గి టీ20 సమరానికి సన్నద్ధం కావాలని కివీస్ భావిస్తోంది. ఐతే గాయం కారణంగా ఓపెనర్ గప్తిల్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశముంది. అతడి స్థానంలో మన్రో జట్టులోకి రావొచ్చు. కెప్టెన్ విలియమ్సన్ జోరందుకోవాలని ఆ జట్టు ఆశిస్తోంది. ఇక బౌలింగ్‌లో బౌల్టే కివీస్ ఆయుధం. నాలుగో వన్డేలో అతడు ఐదు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించిన సంగతి తెలిసిందే. ఐతే కివీస్‌కు ఓ ప్రతికూలాంశం ఉంది. ఈ మ్యాచ్ వేదికలో ఆడిన గత మూడు వన్డేల్లో ఆ జట్టు ఓడింది.

విశేషాలు

- యూత్ వన్డేల్లో గిల్ సగటు 104.46
- టేలర్ మరో 110 పరుగులు చేస్తే వన్డేల్లో వేగంగా 8000 పరుగుల మైలురాయిని అందుకున్న ఏడో బ్యాట్స్‌మన్ అవుతాడు.

హేమాహేమీ జట్లను ఓడించి రంజీ ఫైనల్ చేరిన సౌరాష్ట్ర, విదర్భ అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. నాగ్‌పుర్‌లో ఆదివారం నుంచే తుది సమరం. టీమ్ ఇండియా టెస్టు నిపుణుడు ఛెతేశ్వర్ పుజారా సౌరాష్ట్రకు అతిపెద్ద బలం. వెటరన్ దేశవాళీ స్టార్, రంజీల్లో అత్యధిక పరుగుల వీరుడు వసీం జాఫర్ విదర్భకు పెట్టని కోట. సిసలైన బ్యాటింగ్ మజాను అందిస్తుందన్న అంచనాల మధ్య జరగనున్న ఈ ఐదు రోజుల పోరాటంలో గెలిచి ఛాంపియన్‌షిప్‌ను పట్టుకుపోయే జట్టేదో..!



సౌరాష్ట్ర × విదర్భ

నేటి నుంచే రంజీ ఫైనల్

నాగ్‌పుర్

అటు సౌరాష్ట్ర, ఇటు విదర్భ.. రెండు జట్లు బ్యాటింగ్‌ను నమ్ముకునే ఫైనల్ బరిలో దిగుతున్నాయి. రెండు జట్లలో తొమ్మిదో స్థానం వరకు బ్యాటింగ్‌తో సత్తా చాటగల ఆటగాళ్లున్నారు. పుజారా జాతీయ జట్టుకు ఆడుతున్న సమయంలో షెల్డన్ జాక్సన్ (838 పరుగులు), యువ బ్యాట్స్‌మన్ హార్విక్ దేశాయ్ (763) జట్టు బ్యాటింగ్ భారాన్ని మోశారు. టెస్టు మ్యాచ్‌లు ముగియడంతో మళ్లీ దేశవాళీ బరిలో దిగిన పుజారా సెమీస్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును ఫైనల్ చేర్చాడు. ఇక విదర్భది దాదాపుగా అదే పరిస్థితి. 40 ఏళ్ల జాఫర్ ఆ జట్టుకు ప్రధాన ఆయుధం. ఈ సీజన్‌లో రెండో అత్యధిక (1003) పరుగులు అతడివే. కెప్టెన్ ఫయాజ్ ఫజల్ (786), అక్షయ్ వాడ్కర్ (680) కూడా మంచి ఫామ్‌లో ఉన్నారు. ఈ సీజన్‌లో విదర్భ నుంచి ఎనిమిది మంది 30కిపైగా సగటుతో పరుగులు సాధించడం విశేషం. ఇక బౌలింగ్‌లో ఉమేశ్ యాదవ్ మంచి ఫామ్‌లో ఉండటం కలిసొచ్చే అంశం. బ్యాటింగ్ పిచ్‌లపై సాగిన గత రెండు మ్యాచ్‌ల్లో అతడు 21 వికెట్లు తీశాడు. ఇక సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనద్కట్‌పైనే ఆశలు పెట్టుకుంది.

1 – ఇప్పటివరకు విదర్భ ఆడిన రంజీ ఫైనల్స్. పోరుకు అర్హత పొందిన ఆ జట్టు టైటిల్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఇరానీ ట్రోఫీని గెలిచింది.

2 – ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన వారిలో వసీం జాఫర్ (1003) స్థానం. సిక్కిం బ్యాట్స్‌మన్ మిలింద్ కుమార్ (1331) మాత్రమే అతడి కంటే ముందున్నాడు.

3 – సౌరాష్ట్రకు ఇది మూడో రంజీ ఫైనల్. 2012-13, 2015-16 సీజన్లలో ఆ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

5 – వరుసగా రెండుసార్లు రంజీ టైటిల్ సాధించిన జట్ల సంఖ్య. ఈసారి విదర్భ విజయం సాధిస్తే ఆ ఘనత దక్కించుకున్న ఆరో జట్టు అవుతుంది.

విశాఖలో 24నే టీ20 మ్యాచ్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: భారత్‌లో ఆస్ట్రేలియా టీ20 సిరీస్ షెడ్యూల్‌లో మార్పు చోటు చేసుకుంది. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ ఈ నెల 27న రెండో టీ20 మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వాలి. ఐతే.. భద్రత కారణాల రీత్యా 24న తొలి టీ20ని బెంగళూరులో నిర్వహించలేమని, రెండో మ్యాచ్‌ను తమకు కేటాయించాలని కర్ణాటక క్రికెట్ సంఘం కోరడంతో బీసీసీఐ అందుకు అంగీకరించింది.



భారత్ మళ్లీ జోన్‌కు

డేవిస్‌కప్ అర్హత రౌండ్లో ఇటలీ చేతిలో ఓటమి

కోల్‌కతా: డేవిస్ కప్ ప్రపంచ ఫైనల్స్ ఆశలు ఆవిరయ్యాయి. అర్హత టోర్నీలో భారత జట్టుకు నిరాశే మిగిలింది. స్వదేశంలో ఇటలీతో పోరులో 1-3తో పరాజయంపాలైంది. శనివారం డబుల్స్‌లో అంచనాల మేరకు రాణించినా.. రివర్స్ సింగిల్స్‌లో విఫలమవడంతో భారత జట్టు మళ్లీ జోన్ దశకు పడిపోయింది. వచ్చే ఏడాది ప్రపంచ ఫైనల్స్ అర్హత రౌండ్లో బెర్తు కోసం ఈ ఏడాది ఆఖర్లో ఆసియా/ఓసియానియా జోన్‌లో ఆడనుంది. రేసులో నిలవాలంటే శనివారం తప్పక గెలవాల్సిన డబుల్స్ మ్యాచ్‌లో భారత జట్టు నెగ్గింది. హోరాహోరీ పోరులో రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ జంట 4-6, 6-3, 6-4తో సిమోన్ బొలెల్లి, మాటియో బెరెట్టి జోడీని ఓడించింది. ఐతే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 19వ స్థానంలో ఉన్న భారత జట్టు జోన్ దశకు పడిపోయేందుకు ఎంతో సమయం పట్టలేదు. రివర్స్ సింగిల్స్‌లో ఆంద్రియాస్ సెప్పి 6-1, 6-4తో భారత అత్యుత్తమ సింగిల్స్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్‌ను అలవోకగా ఓడించాడు. దీంతో ప్రపంచ నం.10 ఇటలీ ప్రపంచ ఫైనల్స్‌కు అర్హత పొందింది. భారత జట్టు సెప్టెంబరులో ఆసియా/ఓసియానియా గ్రూప్ దశ ఆడనుంది. "తొలి రోజు రెండు సింగిల్స్‌లో ఓడిపోయాక మళ్లీ పుంజుకోవడం చాలా కష్టం. ఇటలీ జట్టులో ముగ్గురు టాప్-60 ఆటగాళ్లున్నారు. భారత జట్టులో టాప్-100లో ఉన్న ఆటగాడే లేడు. ఎలాగైనా ప్రపంచ ఫైనల్స్‌కు అర్హత సాధించాలనుకున్నాం. కానీ వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలి" అని నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి అన్నాడు. మారిన డేవిస్ కప్ ఫార్మాట్ ప్రకారం ఈ ఏడాది నవంబరులో ప్రపంచ ఫైనల్స్ జరుగుతాయి. మొత్తం 18 జట్లు టైటిల్ కోసం ఈ టోర్నీ బరిలో దిగనున్నాయి.



ప్యాటర్సన్ సెంచరీ

- తొలి ఇన్నింగ్స్‌లో 534/5 డిక్లేర్డ్
- శ్రీలంక 123/3

కాన్‌బెర్రా: శ్రీలంకతో రెండో టెస్టుపై ఆస్ట్రేలియా పట్టు బిగిస్తోంది. 384/4తో రెండో రోజు, శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. ప్యాటర్సన్ (114 నాటౌట్) అజేయ శతకం బాదడంతో 534/5 వద్ద డిక్లేర్ చేసింది. బర్న్స్ (180) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు కేవలం ఎనిమిది పరుగులే జోడించగా.. అతడితోపాటు ఇన్నింగ్స్ కొనసాగించిన ప్యాటర్సన్ (ఓవర్‌నైట్ 25) ధాటిగా ఆడాడు. పైన్ (45 నాటౌట్)తో కలిసి అభేద్యమైన ఆరో వికెట్‌కు అతడు 130 పరుగులు జోడించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. కరుణరత్నె (46, రిటైర్డ్ హర్ట్), తిరిమానె (41) రాణించారు. కుశాల్ పెరీరా (11), డిసిల్వా (1) క్రీజులో ఉన్నారు.



బలంగా తాకిన బౌన్సర్.. కరుణరత్నెకు గాయం

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా, శ్రీలంక రెండో టెస్టు సందర్భంగా విచారకర ఘటన చోటు చేసుకుంది. ఓ బౌన్సర్‌కు శ్రీలంక బ్యాట్స్‌మన్ కరుణరత్నె గాయపడడం అందరినీ తీవ్ర ఆందోళనకు గురి చేసింది. 46 పరుగుల వద్ద అతడు రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. ఆస్ట్రేలియా పేసర్ కమిన్స్ వేసిన బౌన్సర్ నేరుగా మీదికి దూసుకురాగా.. కిందికి వంగి తప్పించుకునేందుకు కరుణరత్నె విఫలయత్నం చేశాడు. కానీ బంతి కుడి భుజాన్ని రాసుకుంటూ వెళ్లి హెల్మెట్ కింద మెడ భాగంలో బలంగా తగిలింది. వెంటనే అతడు బ్యాటును వదిలేస్తూ కింద కుప్పకూలిపోయాడు. వెంటనే వచ్చిన వైద్య సిబ్బంది కరుణరత్నెను స్ట్రెచర్‌పై మైదానం బయటికి తీసుకెళ్లి.. ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించాక కరుణరత్నెకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తేల్చారు.

పట్టుబిగించిన వెస్టిండీస్

నార్త్ సౌండ్: ఇంగ్లాండ్‌తో రెండో టెస్టుపై వెస్టిండీస్ పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 272/6తో మూడో రోజు, శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్.. 306 పరుగులకు ఆలౌటైంది. డారెన్ బ్రావో (50) టాప్ స్కోరర్. 119 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ కడపటి వార్తలందేసరికి 63 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. హోల్డర్, జోసెఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులు చేసింది.

పాక్ జోరుకు బ్రేక్

కేప్‌టౌన్: టీ20ల్లో వరుసగా తొమ్మిది విజయాల తర్వాత పాకిస్థాన్‌కు పరాజయం ఎదురైంది. మూడు టీ20ల సిరీస్ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. హెండ్రిక్స్ (74; 41 బంతుల్లో 8×4, 2×6), డుప్లెసిస్ (78; 45 బంతుల్లో 6×4, 4×6) చెలరేగడంతో మొదట దక్షిణాఫ్రికా 6 వికెట్లకు 192 పరుగులు చేసింది. షిన్వారి (3/31) మూడు వికెట్లు తీశాడు. లక్ష్యఛేదనలో పాక్ 9 వికెట్లకు 186 పరుగులు మాత్రమే చేయగలిగింది. బాబర్ ఆజం (38), హుసేన్ తలత్ (40), షోయబ్ మాలిక్ (49) రాణించడంతో పాక్ విజయం దిశగా సాగింది. ఐతే ఆఖర్లో హెండ్రిక్స్ (2/40) ఆ జట్టును దెబ్బతీశాడు. చివరి ఓవర్లో విజయానికి 16 పరుగులు చేయాల్సివుండగా పాక్ ఒక వికెట్ కోల్పోయి 9 పరుగులు మాత్రమే చేసింది.



తల్లి మరణించినా..

అల్జారి జోసెఫ్. వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్. ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు మూడో రోజు ఉదయం ఆట ఆరంభానికి ముందే తన తల్లి షరోన్ మరణించిందని అతడికి తెలిసింది. అయినా 22 ఏళ్ల జోసెఫ్ దుఃఖాన్ని దిగమింగుకుంటూ మ్యాచ్ ఆడాడు. రెండు జట్ల ఆటగాళ్లు నల్ల ఆర్మ్‌బ్యాండ్లు ధరించి బరిలోకి దిగారు.



కోచి శుభారంభం

యూ ముంబాపై విజయం

కోచి: ప్రొ వాలీబాల్ లీగ్ ఆరంభ పోరులో ఆతిథ్య జట్టు అదరగొట్టింది. శనివారం కోచి బ్లూ స్పైకర్స్ 4-1 (15-11, 15-13, 15-8, 15-10, 5-15)తో యూ ముంబా వాలీని చిత్తు చేసింది. మను జోసెఫ్ 15 పాయింట్లతో చెలరేగడంతో కోచికి ఎదురులేకుండా పోయింది. అందుల్లో 14 స్పైక్స్, ఒక బ్లాక్ ఉన్నాయి. ప్రత్యర్థి జట్టులో నికోలస్ డెల్ బియాంకో 10 పాయింట్లతో రాణించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి కోచి ఆధిపత్యం సాగింది. ఆఖరి సెట్లో మాత్రమే ముంబా జట్టు గెలిచింది.

వారికి పండగే..

పాల్ లోటమన్

ప్రొ వాలీబాల్ లీగ్ తొలి రోజు రసవత్తరంగా ముగిసింది. రెండో రోజు అంతకుమించి అలరిస్తుందనడంలో సందేహం లేదు. ఈ వారాంతం కేరళలోని వాలీబాల్ అభిమానులకు పండగే. నేను 13 ఏళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెట్టాను. చాలా ఉద్వేగంగా ఉంది. లీగ్‌లో కాలికట్ హీరోస్ తరఫున ఆడుతున్నాను. మా జట్టు సమతూకంతో ఉంది. అనుభవజ్ఞులూ ఉన్నారు. యువకులూ ఉన్నారు. జట్టులో సారథి జెరోమ్, రతీష్ సీనియర్ ఆటగాళ్లు. జెరోమ్ ఆటతీరును

ప్రాక్టీస్‌లో పరిశీలించాను. సాంకేతికంగా తిరుగులేని ఆటగాడు. ప్రపంచస్థాయి ఆటగాడని చెప్పొచ్చు. భారత్‌లో వాలీబాల్ ఎదుగుదలలో ఈ లీగ్ కీలకపాత్ర పోషిస్తుందనడంలో నాకెలాంటి సందేహం లేదు. ముఖ్యంగా యువకులకు ఇదో గొప్ప అవకాశం. వాళ్లలో ప్రతిభను సానబెట్టి.. అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి ఈ లీగ్ కచ్చితంగా దోహదపడుతుంది. ప్రపంచస్థాయి ఆటగాళ్లతో కలిసి ఆడడం వల్ల చాలా మెలకువలు నేర్చుకుంటారు.

– పాల్ లోటమన్, ఒలింపిక్ స్వర్ణపతక విజేత

మమత సర్కారుకు వణుకు!

- ప్రజాదరణను చూసి ఓర్వలేకే భాజపా కార్యకర్తలపై దాడులు
- ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం

దుర్గాపూర్, ఠాకూర్‌నగర్

పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సర్కారు పునాదులు కదులుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. శనివారం దుర్గాపూర్‌లో జరిగిన భాజపా కార్యకర్తల సమావేశం, ఠాకూర్‌నగర్‌లోని మతువా మహాసంఘ్ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన తృణమూల్ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. భాజపాకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండడంతో మమతా బెనర్జీ సహించలేకపోతున్నారని, తమ కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. "దీదీ ఎందుకు హింసకు దిగుతున్నారో నాకు అర్థమయింది. మాపై మీరు కనబరుస్తున్న ప్రేమను చూసి ఓర్వలేకపోతున్నారు. ఆమె సర్కారు పునాదులు కదులుతున్నాయి" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 'ట్రిపుల్ టీ' (తృణమూల్ టోలాబాజీ ట్యాక్స్) అమలవుతోందని ఆరోపించారు. ప్రతి పనికీ ఆ పార్టీ సిండికేట్‌కు టోలాబాజీ (బెదిరించి బలవంతంగా వసూలు చేయడం) పన్ను చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. మమత కూడా కమ్యూనిస్టుల మార్గంలోనే నడుస్తున్నారని చెప్పారు. ''నాలుగేళ్ల క్రితం వరకు ముఖాలు చూసుకోవడానికి ఇష్టపడని వారు ఇప్పుడు ఈ చౌకీదార్‌ను ఓడించడానికి ఏకమయ్యారు. చిట్‌ఫండ్‌లు, రక్షణ ఒప్పందాల ద్వారా సొమ్ము వెనకేసుకున్నవారికి ఈ చౌకీదార్ నచ్చడం లేదు" అని వ్యాఖ్యానించారు. అయితే ఈ అరాచకాలు ఎంతో కాలం కొనసాగవని, ప్రజల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం తీరుస్తుందని హామీ ఇచ్చారు. పొరుగుదేశాల్లో మతపరంగా వేధింపులకు గురయిన హిందువులు, సిక్కుల వంటి మైనార్టీలకు పౌరసత్వం కల్పించడానికి ఉద్దేశించిన పౌరసత్వం బిల్లుకు అడ్డంకులు ఎందుకని మోదీ ప్రశ్నించారు. వారు ఆశ్రయం పొందడానికి భారత్ తప్ప మరో మార్గం లేదని అన్నారు. ఈ బిల్లుకు మద్దతు తెలపాలని మమతా బెనర్జీని కోరారు. ఠాకూర్‌నగర్‌లో జరిగిన మతువా మహాసంఘ్ సమ్మేళనంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు.


ఠాకూర్‌నగర్‌లో నిర్వహించిన మతువా మహాసంఘ్ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

తొక్కిసలాటతో ముగిసిన సభ

ప్రధానిని దగ్గరగా చూసేందుకు ప్రజలు పోటీపడడంతో సమావేశంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో కొందరు పిల్లలు, మహిళలు గాయపడ్డారు. ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేసినా వినకపోవడంతో ప్రధాని 14 నిమిషాల్లోనే ప్రసంగాన్ని ముగించాల్సి వచ్చింది. సమావేశానికి ముందు ఆయన మతువా వర్గం నాయకురాలు బారో మా వద్దకు వెళ్లి ఆమె ఆశీర్వాదాలు పొందారు. ఆమె మహాసంఘ్ వ్యవస్థాపకుడు దివంగత హరిశ్చంద్ర ఠాకూర్ భార్య కావడం గమనార్హం.

రుణమాఫీ లాంటి గిమ్మిక్కు కాదు: మోదీ

దుర్గాపూర్: తాత్కాలిక బడ్జెట్‌లో కాంగ్రెస్ తరహా రైతు రుణమాఫీ గిమ్మిక్కులకు తమ ప్రభుత్వం పోలేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అలాంటి రుణమాఫీలతో పేదరైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. దానికి బదులు రూ.ఆరు వేల చొప్పున రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్వతంత్రం అనంతరం ఏ ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే ఇలాంటి భారీ సాయాన్ని చేయలేదని శనివారం దుర్గాపూర్‌లో జరిగిన సభలో ప్రధాని మోదీ చెప్పారు.

మరోవైపు గుజరాత్‌లో కోలి వర్గాన్ని గతంలో ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకోవడం దురదృష్టకరమని మోదీ విమర్శించారు. గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లా చోటిలాలో కోలి వర్గానికి చెందిన నాయకుడు కున్‌వర్జీ బవాలియా ఇటీవల ఉప ఎన్నికల్లో గెలిచారు. ఈ సందర్భంగా శనివారం ఆయన్ను సన్మానించారు. ఈ సభను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించిన 8 నిమిషాల వీడియోను అక్కడ ప్రసారం చేశారు.

నేడు జమ్ము-కశ్మీర్‌కు ప్రధాని

జమ్ము: జమ్ము-కశ్మీర్‌లోని జమ్ము, శ్రీనగర్, లేహ్, సాంబా జిల్లాలోని విజయ్‌పూర్‌లలో ఆదివారం ప్రధాని పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు.

మీ సంగతి చూసుకోండి!

భాజపాకు మమత సూచన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో విజయం సాధించడంపై కలలు కనడం మానుకొని సొంత సీట్లలో గెలుపొందడంపై దృష్టిపెట్టుకోవాలని మోదీ, రాజ్‌నాథ్ సింగ్‌లను ఉద్దేశించి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. వారణాసిలో మోదీ నెగ్గుతారా అని ప్రశ్నించారు. మోదీ అవినీతికి తాతలాంటివారని విమర్శించారు. వారు బయట నాయకులని, బెంగాల్ సంస్కృతి గురించి వారికేమీ తెలియదని అన్నారు. పౌరసత్వ బిల్లుకు మద్దతు ఇచ్చేది లేదని, దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు.

నెలాఖరులోగా పాస్‌పోర్టు కేంద్రాలు

అలహాబాద్: త్వరలో అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో పాస్‌పోర్టు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర టెలీ కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా వెల్లడించారు. శనివారం ఆయన అలహాబాద్‌లో కుంభమేళాపై రూపొందించిన తపాలా బిళ్లను విడుదల చేశారు. ఇప్పటివరకు పాస్‌పోర్టు కేంద్రాలు లేని లోక్‌సభ నియోజకవర్గాల్లో ఫిబ్రవరి నెలాఖరులోగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అన్నా లేఖపై పీఎంవో పొడిపొడి స్పందన!

అహ్మద్‌నగర్: గత మూడురోజుల నుంచీ తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే రాసిన లేఖకు ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) నిర్లిప్తంగా స్పందించింది. దీనిపై ఆయన మద్దతుదారులు, గ్రామస్తులంతా మండిపడుతున్నారు. కొందరైతే శనివారం మధ్యాహ్నం తమ గ్రామంలోని ఎత్తైన టవర్‌పైకి ఎగబాకి అక్కడి నుంచి పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఇలా నిరసన వ్యక్తం చేసిన వారిలో మహిళలూ ఉన్నారు.

అమెరికా నుంచి 73 వేల ఆధునిక రైఫిళ్లు

దిల్లీ: సుమారు 73 వేల అత్యాధునిక సిగ్‌సార్ రైఫిళ్లను అమెరికా నుంచి భారత్ సమకూర్చుకోనుంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సదరు ప్రతిపాదనకు కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదముద్రవేశారు. ఇందుకు సంబంధించిన ఒప్పందం వారంరోజుల్లోపలే ఖరారౌతుందని భావిస్తున్నారు. ఒప్పందం ఖరారైన ఏడాది కాలంలో అమెరికా ఈ రైఫిళ్లను భారత్‌కు అందచేయాల్సి ఉంటుందని సదరు వ్యవహారాలు చూస్తున్న సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

'గ్రీన్‌పీస్' కార్యాలయాల మూసివేత

దిల్లీ: పర్యావరణంపై పోరాడుతున్న స్వచ్ఛంద సేవాసంస్థ "గ్రీన్‌పీస్ ఇండియా" శనివారం దిల్లీ, పట్నాల్లోని ప్రాంతీయ కార్యాలయాలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, కార్యాలయాలు మూసివేసినా కొందరు ఉద్యోగులు స్వచ్ఛంద సేవకు జీతాల్లేకుండానే పనిచేయడానికి ముందుకొచ్చారని సంస్థ తెలిపింది. అయినా వాతావరణ మార్పులపై అత్యవసర విషయాల్లో పోరాటాన్ని మాత్రం ఆపబోమని సంస్థ ప్రచార సంచాలకుడు దియాదేబ్ తెలిపారు.

ఆ అవకాశం సక్సేనాకు ఇవ్వొద్దు: ఈడీ

దిల్లీ: అగస్టా హెలికాప్టర్ల కుంభకోణంలో నిందితుడైన దుబాయి వ్యాపారవేత్త రాజీవ్ సక్సేనాకు న్యాయవాదిని వ్యక్తిగతంగా కలిసే అవకాశం ఇవ్వవద్దని ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కోరింది. శనివారం ప్రత్యేక న్యాయస్థానంలో వాదనలు వినిపిస్తూ ఇలా చేస్తే తమ దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని తెలిపింది. దీనిపై సోమవారం సవివరంగా సమాధానం సమర్పించాలని ప్రత్యేక జడ్జి ఈడీని ఆదేశించారు.

కొడుకు అక్రమాలకు పాల్పడ్డాడని..

తల్లి పింఛను ఖాతాను నిలిపేసిన ఎస్‌బీఐ!

దిల్లీ: తమ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగి అక్రమాలకు పాల్పడ్డాడని, వితంతువైన అతని తల్లి పింఛను ఖాతాను స్తంభింపజేయడం సరికాదంటూ... ఎస్‌బీఐకి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చీవాట్లు పెట్టింది. ఇది సేవా లోపమని తప్పు పట్టింది. వెంటనే ఆమె ఖాతాను పునరుద్ధరించాలని పశ్చిమ బెంగాల్‌లోని నదియా ఎస్‌బీఐ శాఖను ఆదేశించింది. సర్కార్ అనే మహిళ భర్త సైన్యంలో పనిచేశారు. ఆయన చనిపోయిన తర్వాత తనకు వచ్చే పింఛను తీసుకునేందుకు ఎస్‌బీఐలో పనిచేసే తన కుమారుడితో కలిసి ఆమె ఉమ్మడి ఖాతాను తెరిచారు. అయితే... ఆమె కుమారుడు శాఖా పరంగా అవకతవకలకు పాల్పడ్డాడంటూ సదరు బ్యాంకు ఈ ఖాతాను స్తంభింపజేసింది.

గౌతం ఖైతాన్ రిమాండు పొడిగింపు

దిల్లీ: అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణంలో అరెస్టు అయిన న్యాయవాది గౌతంఖైతాన్ కస్టడీని దిల్లీ కోర్టు మరో ఆరు రోజులు పొడిగించింది. నల్లధనం కలిగి ఉండటం, నగదు అక్రమ లావాదేవీలకు పాల్పడటం అనే కొత్త కేసులో ప్రత్యేక జడ్జి అరవింద్‌కుమార్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. నగదు అక్రమ చలామణి చట్టం(పీఎంఎల్‌ఏ) ఉల్లంఘించిన ఖైతాన్‌ను జనవరి 25న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అదుపులోకి తీసుకుంది.

ప్రియాంకను కించపరిస్తే సహించం

మహిళా కాంగ్రెస్ విభాగం ప్రకటన

దిల్లీ: ప్రియాంకాగాంధీ వాద్రాపై జరుగుతున్న బురదజల్లే తరహా ప్రచారం, వ్యాఖ్యలకు వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో కాంగ్రెస్ మహిళా విభాగం సోమవారం ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయనుంది. మహిళా విభాగం అధ్యక్షురాలు సుష్మితాదేవ్ శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఆమెను యూపీ(తూర్పు) కాంగ్రెస్ వ్యవహారాల ప్రధానకార్యదర్శిగా ప్రకటించిన తర్వాతి నుంచి భాజపా నాయకులు ప్రియాంకాగాంధీని కించపరచే విమర్శలకు దిగారంటూ సుష్మితా దేవ్ ఆరోపించారు.

ప్రజలకు ప్రభుత్వానికి మీడియా వారధి కావాలి

ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

కొల్లాం/కొట్టాయం: ప్రజలకు, ప్రభుత్వానికి మీడియా వారధిగా పని చేయాలని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కేరళలోని కొల్లాం, కొట్టాయంలలోని వివిధ కార్యక్రమాల్లో ఆయన శనివారం పాల్గొన్నారు. కొల్లాం ప్రెస్‌క్లబ్ స్వర్ణోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడారు. ఆధునిక జర్నలిజంలో సంచలనశీల రచనలు, చెల్లింపు వార్తలు, పక్షపాత ధోరణి అవరోధాలుగా మారాయన్నారు. బోగస్, తప్పుడు వార్తల సమస్య కూడా ఉందన్నారు. ఈమేరకు మీడియా ఆత్మ పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛగా, సజావుగా అన్ని రకాల అభిప్రాయాలు వ్యక్తమైతేనే ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. అలాగే కొట్టాయంలో మలయాళ మనోరమ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల కేరళ బలజనసఖ్యం 90వ వార్షికోత్సవంలోనూ ఆయన ప్రసంగించారు. అనంతరం ఆయన కేరళలోని పాత్రికేయ ప్రముఖుల పేరిట ఉన్న కేసీ మమెన్ మప్పిళ్లై హాల్‌ను సందర్శించారు.

రామమందిరంపై కాంగ్రెస్ వైఖరేమిటి: అమిత్ షా

దేహ్రాదూన్: అయోధ్యలో సాధ్యమైనంత త్వరగా రామ మందిరం నిర్మించాలన్నదే భాజపా విధానమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. దీనిపై కాంగ్రెస్ వైఖరి ఏమిటని ప్రశ్నించారు. శనివారం ఇక్కడ పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ కుంభమేళా జరుగుతున్న నేపథ్యంలో రామమందిరం నిర్మాణంపై డిమాండ్లు రావడం సహజమేనని అన్నారు. కేవలం మోదీని తొలగించాలన్న ఏకైక లక్ష్యంతోనే విపక్షాలన్నీ మహాకూటమిగా ఏర్పడుతున్నాయని తెలిపారు. దెహ్రాదూన్‌లో చంద్రబాబు, దేవెగౌడలు ప్రసంగిస్తే వినేవారు ఎవరని ప్రశ్నించారు.

'అయోధ్య' కాల్పులపై విచారణకు డిమాండ్

దిల్లీ: రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంమీద 1990లో అయోధ్యలో జరిగిన పోలీసు కాల్పుల్లో 16 మంది కరసేవకులు కన్ను మూయడంపై తగిన విచారణ జరిపించాలని భాజపా డిమాండ్ చేసింది. ములాయం సింగ్ యాదవ్ యూపీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆ సమయంలో కర సేవకులకు ప్రాణనష్టం వాటిల్లిందని, దానిపై ఆయన తనయుడు అఖిలేశ్ యాదవ్ స్పందించాల్సిన అవసరం ఉందని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా శనివారం విలేకరుల సమావేశంలో చెప్పారు.

తృణమూల్ పాలనలో పెరిగిన హింస: రాజ్‌నాథ్

ఫల్‌కతా: తృణమూల్ పాలనలో హింస పెరిగిందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లోని ఫల్‌కతలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 'మా, మటి, మనుష్' (తల్లి, మట్టి, మనుషులు)లకు రక్షణ లేదని అన్నారు. రాష్ట్రంలో రాజకీయ హింస ఆగాలంటే భాజపా ముఖ్యమంత్రి రావాల్సి ఉందని తెలిపారు.

రెండు నెలల్లో రూ. 2 వేలు

- మార్చి నెలాఖరులోగా రైతుల ఖాతాల్లో జమ
- ఆదాయ మద్దతు పథకానికి లబ్ధిదారుల గుర్తింపునకు కేంద్రం ఆదేశాలు

దిల్లీ: చిన్న, సన్నకారు రైతుల కోసం ప్రకటించిన 'ఆదాయ మద్దతు పథకం' కోసం లబ్ధిదారుల్ని సత్వరం గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. రూ.6000 మొత్తంలో మొదటి విడతగా రూ.2000 ఈ ఏడాది మార్చిలోగానే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలనేది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. దాదాపు 12 కోట్ల మంది రైతుల కోసం రూ.20,000 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. రెండు హెక్టార్లలోపు సాగుభూమి ఉన్న రైతులకు 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' కింద ఏడాదికి రూ.6000 చెల్లించేందుకు రూ.75,000 కోట్లు ఖర్చవుతుందని కేంద్రం తాజా బడ్జెట్లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఒక్క ఈశాన్య రాష్ట్రాల్లో దీని అమలుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నా మిగిలిన చోట్ల ఎలాంటి ప్రధాన అవరోధం ఉండబోదని నీతిఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ శనివారం ఒక వార్తాసంస్థకు తెలిపారు. పథకాన్ని అమలు చేయడానికి వ్యవసాయ మంత్రిత్వశాఖ యుద్ధప్రాతిపదికన పనిచేస్తోందని ఆయన చెప్పారు. ఆ శాఖ కార్యదర్శి శుక్రవారమే అన్ని రాష్ట్రాలకూ లేఖలు పంపారని తెలిపారు. రైతుల పేర్లను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచేలా చేస్తామని చెప్పారు. భూముల రికార్డుల్ని ఇప్పటికే డిజిటల్ పద్ధతిలోకి మార్చినందువల్ల పథకం అమల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్నారు. నెలకు సగటున రూ.500 అనేది చిన్నమొత్తమేమీ కాదని చెప్పారు.

బడ్జెట్‌కు అమెరికా వాణిజ్య మండలి కితాబు

వాషింగ్టన్: భారతదేశ బడ్జెట్ బాగుందని, వినియోగదారులు ఖర్చుపెట్టడాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేలా ప్రతిపాదనలు ఉన్నాయని 'అమెరికా-భారత్ వాణిజ్య మండలి' (యూఎస్ఐబీసీ) పేర్కొంది. రక్షణరంగం, ఆరోగ్యం, డిజిటలీకరణ సహా అనేక రంగాల్లో సానుకూలాంశాలు ఉన్నాయని మండలి అధ్యక్షురాలు నిషాదేశాయ్ పేర్కొన్నారు. 7.5% స్థూల జాతీయ వృద్ధి లక్ష్యాన్ని చేరుకునేందుకు భారత్ కట్టుబాటును బడ్జెట్ చాటుతోందని చెప్పారు.



రాబర్ట్‌వాద్రాకు బెయిల్

దిల్లీ: నగదు అక్రమ చలామణి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్‌వాద్రాకు దిల్లీకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఫిబ్రవరి 16వరకు అరెస్టు చేయకూడదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని ప్రత్యేక జడ్జి అరవింద్‌కుమార్ ఆదేశించారు. ఈడీ దర్యాప్తునకు సహకరించాలని, ఫిబ్రవరి 6న వాద్రా విచారణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. హవాలా లావాదేవీల ద్వారా లండన్‌లోని బ్రయాన్‌స్టన్ స్క్వేర్ వద్ద వాద్రా 1.9 మిలియన్ పౌండ్ల ఆస్తి కొన్నట్లు 'ఈడీ' ఆరోపిస్తోంది. వాద్రాకు 2009లో జరిగిన పెట్రోలియం ఒప్పందంలో ముడుపులు ముట్టాయని, అతనికి ముందస్తు బెయిల్ మంజూరు చేయకూడదని ఈడీ తరపున హాజరైన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.పి.సింగ్, అడ్వొకేట్ నితీ శ్‌రాణా వాదించారు. తన క్లైంట్‌పై దురుద్దేశపూర్వకంగా, రాజకీయ ప్రతీకారంలోభాగంగా కేసు బనాయించారని, తల్లికి చికిత్స చేయించడానికి విదేశాలకు వెళ్లినందున బెయిల్ మంజూరు చేయాలని వాద్రా తరపున హాజరైన సీనియర్ అడ్వొకేట్ కేటీఎస్‌తుల్సి వాదించారు.

యువత మాటే కాంగ్రెస్ బాట

- విద్యార్థులతో రాహుల్ భేటీ

దిల్లీ: ఎన్నికలు సమీపిస్తుండడంతో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వివిధ వర్గాలతో భేటీకావడంపై ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్టీ ఎన్నికల ప్రణాళికలో వారి అభిప్రాయాలకు చోటు కల్పించాలని ఆలోచిస్తున్నారు. 'అప్నీ బాత్ రాహుల్ కే సాత్' (రాహుల్‌తో మీ మాట) అన్న పేరుతో తొలిసారిగా యువతతో భేటీ అయ్యారు. శుక్రవారం సాయంత్రం ఏడుగురు విద్యార్థులను విందుకు ఆహ్వానించి వారిని ఆశ్చర్యపరిచారు. చైనా వంటకాలను స్వయంగా వడ్డిస్తూ దాదాపు రెండు గంటలుపాటు గడిపారు. స్నేహం పెంచుకోవాలన్న రీతిలో ముచ్చటించారు. ఈ భేటీలో పాల్గొన్న దిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీ రాజనీతి శాస్త్రం విద్యార్థిని ప్రతిష్ఠ దేవేశ్వర్ తన అనుభవాలను వివరిస్తూ "చాలా స్నేహపూర్వకంగా మాట్లాడారు. అన్ని నాకే తెలుసన్న ధోరణి ఆయనది కాదు. చెప్పినవన్నీ శ్రద్ధగా విన్నారు" అని చెప్పారు. అంధుల కోసం బ్రెయిలీ లిపిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికను తీసుకురావాలని ఆమె సూచించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలను అందరికీ అందుబాటులోకి తేవాలని చెప్పారు. ధార్వాడ్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి రోహన్ రేజే మ్యాథ్యూ హిజ్రాలు, సంబంధిత వర్గాల సమస్యలపై పోరాడుతుంటారు. వారి సమస్యలను వివరించినప్పుడు పార్టీ ఎన్నికల ప్రణాళిక సంఘం సమావేశానికి ఆహ్వానిస్తామని తెలిపారు. దిల్లీకి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి షెమైలా అలీ ఖాన్ ముస్లిం బాలికల నిరక్షరాస్యతపై వివరించారు. దళితులపై జరుగుతున్న అత్యాచారాలను పట్టించుకోవాలని ఆగ్రాకు చెందిన న్యాయ విద్యార్థి అనిల్ కుమార్ మౌర్య సూచించారు. ముంబయి ఐఐటీ విద్యార్థి అభిలాష్ కర్రి మాట్లాడుతూ ఇతర పార్టీలు చేపట్టిన మంచి కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. బిహార్ రాజధాని పట్నాలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభలో రాహుల్ గాంధీ పాల్గొననున్నారు. మూడు దశాబ్దాల అనంతరం అక్కడి గాంధీ మైదాన్‌లో ఆ పార్టీ సభ నిర్వహిస్తుండడం విశేషం.


దిల్లీలో యువతతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

మోదీ ఉద్దేశంలో యోగ్యత అంటే..

దిల్లీ: రఫేల్ ఒప్పందం ద్వారా అనిల్ అంబానీకి ప్రధాని నరేంద్రమోదీ లబ్ధిచేకూర్చారన్న ఆరోపణలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శనివారం పునరుద్ఘాటించారు. అనిల్ అంబానీ రిలయెన్స్ గ్రూప్‌నకు ఈ రఫేల్ ఒప్పందం అనేది ప్రాణవాయువులా పనిచేసిందంటూ వచ్చిన మీడియా వార్తను రాహుల్ ఉటంకించారు. "ఇది మోదీ ఉద్దేశంలో యోగ్యత' అంటూ రాహుల్ ట్వీట్ చేశారు.

రూ.9 లక్షల ఆదాయమున్నా.. ఉపశమనం

దిల్లీ: తగిన ప్రణాళిక ఉన్నట్లయితే ఏటా రూ.8-9 లక్షల ఆదాయం ఉన్నవారు కూడా ఏమాత్రం ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదని కేంద్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి అజయ్‌భూషణ్ పాండే చెప్పారు. వీరు భవిష్యనిధి, జీవిత బీమా, పింఛన్ పథకాల్లో తగినంత పెట్టుబడులు పెట్టి, గృహరుణం తీసుకున్నట్లయితే పన్ను నుంచి బయటపడవచ్చని తెలిపారు. శనివారం ఆయన ఒక వార్తాసంస్థతో మాట్లాడారు. 'రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారు ఐ.టి. చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. రూ.8-9 లక్షల ఆదాయ శ్రేణిలో ఉన్నవారు 80 (సి) సెక్షన్ కిందికి వచ్చేవాటిలో తగినన్ని పెట్టుబడులు పెట్టడం, గృహరుణ వడ్డీపై రాయితీ ఆధారంగా పన్ను వర్తించే ఆదాయాన్ని రూ.5 లక్షల కంటే తక్కువకు తగ్గించుకుని ప్రయోజనం పొందవచ్చు. స్వయం ఉపాధి పొందుతున్న వారికి, చిన్న వ్యాపారులకు, వేతన జీవులకు, పింఛన్‌దారులకు ఇది ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది' అని పాండే తెలిపారు. గృహరుణ వడ్డీ కింద రూ.2 లక్షలు, జాతీయ పింఛన్ పథకంలో రూ.50000, వైద్య బీమా ప్రీమియం రూ.75000 వరకు మినహాయింపు కోరవచ్చని చెప్పారు.

అబ్బురపరిచే విన్యాసం


ముంబయిలోని ప్రఖ్యాత 'గేట్‌వే ఆఫ్ ఇండియా' ఎదుట శనివారం రేసర్లు అబ్బురపరిచే విన్యాసాలు చేశారు. రెడ్‌బుల్ ఎఫ్ఎంఎక్స్ జామ్ పేరుతో ఈ కార్యక్రమం జరిగింది. దీనిలో ప్రపంచ ప్రముఖ రేసర్లు పాలుపంచుకున్నారు.

అమెరికా బాటలో రష్యా...

- 'అణ్వస్త్ర' ఒడంబడిక నుంచి వైదొలగుతున్నట్టు పుతిన్ ప్రకటన

మాస్కో, బీజింగ్, తెహ్రాన్: అమెరికా బాటలోనే... ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి 'మధ్యశ్రేణి అణ్వస్త్ర దేశాల ఒడంబడిక (ఐఎన్ఎఫ్)' నుంచి రష్యా కూడా వైదొలగింది! ఈ ఒప్పందం నుంచి తప్పుకొంటున్నట్టు అమెరికా ప్రకటించినందున, తాము కూడా అదే నిర్ణయం తీసుకున్నట్టు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం వెల్లడించారు. విదేశాంగ, రక్షణశాఖ మంత్రులతో దృశ్య మాధ్యమ సమావేశం సందర్భంగా ఆయన ఈ విషయాన్ని బహిర్గతం చేశారు. అయితే... ఈ కీలకాంశంపై ఒప్పంద భాగస్వామ్య పక్షాలు అర్థవంతమైన చర్చలు జరుపుతాయేమో వేచి చూస్తామని కూడా ఆయన పేర్కొనడం గమనార్హం. స్వల్ప, మధ్యశ్రేణి క్షిపణులను నిషేధిస్తూ రూపొందించిన ఈ ఒప్పందంపై 1987లో అమెరికా, యూఎస్ఎస్ఆర్‌లు సంతకాలు చేశాయి. అయితే, ఐఎన్ఎఫ్ నిబంధనలను రష్యా ఉల్లంఘిస్తోందని దీర్ఘకాలంగా ఆరోపిస్తూ వచ్చిన అమెరికా దీన్నుంచి బయటకు వెళ్తామని ప్రకటించింది. దీంతో మరుసటి రోజు రష్యా కూడా అదే నిర్ణయాన్ని ప్రకటించింది. అలాగే ఐఎన్ఎఫ్‌కు బదులుగా ప్రత్యామ్నాయ ఒప్పందాన్ని తీసుకొచ్చే అవకాశం లేదని చైనా విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

క్షిపణిని ప్రయోగించిన ఇరాన్

1,350 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేదించే సరికొత్త క్షిపణిని ఇరాన్ ప్రయోగాత్మకంగా పరీక్షించింది. ఇందుకు సంబంధించి 37 నిమిషాల నిడివి ఉన్న వీడియోను ఆ దేశ రక్షణశాఖ తన వెబ్‌సైట్‌లో ఉంచింది.

అత్యయిక పరిస్థితికి చేరువగా అమెరికా!

వాషింగ్టన్: భారీ సరిహద్దు గోడను నిర్మించాలన్న తన కలను సాకారం చేసుకోవడం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆఖరి అస్త్రం ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. అత్యయిక పరిస్థితి ప్రకటనకు తాను చేరువవుతున్నానని ఆయన తాజాగా వెల్లడించారు. సరిహద్దు భద్రతపై ప్రతిపక్ష డెమోక్రాట్లతో ప్రస్తుతం సాగిస్తున్న చర్చలు సమయాన్ని వృథా చేయడమేనని ట్రంప్ అన్నారు. ప్రతిపక్ష నాయకురాలు, ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసి మొండిగా వ్యవహరిస్తున్నారని.. దేశానికి నష్టం కలిగిస్తున్నారని మండిపడ్డారు. మెక్సికో నుంచి అక్రమ వలసలను అడ్డుకునేందుకు దేశ దక్షిణ సరిహద్దుల్లో భారీ గోడ నిర్మాణం కోసం ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అత్యయిక పరిస్థితి విధిస్తే కాంగ్రెస్ అనుమతితో నిమిత్తం లేకుండా ప్రత్యేక అధికారాల ద్వారా ట్రంప్ గోడ నిర్మాణం చేపట్టొచ్చు.

కాగా అమెరికా సుప్రీం కోర్టు త్వరలోనే ఓ పరీక్షను ఎదుర్కోనుంది. గర్భవిచ్ఛిత్తి చికిత్సలపై ఆంక్షలు విధిస్తూ లూసియానా రాష్ట్రం తెచ్చిన కొత్త చట్టానికి వ్యతిరేకంగా ఓ ఆసుపత్రి, ఇద్దరు వైద్యులు సుప్రీం కోర్టులో అపీలు చేశారు. న్యాయపరంగా ఏ అడ్డంకీ ఎదురుకాకపోతే సోమవారం ఈ చట్టం అమల్లోకి రానుంది. 2016లో టెక్సాస్ రాష్ట్రం తెచ్చిన ఇలాంటి చట్టాన్ని సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో తాజా అపీలుపై ఏ నిర్ణయం వెలువడుతుందన్నదానిపై ఆసక్తి నెలకొంది.


పట్నాలో కేంద్ర మాజీ మంత్రి కుష్వాహ సహా నిరసనకారులపై లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

'ఆక్రోశ్ ర్యాలీ'పై లాఠీఛార్జి

కేంద్ర మాజీ మంత్రి కుష్వాహకు గాయాలు

పట్నా: పోలీసులు జరిపిన లాఠీఛార్జిలో కేంద్ర మాజీ మంత్రి, రాష్ట్రీయ లోక్ సమతాపార్టీ (ఆర్ఎల్ఎస్‌పీ) అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహ గాయపడ్డారు. ఆయన శరీరంపై గాయాలున్నాయని, ప్రాథమిక చికిత్స చేశామని, కాస్త విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని పట్నా వైద్య కళాశాల, ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. బిహార్ విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండు చేస్తూ రాజ్‌భవన్ వద్ద ఆందోళన చేపట్టడానికి శనివారం కుష్వాహ.. తమ పార్టీ కార్యకర్తలతో కలసి 'ఆక్రోశ్ ర్యాలీ' పేరిట నిరసన చేపట్టారు. చేతిలో లాఠీలతో, నినాదాలు చేస్తూ బయలుదేరిన ఆందోళనకారులను రాజ్‌భవన్‌కు రెండు కి.మీ. ముందు పోలీసులు నిలిపివేశారు. ఇంతకుమించి ముందుకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఆందోళనకారులు బేఖాతరు చేయడంతో పోలీసులు జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి ప్రారంభించారు. ఈ ఘర్షణలో కుష్వాహ సైతం గాయపడ్డారు. నీతీశ్‌కుమార్ నేతృత్వంలోని నియంతృత్వ ప్రభుత్వం ఆదేశాల మేరకే పోలీసులు అరాచకంగా ప్రవర్తించారని, అన్నిరకాల అసమ్మతిని అణిచివేయాలని విఫల యత్నం చేస్తున్నారని కుష్వాహ విమర్శించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00